# కవ్వింత కథలు

కథాసంకలనం

- వేదాంతం శ్రీపతిశర్మ



శ్రీ
కౌముది
మీ మంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 213

కౌముది మాసపత్రికలో

జనవరి 2017 సంచిక నుంచి జూలై 2018 సంచిక వరకూ వచ్చిన

కథాసంకలనం

(ముందుగా ఓ మాట)

**అందమైన** ఆలోచనలన్నీ సాహితీ వినీలాకాశంలో తారల వలె ప్రభవిస్తూనే ఉంటాయి. ఒకటి పద్యం, ఇంకొకటి కథ, ఒకటి నాటకం, ఇంకొకటి నవల, ఒకటి వ్యాసం, ఇంకొకటి కవిత, మరొకటి కావ్యం.. ఇలా మనసును చంద్రుడిగా మలచినప్పుడు చుట్టూతా మెరిసేవన్నీ ఆలోచనల నక్షత్రాలే. కాకపోతే ఈ 'తారాశశాంకం' అందరినీ ఒకలాగే అలరిస్తుంది అనుకోవటం సరికాదు. ఒక్కొక్కరికి ఒక్కో నక్షత్రం సరిపోయినట్లు ఒక్కొక్కరి మనస్తత్వం ప్రకారం ఒక్కో సాహితీ ప్రక్రియ ఆనందాన్ని అందించటం సహజం.

ఆలోచనల అంతరంగం ఒక తరంగంలా సాగి శబ్దాలను తాకి పదజాలంలోకి అల్లుకుని ఒక రంగవల్లిలా రంగరించుకున్న వేళ కవిత్వం అనేది పద్యంలా కనిపించవచ్చు, కవితలా అనిపించవచ్చు.. కథలా కూడా దర్శనమివ్వవచ్చు.

అవధాన ప్రక్రియలో సమస్యాపూరణంలాగా, దృశ్యకావ్యం లేదా నాటక ప్రక్రియలో గర్భాన్ని ఆవిష్కరించే విధంగా కవితకు కథ వ్రయటం అనేది తెలుగు సాహిత్యంలో ఒక వినూత్నమైన ప్రయోగం! 'కవిత' అనే పేరుగల అమ్మాయి రచయితకు తన కవిత ద్వారా పరిచయం అవుతుంది. అమ్మాయి అందిస్తున్న కవితలకు రచయిత కథలను సృజించి ఆమెకు మెయిల్ చేస్తూ అంటాడు. అలా పరిచయం పెరుగుతూ ఉంటుంది. కవిత తన కవితలో పలు అంశాలను స్పృశిస్తూ అంటుంది. ఇవి ఎక్కువగా స్త్రీ పురుష సంబంధాలు, బంధాలు, అనుబంధాలు, రాగద్వేషాలు, సౌందర్యారాధన, తప్పించుకోలేని జీవిత సత్యాలు.. కానీ ఎన్నో విషయాలు రసవత్తరంగా సాగిపోతూ ఉంటాయి.

కవిత రచయితను సవాలు చేస్తోందా లేక పరీక్షిస్తోందా లేక తన స్థాయిలో జీవిత భాగస్వామిని ఎంచుకుంటోందా అనే ఆలోచనలు కలుగుతాయి. ఇటు ప్రక్క రచయిత తన కథలలో అందించిన కవితలోని ప్రాణాన్ని పైకి చూపుతూనే సరికొత్త పరిస్థితులను ఎత్తి చూపటం కూడా జరుగుతూ ఉంటుంది.

కవితలోని వృత్తం, కథలోని ఇతివృత్తం కొన్ని సందర్భాలలో మమేకం కావటం, కొన్ని సందర్భాలలో సమానాంతరంగా సాగటం జరుగుతాయి. కవిత కోసం కథ వ్రాయటం అనేది కత్తిమీద సాములాంటిది. సామాజికపరమైన సంఘటనలను సృష్టించాలా లేక సహజంగా ఉన్నవాటిని మాలికలా అల్లి 'కవిత'ను ముగ్గులోకి దింపాలా అనేది విషయాన్ని ఆధారం చేసుకుని రచయిత ఎంచుకోవలసిన మార్గం.

కవిత పరిచయమవటం, కథ వ్రాయమనటం వంటివి 'కథాకౌముది' ద్వారా జూన్ 2016 http://www.koumudi.net/Monthly/2016/june/june_2016_kadhakoumudi_5.pdf సంచికలో 'వీలునామా' అనే కథలో మీరు చూడవచ్చు.

కవితకు కథ అనే ప్రక్రియలోని కవ్వింత వింతగానే మిగిలిపోతుందా, ఇద్దరికీ ఈ రసవత్తర స్థాయిలో అనుబంధం ఏర్పడుతుందా అనేది చివరి వరకు కవ్విస్తూనే ఉంటుంది.

వేదాంతం వేంకట సత్యవతి యిస్తున్న కవితలకు కథలను వేదాంతం శ్రీపతిశర్మ అందిస్తున్నారు.

****

# బృందగానం

'**వీలునామా వ్రాసేసి తప్పుకుంటే** అయిపోతుందా?', ఎక్కడినుండో వినిపించింది. కవిత గొంతు అది. పుస్తకాలయంలోని పుస్తకాల మాటున ఎక్కడినుండో వినిపించింది ఆ మాట. కవితకు కథ కవిత ఒప్పుకున్నట్లా లేక ఒక్కింత వెక్కిరింతా అనే ఆలోచన వచ్చింది. అటుగా నడిచాను. ఎడమవైపు చివార్న ఒక టేబుల్ మీద ఉన్న ఏదో చాలా పెద్ద పుస్తకంలోంచి తల పైకి లేపింది. పుస్తకంలోంచి సరస్వతి ఈ ఒక్కసారికి తెల్ల కలువలా వికసించిందా అనిపించింది.

'నా ముందర నుండే వెళ్ళిపోయారు', నవ్వుతూ చెప్పింది.

'పుస్తకాల వెనుక ఉన్నది కనిపించలేదు'

'కూర్చోండి', అంటూ ముందరున్న కుర్చీ చూపించింది. తన బాగ్‌లోంచి ఓ కాగితం తీసింది. ఒకసారి చదువుకుంది. మెల్లగా నావైపు తోసింది. కాగితం ఎగరకుండా దానిమీద చెయ్యిపెట్టాను. తన చెయ్యి తీసేసి బాగ్ సర్దుకుంది. కాగితం తిప్పి చదివాను -

*'ముందుమాట...*

***కలం నాదే!***
***ఇది నిజమే!***
***అందునుండి జాలు వారిన కన్నీటి వ్రాలుని,***
***నాది కాదు పొమ్మని నీవనుకొనగలుగుదువా?***
***అలా నా కవిత నీక్కనపడిన నాడు -***
***అది చీకటిలో నిలబెట్టిన నిలువుటద్దం లాంటిదే!***
***నీకు కూడా అగుపించని చిమ్మ చీకటిలో***
***నిలువుటద్దం వుండడం నిష్ప్రయోజనమేగా!***
***అలా కాకుండా -***
***ఎన్నడైనా 'ఇదిగో నాలాగే; ఇది నాతో గొంతు కలపగల వేదనా నాదం' అని నీకనిపిస్తే***
***అప్పటి నా ఈ పుస్తకాన్ని తెరచే సాహసం చేయి!***
***నా లోలోన అంతా విశ్వజనిత, విశ్వజనీయ వేదనా రవళి మాత్రమే!***
***ఈ బృందగానం నీకు వినపడాలంటే నీకూ నిబ్బరమైన గుండె ఉండాలి మరి!'***

గ్రంథాలయంలో సామాన్యంగా కొందరు లభ్యంకాని పుస్తకాలను వెతుకుతూ ఉంటారు. వెతికితే దొరికేది పుస్తకం కాదు అని చెబుతున్నట్లు, కవిత, వ్రాయబడని ఓ పుస్తకంలా కళ్ళు విప్పార్చి చూస్తోంది.

కాగితం జేబులో పెట్టుకున్నాను.

ఈమెలోంచి ఓ ప్రపంచం జారిపోయిందా లేక తెలియని మరో ప్రపంచం కోసం ఈమె మరోలా మారిపోయిందా అనే వింత ఆలోచన కలిగింది.

ఆఫీసులో ఈ మధ్య మా బాస్ కొత్తగా మాట్లాడటం ప్రారంభించాడు. ఏదైనా ఫైల్ తీసుకుని వెళితే అంతా చదివి 'దానికీ దీనికీ ఏంటి సంబంధం? ఈ రెండిటినీ ముడి పెట్టకండి. పై వాళ్ళకి పిచ్చి ఎక్కి నా మీద కేకలేస్తారు' అనటం పరిపాటి అయిపోయింది. గతంలో ఈయనే ఇలా కాకుండా 'ఓ పని చెయ్యండి, ఆ పాత ఫైల్ ఉంది చూడండీ, దానిని ఒకసారి తిరగేసి కనెక్ట్ చెయ్యండి, సరిపోతుంది' అనేవాడు.

ఇవతలకి వచ్చి ప్రక్క సీట్లోని బుచ్చిబాబుని అడిగాను. వీడు టైలర్‌లాగా కాలు ఆడిస్తూనే ఉంటాడు. అడిగేసరికి స్పీడు పెంచాడు.

'పైవాడి బట్టి ఉంటుంది..', చెప్పేసాడు, '... ఆ పైవాడు ఆ పైవాడి బట్టి కులుకుతాడు. మనకెందుకు? చెప్పినట్లు చేసి ఇంటికి పోతేసరి.'

నిజమే పరిస్థితులు అలాంటివే. కాకపోతే ఈయన పెద్ద వయసున్నవాడు కాడు. డైరెక్ట్ రిక్రూట్, చక్కని భవిష్యత్తున్నవాడు. పెళ్ళికూడా ఈ మధ్యనే అయినట్లుంది. టీ త్రాగుతుండగా కుర్రాడొచ్చి 'సార్ రమ్మంటున్నాడు' అన్నాడు. టీ ముగించి లోపలికెళ్ళాను. కూర్చోమన్నాడు.

ఏవో కాగితాలన్నీ చూసేసి పెన్ను స్టాండులో పెట్టేసాడు.

'ఈ ఊళ్ళో తీగలెక్కడ దొరుకుతాయి?' అడిగాడు.

ఇదేంటి? ఆరేసుకుంటాడా? లేక బట్టలారేసుకోవాలా? చిరునవ్వు పనికొస్తుందనుకుని బదులుగా దానినే వాడాను. కళ్ళు మూసుకున్నాడు.

'ఓ...సారీ. తీగలంటే... అ.. వీణకు వాడే తీగలు. కావాలి.'

' రెండు మూడు చోట్ల దొరుకుతాయి. మేడమ్‌గారు వీణ వాయిస్తారా సార్?'

'వాయిస్తుంది. అవి..'

'తెగిపోయాయా?'

'అనుకోండి. నాకు వాటి గురించి తెలియవు. కొద్దిగా తెప్పిస్తే నేను మీకు డబ్బులిస్తాను. ఈ ఊరు గురించి నాకు పెద్దగా తెలియదు.'

'అలాగే సార్. కాకపోతే తీగెలలో రకాలుండవచ్చు. ఒక్కసారి ఫోన్‌లో కనుక్కుని చెబుతారా?'

తన మొబైల్ మీద చెయ్యి పెట్టి నన్ను అదోలా చూసాడు.

'నో... ఓ పని చెయ్యండి. అందరూ వాడేవి ఉంటాయి కదా? అవి తీసుకుని రండి.'

'ఓ.. అర్థమైంది. సర్‌ప్రైజ్ ఇద్దామనుకుంటున్నారన్నమాట. అలాగే...' అంటూ లేచాను – అతనూ లేచి నిలబడ్డాడు.

'అసలు సుఖం ఎక్కడుంది చెప్పండి?' అన్నాడు. చెయ్యి ఆయనే అడ్డు పెట్టి చెప్పాడు, '... మీ మాట ఒకరు వినటంలో ఉందా? మీలాగా నడుచుకోవటంలో ఉందా? మీరనుకున్నది జరగటంలో ఉందా?... ఎక్కడ?' ఇతని మనసు ఎక్కడో ఇబ్బంది పడ్డట్లుంది. పైవాళ్ళతో ఏం మాట్లాడినా ఇబ్బందే

'అసలు ఎక్కడా సుఖం లేదు సార్', అనే స్టాండర్డ్ మాట అనేసాను. అసలు జీవిత సత్యం అదేనన్నట్లు తలూపాడు.

'నాకో వింత ఆలోచన కలుగుతోంది', అన్నాడు.

'చెప్పండి సార్'

'తీగను రెండు వైపులా బంధించి, లాగి బిగించి అక్కడ తాకి, ఇక్కడ కదిలించి, సరిగమలని, సంగీతమని, సామవేదమని కబుర్లు చెప్పటం సమంజసమా?'

'ఆలోచన బాగుంది సార్. లాగి బంధించకపోతే నాదం ఎలా పుడుతుంది? ఓ ప్రక్రియ లేకపోతే తీగె తీగలాగానే ఉంటుంది. కరెంటూ రాదు, శబ్దమూ వినిపించదు.'

కిటికీ బయటకు చూసాడు.

'తీగె ఒక చోట కాలిపోతోంది, మరో చోట తాకినప్పుడల్లా కంప్లయింట్ చేస్తోంది. ఏవంటారు?'

'ఓకే సార్. తీగెలను కొని తెస్తాను. నే తెచ్చే పాకెట్లో అయితే అవి బాధపడవు!'

బాస్ నవ్వాడు.

'అని బాధపడితే ఎంత? పడకపోతే ఎంత? ఎవరికి కావాలి? ఎవరు చూడాలి?' అడిగాడు.

'నిజమే సార్.'

'ఓకే. ఓ పని చెయ్యండి. తీగెలు తీసుకుని మా ఇంటికి రండి. ఎప్పుడైనా సాయంత్రం వేళ ఫోన్ చేసి రండి' అని మొబైల్ చూపించాడు.

'సృజన' కాంప్లెక్స్‌లోకి వెళ్ళి ఓ సాయంత్రం అపార్ట్‌మెంట్ నంబర్లలో ఈయన పేరు చూస్తున్నాను. వెనుక నుండి ఆయనే భుజం తట్టాడు.

'గుడ్ ఈవినింగ్ సర్' అన్నాను.

'రండి' అంటూ మెట్లెక్కాడు, ఇద్దరం ఇంట్లోకి వెళ్ళాం.

చేతిలో ఉన్న పళ్ళ సంచీ ఆయన చేతికిచ్చాను.

'ఇవెందుకు?' అడిగాడు.

'మేడమ్ గారికి...' అంటూంటేనే గట్టిగా నవ్వాడు.

'కూర్చోండి, ఆవిడెక్కడ? ప్రస్తుతం నేనొక్కడినే' కూర్చున్నాను.

'అంటే..'

'అలాంటిదేమీ లేదు కానీ... చెబుతాను' అంటూ లోపలికెళ్ళి మంచి నీళ్ళతో వచ్చాడు. ఎదురుగా కూర్చున్నాడు. టీపాయ్ మీద రెండు తీగెల పాకెట్లను పెట్టాను. రెండింటినీ పరిశీలించాడు.

'రెండూ మంచివే సార్. వాడి చూడమనండి. శృతి చేస్తేగానీ తెలియదు'

వాటిని అక్కడ పెట్టి నన్ను జాగ్రత్తగా చుసాడు.

'మీకు సంగీతం తెలుసా?' అడిగాడు.

'ఏదో పరిచయం ఉంది. అంతే సార్'

'ఊ... సంగీతం అంటే పెద్దగా గిట్టకపోతే నరకానికి సూటిగా ప్రవేశం ఉంటుందా?'

ఇదేంటి? ఇంజినీరింగ్ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటా అడిగినట్లు అడుగుతాడు?

'అదేంటిసార్! అలా అడిగారు?'

'నాకు సంగీతం గిట్టదు అని చెప్పను కానీ.. మరి ఇదెలా ఉంది, అదిలా ఉంది అంటే ఏదీ చెప్పలేను.'

'అది పెద్ద తప్పు అని నేననుకోను'

'హహ.. మీరన్నా నష్టంలేదు.'

ఆలోచించాను. వీళ్ళిద్దరూ ఏదో గొడవ పడ్డట్లున్నారు.

'ఓ. మేడమ్‌గారు...'

చెయ్యి అడ్డం పెట్టాడు.

'నో. ఆమె కూడా అలా అనలేదు. కానీ ఏ కారణం వల్లనో లోలోపల బాధ పడుతోందేమోననిపిస్తుంది'

నిజమే. ఇదొక ప్రక్రియ. ఒకరి కళకు సరైన స్పందన లభించకపోతే జీవితం ఉప్పులేని కూరలాగా, ఉడకని పప్పులాగా, నడవలేని నడకలాగా, చప్పగా, కనిపించకూడదా అనుకునే తప్పులాగా అలా ఆగిపోతే బావుండుని అనుకుంటూనే ఎందుకో సాగిపోతూ ఉంటుంది.

'ఈ మధ్యనే వివాహం అయిందనుకుంటాను' అన్నాను.

'ఓ ఎనిమిది నెలలైంది.'

'పోనీ కచ్చేరీలు ఏర్పాటు చేసి చూసారా?'

'అయ్యో మీరు భలేవారే! కొన్ని వందలలో కచ్చేరీలిచ్చింది.' లేచి ఓ గదిలోకి నడిచాడు. నేను అటు వెళ్ళాను.

'ఇదిగోండి. అక్కడ కూర్చుని వాయిస్తుంది వీణ' గదిలో వీణ లేదు.

'అంటే సార్, వీణ కూడా తీసుకుని..'

'అవును.'

'సార్... మీరు వాయిస్తుండగా ఆపేయమని ఏదైనా ఇబ్బంది పెట్టారా?'

'నో..నో. అలాంటి పని ఎన్నడూ చేయలేదు. నాకు కావాల్సిన పనులన్నీ చూసుకుని చక్కని టైమ్ సెట్ చేసుకుని వాయిస్తుంది. చక్కగా అభ్యాసం చేస్తుంది.'

'మరి ఇలా ఎందుకు జరిగింది?'

నిట్టూర్చాడు. తలుపు వేసేసాడు. మరల హాల్లోకి వచ్చాం.

'పెద్ద విషయం కాదుకానీ..' సిగరెట్ తీస్తూ చెప్పాడు, 'ఇలా ఏ మాటా చెప్పకపోతే సమస్య పెద్దదైపోతుందేమోనని భయంగా ఉంది. '

'ఆవిడ తల్లిదండ్రులతో మాట్లాడరా?'

చిరునవ్వు నవ్వాడు. టి.వి దగ్గర ఏదో డైరీ తీసుకుని వచ్చి అందులోంచి ఓ కాగితం తీసాడు.

'వాళ్ళే వచ్చారు. ఏమీ అర్థం కావటంలేదన్నారు' ఆ కాగితం చేతికిచ్చాడు. చక్కని దస్తూరి ఉంది. కవితలా ఉంది.

***'...ఎన్నడైనా ఇదిగో నాలాగే, ఇది నాతో గొంతుకలపగల వేదనా నాదం అని నీకనిపిస్తే***

***అప్పుడు నా ఈ పుస్తకాన్ని తెరిచే సాహసం చేయీ!***

***నీ లోలోన అంతా విశ్వజనిత, విశ్వజనీయ వేదనా రవళి మాత్రమే!***

***ఈ బృందగానం నీకు వినపడాలంటే నీకూ నిబ్బరమైన గుండె ఉండాలి మరి. '***

'ఇది మీకు వ్రాసిన లేఖా?'

'కాదు. వాళ్ళ నాన్నకిచ్చింది.'

'ఓ.. మరి నాకు శలవిప్పిస్తారా?' అంటూ లేచాను. ఆయన కూర్చోమని సైగ చేసాడు. కూర్చున్నాక ఆ తీగెల పాకెట్లు నా చేతిలో పెట్టి ఓ కార్డు అందించాడు.

'ఏమీ అనుకోకుండా ఇవి వాళ్ళ ఇంట్లో ఇచ్చేస్తారా?' అడిగాడు. అనుకున్నంత పనీ అయింది. ఈ రాయబారాల వలన గతంలో చాలా ఇబ్బందులకు గురి అయ్యాను. నమస్కారం చేసుకుంటూనే లేచాను.

'సార్. క్షమించండి. మీరు బాగుండాలని కోరుకుంటూనే ఉంటాను. నాకు ఇలాంటి విషయాలలో చేదు అనుభవాలు ఎదురైనాయి. నన్నొదిలెయ్యండి' అని చెప్పి వెనుదిరిగాను. ఆయన వాటిని టీపాయ్ మీద పడేసాడు. ఓకే అన్నట్లు చేతులూపాడు. తలుపు దాకా వచ్చి ఎందుకో ఆగాను.

'సార్, ఈ గది.. తాళం ఎందుకు పెట్టారు?'

'ఇది నా ప్రైవేట్ గది'

'ఓ' అంటూ బయటకు వచ్చాను.

'చూడరా?' అడిగాడు. ప్రతి మనిషీ ఓ ప్రపంచం. ఒక్కో మనసు ఒక్కో మ్యూజియమ్ - ఓ ప్రదర్శన శాల. కొన్ని వేరు వేరు ఆలోచనలు, కొన్ని ఏరేసిన అనుభవాలు, మరి కొన్ని పొందు పరుచుకున్న పసందైన వసంతాలు.. చూడరా అంటే చూడను అనటం ఎంత తప్పు? మరల లోనకెళ్ళాను. తాళం తీసాడు. ఆశ్చర్యం వేసింది. ఓ అరగంట సేపు అలా చూస్తూనే ఉండిపోయాను. ఇవతలకి వచ్చి ఎందుకో ఆ తీగెల పాకెట్లను తీసుకున్నాను. ఇద్దరం గేటు దాకా వచ్చాం.

'ఈ గదికి తాళం ఎందుకు పెట్టారు?' అడిగాను.

'నేనూ మనిషినే!' మెల్లగా అన్నాడు.

విజయనగర్ కాలనీలోకి వెళ్ళి రెండు మూడు సందులు తిరిగి చివరకు ఇల్లు కనుక్కుని లోపలికెళ్ళాను. తలుపు తెరిచే ఉంది. టి.వీలో ఏదో సీరియల్ సాగుతోంది. హాల్లో ఎవరు లేరు. ఎందుకైనా మంచిదని బెల్ నొక్కాను. ఎక్కడినుండో ఓ తల ముందుకు వచ్చి నన్ను చూసింది. కొత్త మనిషిని చూడటంతో ఆవిడ తలుపుదాకా వచ్చింది.

'రాజశేఖర్‌గారు పంపించారు' అన్నాను.

పెద్దావిడ ముఖం స్పష్టంగా వికసించింది.

'లోపలికి రండి' అంటూ సోఫా చూపించింది. ఒక ప్లేట్లో మంచి నీళ్ళ గ్లాసు తెచ్చి కూర్చుంది.

'హాల్లో ఎవరూ లేకపోయేసరికి తలుపు తెరచి ఉన్నా బెల్ నొక్కాను..'

ఆవిడ నవ్వింది.

'అలాక్కాదండీ. ఈ టీవి చూస్తూనే అలా వెనుకనున్న జాగాలో కుర్చీ వేసుకుని కూర్చుంటాను - మా వారు హాల్లో కూర్చుని అన్ని ఛానెళ్ళూ తిప్పి ఒకసారి చూసి నా సీరియల్ నాకు వదిలేస్తూ ఉంటారు.'

'బాగుంది'

'హ హ... ఆయనకేమైనా కావాల్సి వచ్చినప్పుడు సీరియల్ వస్తున్న ఛానెల్ మార్చేస్తారు'

'ఓ... స్కీమ్ బాగుంది.'

'అందుకని అక్కడే కూర్చుంటాను'

తీగెల పాకెట్లు టీ పాయ్ మీద పెట్టాను.

'సార్ మేడమ్ గారికి ఇమ్మన్నారు.'

'ఏంటివి?'

'వీణకు వాడే తీగెలు'

ఆవిడ తీగెలు బైటకి తీసి పరీక్షగా చూసింది.

'మేడమ్ గారు ఇంట్లో లేరండీ?'

చిరునవ్వు నవ్వింది. 'మా వారు ఇప్పుడు అక్కడికే వెళ్ళారు'

'అంటే..'

'ఏం లేదండీ. మా అల్లుడు మీకు చెప్పే ఉంటాడు. చిత్రమైన పరిస్థితిలో ఉంది. డాక్టరు కూడా కొంత సమయం వేచి చూడమన్నాడు.

'ఏదైనా తీవ్రమైనది. ఇబ్బందిలాగా..'

'నోనో.. చాలా మంది కళాకారులకు వచ్చే ఒక సింద్రోమ్! మాకు అర్థంకాలేదు.'

ఆలోచించాను. అంటే వీళ్ళు కూడా రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారన్నమాట.

'అంటే ఇప్పుడు డాక్టర్ దగ్గరకి వెళ్ళారా?'

'నో నో... అమ్మాయి ఒక చోట పిల్లలకి వీణ నేర్పుతుంది. అక్కడికి వెళ్ళారు'

'అయితే ఇంటికి వచ్చేసరికి చాలా సమయం పడుతుందన్నమాట నే వస్తాను..' అంటూ లేచాను.

ఆవిడ గేటు దాకా వచ్చింది. 'ఇవి అమ్మాయికి ఇస్తాను. అల్లుడుగారిని అడిగినట్లు చెప్పండి'

తల ఊపి గేటు బైటకి వెళ్ళాను.

'ఈసారి ఇంట్లో ఉండే టైంలో వస్తాను. మీకేమైనా అభ్యంతరమా?' అడిగాను.

'నోనో.. కానీ..'

'కానీ అన్నారు?'

ఆవిడ చిన్నగా నవ్వింది.

'కానీ అసలు విషయం ఏవిటంటే అమ్మాయి ఇక్కడ కూడా ఉండటంలేదు.'

'ఓ' 'అమ్మాయి ఆ పిల్లతోనే కలసి ఉంటోంది. డాక్టర్ అలానే వదిలెయ్యమన్నాడు. మా వారు చూడటానికి వెళుతూ ఉంటారు'

ఇది నాకు మింగుడు పడలేదు. మరీ ఇంత లోతులలోకి మనసు దూసుకుని పోయి ఈదలేని అనుభూతుల నీటిలో ఒక ప్రపంచం ఏర్పడి ఇవతలి రాలేని సమస్యలా కనిపించింది. ఎందుకన్నానో తెలియదు. 'ఆ తీగెలు ఇవ్వండి' అన్నాను.

గేటు మీద నుంచి ఆవిడ చేతులు తీసింది. నన్ను కొద్దిగా భయంగా చూసింది. ఏమి మాట్లాడకుండా లోపలికెళ్ళి తీగెలు తెచ్చి ఇచ్చింది. ఎందుకో నమస్కారం పెట్టింది.

'ఇందులో మా తప్పేమీ లేదండీ. మా మాటగా ఆయనకు దయచేసి చెప్పండి'

'అయ్యో! నాకు అటువంటి ఆలోచనే లేదు. ఆయనకు అసలు లేదు.'

'మరి తీగెలు ఎందుకు తీసేసుకున్నారు?'

'మీ అమ్మాయికి స్వయంగా అందజేస్తాను. అడ్రస్సు చెప్పండి.'

ఏదో అనబోయి ఆవిడ మరేమీ మాట్లాడకుండా లోపలికెళ్ళి గబగబా ఓ కాగితం తీసుకుని వచ్చింది.

ఓ మంచి రోజు చూసుకుని సంగీతం నేర్చుకుంటున్న పిల్లల వద్దకు వెళ్ళాను. అదో పెద్ద హాలు. పిల్లలంతా అటు తిరిగి కూర్చునున్నారు. వాళ్ళ ఎదురుగా ఈమె వీణతో కనిపించింది. వీణ మీద వాయిస్తూనే గాత్రం నేర్పుతున్నది. పిల్లలు తాళం వేస్తూ చక్కగా అనుసరిస్తున్నారు. 'నీ వల్ల గుణదోషమేమి? నా వల్లనేగాని నళిన దళనయనా, శ్రీమా..' అనే కృతి హాల్లో మారుమ్రోగుతోంది. ఓ ప్రక్కగా కూర్చున్నాను. క్లాసు అయిపోయింది. ఆమెతో మాట్లాడాలని అక్కడ కూర్చున్నట్లు గ్రహించింది. నేను దగ్గరగా వెళ్ళి తీగెల పాకెట్లు యిచ్చాను.

తలదించుకుంది.

'నేను రాజశేఖర్ గారి ఆఫీసులో పనిచేస్తాను. మీరెలా ఉన్నారు?'

ఏమీ మాట్లాడలేదు.

'సార్ అడగమన్నారు'

'....'

'బాగా పాడారు'

ఒక్కసారి నన్ను చూసి చీరె కొంగు కప్పుకుంది.

'నా వల్లనేగాని.. అని పాడుతున్నప్పుడు..' ప్రశ్నార్థకంగా చూసింది.

'నా వల్లనేగాని అన్నీ నా వల్లనేగాని అన్నా అర్థంలో తేడా ఉంటుంది కదా?'

ఆలోచించినట్లుంది.

'నే దగ్గర స్వరం పైకి వెళుతుంది.. అంతే' అంటూ లోలోన మరల పాడుకుంది.

'కరెక్ట్, మనమందరం మన వల్లనేగదా?'

'సారీ. నేను ఏమీ చెప్పలేను. నా పరిస్థితి అంత బాలేదా, ప్లీజ్' చెయ్యి అడ్డుపెట్టాను.

'తీగెలు సరైనవో కావో చెప్పండి. చాలు!'

పాకెట్లలోంచి తీసి చూసింది. ఓకే అన్నట్లు తల వూపి ప్రక్కన పెట్టింది.

'వస్తాను', అంటూ ఇటు తిరిగాను. అప్పుడర్థమైంది - ఈ పిల్లలందరూ కనుచూపులేనివారు. మరల ఆమె వైపు తిరిగాను.

'మీరు గొప్ప పని చేస్తున్నారు.' అన్నాను, '...నాకు ఓ పాట గుర్తుకొస్తోంది. వినిపించని రాగాలే, కనిపించని అందాలే .... కాకపోతే కనిపించని అందాలను వినిపించే రాగాలలో చూపిస్తున్నారు'

'కళ్ళకు గంతలు కట్టుకుని వేసిన పెయింటింగ్'

'ఓ. అద్భుతం.'

'మా ఆవిడ ఆ గదిలో వీణ వాయిస్తూంటే ఆ శబ్దానికి స్పందిస్తూ అన్ని కంచెలు దాటేసింది నా కుంచె.'

ఆమె వైపు చూసాను. ఆమె తల దించుకుంది.

సంగీతానికి తాళం వెయ్యలేక ఈ గదికి తాళం వేసాడు పాపం ఈయన. అది తెరుచుకున్నందుకు ఆనందంగా ఉంది.

'అవునూ..', అడిగాడు, '...ఈ గదిని చూసాక ఆ తీగెలను అడిగి మరీ తీసుకున్నారు. అక్కడికెళ్ళి ఏం చేసారు?' నవ్వాను.

'తీగెలు కేవలం నాదానికే చెందినవి కావు సార్. వాటిని లాగి, బిగించి బాధపెట్టడం దేనికి? అన్నారు మీరు. రెండు భిన్నమైన స్పందనలు కలవాలన్నా అవే కావాలి.'

'తను వీణ వాయించే సమయంలోనే నన్ను ఈ పనిలోకి దిగమని ఈమె నాకు చెప్పింది. మీ ఆలోచనా?'

ముగ్గురం నవ్వుకున్నాం. జలపాతంలోని రంగులు, రాగాలు ఒకేసారి బృందగానం చేస్తున్నాయి.

## ఓ వానాకాలం పొద్దు

**స్కూటర్** ప్రక్కగా ఆపి రోడ్డు మీదకే ఉన్న ఆ చిన్ని హోటల్లోకి దూరాను. పావ్‌బాజీ ఆర్డర్ చేసి గుండ్రంగా ఉన్న టేబుల్ దగ్గర కుర్చున్నాను. సెల్ఫ్‌సర్వీస్ అయినా ఇక్కడ కొద్దిగా మాట వింటారు. 'కూర్చోండి' అని చెప్పి అతను తయారు చేస్తుంటే బలే ఉంది. వాన దంచుకుంటోంది.

ఈ అమ్మాయిలో ఏదో ఉంది. మనసులోకి ఓ చిలిపి ఆలోచన దూరినట్లు, ఇది నా సామ్రాజ్యం అన్నట్లు లోపలికి వస్తుంది. నన్ను చూసి చిలిపిగా నవ్వి ఎదురుగా కూర్చుంది.

'బృందగానం చదివాను.', చెప్పింది.

'గానం వింటారు కానీ చదవటం ఏంటి?'

'ఊ... కథలో ఏదో పాట కూడా విన్నట్లే ఉంది'

కవిత ఇపుడు నవ్వుతుంది. అనుకున్నప్పుడు ఎన్నడూ నవ్వదు.

నవ్వినప్పుడు ఏదో ఆలోచించే లోపల నవ్వు ఆపేస్తుంది. ఇందులో కూడా ఏదో అందం ఉంది అనిపిస్తుంది.

'కవిత లేదా హాండ్‌బాగ్‌లో?'

చుట్టూతా చూసింది. లేదన్నట్లు తల ఊపింది.

'చెబుతాను. గుర్తుంటుందా?'

'చెప్పండి'

***'చిట్టి సూరిగాడు చిరాకు పుట్టి మబ్బు ముసుగు తొడిగేసాడు.'***

'ఓ..బాగుంది'

***'కానీలెమ్మని నేనూ ఓ టీ కప్పుతో ఈజీ చెయిర్‌ను ఆశ్రయించాను.***

***ఇంతలో...***

***జిలుగు వర్షపుధారని ఛేదించుకుంటూ***

***ఓ క్రొక్కరు మెరుపుతీగె చటుక్కున***

***నా ఇంటి చూరునాశ్రయించింది.***

***అంతే.***

***నా నలభై వత్సరాలలో ఇరవై యింటిని కుర్చీకి తన్నిపెట్టి నిటారుగా స్థిరపడ్డాను.***

***ఇంతలో..***

***కొంటె సూరిగాడు కన్నుకొట్టుకుంటూ తొంగి చూసేసాడు.***

***అంతే..***

***మెరుపు తీగె మరి నిలువలేదుగా!***

***చరున కాలిన నాలుకని 'ఉఫ్'మని ఊదుకుంటూ, మళ్ళీ ఓసారి నా చెలి ఈజీ ఛెయిర్‌ను ఆశ్రయించాను కుర్చీలో వాలాను.***

కవిత లేచి '***వాన వెలిసింది***', అంది.

'బాగుంది. ఆ వానని నాలోకి పంపాక అక్కడ ఆగక ఏమవుతుంది?' అన్నాను.

'కథవ్రాయండి' అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆలోచించాను. కవితను, తన కవితనూ గుర్తు తెచ్చుకున్నాను.

'ఓ వానాకాలం పొద్దు' అని వ్రాసాను.

'దోషం లేదు', అన్నాడు సుందరం. అతని వెనుక నిలుచునుంది ఛాయాదేవి.

'ఏంటి? మీ వెనుక నిలబడటం కూడా దోషమేనా?'

'లేదంటున్నాను కదా?'

'ఎందుకులేదు?'

'నేను టి.విలో ఇలా వార్తలు చదివే అమ్మాయిలను, ఏదో ప్రోగ్రామ్‌లు నడిపే వాళ్ళను ఎందుకు కళ్ళార్పకుండా చూస్తాననే కదా నీ బాధ?'

ఆమె ముందుకొచ్చింది.

'నా పేరు ఛాయ!'

'కరెక్ట్'

'ఏది చేసినా చూస్తాను'

'చూడు'

'దోషం దేనికి?'

'దోషం లేదంటున్నాను.'

'లేదన్నప్పుడు ఆ మాటెందుకొచ్చింది?'

'మాట వస్తుందేమోనని అక్కరలేదని నేను నిర్ధారించానన్నమాట' కాఫీ గ్లాసు తీసుకుంది ఛాయ.

'రకరకాల పూలు పూస్తూ ఉంటాయి. వాటిని చూడాలి కదా?'

'కరెక్ట్. అందుకే ఈ మధ్య కొద్దిగా జాగ్రత్తగా చూస్తున్నాను. విశ్లేషణకు పనికొస్తున్నాయి'

'ఈ మధ్యనే ఎందుకో?'

సుందరం లేచి వరండాలోకి వచ్చాడు. ఛాయ వెనుక వచ్చింది. ఇద్దరూ పిట్టగోడ దగ్గిర నిలుచున్నారు.

'ఓ మాటనుకుందాం' అన్నాడు సుందరం.

'చెప్పండి'

'ట్రాఫిక్‌లో సిగ్నల్ ఎక్కడుంటుంది?'

'నాలుగు వీధులు కలిస్తే సిగ్నల్ పెడతాడు'

'బాగా చెప్పావు. మగాడికి కూడా వయసులో నాలుగు పదులు కలిస్తే ఎక్కడినుండో సిగ్నల్‌లు వస్తు ఉంటాయి'

లోపలికి నడిచింది. వెనుక వెళ్ళాడు సుందరం.

'తెచ్చిపెట్టుకున్న సిగ్నల్స్ ఇవి. ఫేస్‌బుక్‌లో చాటింగ్, వాట్స్‌అప్‌లో ఫోటోలు, కొద్దిగా తగ్గిస్తే బాగుంటుంది సార్. ఆ ఫోన్‌ను వదిలి నన్ను చూస్తే అర్ధం అవుతుంది.'

'నీ గురించి సరిగ్గా తెలియాలంటే ఎందరినో చూడాలి. ఎన్నో తీర్ధయాత్రలు చేసి ఇంటిలోనే దైవం ఉందని తెలుసుకుంటాడు సరైన సాధకుడు'

ఛాయకు తిక్క వచ్చేస్తోంది. నడుము బిగించి కళ్ళు పెద్దవి చేసింది. జాగ్రత్తగా చూసాడు సుందరం. రాజకీయ నాయకులు పలుమార్లు స్త్రీలందరూ నడుము బిగించాలి అని ఎందుకంటారో అర్ధమయింది.

'చిల్లరకొట్టుళ్ళను, చిలక కొట్టుళ్ళను వైవిధ్యం పేరుతో సమర్ధించుకోవటం చాలా చూసాం. ఏంటి సంగతి?'

సుందరం లుంగీ పైకి కట్టేసాడు. ఎందుకో రేడియో పాట అందుకుంది.

'అందాలా ఆనందం ఇందేనయ్యా, అందం చూడవయ్యా, ఆనందించవయ్యా..' వాస్తవానికి ఆడది నడుము బిగించటం, మగాడు లుంగీ పైకెత్తటం సామాన్యమే. కాకపోతే మానసిక శాస్త్రంలో నిపుణులు, ఇతర శాస్త్రవేత్తలు ఈ మధ్య ఈ ప్రక్రియను గట్టిగా పరిశీలించినట్లు తెలుస్తోంది ఈ ప్రక్రియను సాహితీవేత్తలు కూడా ఏదైనా కథలో నున్న నడిబొడ్డును ఇటువంటి సంఘటనతో పోల్చటం మనం చూస్తున్నాం. అలాగే ఉన్నతమైన న్యాయవాదులు కూడా ఒకే కేసును చక్కగా పరిశీలించి కొంత దూరం వెళ్ళాక

'ద కోర్ట్ విల్ టేక్ పొసిషన్' - న్యాయస్థానం ఇప్పుడు ఇక్కడినుండి ఒక నిష్కర్షకు వచ్చే మార్గాన్ని సూచిస్తుంది అంటారు. రిఫరీలు ఈల వెయ్యటం, కుక్కరు మూడో కూత కూయటం, ఎటో పోయేవాడు కూడా ఇటు తిరిగి చూడటం కూడా ఇక్కడే

'చూడటం కూడా చెడిపోవటమేనా?'

'చెడిపోయాకనే చూడటం ప్రారంభమవుతుంది'

'అంటే నేను చెడిపోవటం అయిపోయి చాలాకాలం అయిందంటావు'

'కొద్దిగా టైం ఉంది'

'దేనికి?'

'చెడిపోవటానికి'

ఆలోచించాడు సుందరం. పైకోర్టుకు అపీలు పెట్టుకునేందుకు యిచ్చిన గడువా ఇది లేక మెడ పూర్తిగా పట్టేస్తే నాలుగు రోజులు నేలమీద పడుకునేందుకు డాక్టరు ఇచ్చిన అవకాశమా?

ఇద్దరూ ఒకరి వెనుక ఒకరు నడిచారు.

'ఇంతలో అంత రిబేటు ఎలా ఇచ్చావు ఛాయా?' టోన్ మార్చాడు సుందరం.

'భగవద్గీత చదవండి'

లుంగీ సరైన పొసిషన్‌కి వచ్చేసింది.

'నేనింకా రిటైర్ కాలేదు. తరువాత ఎలాగో..'

చెయ్యి అడ్డుపెట్టింది ఛాయ.

'కుర్రాళ్ళ కోసం గీతలో ఎంతుందో మొన్న ఓ స్వామీజీ వివరించాడు'

'గీత అంటే...'

ఛాయ ముఖం సూర్యుడిలా మారింది.

'ఈ జోకులే వద్దన్నది. మండుతుంది'

'ఛాయ కూల్‌గా ఉండాలి'

'అంటే?'

'ఛాయను భార్యగా పొందినవాడు అదృష్టవంతుడు'

కూల్ అయింది ఛాయ. అల్పసంతోషం నుండి ఆడది పుట్టిందని సుందరమే చాలా సార్లు అన్నాడు.

'భార్య అనే నీడలో ఉంటూ అక్కడక్కడ కాచే ఎండను చూడటం ప్రతి మగాడూ చేస్తూ ఉంటాడు'

మళ్ళీ పాదరసం పైకి ప్రాకింది.

'ఇంతకీ గీత గురించి ఎందుకు చెప్పానో తెలుసా?'

'చెప్పేసెయ్'

'శ్రీకృష్ణుడు తనని అందరిలోనూ, అందరినీ తనలో చూడమన్నాడు'

'కరెక్ట్'

'అంచాత ఏ అమ్మాయి బాగుందనిపించినా మీకు ముందర నేను గుర్తుకురావాలి'

'గుడ్ ఇప్పుడు అలాగే జరుగుతోంది. తరువాత ఏమవుతుందో చెప్పలేను'

'అంటే?'

'తాదాత్మ్యం చెంది అందరిలో నువ్వే కనిపిస్తే నన్ను నేను పట్టుకోవటం కష్టమైపోతే?'

ఛాయ ఈసారి కళ్ళు పెద్దవికావు, ఎర్రగా కూడా చేసి దగ్గరకి వచ్చింది. గట్టిగా పట్టుకున్నాడు సుందరం.

'సాష్టాంగం అంటే ఏంటో తెలుసా?,' చెవిలో చిన్నగా అడిగాడు.

'నా కనవసరం'

'మన నీడ మనలో కలసిపోవాలి ఛాయా...'

శనివారం మధ్యాహ్నం నిద్రలేచి కిటికీ వద్దకు వచ్చాడు సుందరం. నన్ను కాకుండా లెక్కేసుకోండి అనే వాడు ఎలా ముసుగు తన్నేస్తాడో సూర్యుడు కూడా నల్ల మబ్బులను పైకి తెచ్చుకుని విశ్రమిస్తున్నట్లుంది. కాలం ఎంత మారినా చినుకు ఉనికికి మట్టి ప్రకృతి

గట్టిదనాన్ని తన సువాసనతో ప్రకటిస్తోంది. ఇంట్లో ఎవరూ లేరు. నా తరువాతే ఏదైనా అనే ధృవీకరణ పత్రం చివర ఎవరో సంతకం చేస్తున్నట్లు మబ్బుల చాటున మెరుపులు అలా మెరుస్తున్నాయి. సరైన రాగానికి విరివిగా తాళం తోడై అనర్గళంగా సంగతులతో కలిసి శృతిలో సాగిన కృతిగా వర్షం ఓ భావజాలంలో భువనత్రయులను అతనికి చూపిస్తోంది.

పోటీపడుతున్న చినుకులను అదే పనిగా చూస్తున్నాడు సుందరం. ఈ వాన కురిస్తే తప్ప అసలు ఈ నేలమీద ఏముందో తెలియదు. ఓ దృశ్యం కనిపిస్తే తప్ప అసలు ఈ మనిషిలో ఎటువంటి ఆలోచనలు ఉన్నాయో తెలియదు. మరి ఆలోచనల నుండి కదా దృశ్యం ఏర్పడాలి? ఏమో భూమి మీద పచ్చదనం ఎంత ఉంటే అంత చక్కగా వానలు కురుస్తాయిట. అంటే అక్కడ కావలసింది ఇక్కడా ఉండాలి, ఇక్కడ కావలసింది అక్కడా ఉండాలి. అంతా ఆలోచనే. సర్వం స్పందనలోనే ఉంది. సంతోషంగా ఉన్నవాడి దగ్గరకే లక్ష్మి వస్తుందిట. సద్భావనలోనే సరైన జీవితం ఉంది.

వానజోరు పుంజుకుంది. వరండా క్రింద ఉన్న చిన్ని చిన్ని రాళ్ళూ, రప్పలూ అలా కొట్టుకుని పోతున్నాయి.

చూరుమీది నుండి వ్రేలాడుతున్న పైపులోంచి నీరు ఓ చిన్ని జలపాతంలా దూకుతోంది. మామిడి చెట్టు కొమ్మల్లోంచి పయనించి అలా విరజిమ్ముతూ మట్టిలోకి చేరుకుంటోంది. ఓ పల్లెపడుచు ఆకుపచ్చ పరికిణీని కొద్దిగా పైకి పట్టుకుని అలా గట్టు దాటుతోందా అనిపిస్తోంది. ఇటుప్రక్క పల్లంగా ఉన్న చోట నీరు నిండింది. ఇది నా ప్రపంచం అన్నట్లు చినుకులు గంతులేస్తుంటే అప్పుడే వేదిక మీద భామా కలాపం ఎవరో ప్రదర్శిస్తున్నట్లుంది.

ఉరుములు వినిపిస్తున్నాయి. అవునూ.. ఎందుకు ఈ మనసు అమ్మాయిల గురించే ఆలోచిస్తోంది? ఏమో ఇదంతా సహజమేమో! ఇద్దరు చిన్నకుర్రాళ్ళు రోడ్డుమీద కావాలని తడుస్తూ నీళ్ళ మీద గంతులేస్తూ వెళ్ళిపోయారు.

పూల కుండీల మాటున పైకి ప్రాకిన మల్లెతీగ మీదుగా ఎంతో నాజూకుగా నీరు జాలువారుతోంది. జడ ఆన్చిన నడుము మీది నుంచి యువతి నిలకడలేని చీర ఎందుకో జారిపోతానంటోంది.

అటు మూల ఉన్న ఒక బుల్లి పైపు మీద నీరు పొంగి నిన్ను ముంచేసాను అంటోంది. ప్రేమ రసభావంతో నిండిన ఖయ్యామ్ రుబాబూ రుబాబుగా గ్లాసుదాటి పొంగి పొరలుతోందా అనిపిస్తోంది.

మెరుపులు మెరిసినప్పుడు ఆకాశం పెద్ద కాన్వాస్‌లా కనిపిస్తోంది. చిత్రకారుని చేతిలోంచి మబ్బుల గుంపులు ఇంపుగా కళాత్మకమైన చిత్రంలోకి అదురుతున్నట్లున్నాయి. ఎప్పుడో అప్పుడు మనసు ఉరకలేయటం చంద్రుడికే కాదు సూర్యుడికైనా తప్పదన్నట్లు అయిన కూడా కొద్దిసేపు దాక్కుంటున్నాడు. సుందరం ఏపాటి?

ఆలోచించాడు. గీత అంటోందేంటి ఛాయ? ఎక్కడ విన్నదీ గీత గోవిందాన్నీ.

తెల్లని సల్వార్ కమీజ్ మీద సన్నజాజి రంగు చున్నీ ధరించి నిలబడేది గీత. ఆ బస్ స్టాప్ పైన రేకుల మీద వాన పడుతుంటే ఆ శబ్దాన్ని గమనించుకుంటూ, ఎదురుగా ముంచెత్తుతున్న వాన ఇంకా ఎంత సేపుంటుందో గమనిస్తూ నిలబడ్డాడు.

పాతైనా ఆ రోజుల్లో కుర్రతనం నేనూ ఉన్నానని వెంట పడేది. నాలుగైదు సార్లు దొంగ చూపులు చూసేసాడు.

'నాకు మీతో మాట్లాడాలని లేదు' అని సూటిగా తనను చూసింది ఆ అమ్మాయి. ఆ మాటకి చుట్టూతా చూసి ఏమనాలో తెలియక రెండు చేతులూ జేబుల్లో పెట్టుకున్నాడు. పక్కున నవ్వింది.

'నాతో అంటున్నారా?', అడిగాడు.

'అవును. మామూలుగా ఇలాంటప్పుడు మాట్లాడిస్తారు కదా, మీలాంటి వాళ్ళు?'

'నాలాంటి వాళ్ళు అంటే?'

'ఓ. పోనీ ఇంకో మాటంటాను. కొందరు మగాళ్ళు'

'నమ్మండి. నేను మాట్లాడాలనుకోలేదు'

'మరి?'

'చూడాలనుకున్నాను!'

ఏదో అనబోయి ఆగింది.

'అది కూడా తప్పే'

'మరి ఏం చెయ్యాలి నేను?'

'ఏం చెయ్యాలి? వాన తగ్గే వరకూ ఆగి వెళ్ళిపోవాలి'

'అయ్యో. అది కుదరదు కదా?'

'ఏం? ఎందుకు కుదరదు?'

'బావుండదు. సామాజిక స్పృహ లేదని మీరనుకుంటారు'

'నేననుకోను, ఇంతకీ ఏం చూస్తున్నారు?'

'మంచి రంగున్నవారు తెల్లరంగు దుస్తులు ధరించటం అవసరమా? అని చూస్తూ ఆలోచిస్తున్నాను'

'ఊ. మీకెందుకా సంగతి?'

'ఈ బస్ స్టాప్‌లో ఉన్నాను కాబట్టి'

'నాన్‌సెన్స్. మీరు వచ్చేముందు ఓ అడుక్కునే వాడు అలా కూర్చున్నాడు.'

'అతను ఏం చేస్తాడు?'

'నాన్‌సెన్స్. ఆఖరుకి అమ్మాయి కనిపిస్తే అడుక్కునే వాడు కూడా ఏదో ఒకటి చెయ్యాలా? అడుక్కున్నాడు.'

'ఏదైనా వేసారా?'

'మీకెందుకు?' దాదాపు అరచినంత పని చేసింది.

'నేనూ అడుక్కునే వాడినే.'

'వద్దు. నేను వెళతాను. సినిమా వద్దు'

'అరె. నా మాట  వినండి. నా మాటకు భిక్షగా కొద్దిగా గౌరవం పొయ్యండి'

'ఏంటి మీ మాట?'

'కలర్ కాంబినేషన్'

చున్నీ ముందరకి లాక్కుని చేతులు కట్టుకుంది.

'మీరెవరో నాకు తెలీదు. నేను'

'సుందర్. ఇండియన్ బ్యాంక్'

దగ్గర కొచ్చింది. 'నేనడిగానా?'

'నేను చెప్పేసాను. బాగుండదని చెప్పాను.'

రెండు చేతులూ జోడించింది.

'బావుంటుంది. ఏమీ మాట్లాడకపోతే బాగుంటుంది'

'అలాక్కాదు. మీరు!?.'

'ఖర్మ. ఇదే నా భార్య. నేనూ బ్యాంకే! ఆంధ్రా బ్యాంక్' బస్సువాడూ అప్పుడే వచ్చాడు. లోపలికెక్కేసి కూర్చుంది. కిటికీ దగ్గిరకు తడుస్తూ కూడా ముందరకి వచ్చాడు సుందరం.

'ఏవండీ.. మీ పేరు చెప్పేస్తే కొద్దిగా'

రెండు చేతులూ నెత్తిన పెట్టుకుంది.

'ఖర్మ!'

'ఛా! అలా ఉండదు'

'కాదు అలానే ఉంది ఈ రోజు నాకు'

'అలాక్కాదండీ. నేను..'

బస్సు కదిలింది. కొద్దిగా నడిచాడు.

'గీత' ఎక్కడినుంచో వినిపించింది.

ఇటు తిరిగాడు. ఓ పెద్దావిడ నిలబడి ఉంది.

'గీత' అన్నది మీరేనా?

'అవును. మా ఆఫీసే...'

అంతసేపు ఓ అమ్మాయితో మాట్లాడటం, అదే మొదటిసారి. నిజానికి అదే ఆఖరు కూడా. కాకపోతే సుందరం ఆ అమ్మాయిని ఎందరితోనో పోల్చుకున్నాడు. అదృష్టమో, దురదృష్టమో, అతి త్వరగానే పెళ్ళయిపోయింది.

వాన వెలుస్తోంది. ఎందుకో ఒక్కసారి ఆ గీత అలా ఓ మెరుపులా మెరిస్తే బాగుండనిపించింది. ఇలాంటి వాన కురుస్తున్న రోజున ఎంచక్కా ఓ గొడుగు పట్టుకుని ఇలా గేటు తెరుచుకుని లోపలికొచ్చి

'ఏవండీ ఈ అడ్రస్సు. '

'అరే మీరా?'

'మిమ్మల్ని ఎక్కడో. '

'కరెక్ట్. '

'ఎంత విచిత్రం?'

లోపలికి వచ్చి 'అయ్యో రండి, ఓ కప్పు కాఫీ. '

ఇలా తెలుగు సినిమాలా జీవితంలోకి వెలుగు ఎందుకు ప్రవేశించదు? ఆలోచిస్తూనే ఉన్నాడు సుందరం పాపం.

ఇవన్నీ సహజమేనేమో. నలభై నిండాక ఎందుకో మబ్బులకు ఓ సిల్వర్ లైనింగ్‌లాగా ప్రతిమగాడికీ ఓ మెరుపు మెరుస్తుంది - ఓ గీత దర్శనమిస్తుంది.

గేటు తెరుచుకుంది. తెల్లని చుడీదార్‌లో ఓ అమ్మాయి గొడుగుతో నిజంగానే లోపలికి వస్తోంది. ఇదేంటి? వర్షాలకి చేను నిక్కపొడుచుకున్నట్లు శరీరం మీది వెంట్రుకలు లేచి నిలబడ్డాయి. ఎక్కడో కాదు ఇక్కడే సినిమా రిలీజ్ అయిపోతోంది. ఘటన అంటే

ఇదే ఇటే వస్తోంది. ఇంట్లో కాఫీ డికాషన్ ఉందో లేదో. ఆమె కిటికీ దాకా వచ్చింది. సుందరం కిటికీ చువ్వలు పట్టుకుని ఎలాగో అలాగ ఈ 'భావసముద్రం'లోంచి విడుదల చేయమంటున్న ఖైదీలా నిలబడ్డాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. సుందరం ఇక నవ్వుతూ చంటాడిలా నడిచేస్తాడా అనిపిస్తోంది. అయ్యో, గొడుగు అక్కడ పెట్టేసి లోపలికొచ్చేస్తోంది.

ఆమె లోపలికొచ్చేసింది. 'ఏంటలా చూస్తున్నారు? ఏమైంది?' అంది.

ఇటు తిరిగాడు. ఆమె గీత కాదు, ఛాయ.

'ఏం లేదు..'

'అర్థమైంది. ఈ చుడీదార్ ఎక్కడిదనా?'

'కరెక్ట్. నువ్వు వాడవు కదా? అవునూ..'

'ఏం లేదండీ. వానలో పూర్తిగా తడిసిపోయాను. మా స్టూడెంట్ ఇంట్లో కూర్చున్నాను. ఆ అమ్మాయ్ చీరలు కట్టదు. టక్కున ఈ డ్రెస్ ఇచ్చింది. ఎలా ఉన్నాను?'

'బలే ఉన్నావు. ఉండు ఫోటో తీస్తాను'

ఛాయ లోపలికెళుతోంది. 'అయ్యో వద్దండీ..'

మొబైల్ పట్టుకొచ్చాడు. ఇద్దరూ దగ్గరగా నిలబడి ఫోటో తీసుకున్నారు.

ఆమె లోపలికెళుతూ ఆగింది.

'దోషం లేదా?'

'నో! అస్సలు లేదు.'

## *బ్రతుకు వెంబడి బంధాలు*

**కవిత నుంచి** చాలారోజులు గడిచినా మెయిల్ లేదూ, మాటా లేదు. ఏమయి ఉంటుందా అనుకున్నాను. ఒక రోజు ఫోన్ వచ్చింది.

'వానాకాలం పొద్దు కవ్వించింది.., చెప్పింది.

'గుడ్'

'కానీ జీవితం చిత్రమైనది.'

'కరెక్ట్'

'చినుకుల్లాగా, చిన్ని కునుకులాగా ఏదీ శాశ్వతం కాదంటుంది'

'ఊ...'

'ప్రస్తుతం హైదరాబాదులో లేను'

'ఏమైంది?'

'బాగా కావలసిన బంధువు చివరిరోజులలో ఉన్నాడు. ఆ రోజులు కలసి వెళ్ళదీస్తున్నాం'

'ఓ . అయామ్ సారీ'

'కవిత వద్దా?'

ఇలాంటి ప్రశ్న ఈ అమ్మాయి అడగలేదెప్పుడూ. వద్దని ఎలా చెబుతాను, కవిత కావాలి. ఏమో, కవితా కావాలి.

'ఎదురు చూస్తున్నదానిని వద్దని చెప్పే వెర్రివాడినైతే కాను'

**'కొన్ని..**

**తామరాకుపై నీటి బొట్టుల్లా నిశ్శబ్దంగా కేవలం..**

**కొన్ని -**

**సాయం సంధ్యన వినిపించీ వినిపించకుండా దూరాన సాగే కమ్మని పాటలా....**

**కొన్ని -**

**నిశ్శబ్ధంలో ప్రక్కనే వుండి పలుమార్లు ఇబ్బంది పెట్టే బల్లి కూతల్లా...**

**కొన్ని -**

**ఎక్కడ వున్నా నీకై, నీ కోసమే, నీలోనే మేము అంటూ ప్రాణ నాడిలా...**

**ఏ బంధమైనపుడు, ఏ రూపాంతరం చెందుతుందో, చెందిందో**

**విశ్లేషణ అసాధ్యం, అనవసరం..**

**అన్నిటిని ఆస్వాదించుట అనివార్యం'**

ఫోన్ పెట్టేసింది.

కాగితం ముందు కూర్చున్నాను. ఈమె ఆలోచనలు చిత్రంగా చిందులు వేస్తాయి. సర్కస్‌లోని నెట్‌లో గంతులు వేసే కళాకారుల్లా అమాంతం ఒక చోటనుండి మరో చోటుకి ఎగిరిపోతాయి. ఏదో తాత్వికంనుంచి మరేదో ఆధ్యాత్మికం వైపు సాగి ఒక్కసారి గదిలోని 'బల్లికూత' అంటుంది.

నిజానికి కథకి ఇదే 'వీలు'. ఈమె కవితలో ఎక్కువగా ఈ వీలునామానే వెతకటం పరిపాటి అయిపోయింది.

మరోసారి కవిత చదివాను. కవితను చదవగలగటం ఇంకా చేతకాలేదా!

'బ్రతుకు వెంబడి బంధాలు' అని వ్రాసాను.

ఆసుపత్రిలోని ఆ రూము అలవాటైపోయింది. బెడ్ ప్రక్కనే ఓ చువ్వకు ఓ సెలైన్ బాటిల్ నువ్వా నేనా అన్నట్లు నిశ్శబ్దంగా వెక్కిరిస్తోంది. ఎదురుగా ఉన్న కిటికీ తెరవమంటే ఎందుకో తెరవరు. సాయంత్రం ఎవరో వస్తూ ఉంటారు, వెళుతూ ఉంటారు డాక్టర్లు బైటకి వెళ్ళి మాట్లాడుకుంటారు. అవేవో రహస్యాలు, ఎవరికి తెలియవు? ఎందుకో అందరికీ ధన్యవాదాలు చెప్పాలనిపిస్తోంది. అదికూడా సాధ్యంకాదా. చుట్టూతా ఎంత నిశ్శబ్ధం కమ్ముకున్నా మనసు గోల పెడుతూనే ఉంటుంది.

బ్లాక్ అండ్ వైట్ ఫోటో ఆల్బమ్ పన్నాలు తిరగేస్తున్నట్లు వార్ధక్యం గతంలోని పుటలను టి.వి సీరియల్‌గా తిప్పుతూనే ఉంది. ఎవడో వస్తాడు. ఆ సెలైన్ బాటిల్‌ను ఎందుకో పరిశీలిస్తాడు. అటు తల తిప్పగానే చెయ్యి చూపిస్తాడు. నా పెదవులు కదిలే ప్రయత్నం చేస్తాయి. వాడు ఎందుకో పళ్ళు ఇకిలిస్తాడు.

'మీరు రెస్ట్ తీసుకోవాలి' అంటాడు.

ఇదేంటి? నేనేమన్నా కష్టపడి దేశాన్ని ఉద్ధరిస్తున్నానా? కళ్ళు మూసుకుంటాను. వాడు వెళ్ళిపోతాడు. ఆ కిటికీ అద్దం వెనుక అది ఏ పక్షి అయి ఉంటుందో తెలియదు, రెండు మూడుసార్లు ముక్కుతో అద్దం మీద కొడుతుంది. కిటికీ తెరవమంటుంది ఆ శబ్దం ఎందుకో నన్ను మరల సమాజంలోకి లాగుతుంది. అది నా గుండె చప్పుడు వినాలనుకుందో ఏమో, ఒకవేళ వినేసిందేమో కూడా. శబ్దం ఆగిపోయాక నాకు తెలుస్తుందా? వీళ్ళకి ఎలాగో తెలుస్తుంది. నాకెందుకు?

'గుడ్..', అన్నాడు డాక్టర్, '.. అన్నీ బాగున్నాయి. పెద్దవారు కదా? అంతకంటే ఏమీలేదు.'

అన్నీ బాగుండటం కూడా ఇబ్బందే నాకు ఈ బాధ అని చెప్పుకునే అవకాశం కూడా లేదు. మూర్తిగారితో తిరుగుతున్నప్పుడు ఓ మాట అనేవాడు.

'సార్, ఏ బాధా లేనప్పుడు మెదడుకి ఆక్సిజన్ సప్లయి తగ్గటం వల్ల మనలాంటి వాళ్ళు ఇబ్బంది పడతారు'

'కరెక్ట్'

'అది ఎప్పుడు తెలుస్తుంది? అని అడగండి'

'ఎప్పుడు తెలుస్తుంది మూర్తిగారూ?'

'మీ గుండె చప్పుడు మీకు చెవిలో వినిపిస్తూ రోజురోజుకీ శబ్దం పెద్దదవుతుంది'

'ఓ . ఆగిపోయే వరకూ వినిపిస్తుందా?'

'అది నాకూ తెలియదు'

ఇద్దరం పార్కులోంచి ఇవతలకి వచ్చేవాళ్ళం.

'శబ్దంతో తీరని బంధం సార్..' చివరగా అనేవాడు 'ఎక్కువగా ఆలోచించకండి. ఆలోచనలకు ఓ శబ్దం ఉంటుంది. అది మరీ చంపుకు తింటుంది.'

ఆయన చివరి రోజుల్లో తరచూ వెళ్ళేవాడిని. మంచం ప్రక్కన ఓ బాల్చీ ఉండేది. దానిమీద ఓ కిటికీలో ఓ వాటర్ ఫిల్టర్ ఉండేది. అందులోంచి టాప్ లీక్ అవటం వలన ఒక్కో చుక్కా నీటిలో పడి శబ్దం చేసేది. ఆ టాప్ గట్టిగా కట్టే ప్రయత్నం చేసాను. వద్దని సైగ చేసాడాయన. ఆ శబ్దం కావాలిట ఆయనకు.

బహుశ ఇదేనేమో నాకూ జరుగుతోంది. ఆ పక్షి వచ్చి ముక్కుతో శబ్దం చేస్తే తప్ప రోజు గడవటంలేదు. మూర్తిగారు ఊరవతల ఇల్లుకట్టుకునే రోజులలో రాత్రి చివరి బస్‌లో ఇద్దరం వెళ్ళేవాళ్ళం. కండక్టర్ 'అంతదూరం వస్తారా. తిరిగి సర్వీస్ లేదు' అనేవాడు. మాకు అక్కరలేదు. మేము వాచ్‌మన్‌గిరి చేయటానికి వెళ్ళేవాళ్ళం. నిర్మానుష్యంగా ఉన్న చోట దిగగానే ఓ కుక్క కాచుకుని ఉండేది. మాతో ఆ నిర్మాణంలో ఉన్న ఇంటిదాకా వచ్చేది. చక్కగా తోక ఆడిస్తూ అది కూర్చుంటే మేము కునుకుపాట్లు పడేవాళ్ళం. నెలరోజుల తరువాత అది ఎందుకో కనిపించలేదు. మూర్తిగారు చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. ఇంకా పూర్తికాని ఇంటి ముందు ఈశాన్యంలో కూర్చున్నాడు. సిగరెట్ అవతల పడేది ఓ అగ్గిపుల్లతో గీతగీసాడు.

'సార్, ఈ చోటు నాకు మిగులుతుందా?' అడిగాడు.

'అంత భావుకత్వం వద్దు.' అన్నాను.

'...అన్నివేళ్ళూ ఒకలా ఉండవు, అన్ని వేళలూ ఒకలాగా ఉండవు'

కానీ ఆయన అన్నది నిజమే. ఆ గీత దగ్గరే కట్టిన వరండాలో పడుకున్నాడు. మాట కూడా పడిపోయింది. కళ్ళతో మాట్లాడుతున్నాడు.

చేతిలో ఆ గీతను చూపిస్తూ నవ్వేవాడు. ఆ మధ్య కొద్దిగా ఆరోగ్యం పుంజుకున్నప్పుడు ఓ కాగితం మీద ఏదో వ్రాసి చూపించాడు. నాకు ఏమీ అర్థం కాలేదు. చెయ్యి నెత్తిమీద పెట్టుకున్నాడు. కొద్దిసేపు కళ్ళుమూసుకుని ఓపిక తెచ్చుకుని మరలా వ్రాసాడు. జాగ్రత్తగా చదివాను.

'అది నెలరోజులలో వెళ్ళిపోయింది. నాకు నలభై ఏళ్ళు పట్టింది.'

ఆయనను జాలిగా చూసాను. కళ్ళలో ఏదో మెరుస్తోంది. ఆ తరువాత మూర్తిగారు నాకు కనిపించలేదు. ఎక్కడైనా ఏదైనా టాప్ లీక్ అవుతుంటే కనిపిస్తాడు.. ఆ శబ్దానికీ, ఆయనకూ ఏదో మరి.

'జాగ్రత్తగా చూస్తే తామరాకు మొత్తం దాని మీద ఉన్న నీటి బొట్టులో గోచరిస్తుంది. అది ఒక క్రిస్టల్‌లా మారుతుంది. నీటిబొట్టు ప్రాకదు, తాకదు, జారదు, తిరగబడదు, అరవదు, కరవదు.. కానీ వెళ్ళిపోతుంది' ఆరోజు ఆయన బంధువెవరో చెబుతున్నాడు.

మరల ఆ పిట్ట అద్దాన్ని తడుతోంది. జోలపాట ఓ శబ్దం, నిదుర ఓ నిశ్శబ్దం, మంచిమాట ఓ శబ్దం, మనశ్శాంతి ఓ నిశ్శబ్దం. తాళం ఓ శబ్దం, లయ ఓ శబ్దం, సంగీతం ఓ శబ్దం.. నిబద్ధత ఓ నిశ్శబ్దం.. ఈ పిట్ట చక్కగా కొడుతోంది. పిచ్చుకలా ఉంది. ఎందుకో దీనికి పిచ్చి.

బూజు పట్టిన ఆ కళాసమితిలో బాబురావు ఒక్కడూ తాళం వేసుకుంటూ ఏవో పాటలు వ్రాసుకునేవాడు. అప్పుడప్పుడు అటు వెళ్ళేవాడిని. కంజీరా వాయించేవాడు.

'ఎందుకు బాబూరావూ, ఈ శ్రమ నీకు?' అడిగేవాడ్ని, '...జనాలకి అక్కరలేదా, ఒక్క పైసా రాలదు. ఎవరికోసం? ఇంట్లో కూడా అందరికీ ఇబ్బందే నా మాట విను.'

బాబూరావు దానిని ప్రక్కన పెట్టి చూరు మీద ఓ కన్నం చూపించేవాడు.

'దానిని చూడండి సార్....... ఈ గదంతా చీకటైతే అందులోంచి వచ్చే సూర్యరశ్మి చూసి మరో ప్రపంచం వైపు ఆలోచన సాగించాలి. ఇదే జీవితం. చీకటికిదే నివాళి.. వెలుగుకు ఇదే నమస్కారం.'

పైపెచ్చు ఆ కంజీరా నా చేతిలోకి విసిరేవాడు.

'గరీబోడిదీ నాటకం, గరీబుతోనే నాటకం.'

నేను చిన్నగా తాళం వేసేవాడ్ని. అతను తన్మయత్వంతో పాడేవాడు.

'పరదాలు లేవు సరదాలు లేవు, వరదలా పారే పేదరసం. హాయ్, గరీబోడిదీ నాటకం, గరీబుతోనే నాటకం..

రంగులు లేవు, హంగులు లేవు, కష్టం అయినా ఇష్టం అయినా దిష్టి బొమ్మతో నాటకం..హాయ్'

బాబూరావు గొంతు కూడా మూగబోయింది.

'నా నాటకం అయిపోయింది.., జీర గొంతుతో పలికాడు.

ఎవరో బంధువుల ఇంట్లో ఓ మూల పడుకోపెట్టారు. 'అదిగో ఆనందం, ఇదిగో కష్టం తీరింది అనిపించే సంధిలో, ఓ అద్భుతమైన సంధ్యలోని అందని అనుభూతిలా ఏదో ఆశతో బ్రతికేసానా.?

చేతులు కట్టుకుని కూర్చున్నాను. బాబూరావు సామాన్యమైన కళాకారుడు కాడు. కాకపోతే అతన్ని ఒక్కరైనా అర్థం చేసుకుంటే బ్రతికేసాననుకుంటాను అనేవాడు.

'ఎంత వెలుగైనా ఈ సంధ్య తలుపులోంచి చీకటే. ఎంత చీకటైనా ఓ సంధ్య తెర తీసాక వెలుతురే. నిలకడలేని రెండింటిలోనూ ఏమీలేదు. ఈ తలుపులో శాశ్వతంగా ఉండిపోవటం సాధ్యమా? చెప్పండి!'

ఆలోచించాను. ఆ గదిలో కూర్చోవటం ఇబ్బందిగానే ఉంది. ఇద్దరు కుర్రాళ్ళెవరో గది తలుపు అవతల నుండి వింటున్నారు. అదే పనిగా చూస్తూ నవ్వుకుంటున్నారు.

'అంత దగ్గరకి రాకండి సార్.' బాబూరావు అన్నాడు,

'...నేను మీకు మంచోడినే. నా వ్యాధులకు మీరెవరో తెలియదు'

ఏం మాట్లాడాలో తెలియక అలాగే కూర్చున్నాను. కొద్దిసేపు కళ్ళుమూసుకున్నాడు. ఏమయిందో ఏమో కిటికీలో ఉన్న కంజీరా నావైపు విసిరాడు. కిటికీలోంచి చూస్తే సూర్యుడు అస్తమిస్తున్నాడు.

'చాలాసార్లు వద్దన్నారు. అయినా కొత్త నాటకం వేస్తున్నాను.'

'అయ్యో.. అలాక్కాదా..'

'నో.. ఆమడ దూరం అవతల నా పాట మరల వినిపిస్తోంది. మీరు తాళం బాగా వేస్తారు. వెయ్యండి.'

ఏం చెయ్యాలో తెలియలేదు. చిన్నగా తాళం వేసాను.

'ఇది గొప్ప నాటకం..' దగ్గుతూ అన్నాడు '...మృత్యువును సుందరంగా తీర్చిదిద్ది దాని మీదుగా తెర తీసేస్తాను. ఇది గొప్పది సార్, పండుతుంది.'

ఆ మాటలకు ఆశ్చర్యం వేసింది. దగ్గుతూనే కళ్ళు మూసుకున్నాడు. ఎవరూ పాడటంలేదు. కానీ పాట వినవస్తున్నట్లుంది. చీకటి పడిపోయింది.

థెరపిస్ట్ వచ్చి నా శరీరంలో ఎక్కడెక్కడో నొక్కాడు. అక్కడక్కడ నొప్పివున్నా నేను మాట్లాడలేదా.

'ఎలా ఉన్నారు?' అడిగాడు. చిన్నగా తల ఆడించి చిరునవ్వు నవ్వాను. నొప్పితో లావాదేవీ లేని జీవితాలు ఎన్ని? నన్ను కాదు. నొప్పిని ఎలా ఉన్నావని అడగాలి. దానికే నాకు బంధం తెగిపోవస్తోందని అర్థమవుతోంది. అది ఇబ్బంది పడాలి. అదీ బాధగానే ఉంది. సిస్టర్ చేతికి ఏదో కెలికిన కాగితం ఇచ్చి నా నుదుటి మీద చెయ్యిపెట్టి వెళ్ళిపోయాడు. కిటికీ అద్దం దగ్గర పిట్ట శబ్దం చేస్తోంది. ఇక్కడ నొప్పి కలిగినప్పుడు నా మనసు గంతంలోకి వెళ్ళి శబ్దం చేస్తుంది. ఇక్కడ నొప్పి, అక్కడ నొప్పి అన్నప్పుడు కొన్నాళ్ళు చేసారు. మనకే బంధం ఉన్నది అని అక్కడక్కడ నొక్కి వక్కాణించారు. తరువాత వదిలేసారు. నా శరీరం నాకు తోడు. దాని బాధలు నా బంధువులు. తెలియక మూలిగిన మూలుగుళ్ళన్నీ మేజువాణీలు.

కండరాలలోంచి కీళ్ళవరకు జరిగే ప్రయాణంలో నొప్పులు తాళం తప్పినా ఫరవాలేదనుకుని శబ్దం చేస్తూనే ఉన్నాయి. వీటిని విడిచిపెడితే ఎలా? ఇవి లేకపోతే నన్ను కనిపెట్టుకున్న వారు ఏమవ్వాలి? చేతులు బాధపెట్టినా కాళ్ళు పిసికిన వారేమవ్వాలి ఆలోచించాను. కిటికీ అద్దం చోటున ఆ పిట్ట కూర్చున్నట్లు తెలుస్తోంది. కానీ శబ్దం చెయ్యటం లేదు. అద్దం మీద తన ముక్కుతో తాకి కొట్టిన చోటుల్లో చిన్న చిన్న మరకలున్నాయి. అది తన ముక్కును అక్కడికి తెచ్చి మరల వెనక్కి వెళుతోంది. అంతలోనే అది చెక్కిన శిల్పం అది. ఓ సహజమైన చిత్రం. ఓ స్వీయ సృష్టి.

ఎవరో డాక్టర్ వచ్చాడు. కుడి కాలుపైకి ఎత్తి లటుక్కున పడేసాడు. కాటుక పెడుతున్నట్లు కళ్ళను క్రిందకి లాగాడు. సన్నని టార్చ్ పట్టుకుని కళ్ళల్లోకి కాంతిరేఖలను నింపాడు. పెదవి విరిచి చేతులు కట్టుకున్నాడు. నాకూ అతనికీ ఒకే సంశయం ఒకేసారి కలిగినట్లుంది. వాడు ఎందుకు బ్రతికున్నాడా అనే ఆవేదన అతనికి కలిగింది. సిరంజ్ తీసుకుని అందులోకి ఏదో నింపాడు. ఇది ఇంత తేలికగా చెయ్యవచ్చా అన్నట్లు ఆ సిస్టర్ కళ్ళు పెద్దవి చేసింది. నాకే ఇంజక్షన్ ఇస్తాడనుకున్నాను. కానీ సెలైన్ పైపును ఓ చూపు చూసాడు. మళ్ళీ ఎందుకో నన్ను చూసాడు.

'మాష్టారూ, ఇంజక్షన్ తీసుకుంటారా?' అన్నాడు.

చాలాసార్లు ఒక్క విషయం గుర్తుకొస్తూ ఉంటుంది. స్కూల్లో నాకు ప్రైజ్ వచ్చినప్పుడు కూడా పొరపాటుగా నా పేరు బదులు ఇంకొకరి పేరు చదివేవారు. ఏదైనా వ్యాసం గురించి మాట్లాడేటప్పుడు 'ఈయనెవరో పాపం బలే వ్రాసాడు' అనే వారు కానీ నా పేరు సరిగ్గా ఎవరూ పలుకలేదు. ఏదైనా స్వీట్ ఇచ్చేటప్పుడు 'నీకు ఇది పడదేమో' అంటూ అనుమానంగా చూసేవారు.

కాళ్ళతోనే కబేళాకు బేలగా సాగిపోయిన జీవిని. జీవితంలో తొలిసారి ఒకరు తీసుకుంటారా? అని అడిగారు. మనసు ఉరకలేసింది. జేబుదొంగ వొళ్ళంతా మనీ పర్సుకోసం వెతికినట్లు నా శరీరమంతా దేనికోసమో వెతికినట్లు వెతికాడు డాక్టర్. ఓ ఖనిజం దొరికినట్లు మురిసిపోయి సూది పొడిచాడు. ఇది నొప్పా? ఆలోచించాను. సూది ప్లేట్లో పెట్టి చేతులు కడుక్కున్నాడు కుర్ర డాక్టర్. సిస్టర్ ఏదో ఉపగ్రహం లాంచ్ అయినట్లు మొహం నిండా వెలుగులు నింపింది. కాగితం మీద ఏదో వ్రాసి నాకు టాటా చెప్పి ఇద్దరూ వెళ్ళిపోయారు. చిన్నగా నిద్రపట్టింది.

ఆకలి వేసినా పెద్దగా ఎప్పుడూ అడిగేవాడ్ని కాను. ఎక్కడైనా నలుగురూ కలిసే చోటికి వెళ్ళినప్పుడు ఎక్కడినుండో వచ్చేసి అమ్మ "అటు వెళ్ళు, వడ్డిస్తున్నారు " అనేది. ఆవిడకి శబ్దంతో పనిలేదు, శబ్దం గిట్టేదికాదు. ఏదైనా ఇంట్లో కార్యక్రమం ఉంటే చాటుగా ఆవిడ చేతుల మీదుగా ఎన్ని తిని ఉంటానో.. నిశ్శబ్దంగా బాధలు భరించేవారు ఎందుకు లోకానికి లోకువవుతారో లోకేశ్వరుడికే తెలియాలి. కాకపోతే అన్నీ శబ్దాలే. ఆలోచనలన్నీ శబ్దాలే.

'నిన్ను ఎలా పెంచానో తెలుసా?' ముసలాయన అడిగేవాడు. 'అందరూ గుండెలమీద పడుకోబెట్టుకుని పెంచానురా అంటారు. నేను అలా చెయ్యలేదు. గుండె చప్పుళ్ళకు నీ నిదుర చెదురుతుందని కష్టం అనిపించినా కొద్దిగా క్రింద పడుకోపెట్టుకున్నాను..'

పిల్లలు కాళ్ళ బూట్లతో బుల్లి బుల్లి అడుగులు వేస్తుంటే వినిపించిన శబ్దాలు ఇంకా మరువలేదు. వాళ్ళు తెలివిగలవాళ్ళు. కాలంతో కలసి నడిచారు. గడపలు పట్టుకుని నడకలు నేర్పిన మా ముందు నడకలు మార్చిమార్చి నాట్యాలు చేసారు. ఆ శబ్దాలు ఎక్కడో వినిపిస్తున్నాయి.

ఇన్నింటిలో ఒక్క నిశ్శబ్దం అలా మనసును రామబాణంలా ఛేదిస్తుంది. కాళ్ళనొప్పులకు నిద్రపట్టనప్పుడు నా భార్య పాదాల దగ్గర కూర్చుని పిసుకుతూనే నిద్రపోయేది. మెల్లగా లేచి ఆమెను పడుకోపెట్టి నేను హాలులోకి వస్తుంటే వెనుకనుండి వినిపించేది. 'పడుకోండి..'

కిటికీ అద్దం మీద ఆ పిట్టలా పొడుస్తూ ఈసారి ఎందుకో చాలా వేగంగా శబ్దాలు చేస్తోంది. ఎందుకో అనిపిస్తోంది. ఈ శబ్దాలన్నీ నాలోనివే. ఇన్ని లేకపోతే ఈ లోకానికీ నాకూ ఏముందని?

ఆత్మీయులు ఫోన్ చేసేవారు. కష్టకాలంలో కొందరు భుజం మీద చెయ్యిపెట్టేవారు. మనసు బాలేనప్పుడు గమనించి కబుర్లలో శబ్దాలను సృష్టించారు. ఆ కీటికీ నుండి వస్తున్న శబ్దాలకు లయబద్ధంగా అందరూ గుర్తుకొస్తున్నారు. ఎవరు వీరందరూ?

'అదితిర్ద్యాః అది తిరంతరిక్షమ్, అది తిర్మాతాసపితా సపుత్రః..' అంటుంది వేదం. ఈ బంధాలన్నీ కేవలం స్వరూపాలే. పైవాడి సుకృతాలే. మూర్తిగారూ, బాబూరావుగారూ అందరూ అనుభవించి ఆత్మను దర్శించుకున్నారు. కాకపోతే వాళ్ళే ఎందుకు శబ్దరూపాలలో ప్రతిధ్వనించాలి? కిటికీని చూసాను. అక్కడ పిట్టలేదు. అద్దం మీద ఏవేవో కోరికలున్నాయి. శబ్దం ఇటు వెనుక, అటుపైనా కూడా దాగి ఉన్న అనంతానితో ఉండే అనుబంధాన్ని ఏర్పరుస్తోంది.

తెల్లవారినట్లుంది. ఇద్దరు కుర్రాళ్ళు ఆ కిటికీ అద్దాన్ని పరిశీలిస్తున్నారు.

'మంచు పడ్డట్లుంది'

'అవును. సూర్యకాంతికి పగిలింది.'

'కానీ ఒరేయ్, కరెక్ట్‌గా ఏదో చెక్కినట్లు గుండ్రంగా ఎలా పగిలింది. ఎవరో కన్నం వేసినట్లుంది'

సిస్టర్ లోపలికి వచ్చింది. ఆ కన్నాన్నీ, నన్నూ పదే పదే చూస్తోంది.

'పాపం... ఈ పెద్దాయన కిటికీ తెరవమనేవారు రోజూ. అందుకేనేమో కన్నం పడింది.'

బైట జనం పోగవుతున్నట్లున్నారు అనంతమైన శబ్దబ్రహ్మంతో సరైన అనుబంధం ఏర్పడుతున్నట్లుంది.

## మరో వసంతం

**స్కూటర్లు, బైకులూ,** రకరకాల బళ్ళ మధ్యలోంచి తప్పించుకుని నా వైపుకు వస్తున్నది కవిత. దగ్గరకు వచ్చి తన బాగ్ వెతుకుతోంది.

'అంత తొందరెందుకు? కవిత ఇచ్చి పారిపోవాలి. అంతేకదా?' అసలు వినిపించుకున్నట్లే లేదు. గబగబా కాగితం వెతికి ఇవతలికి తీసింది.

'హు... ఆ పార్కింగ్‌లోంచి ఇవతలికి రావటం మీరు వ్రాసిన బ్రతుకు వెంబడి బంధాలను తెంచుకు రావటంలా ఉంది. ఇదిగో... కొద్దిగా మంచి ఆలోచనలకు ఆహ్వానం పలకండి' అంటూ ఆ కాగితం అందించి గలగలా నడిచింది. గట్టిగా రెండడుగులు వేసి ఆపాను.

'కథ బాలేదా?'

ఆగింది.

'అలా అన్నానా?'

'మరీ...'

'మంచి ఆలోచనలకు ఆహ్వానం అంటే మొన్న కలిగిన ఆలోచనలు మంచివి కావని కాదు..' అంటూనే కొద్దిగా తలదించుకుని కళ్లు పైకి ఎత్తింది. ఈశ్వరుడు ఆడవాళ్ళకిచ్చిన అద్భుతమైన వరం ఈ ప్రక్రియ. ఓ కలమీదుగా తెరదించి మరో కథకు తెర ఎత్తినట్లుంది. ఏదో రహస్యం చెప్పినట్లు చెప్పింది. '...కవితను సరిగ్గా చదవండి.'

గబగబా వెళ్ళిపోయింది.

టేబుల్ ముందు కూర్చున్నాను. కవితను సరిగ్గా చదవాలా? ఈమెను సరిగ్గా చదవాలా? ఎందుకో ఆలోచనలు స్త్రీల పాత్రల మీదుగా సాగుతున్న రచయితల కలాలను కూడా కదిలించగల కదలిక ఒక అమ్మాయి గురించి చేసే ఆలోచనలలో ఉంటుంది. ఇదే అసలు కథ. అప్పటివరకూ సూటిగా సాగే మాట కూడా గూటిలోంచి ఎగిరిపోయిన పిట్టలా వంకర్లు తిరుగుతూ సాగుతుంది.

కాగితం తీసాను.

'ఆహ్వానం' అని ఉంది. కిటికీలోంచి చూసాను. దింపి పైకి లేపిన కళ్ళు మరల కనిపించాయి.

***'శిశిరం ఎపుడూ వసంతానికి ఒకడుగు ముందే***
***చీకటి అంచుల పైననే కదా వేకువ మెరుపులు!***
***మొగ్గ మౌనాన్ని వీడేది***
***కిరణాలు గుండె చీల్చుకుని తమ ఆగమనాన్ని సూచించినప్పుడే!***
***ప్రకృతి కాంత ప్రతీ భావావేశానికి ఒక రూపం కల్పించినట్లు***
***వాటిని ప్రస్ఫుటముగా మోముపై సింగారించుకుని***
***అనుభవైక సాధ్యమైన ప్రతిదీ***
***అంతో ఇంతో..***
***అప్పుడో ఇప్పుడో ఆనందదాయకమేనని చెప్పకనే చెబుతున్నట్లు లేదూ?***
***తమసోమా జ్యోతిర్గమయ - అని?***

ప్రయాణాలు చిత్రమైనవి. అలవాటుగా ఎప్పుడూ ఒక ఊరే వెళ్లేవాడు. కరెక్ట్‌గా ఊరు వచ్చే వేళకి దిగిపోయి సిద్ధమైపోయి బండి దిగేందుకు సద్దేసుకుంటాడు. ఏదో ఊరికి మొదటిసారి వెళుతున్నవాడు అదే పనిగా కిటికీలోంచి చూస్తూనే ఉంటాడు. రైలు బండిలో నాలాంటి వాళ్ళూ ఉంటారు, కొద్దిసేపు చక్రాల మీదినుండి దిగి నేలమీద నిలబడటానికి ఏ స్టేషన్ అయినా ఫరవాలేదనుకునే వాళ్లు.

కొద్దికాలంగా జీవితం ఇలానే సాగుతోంది. రెఫ్రిజిరేటర్‌తో పనిలేకుండానే అన్నీ గడ్డకట్టుకుపోతున్నాయి. నా కళ్ల ముందర ఎందరో బండి ఎక్కుతున్నారు, దిగిపోతున్నారు. నాకెవరితోనూ సంబంధం లేదని కూర్చున్నాను. ఆ టీ పోసేవాడు కూడా అఖరుకి నన్ను అడగటం కూడా మానేసాడు. మిగతావాళ్లని కనుక్కుని ముందరకి వెళ్లిపోతున్నాడు. నాలుగు నెలల్రకితం ఇలాగే ప్రయాణిస్తున్నప్పుడు నేనే నలుగురినీ ' టీ త్రాగుతావా?' అని అడిగేవాడిని. కాలం ఎంత గడుగ్గాయి? ఎందుకిలా జరిగింది?

ఏదో స్టేషన్‌లో బండి మెల్లగా ఆగింది. ప్లాట్‌ఫారం మీద ఎక్కువ జనంలేరు. ఒక బెంచీ మీద ఒక అమ్మాయి, అబ్బాయి, కబురు చెప్పుకుంటున్నారు. అమ్మాయి చేతులు కట్టుకుని క్రిందకి చూస్తూ గడగడా ఏదో చెబుతున్నట్లుంది. అతను వింటున్నట్లే ఉన్నాడు, కానీ ఒక్కసారి ఎడమవైపుకు తలత్రిప్పి మరల పాయింట్‌లోకి వస్తున్నాడు. అమ్మాయి ఊపిరి తీసుకుని తిరిగి తిరగలి త్రిప్పుతోంది. అబ్బాయి చెయ్యి ముందరకొచ్చింది. అమ్మాయి ఆ చేతిని చిన్నగా కొట్టి క్రిందకి దింపింది. అతను కళ్లు మూసుకున్నాడు. రైలు కూత కూసింది. అదికాదు, ఇది అవును అనేవి మరల ప్రారంభమైనాయి. బండి కదిలింది.

బాగా దగ్గరగా వచ్చిన అమ్మాయి బిగ్గరగా అరిస్తే బాగుండదు. తిట్లు కూడా ఉగ్గుపాలు పోసినట్లు ఉండాలి.

ఆ రోజు మొబైల్ చిన్నగా మ్రోగినా అందులో మ్రోగింది అలా మ్రోగలేదు. 'నీకు నేను చెప్పిందేదీ గుర్తుండదు. అసలు నేనే గుర్తుండను. మనం పెళ్ళి చేసుకుని ఉపయోగం ఏంటి?'

'హలో.. చెప్పు. ఏం మరచాను?'

ఫోన్ కట్ చేసేసింది.

ఈ ఫోన్లు లేనప్పుడే బాగుండేది. నవ్వుకున్నా ఏడ్చుకున్నా ఎదురు బదురుగానే సాగేవి. కాలం మారింది. అన్ని కథలూ మొబైల్స్ చెప్పేస్తున్నాయి. కాల్స్ ఎత్తలేదు. రెండు వారాల తరువాత 'ఈ నంబరు మనుగడలో లేదు' అని వినిపించింది.

బండి పోతోంది. ఏం మరిచిపోయాను? ఏమో! అంత మాత్రానికి మా అనుబంధమే మనుగడ కాకుండా పోయిందా?

మరచిపోవటం కామన్. ఇదంతా మరచిపోతున్నారు మిత్రులు. ఇలాంటివి దాదాపు వంద చూసిన వాళ్లు అమ్మాయిలందరూ ఇంతే, అనేసారు. కాకపోతే ఆ గుణం తక్కువగా ఉండే మరో అమ్మాయిని చూస్కోమన్నారు. అంత సింపుల్ అయితే మరింకేం?

శాలువాలు కప్పించుకుని లావుగా సన్మానాలు చేయించుకుంటే వచ్చేదేమిటి? భావుకులు ఏనాడూ తొందరగా బావుకోలేరు.

చీకటి పడుతోంది. వెతుక్కుంటూ బండిలోకి ఓ పెద్దాయన వచ్చాడు. ఎదురుగుండా కూర్చున్నాడు. నన్ను జాగ్రత్తగా చూసి కళ్లు మూసుకుని తల అటూ ఇటూ తిప్పాడు. నా వాలకం చూసి నన్ను ఎవరూ బాగు చేయలేరని ఈయన కూడా నిర్ధారించాడన్నమాట.

'నిన్ను ఎక్కడా చూడలేదు' అన్నాడు.

ఇది మరీ బాగుంది. నాకు ఈ మధ్య గెడ్డం పెరిగిపోవటం వాస్తవమే. అంత మాత్రం చేత ఈయన నన్ను దొంగను చూసినట్లు చూస్తారేంటి?

'రైల్లో ప్రయాణం చేసే అందరూ ఒకళ్లకొకరు పరిచయం ఉండాలని ఎక్కడుంది?' అన్నాను.

ఆ మాట విని మరీ కోపంగా చూసాడు. చూపుడు వేలు చూపించాడు. 'అలా మాట్లాడతావా?' అన్నాడు.

టి.టి.ఇ వచ్చాడు.

"మిమ్మల్నెక్కడో చూసినట్లుంది" అన్నాడు.

అతను చార్ట్ మీద ఓ చోట టిక్ కొట్టాడు. పెద్దాయన జేబులో ఉన్న మొబైల్‌లోని టెక్స్ట్ చూసి వెళ్లిపోయాడు. అతనికి ఈయన ఇలాగే తెలిసుంటాడు అనుకున్నాను.

'నాకేదీ గుర్తుండటంలేదంటున్నారు ఈ మధ్య!' అన్నాడు.

'మతిమరుపును మించిన వరం లేదుసార్' అన్నాను.

'కరెక్ట్. మైమరచిన నిద్రలాంటిది. పగలు తెరచిన కిటికీని రాత్రి మూసేస్తాం. పగలు మీద రాత్రికేంటి పగలు? దాన్నిది, దీన్నది, మరిచిపోతేనే మజా!'

టి.టి.ఇ మరల వచ్చాడు.

'బాబూ...', అన్నాడు '...పెద్దాయన పడుకున్నప్పుడు కొద్దిగా సద్దుకోండి. రెండు గంటల్లో ఎలాగో దిగిపోతావు కదా?' అంటూనే ఎవరో బెర్త్ అడుగుతుంటే అతనితో వెళ్ళిపోయాడు.

బాగా పొద్దుపోయాక కునుకు పట్టింది మెలుకువ వచ్చి చూసాను. పెద్దాయన నన్ను ఆనుకుని పడుకునున్నాడు. అటుప్రక్క ఓ సీటు ఖాళీగా ఉన్నదని గమనించి ఆయన్ని అలా పడుకోపెట్టి లేచాను. ఆయనకి మెలుకువ వచ్చింది. నన్ను అదోలా చూసాడు.

'నిన్ను ఎక్కడా చూడలేదు..' అన్నాడు, 'ఓ.కే. పడుకుందాం. మరపులు, మైమరపులు... హహహ..'

మంచి నీళ్లు త్రాగాడు. కళ్లు మూసుకున్నాడు.

'శిశిరాన్ని మరిచిపోతేనే వసంతానికి స్వరూపం!'

చాలా ఆశ్చర్యంగా ఉంది. ఏమీ అర్థం కావటంలేదు. ఇప్పటికే ఒక ఇంజెక్షనూ, రెండు టాబ్లెట్లూ నామీద ప్రయోగించారు. అందరూ వచ్చి 'నేను గుర్తున్నానా?' అని అడుగుతున్నారు. నేను మామూలుగానే మాట్లాడుతున్నాను. ఇద్దరు పాతమిత్రులు వచ్చారు.

'రేయ్, ఎక్కువగా ఆలోచిస్తే ఇలాగే జరుగుతుంది. నో.. నీకేంటిరా తక్కువ? ఆ అమ్మాయి.' ఎవరో వాడిని ఆపేయగానే ఆగిపోయాడు. బైట ఏదో టాక్సీ వచ్చి ఆగింది. మొబైల్ కట్ చేసేసిన అమ్మాయి వచ్చింది. నన్ను బాధగా చూసింది. మా ఇద్దరినీ వదిలేసి అందరూ వెళ్లిపోయారు! దగ్గరకి వచ్చి చెయ్యి పట్టుకుంది.

'అయామ్ సారీ' చెప్పింది, 'నేను నిన్ను కట్ చేసినందుకు నిన్ను నువ్వే మరచిపోయావంటే నీది ఎంత నిజమైన ప్రేమో అర్థమైంది.' అంటోంది.

నన్ను నేను మరచిపోవటమేమిటి? ఏమీ అర్థం కావటంలేదు కానీ ఋతువు ఎందుకో మారినట్లు తెలుస్తోంది.

డాక్టర్ వచ్చాడు. ఆమెనూ వెళ్లిపొమ్మన్నాడు.

'చూడు బాబూ, ఈ అమ్మాయి పరిచయం తర్వాత బాగా భావుకుడవైనందుకు ఇలాంటి పరిస్థితికి వచ్చావు. కొద్దిరోజులలో కోలుకుంటావు. మందులు వాడుతూ ఉండు. నీకు నిద్ర అవసరం. పడుకో' అని చెప్పి వెళ్లిపోయాడు.

నేను గదిలోకి వెళ్లిపోయాను. హాల్లోంచి మాటలు వినిపిస్తున్నాయి.. 'నయమైనాక కూడా ఎప్పుడైనా బైటికెళ్లినప్పుడు ఈ బాడ్జ్ తగిలించండి. మీకే మంచిది.'

మాత్రలకు నిద్రపట్టింది. అర్ధరాత్రి మెలుకువ వచ్చి హాల్లోకి వచ్చాను. అక్కడ మందుల ప్రక్కన ఓ బాడ్జ్ ఉంది - 'నేను అల్‌జీమర్స్‌తో బాధపడుతున్నాను. ఒకవేళ ఎక్కువసేపు ఎక్కడైనా గడుపుతూ దొరికితే నా జేబులోని కార్డు చూసి నా వాళ్లకు ఫోన్ చేయవలసిందిగా మనవి.'

ఇదెక్కడో చూసినట్లు అనిపించింది. అవును. రైల్లోని ఆ పెద్దాయన షర్ట్‌కున్న స్టిక్కర్. నాకు తగులుకున్నట్లుంది. నో... ఆయన ఇంటికి చేరుకున్నాక కొత్త బాడ్జ్ తగిలించుకుంటాడు. అదో వసంతం. కాకపోతే నా వసంతం నాకు తిరిగి వచ్చినట్లుంది.

## *మిసిమి*

**ఒక పెళ్లి సందడిలోంచి** గబగబా ఇవతలకి వస్తున్నాను. పెండ్లి తంతు అయిపోవటంతో పిల్లలు మైకు తీసుకుని పాటలు పాడుతున్నారు. ఇంతలో ఎవరో మైకు తీసుకుని అంటున్నారు, '...ఇప్పుడు నేను మీ అందరికీ కవిత గురించి చెబుతాను..' అంటోంది, '...కవిత గురించి అంటే కవిత్వం గురించికాదు. కవిత అనే అమ్మాయి గురించి!'

అక్కడే ఆగిపోయాను. నాకు తెలియకుండానే వెనక్కి తిరిగి లోపలికి నడిచాను. దగ్గరగా వెళ్లి ఓ కుర్చీలాక్కున్నాను. ఎవరో ఓ స్వీట్ ఉన్న కప్ చేతిలో పెట్టారు. ఇవన్నీ గుర్తించటం మానేసాను. స్టేజ్ మీదనే దృష్టి ఉంది. ఈమె నాకు తెలిసిన కవితేనా...

'కవిత సామాన్యురాలు కాదు. మీరు అష్టావధానం చూసి ఉంటారు. కానీ కవ్విస్తే చాలు కవిత చెప్పేవారిని చూడలేదు'

అందరూ చప్పట్లు కొట్టారు. అవును. లేత చిగురాకు రంగు చీర ఆ కాంతులలో మరీ మెరిసిపోతోంది. మైకు తీసుకుంది.

'ఈ క్రొత్త జంట కోసం కలలేకాదు, కలల పంటలు పండాలంటూ ఓ చిన్ని కవిత ఇప్పుడు. ఈ కవితలో ఎవరు ఎవరో మీరే నిర్ణయించుకోవాలి...' అంటూ ఒక్కసారి నావైపు చూసింది. రిపెయిరు పూర్తయి స్విచ్చులు నొక్కగానే ఒక్కసారి లైట్లన్నీ వెలిగినట్లయింది. అదనంగా అందించిన ఆ చిరునవ్వుకు ఫాను కూడా తిరగటం ప్రారంభించి చల్లనిగాలి వీచినట్లయింది.

**'మనః సుమాలతో**

**అంచెలంచెలుగా**

**దోసిటని**

**నింపుతున్నదెవ్వరో?**

**మిసిమిమల్లె**

**ముసినవ్వుల**

**మురుస్తూన్నావెందులకో...**

**వసంతుడొచ్చేస్తున్నందుకేగా..!'**

వధూవరులు చూపులు కలుపుకున్నారు. కవిత గొంతు సద్దుకుంది.

**'కంటి కొలను**

**నీదైతే**

**అంచుల**

**హిమకుసుమాన్నే!'**

అందరితోపాటు నేనూ చప్పట్లు కొట్టాను. ఆ హాలు బైట కొద్దిసేపు ఆగాను. కలసి మాట్లాడుతుందేమో అనుకున్నాను. నన్ను గమనిస్తూనే గబగబా ఎవరి కారులోనో తన స్నేహితురాళ్లతో కలసి దూరిపోయింది. కిటికీ అద్దంపైకి లేచి తనని మూసేసింది. ఒక చూపు నా మీద విరివిగా పారేసి కరవద్దన్నట్లు అటు తిరిగిపోయింది!

ఈ కవితను తలచుకుంటే ఎందుకో తెల్లకాగితం మీద కలం పెట్టగానే స్త్రీలోనే ఆరు ఋతువులూ కనిపించాయి. వసంతంలా కన్య చిగురించగా వివాహానికి ఆహ్వానం పలుకుతోంది ప్రకృతి. గ్రీష్మ తాపంలో భర్తతో కోపతాపాలను పంచుకుని క్రొత్త వంటకాలను ఆవిష్కరిస్తోంది. వర్షాకాలంలోని నూతన కలయికతో నవమాసాలు నింపుకుంటోంది... శరత్ కాలంలో షరతులు లేకుండా మనుగడ సాగిస్తోంది, హేమంతంలో మూడు పువ్వులు, ఆరుకాయలతో సంసారం సాగిస్తోంది, శిశిరంలో భర్తను కమ్ముకుని తల్లిలా మారుతోంది!

ఆలోచన వలన అమ్మాయికి అందం వస్తోందా? లేక ఒక అందమైన అమ్మాయి వలన నాకొక ఆలోచన వస్తోందా?

'నేను ఈ సమయంలోనే తలుపు తెరచి బైటకొస్తానని తెలిసి కదా నువ్వూ తలుపు తెరుస్తావు కదూ?'

విచిత్రంగా అనిపించింది. నా అపార్ట్‌మెంట్ ముఖద్వారం తెరచి వాకిట్లోకి అడుగుపెడుతుండగా ఇది గొడవ. నిండు ఆకుపచ్చ సల్వార్‌లో భుజాన బాగ్ తగిలించుకునుంది. రెండు చేతులూ జేబుల్లో పెట్టుకున్నాను.

'నా ఇల్లు, నా తలుపు'

'చాలా చూసాం. జాగ్రత్త!' అంటూ గబగబా దిగి వెళ్లిపోయింది.

ఆ అమ్మాయి అలా మెట్లు దిగిపోగానే వాళ్ల వాకిలి వద్దకు ఓ పెద్దాయన వచ్చి నిలుచున్నాడు.

'దయచేసి మరోలా అనుకోకండి' నమస్కారం పెడుతూ అంటున్నాడు,

'...అది మా సమస్య. మీదికాదు!'

'ఇదేం సమస్య?'

'లోపలికి రండి' అంటూ లోపలికి వెళ్లిపోయాడు. లోపలికి వెళ్లాను. చక్కగా అలంకరించుకున్న హాలు. షోకేస్ నిండా ఎంతో అందంగా సర్దిన బొమ్మలు.

'కూర్చోండి' అని వినిపించింది. ఎదురు బదురు కూర్చున్నాం.

'మార్పుకు మార్పే ఓదార్పని ఇలా చాలా చోట్లు మారుతూ వచ్చాం. ఇక్కడా నిరాశే ఎదురయింది. మగపురుగు కనిపిస్తే చాలు, ఏదో ఒకటి అనకుండా ఉండదు. మీ అపార్ట్‌మెంట్ మరీ మా వాకిలి ముందే కాబట్టి ముందుగానే ఓ మాట చెబుతున్నాను. మరోలా అనుకోకండి'

ఆశ్చర్యంగా తోచింది.

'ఏదైనా తీవ్రమైన మానసిక వేదనలాంటిది..'

నిట్టూర్చాడు. కుర్చీలో రెండువైపులా చేతులు గట్టిగా నొక్కిపెట్టి ఇది అందరూ అడిగేదే అన్నట్లు శూన్యంలోకి చూసాడు. జీవితం రుచులను మార్చేస్తుంది. ఋతువులను దాటేస్తుంది. చిన్నప్పుడు కొత్తగా నవ్వుతాం. పెద్దయ్యాక ఉత్తగా నవ్వుతాం. వయసులో కోపం, ఆవేశం అంచనాలు దాటుతాయి, అంచెలంచలుగా మూలకెళ్లి మూలుగుతూ మారతాయి.

'కనిపించినవి కథలు...' చెబుతున్నాడు, '....కనిపించనివి అదుగో, ఆ బొమ్మలు, ఆలోచనలు, అనుభవాలు'

అటు చూసాను. చక్కని బొమ్మల చాటున ఓ పటం ఉంది. ఈయన భార్యదే అయి ఉండాలి. ఓ గ్లాసులో చక్కని చామంతులు ఆ పటం ముందున్నాయి.

'మా అమ్మాయి చాలా బ్రిలియంట్ సార్...' చెప్పాడు.

'....అన్నింట్లో ఫస్టే. అలా అని దూకుడు లేదు. మా అబ్బాయి ఓ అమ్మాయిని ఇష్టపడి వాళ్ల అమ్మకి ఇష్టం లేకపోయినా పెళ్లి చేయించుకుని అమెరికా వెళ్లాడు. మా ఆవిడ అనారోగ్యం ఎపిసోడ్ మా ఇద్దరికీ మిగిలింది.'

'ఏం జరిగింది?'

'అనుకోనివి జరిగినప్పుడు వెనక్కి అనుకోవటం తప్ప ఏమీ చేయలేం సార్. తన ఎమ్.ఎస్ మానుకుంది మా అమ్మాయి. ఆవిడ కళ్లముందు కడతేరింది. ఈమెలో ఏదో తుఫాను చెలరేగింది. కొద్ది రోజుల తరువాత ఒకటే మాట చెప్పింది – తీసుకోవటం తప్ప తిరిగి ఇవ్వని వాళ్లు మగాళ్లు! పానకాలస్వామి అయినా సగం వెనక్కిస్తాడు. తల్లి దగ్గర చేయించుకుని, భార్య దగ్గిర చేయించుకుని.. ఏమిస్తారు తిరిగి?'

ఈసారి నేను నిట్టూర్చాను.

'మిమ్మల్నీ నిలదీసిందా?'

గుర్తు వచ్చినట్లు నిలబడ్డాడు. లుంగీ సద్దుకుని మంచినీళ్ల బాటిల్ పట్టుకొచ్చాడు. 'కొన్నాళ్లు అదీ సాగింది..' చెప్పాడు, '...అమ్మకి ఆ పరిస్థితి రాకుండా వాడికి ఏం చెయ్యగలిగావు? అని నిలదీసింది'

లేచి వాకిలిదాకా వచ్చాను.

'కాలం మారింది..' అన్నాడు,

'...అమ్మ, నాన్న, అన్న, భర్త, భార్య వంటి మాటలు ఆడా, మగా అనే ఆటలోకి మారిపోతే మాట్లాడగలిగింది మరేమీ ఉండదు!'

ఆలోచించాను.

మెట్ల క్రింద నిలబడి ఉండగా పైనుంచి దిగుతూ నాలుగు మెట్ల దూరంలో ఆగింది ఆ అమ్మాయి.

'ఎవర్ని అడిగి ఫోటో తీసావు?' అడిగింది. నా చేతిలో కెమెరాను చూసినట్లుంది. కెమెరాను జాగ్రత్తగా పట్టుకుని ఫోటో చూపించాను. దగ్గరగా వచ్చింది. ఎందుకైనా మంచిదని కెమెరా గట్టిగా పట్టుకున్నాను. ఫోటో చూసింది.

'మెట్లను తీసాను' చెప్పాను.

'మరి నేనెందుకు కనిపిస్తున్నాను?'

'అందులోకి వచ్చావు'

'రాలేదు. నాకోసం ఆగావు'

'లేదు' ఇద్దరం లిఫ్ట్ ప్రక్కగా జరిగి ఆగాం.

అమ్మాయికి కోపం పెరిగిపోతోంది. 'ఫోటోలు తీస్తావా?' అడిగింది.

'అందరూ తీస్తున్నారు'

'అదికాదు..' చెయ్యి అడ్డం పెట్టింది.

'...కెమెరామెన్ వా?'

'అలాగే అనుకో'

'ఛీ' అని గబగబా వెళ్లిపోయింది.

మరో పని ఏమీ లేని సుబ్బారావు దగ్గరగా వచ్చాడు.

'ఈ అమ్మాయే దొరికిందా ఫోటోలకి? కేసు పెట్టేస్తుంది జాగ్రత్త. ఇదిగో ఇలా నిలబడతాను నాకు తియ్!' అన్నాడు. గోడకానుకుని రెండుచేతులూ పైకెత్తి నిలబడ్డాడు. నవ్వుకుని వెళ్లిపోయాను.

చీకటిపడ్డాక కాలింగ్ బెల్ మ్రోగింది. ఎదురింటమ్మాయి నిలబడి ఉంది.

'ఎవరెవరికి పంపావు ఫోటోలు? డిలీట్ చేసి చూపించు. నాకు మగవాళ్ల వేషాలంటే అసహ్యం' గట్టిగా అనేసి నిలబడింది.

'లోపలికిరా' అన్నాను.

'నో... ఇక్కడే'

నేను ప్రక్కకి జరిగాను. హాల్లోకి చూసి తనే లోపలికి వచ్చింది. ఎదురుగా ఉన్న పోస్టర్ సైజు మీద కళ్లు పడ్డట్లున్నాయి. దగ్గరగా నిలబడి పరిశీలించింది. మెట్ల వెనుకనుండి సూర్యరశ్మి కాంతి కూడా మెట్లు దిగుతోంది. ఒక అమ్మాయి మెట్లు దిగుతోంది. ఆ నేపథ్యంలో అమ్మాయి ఎవరో తెలియటంలేదు. పోస్టర్ క్రింద వ్రాసున్నదాన్ని చదివింది.

'మిసిమి'

తల ఆడించాను.

'అంటే?'

'నువ్వే చెప్పాలి. ఏది మెరుస్తోంది?'

'సూర్యరశ్మి'

'అమ్మాయికాదా?'

మారుమాట్లాడకుండా గబగబా వాకిలిదాకా వెళ్లిపోయింది. ఏదో గుర్తొచ్చినట్లు ఆగింది.

'డిలీట్ చెయ్యి'

'ఎప్పుడో డిలీట్ అయింది. అయినా నువ్వెక్కడున్నావు ఫొటోలో?'

నన్ను అదోలాంటి చూపు చూసి వెళ్లిపోయింది.

మా అపార్ట్‌మెంట్స్‌లోని ప్రక్క బ్లాక్‌లో ఓ అమ్మాయిని పెళ్లికూతుర్ని చేస్తున్నారు. నా మిత్రుడు అక్కడ ఫోటోలు తీస్తుంటే వెంట వెళ్లాను. నిలువుటద్దం వద్ద ఈ అమ్మాయి కూడా పెండ్లికూతురుకు ఏదో సద్దుతోంది. చిన్న పిల్లలతో సహా అందరూ సెల్ఫీలతో మునిగిపోయారు. మన స్వరూపాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని అందరికీ కుతూహలమే. అలా ఎందుకున్నామో ఎవరికీ అక్కరలేదా?

అద్దం ముందరకి ఒక చక్కని రూపం వచ్చింది. అమ్మాయి అలంకరించుకున్న జడతో అద్దంలో కనిపిస్తోంది. ఆ జడను సద్దుతూ ఈ అమ్మాయి అద్దం ముందరకి వచ్చింది. నా కెమెరాకు కదలిక వచ్చింది.

రెండు రోజుల తరువాత ఓ ఆదివారం కాలింగ్ బెల్ మ్రోగింది. ఎదురింటమ్మాయి నిలుచునుంది.

'యస్?'

'పోస్టర్'

అడక్కుండానే లోపలికొచ్చింది.

'నేనేం క్లిక్ చేయలేదే?'

'నాకు తెలుసు' అంటూనే పాత పోస్టర్ ప్రక్కనున్నదాని ముందు నిలబడింది. అద్దంలో పూలజడ, చీకటిలో మెరిసిన మెరుపులా కాకుండా నిండు వెలుతురులో గంధం రంగు చీరమీద తళుక్కుమని జారిన నల్లని జడకు అమర్చిన పూలను పరికిస్తున్న నవవధువుతోపాటు కన్యలోని ఆలోచనలు ఎన్ని వొంపులు తిరిగాయో అని పరికిస్తున్న ఈమె.

'పెండ్లి కుమార్తె ఇందులో ఎవరు?' అడిగాను.

కళ్లు పెద్దవి చేసింది. జాగ్రత్తగా చూస్తే అద్దం అబద్ధం చెప్పేస్తుందా అనిపిస్తుంది.

వెళ్లి సోఫాలో కూర్చుంది. ఏదో ఆలోచిస్తోంది.

'నో..డిలీట్ చెయ్యి'

'ఇందులో ఎవర్ని?'

'అరే ఏమనుకుంటున్నావు నువ్వు?' అంటూనే లేచి వెళ్లిపోయింది. మరల పరుగున లోనకొచ్చి దానిక్రింద వ్రాసినదాన్ని చదివింది.

'ఏంటి? నవవసంతమా? నీకేదో పిచ్చి ఉంది.'

'కరెక్ట్. జడ ముడులతో ఉంటుంది. ఎనిమిది సంఖ్యలా మెలికలు తిరుగుతుంది - చివరకు నవనవలాడటానికే గదా!'

'ఏంకాదు...' వెళ్లిపోయింది. తలుపు దగ్గర మరో శబ్దం వినిపించింది..

'ఛీ'

ఇద్దరం ఓరోజు బస్ స్టాప్‌లో నిలబడ్డాం.

'ఎండ మండుతోంది' అన్నాను.

'.....'

'ఇవాళ ఎంత ఉంటుందో?'

'ఏంటీ?'

'ఎండ'

'ఎంతున్నా రెండు డిగ్రీలు ఎక్కువే'

'ఎలా?'

'మనం కలిసాం కదా?'

'ఓ...బాగుంది'

'డిలీట్ చేసావా?'

'ఏది?'

'మొన్నది'

కెమెరా తీసాను. ఇద్దరినీ సెట్ చేసి సెల్ఫీ తీసాను.

'హూ....ఛీ' అంటూ అటూ ఇటూ చూసింది.

'కూల్! టెంపరేచర్ పెరిగిందో లేదో చూస్తున్నాను. నిజమే. బాగా బాగా  వేడిగా ఉంది'

బస్సు రాగానే లోపలికెళ్లి కిటికీ దగ్గర కూర్చుంది. అది కదిలింది. డిలీట్ చెయ్యమని సైగ చేస్తోంది.

నేనది డిలీట్ చెయ్యలేదు. ఆ ఫోటోను ఆమె మొబైల్‌కు పంపి 'గ్రీష్మం' అని వ్రాసాను. కాకపోతే ఆ ఫోటోను మార్చేసాను. ఆమె అటూ నేను ఇటూ తిరిగి ఉన్నాం...

చాలా రోజుల తరువాత ఒకరోజు ఇంట్లోకి వచ్చింది.

'పోస్టర్లేమీ లేవు' అన్నాను.

నవ్వి జాగ్రత్తగా కూర్చుంది.

'నాకు మగాళ్లంటే అస్సలు ఇష్టంలేదు' చెప్పింది.

'నాకు మగాళ్లంటే అభిమానం' అన్నాను.

'హు.. ఎందుకో?'

'భూమి మీద పుట్టిన ప్రతి స్త్రీ సహజంగా, పూర్తిగా స్త్రీ పాతలోకి ఇమిడిపోతుంది మగవాళ్లకి అది పూర్తిగా సాధ్యం కాదు'

'వీళ్లకి స్నేహం ఎందుకు?'

'గోడమీద ఆ ఫొటో చూసావా? వాన వాళ్లని తడుపుతున్నా కూడా ఓ చిన్నారి బాబు, ఈ చిన్న పాప ఎలా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారో?'

నువ్వు బావుపడవన్నట్లు తల ఊపింది.

'ఎందుకో?'

‘వాన కురుస్తోందా లేక చల్లదనం ఆకాశాన్నీ నేలనీ కలుపుతోందా?‘

‘సరే. మా నాన్న నీ దగ్గర ఫోటో తీయించుకోమన్నాడు‘

‘శభాష్‘

‘ఆగు...‘ చెయ్యి అడ్డుపెట్టింది.

‘...దేనికో తెలుసా? మాట్రిమోనీలో పెట్టటానికి‘

‘వెరీగుడ్‘

‘...నేను నో అన్నాను. ఇక్కడికెందుకొచ్చానో తెలుసా?‘

‘పోస్టర్‘

‘నో! మా నాన్న దగ్గిర కూర్చుని కబుర్లు చెబుతున్నట్లు, వింటున్నట్లు తెలిసింది. రేపటినుంచి, కాదు, ఇప్పటినుంచే అవి నువ్వు మానెయ్యాల్సి ఉంటుంది. ఈ చిల్లర..‘

ఆపాను.

‘మంచిదే – నా పోస్టర్ల వలన నీకేవో ఆలోచనలొచ్చాయన్నది నిజమే కదా?‘

‘కావచ్చు. తప్పేంటి?‘

‘చివరగా ఒక పోస్టర్ చూడు. ఓ.కే?‘

‘ఓకే‘

ఈసారి లోపలికి తీసుకెళ్ళాను. అది కొద్దిగా పోస్టర్. అందులో మాసిపోయిన గెడ్డంతో ఈ అమ్మాయి తండ్రి ఉన్నాడు. ఇన్‌లాండ్ లెటర్స్ వంటి ఉత్తరాలను ఆయన శాలువాలా కప్పుకున్నట్లుంది. అమ్మాయి దగ్గరగా వెళ్లింది.

‘గుర్తుందా?‘ తను చదువుతోంది ‘....గుర్తుందా శ్రీమతీ, గుండె చప్పుడుకు నిద్రలేస్తాడని కడుపు మీద పడుకోపెట్టుకున్న బిడ్డని కడుపులోనే పెట్టుకున్నాను. వాడు నిద్రలేస్తే త్వరగా పడుకోడని మా ఇద్దరినీ లేవనీయకుండా నువ్వు ఇద్దరికీ ఏదో కప్పి కుర్చీ క్రిందే కునుకు తీసేదానివి. నేను ఇబ్బంది పడకూడదని నాకు వంట నేర్పావు. ప్రతి కుమ్ములాటలో నన్ను అమ్మలా కమ్ముకున్నావు. నన్ను నిద్రపుచ్చు కానీ కలలోకి రాకు. నిద్రపోలేను. ఈ అమ్మాయి కలలోకి ఒక్కసారిరా. ఓ అమ్మని కమ్మని కమ్మగా చెప్పు. ఈ ఉత్తరం నీకు చేర్చలేను. ఎగిరిపోగలదనే ఆశ, ఓ ఆలోచన – దీనినే దుప్పటిలా కప్పుకుంటాను...‘

పోస్టర్‌ని చూసింది. నన్ను ఎగాదిగా చూసింది. బొమ్మలోని తన తండ్రి గెడ్డం దగ్గర ఎందుకో తాకింది. గబగబా వాకిట్లోకి వెళ్లిపోయింది. నేనూ అనుసరించాను.

‘డిలీట్ చెయ్యాలా?‘ అడిగాను. అటు తిరిగి తలుపుకు ఆనుకుంది.

‘డిలీటెడ్‘ అంది.

* * *

కొద్దిరోజుల తరువాత ఈ అమ్మాయి పెండ్లి చేసుకుంది. ఒకరోజు ఇంట్లో సందడి. వచ్చిన కాంప్లిమెంట్సన్నీ ఒక్కొక్కటీ చూస్తున్నారు. నేనూ పాలుపంచుకుంటున్నాను. ఓ పెద్ద పటం తీసి కవరు చింపారు. అదో ఫోటో పెయింటింగ్. ఈ అమ్మాయి ఒక శిల్పంలా ఓ కొలనులో నిలుచునుంది. కొలనులో ప్రతిబింబం కనిపిస్తోంది. శిల్పం యావత్తూ హిమం పేరుకునుంది. సూర్యరశ్మికి ఒక్కొక్క బొట్టూ జాలువారుతోంది.

దానిని మనసారా చూసుకుని నన్ను దాని మీదుగా చూసింది. కళ్లొక్కటే కనిపిస్తున్నాయి.

'కంటి కొలను నువ్వా?', అడిగింది, '....మరి నేనా?'

నేను నవ్వాను.

'చివర చదువు', అన్నాను.

'హిమ కుసుమం' చదివింది.

## *ఎదురుగా నీవుంటే*

**ఫోన్ నిశ్శబ్దంగా** మ్రోగుతోంది. పనిచేసుకుంటూ దాని వైపు చూసాను.

'కవ్వింత' అని మెరుస్తోంది. మరల కవ్వింత ప్రారంభమైంది. ఈ పేరు కూడా గమ్మత్తుగా ఉంది. ఇదిగో కవ్విస్తున్నానా అన్నట్లు కదులుతోంది.

'హలో'

కవితను మాట్లాడుతున్నాను'

'యస్?'

'మీకు మరో ఛాలెంజ్'

'ఏవైంది?'

'అదేంటి? నాకేం కావాలి? ఏం లేదు. నేనేదో కవిత ఇస్తే దానిని అద్దంలా పట్టుకుని కథ వ్రాయటం పెద్ద గొప్ప విషయం కాదు.'

'ఛా'

'అవును. నేను ఎదురుగా కూర్చున్నప్పుడు నన్ను చూస్తూనే కథ పూర్తిచేయాలి'

'ఓహో - ఎప్పుడు కూర్చోవాలి? ఎక్కడ కూర్చోవాలి?'

'ఇంటికెళ్ళాక మెసేజ్ చూస్కోండి. బై.'

ఫోన్ పెట్టేసింది. ఇదేంటి? ఈమెను చూస్తూ కథ వ్రాయాలా? ఏంటి ఆ గొప్ప. ఇదొకటా మళ్ళీ? ఒ.కె...

ఊహలకందని వారు ఆడవారా లేక ఏదో అందంగా కనిపించటానికి అనూహ్యంగా ఉంటారా? అమ్మో! ఇది మటుకు ఆమెకు చెప్పకూడదా!

నా కుడివైపు ఓ చిన్న సరస్సు ప్రశాంతంగా ఉంది. దూరంగా ఉన్న ఓ ఫౌంటెన్ తాలూకు చుక్కలు పడటంతో అక్కడో అలజడి, ఇక్కడో అలజడిలా ఉంది.

కవిత ప్రక్కగా వచ్చి నిలబడింది. నీళ్ళల్లోకి చూస్తూనే నన్నూ చూస్తోంది. నవ్వుతున్నాను గానీ నేనూ ఏమీ మాట్లాడదలచుకోలేదు. నీటిలో ఇద్దరి ప్రతిబింబాలూ కదులుతుంటే ఈ రెండు బుగ్గలూ సరదాగా అక్కడైనా ఎందుకు రాసుకోకూడదూ అనే చిలిపి ఆలోచన మనసు కొమ్మలా వంగి ముందుకు పొమ్మన్నట్లుంది.

**అరుదైన అనుభూతులు**

*'అనావిష్కృత ఫలకంపై*

*అసంకల్పితంగా ఆకృతి దాల్చి*

*అనూహ్యామైన రంగులద్దుకుని..'*

ఎందుకో ఆగింది. ఈ లోకంలోకి వచ్చిన నేను అది కనపడనీయలేదు.

'ఊ...'

'.....'

*'రంగులద్దుకుని?'*

*'అదేమిటో వర్ణనకందకుండా*

*అలవోకగా జారిపోయేవే అయినా*

*అప్పుడప్పుడు'*

తిన్నగా నిలబడి దూరంగా చూసాను. తనూ తల ఎత్తి ఓరకంట చూస్తోందని తెలుసు.

'అప్పుడప్పుడు?'

*'ఆ ప్రొద్దు పొడుపు సూరీడి సూటైన చూపుల్లా*

*అట్టే క్షణమాగకుండా*

*అందమైన పదాలలో ఒదిగిపోనా?'*

ఎందుకో తెలియదు, ఇటు తిరిగి కళ్ళల్లోకి చూసాను. తలవంచుకుని అరచేతిలో కళ్ళను కప్పుకుని మెల్లగా వేళ్ళను విస్తరించింది..

ఇద్దరం నాలుగడుగులు నడిచాం.

'చాలా కాలం క్రితం బస్సు దిగి కాలనీలోకి నడుస్తున్నప్పుడు అనుకోకుండా వాన కురిసింది..' చెప్పటం మొదలుపెట్టాను, ఆగిపోతే బావుండుననుకుంటూ ఓ ఇంటి చూరు క్రింద నిలబడ్డాను ఆ కిటికీ దగ్గర మాసిపోయిన గెడ్డంతో ఓ కుర్రాడు కూర్చుని ఉండేవాడు. ఏదో వ్రాస్తూనే ఉండేవాడు. ఆ కాగితాలనే కాల్చేవాడో తెలియదు, లేదా సిగరెట్లే కాల్చేవాడో తెలియదు కానీ ఎప్పుడూ ఏదో కాలుతున్నట్లే ఉండేది.

'లోపలికి రావచ్చుగా?' అన్నాడు.

'ఫరవాలేదు సార్, తగ్గిపోతుంది'

'ఏంటి? వానా?'

'అవును. చిన్నదే!'

అతను లేచి తలుపు తెరిచాడు.

'చిన్నవే పెద్దవి. రండి' అన్నాడు. ఎందుకులే అనుకుంటూనే లోపలికి వెళ్ళాను. ఎదురుగా కూర్చున్నాను.

'మీరు వ్రాస్తారా?'

గెడ్డం గోక్కున్నాడు. 'శభాష్. కంపుకొడుతున్న వాడి దగ్గరికెళ్ళి మందుకొడతావా? అంటే ఎలా? హ హ హ.. కాగితాలు సార్ ఇవి! ఆలోచనలు జారిపోతుంటే పట్టుకుని వీటిమీద తల దాచుకోమని చెబుతున్నాను. అంతమాత్రానికి రచయితను కాను.'

కిటికీలోంచి వానను చూస్తూ సిగరెట్ ముట్టించాడు.

'ఆ చినుకులు తన్నుకుంటుంటే ఎలా ఉంది? భార్యాభర్తలిద్దరూ కొట్టుకుంటున్న శబ్దం వినిపించటంలేదూ?'

'నాకు పెళ్ళికాలేదు'

రెండు కాళ్ళూ కుర్చీలోకి పెట్టేసి వాటి మధ్య తలదాచుకున్నాడు. టక్కున బయటకు తీసాడు.

'నాకూ కాలేదు..' చెప్పాడు.

'ఈ గదిలో కూర్చుంటే ఒకటికాదు, వందసార్లు అయినట్లుంటుంది.'

'ఛా'

'అవును. ఈ వానకీ, ఈ కిటికీకీ, ఆ మట్టికీ, మీరెక్కిన ఈ మెట్టుకీ పిచ్చి సంబంధం ఉంది'

నవ్వొచ్చింది.

'పిచ్చి సంబంధం ఏంటి?'

'అవును. అలా చూడండి. మబ్బుకీ, మట్టికీ జరుగుతున్న పెళ్ళి. అవునా?'

'ఓహో'

'వింత ఆలోచనలు, అంతకంటే వింత అనుభూతులు, ఇదిగో, ఈ డైరీలో' అంటూ ఓ డైరీ తీసాడు.

'ఇదిగోండి. ఇవన్నీ ఇందులోనే ఉన్నాయి. మీలాగే కిటికీ దగ్గర ఓ వాన కురుస్తున్న సాయంత్రం నిలబడి ఉన్నాను. ఓ పెద్దాయన ఇలాగే కూర్చుని లోపలికి రమ్మన్నాడు.'

నే లేచాను. కూర్చోమని సైగచేసాడు. డైరీ తిరగేసాడు.

'దీపా!

నువ్వెక్కడా అని ఆరా తీసాను.

దీపావళికి ఒకే ఒక తారాజువ్వ పంపుతున్నాను.

అవి వెనక్కి వచ్చేస్తున్నాయి..

అందుకే నువ్విక్కడేనని గూట్లో దీపం పెట్టుకుంటున్నానా!' డైరీ మూసేసి మరో దమ్ములాగాడు.

'ఈయనెవరో భావకుడిలా ఉన్నాడు సార్'

'మనుషుల వర్గీకరణ ఎందుకు?'

ఆలోచించాను. అతను మరల డైరీ తీసాడు.

'దీపా!

నిన్న గుడిదాకా వెళ్ళాను. మెట్ల దగ్గర ఆగి నువ్వు గతంలో పెట్టిన దీపాలను తలచుకుని ఒక్కో మెట్టూ చూస్తూ నిలబడిపోయాను. ఆ పైన చివరి మెట్టు మీదనుండి అటు జారిపోయిన సూర్యుడు ఒక్కసారి ఓ పసిడి కిరణాన్ని ఇక్కడిదాకా జారవిడిచాడు. ఎవరో దంపతులు నా చేతిలోనూ కొద్దిగా ప్రసాదం పెట్టారు. దీపా! నువ్విలా వెలుగుతూనే ఉంటావు.'

వాన పడుతూనే ఉంది. ఈ గది నిండా కాగితాలే కనిపించాయి.

'ఈ పెద్దాయన ఇంట్లో లేరా?'

సిగరెట్ ప్రక్కన పడేసాడు.

'సార్, మనసు ఒక జైలు లాంటిది. కంటి కిటికీ చువ్వలను పట్టుకుని నిలబడి ఉన్న వాడి వద్దకు ఆలోచన అనేది ఒక విజిటర్‌లాగా వస్తోంది. మీలాగా నేనూ వానలో తడవకూడదని ఇక్కడ, ఈ కిటికీ దగ్గిరే నిలబడ్డాను. ఆయన మాసిపోయిన గెడ్డంతో నాకు ఒక కాగితం పడవ యిచ్చాడు.

'ఆ నీళ్ళల్లో వదిలెయ్', అన్నాడు. ఇతను పిచ్చివాడు అనుకుని పళ్ళికిలించాను. నవ్వాడు. పని కానీ అన్నట్లు కళ్ళతో సైగ చేసాడు.

ఆ కాగితం పడవను నీళ్ళల్లో పడేసాను. దానినే చూస్తూ నిలబడ్డాడు. అది కొద్ది దూరం ప్రయాణించింది. ఏదో అడ్డు వచ్చి ఆగిపోయింది. దానిమీద వాన చినుకులు దాడి చేసాయి. అక్కడే చిరిగిపోయి ముక్కలై ఎటో మట్టిలో కలిసిపోయింది. నేను వెనక్కి తిరిగాను. మరో పడవ చేతిలో పెట్టాడు. నీళ్ళల్లో వదలబోతూ ఎందుకో చూసాను. ఆ కాగితం మీద ఏదో వ్రాసి ఉన్నట్లుంది. చెయ్యి ముందుకు పెట్టాడు.

'తోసెయ్. వాన జోరుగా ఉన్నప్పుడే తోసెయ్. ఊ..' నీళ్ళల్లో పడేసాను. ఈ పడవా అంతే. కిటికీ చువ్వలు పట్టుకుని అలా గమనిస్తూనే ఉన్నాడు.

'ఇదీ చదివేస్తుంది' అన్నాడు.

'ఏం చదువుతుంది? ఎవరు చదువుతుంది?'

'నా ప్రేమలేఖలు.'

అనుకోకుండానే ఈ ఇంట్లోకి వచ్చాను. ఎక్కడెక్కడి నుంచో ఏవేవో కాగితాలు ఏరుకొచ్చి నా ముందు పడేసాడు.

'నేనో పంకజం, నువ్వో పంకజం'

'అంటే?'

'ఇంత చెత్త ఏంటి అని చూడకు. చుట్టూ ఉన్న చెత్తలోంచి కూడా నిటారుగా చిత్తాన్ని వెలుగు వైపుకు నిలిపి నిలబడ్డదే సరైన పువ్వు. వీటన్నిటినీ పడవలు చేసి ఉంచు. వాన అప్పుడే ఆగదు.'

ఓ రోజు మంచి నిద్రలో ఉండగా ఎవరో తలుపు కొట్టారు. లేచి తలుపు తీసాను. జేబులోంచి ఓ ఫోటో తీసి నాకు చూపించారు.

'ఈయన మీకు తెలుసా?'

'తెలుసు. ఆ వీధి చివర ఇల్లు.'

'చివరిసారి ఎక్కడ చూసారు?'

‘ఇంట్లోనే. కిటికీ దగ్గిర‘

‘ఈయన కనిపించటంలేదండి చాలా రోజులుగా. కాస్త కనిపిస్తే ఈ నంబరుకు ఫోన్ చేస్తారా?‘ అంటూ ఓ నంబరు నా చేతికిచ్చాడు ఆయన.

ఎంతో ప్రయత్నించారు కానీ ఆయన దొరకలేదు. ఆయన బంధువులు నాకు తాళం చెవి ఇచ్చి అప్పుడప్పుడు వస్తూపోతూ ఉండమన్నారు. ఇది నా టైం పాస్.

వాన పడుతోంది కానీ తగ్గుముఖం పడుతోంది.

‘ఎన్ని పడవలు చేసారు?‘ అడిగాను.

‘నో. ఇవి పడవలు చేసి నీళ్ళల్లో వదిలే ఆలోచనలు కావు. ఇలా చదువుతూ పోతుంటే మతి పోతుంది. ఆయనకి మతి చలించటంలో ఆశ్చర్యంలేదు. వాన వాకిట్లో ఉన్నా నేను ఈ ఆలోచనల జలపాతంలో తడిసి ముద్దవుతూ ఉంటాను.‘

లేచి బయటకు వచ్చాను. చెయ్యి చాచి చినుకులను పరీక్షించాను.

‘ఫరవాలేదు, పెద్దగా తడవరు‘ అతను కిటికీలోంచి అన్నాడు. అయినా కొద్దిగా సంకోచించాను.

‘సార్, ఎవరినైనా ప్రేమించండి‘ అన్నాడు.

‘ఎందుకు?‘

‘ఇలా తడిసి పోతారేమోనని భయపడరా!‘ చినుకులు ఆగుతున్నాయి. అక్కడ చేరిన నీటిలో ఓ చినుకు మల్లెపూవులా మారుతోంది, ఓ చినుకు మట్టిని చిందిస్తోంది. అన్నీ ఓ ధారలోకి వెళ్ళిపోయి ధరణి ఒడిలోకి ఒదిగిపోతున్నాయి.

వెనక్కి తిరిగాను.

‘మీరా..?‘

‘నేను...హహ... వదిలెయ్యండి. ఈయన ఆలోచనలను సేకరించి పుస్తకం చేయాలనుకున్నాను. అలా కావాలని రాసిపెట్టినట్లుంది. లేకపోతే కాగితం పడవలైపోవా?‘

వాన వెలిసింది. బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాను.

జేబులోంచి రెండు కాగితాలు తీసాను.

‘ఇప్పుడు నన్ను చూస్తూ ఈ కథ వ్రాస్తారా?‘ అడిగింది కవిత.

‘కథ అయిపోయింది‘ అన్నాను.

‘మరి కాగితాలెందుకు?‘

ఒక కాగితం ఆమెకిచ్చాను.

‘కాగితం పడవ చేయటం చేతవునా?‘

‘ఓ....‘

ఇద్దరం చెరో పడవా చేసాం. నీటిలోకి వదిలేసాం. కొంత దూరం అలా వెళ్ళి ఆ ఫౌంటెన్ నీటికి తట్టుకోలేక చిందరవందరయి లోపలికి వెళ్ళి, మరల కాగితాలలా తేలి ఎటో మాయమైనాయి.

‘మీలోనూ ఓ కవిత ఉంది‘ అటు చూస్తూనే అంది కవిత.

'ఒక కవితే ఉంది. ఒదిగిపోయి ఉంది.'

వెంటనే నా వైపు తిరిగి కళ్ళు పెద్దవి చేసింది. ముత్యపు చిప్పలు రెండు అకస్మాత్తుగా తెరచుకుని చినుకులను ఆహ్వానించినట్లుంది.

## సిగ్నల్

**ఇలాంటి అమ్మాయి** ఈ విధంగా దగ్గరవుతుందని ఏ రోజూ అనుకోలేదు. ఎక్కడో మానస సరోవరం దాకా కష్టపడి ప్రయాణం చేసి ఆ జలాన్ని దాచుకుని మురిసిపోవటానికీ, ఓ జలపాతం క్రింద కూర్చుని మనమీది నుండి జాలువారి మరల ఎటో ఉరకలు వేస్తున్న నదీ జలానికీ ఓ చిన్న తేడా ఉంది. ఈ ప్రేమ అనేది ఎక్కడినుండి పుట్టుకొస్తుంది? ఇది పరిశోధనకు వదలకుండా మరిమరి మరగించుకుని ఆనందించవలసిన ప్రశ్న. ఏదో వెతుకుతుంటే నన్ను మరచిపోయావా? అని అడిగే చక్కగా దాచుకున్న ఓ చక్కని పుస్తకం లాంటిది, ఎంతో రక్తికట్టిన కచేరీని ప్రక్కన పెట్టి ఈ గొంతు ఒక్కటి వినకపోతే నిద్రపట్టదు అనిపించేది, వందల మందలలో కలసిపోయి అటూ ఇటూ పరుగులు తీస్తున్నా కనువిందు చేసే ఓ సన్నని ఓరచూపులాంటిది, ఏదీ కొనకుండా కేవలం ఓ బేరీజుకోసం చేసే బేరంలాంటిది, అలవాటుగా చేసే నేఉలాంటిది, అర్థాలతో పనిలేకుండా మాటలతో వండుకునే పదార్థంలాంటిది, చేతిలోకి తీసుకుని ఎవరికీ పంచలేనిది, తల వంచలేనిది, దీనికో బొమ్మ ఏర్పడ్డాక అన్ని బొమ్మలూ ఇలాగే ఉంటే బావుండు అనిపించే మంచి మూర్ఖత్వం ఈ ప్రేమ..

ఫోన్ మ్రోగింది. మొబైల్ స్క్రీన్ మీద ఈ పేరు కొన్ని సమయాలలోనే కవ్విస్తుంది.

'హలో' 'ఊ అంటే?'

'ఉమ్..హూ'

ఇదేదో ఊయల ఊపినట్లుంది. చిరునవ్వు శబ్దం చెయ్యదు కానీ అదేదో మొబైల్‌లో వినిపించేస్తోంది.

'మొబైల్‌లో పేరు కవ్వింత అని సేవ్ చేసుకున్నాను కదా అని ఇలా కవ్వించాలని రూల్ ఎక్కడుంది?'

'ఓహో! నా మొబైలో పేరు వింత అని సేవ్ చేసుకున్నాను కదా అని ఇలా వింతగా మాట్లాడవలసిన అవసరం ఏముంది?'

సిరాబుడ్డి ససేమిరా నీ కలంలోకి కాదు, నీ కాగితం మీదకే అన్నట్లు మొత్తం దొరలి మరీ కవ్వించినట్లుంది.

'హలో'

'ఆ... హలో, చెప్పండి'

'నెట్‌వర్క్ వాళ్ళు ఎందుకింత బాగుపడిపోతున్నారో తెలుస్తోంది'

'విసిగిస్తున్నాను కదూ?'

'లేదు. విసుగు అనిపిస్తే ఆశువుగా కవిత చెప్పు.'

'ఓకే. ఈ సెల్లాక్రమణం మీద ఓ దుష్ట సంధిని సంధిస్తాను'

'అమ్మో!'

నవ్వులు వినిపించాయి. అంతలోనే తేరుకుంది. ఈమె నవ్వు చిత్రంగా ఉంటుంది. సముద్రం అల ఒకటి వచ్చి రాతిని కొట్టుకుని ఓ జల్లులా శిలను అభిషేకించి హోరుమన్నట్లుంటుంది.

'ఈ సెల్ ఒక కర్కశ కంఠీరవ'

'ఓ'

***'ఈ సెల్ ఒక కర్కశ కంఠీరవ'***

***నీకూ నాకూ మధ్య నడుస్తున్న నిశ్శబ్ద క్షణాన్ని నిర్లజ్జగా నాకుంటుంది***

***నాకందుకే అదంటే కణకణమూ కోపమే***

***అయితే పాపం.'***

'ఓహో.. కొంత జాలి కూడా..'

***"ఆహా.. అయితే పాపం***

***అప్పుడప్పుడూ ఒంటరివేళ***

***అదే నా హితకారిణి, కామధేనువు, కల్పతరువూనూ! అందుకే భరిస్తున్నా దాన్ని, చేతిసంచి అడుగునే అంటే కాలి క్రింద మంటలా!'***

'కవిత బాగుంది'

'బాగుందంటే చాలదు. ఆశువుగా ఈ మొబైల్‌లోనే కథ చెప్పండి మరి'

ఆలోచించాను. మొబైల్ వైపు చూసాను. మొదటిసారి ఈ ఫోన్ కొత్తగా కనిపించింది.

'నల్లరంగు కవరుతో ఉన్న స్మార్ట్‌ఫోన్ నన్ను బోల్తా కొట్టించింది. అదే కవరుతో ఉన్న మరో ఫోన్ నాదనుకుని ఎత్తుకొచ్చాను. నాది ఎవరో అలాగే పట్టుకుపోయారని అర్థమైపోయింది. క్షణంలో ప్రపంచం మారిపోయింది. సామాన్యంగా ఎవరైనా ఫోన్ దొంగిలిస్తే అందులోని సిమ్ తీసేయటం చేసే మొదటిపని. కానీ అలా జరగటంలేదు. ఈ ఫోన్‌లోంచి ఎందుకో కాల్ చేయాల్ంటే వద్దనిపించింది. ఒకరోజు నా నంబరు నుంచి ఈ ఫోన్‌లోకి కాల్ వచ్చింది. రెండో రింగుకే గింగురుమనే గొంతుతో 'హలో' అన్నాను. అమ్మాయి గొంతు ఆలయంలో గంటలా మ్రోగింది.

'హలో'

'హలో'

'చూడండీ, మీరెవరో కానీ, ఇలా హలో అంటే హలో అనటం కాదండీ ఫోన్‌లో మాట్లాడటం. మీరు నా ఫోన్ కొట్టేసారు.'

'చూడండీ, మీరూ నా ఫోన్ కొట్టేసారు. ఇది పద్ధతా?'

'మీ ఫోన్‌తో నాకేంటి పని?'

'మీ ఫోన్‌తోను నాకేమీ పనిలేదా'

కొద్దిసేపు నిశ్శబ్దం కమ్ముకుంది.

'రెండు రోజులుగా వెతుకుతున్నాను'

'అంటే? నేను కొత్త ఫోన్ కొని దాన్ని మరచిపోయాననా?'

‘నాకు వాదించే వారంటే అస్సలు ఇష్టంలేదా‘

‘మీకు ఏది నచ్చుతుందో ఏది నచ్చదో నాకెందుకండీ? నేనేమైనా మీ ఇంటికి పెళ్ళిచూపులకొచ్చానా?‘

‘ఆ.. ఎంతమాటంటున్నారు? ఒక అమ్మాయితో మాట్లాడే పద్ధతేనా ఇది?‘

‘ఓ... మీరు అమ్మాయా? ఓకే. అబ్బాయనుకున్నాను.‘

‘నో. మరల బాధపెట్టారా నన్ను. నా గొంతు అలా ఉందా?‘

‘జోక్ చేసాను. ఇంతకీ నా మొబైల్ నాకు ఎప్పుడిస్తారు?‘

ఆ... ఆలోచించాలి. ఇంతకీ ఎక్కడ పోగొట్టుకున్నారో గుర్తొచ్చిందా?‘

‘రాలేదు. అసలు పోయిందీ అన్న సంగతి తెలిసే సరికే చాలా రోజులయింది.‘

‘ఓ.. ఏదీ పట్టించుకోరన్నమాట‘

‘పగలు చూసింది రాత్రి మరచిపోవాలి కానీ పగలు పెంచుకోకూడదు‘

‘అబ్బో. బాగ మాట్లాడతారు. తెలుగు సినిమాలు బాగా చూస్తారన్నమాట!‘

‘ఎలా కనిపెట్టారు?‘

‘మీ మొబైల్ మొత్తం ఒక్కొక్క ఆప్ ద్వారా స్కానింగ్ చేస్తున్నాము‘

‘అయ్యబాబోయ్‘

‘అవును సార్, కావాలంటే నా మొబైల్ కూడా స్కాన్ చేసుకోండి, నా మిత్రుల గురించి తెలుసుకోండి..‘

‘నేనలా చేయలేదు. మీ ఫోటోల కలెక్షన్ చూసాను. అద్భుతమైన టేస్ట్‘

‘...‘

‘ఎక్కడివి అవి?‘

‘నా హాబీ. థాంక్స్. ఇంకేం చూసారు?‘

ఆ ప్రశ్న అడిగిన తీరు ఒక చీరల షాప్‌లో అతను రకరకాల చీరలను ముందర పెడుతుంటే మనకు నచ్చిన చీర దొరికి దేనికిందో దాక్కున్నట్టు అనిపించింది.

‘ఇంకేమీ చూడలేదు. ఒక అమ్మాయి ఫోన్ అని తెలుసుకున్నాక అసలు ఆచూకీ కోసం ఆన్ చేసాను తప్ప ఎప్పుడూ ఆఫ్‌లోనే ఉంచాను.‘

‘ఎందుకో నమ్మాలనిపిస్తోంది. నా ఫ్రెండ్ ఫోన్ మీకు వచ్చుంటుంది. అదే చెప్పింది హాట్ లిస్ట్ చెయ్యనక్కరలేదని.‘

‘నా ఫోన్ నాకెప్పుడిస్తారు?‘

‘ఓహో! ఏదో అప్పున్నట్లు మాట్లాడతారేంటి? నా ఫోన్ కూడా మీ దగ్గరే ఉంది కదా?‘

‘తీస్కోండి, వద్దన్నానా?‘

‘ఇంతకీ ఈ కవలలు ఎక్కడ తప్పిపోయారో తెలుసా?‘

‘చెప్పండి‘

‘సూపర్ మార్కెట్ ప్రక్కన ఉన్న బేకరీ బయట నాలుగు టేబుల్స్ ఉంటాయి. అక్కడ‘

‘ఓ అర్థమైంది. మీరు ఈ ఏరియాలోనే ఉంటారా?‘

'అవును. ఎప్పుడైనా అక్కడే కలుద్దాం'

'ఎప్పుడో ఎందుకు?'

'ఆగండి. అంత తొందరెందుకు?'

'అదేమిటండి?'

'మిమ్మల్ని కాదు, మీ ఫోన్‌ని మొత్తం స్టడీ చేయాలి.'

'ఎందుకు?'

'ఈసారి కాల్ చెయ్యండి, చెబుతాను.. నో మీకే అర్థమవుతుంది'

ఫోన్ పోగొట్టుకున్న వాళ్ళు బాధపడతారు. నేనెందుకో ఆనందిస్తున్నాను. జీవితంలో ఒక్క అమ్మాయితో ఇలా మాట్లాడటం సాధ్యపడలేదు. మర్నాడు ఎవరో గర్ల్‌ఫ్రెండ్ దగ్గిరకు వెళుతున్నవాడిలా తయారయ్యాను. అలా రోడ్డు చివరి దాకా వెళ్ళి కాల్ చేసాను. ఏం చెబుతుందో అనుకున్నాను. రింగ్ టోన్ మార్చేసింది.

'మాటే మంత్రము... మనసే బంధము..'

రింగ్ టోన్ వినిపిస్తోంది. నాలో ఏదో షాక్ తగులుతోంది.

'హలో'

'హలో అండీ. ఏదో వినిపిస్తానన్నారు?'

'వినలేదా? పాట విన్నారుగా?'

'విన్నాను. బాగుంది.'

'నిన్ననే మీకొక మెసేజ్ వచ్చింది'

'ఎక్కడినించి?'

'మీ నాన్నగారి దగ్గరనుంచి'

'ఏమన్నారు? నాకు పంపండి'

'ఏదో సంబంధం తాలూకు ఫోటో మీ దగ్గరున్నది ఆయనకు పంపమంటున్నారు. నేను ఫోనంతా, వాట్సాప్‌లో కూడా వెతికాను. దొరకలేదు పంపుదామంటే'

'టూ మచ్. మీరేంటండీ పంపటం? అసలు' పిచ్చిగా నవ్వింది ఫోన్‌లో.

'అవునూ, ఇంతకీ ఎక్కడుంది ఫోటో?'

'నేను డిలీట్ చేసాను. అలా అమ్మాయిల ఫోటోలు సంబంధం కోసమని తెప్పించుకుని ఫోన్‌లో స్టోర్ చేసుకోవటం తప్పుకదా? చూడండి. మీలాంటి వాళ్ళ చేతుల్లోకి..'

'ఓ. నేను కాబట్టి సరిపోయింది'

'కరెక్ట్. మీరు మంచివారండీ'

'అవునా? మీ పద్ధతులూ బావున్నాయి'

'నాకు ఫోన్ కావాలి'

'నాకూ కావాలి'

చాలా మెల్లగా అంది.

'మరి ఆలస్యం దేనికి?'

'ఏవండీ.. జీవితంలో కొన్ని కొన్ని సార్లే, కొన్ని క్షణాలే ఉంటాయి'

'కరెక్ట్.'

'కదా.. ఉండనీయండి.'

'...'

'ఏంటి ఆలోచిస్తున్నారు?'

'ఏం లేదు. నా దగ్గరున్న మీ మొబైల్‌లో ఇలాగే ఏదైనా సంబంధం గురించి విషయం వస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను'

'ఓ.. మీకు ఇప్పుడే వాట్స్ ఆప్‌లో ఓ సంబంధం వచ్చింది. మీకు పంపిస్తున్నాను చూడండి.'

మనసు మనసులో లేదు. ఆ రోజు సాయంత్రం ఇబ్బంది పడుతూ బేకరీదాకా వెళ్ళాను. చుక్కల సల్వార్ కమీజ్‌లో పొడుగ్గా ఉన్న ఒకమ్మాయి కొద్దిగా ప్రక్కగా నిలబడి ఉంది. నన్ను చూస్తున్నట్లే చూస్తూ మరల రోడ్డు మీదకి చూస్తోంది. ఏదో గుర్తుకొచ్చి మొబైల్‌లో ఆ ఫోటో వెతికాను. ఈమె ఫోటోనే. వెంటనే మొబైల్ మ్రోగింది. 'హలో'

'మనసు పారేసుకున్నారా, మొబైల్ పారేసుకున్నారా?'

'ఆ..'

నన్ను చూస్తూనే మొబైల్‌లో మాట్లాడుతోంది.

'ఈ మొబైల్ ఉంటే ఓ బాధ, లేకపోతే మరో బాధ మనసులాంటిది.'

'నిజమే. అనవసరమైనవన్నీ గుర్తుచేస్తూ ఉంటుంది, టైం తినేస్తుంది. సమయానికి పని చెయ్యదు, సిగ్నల్ లేదంటుంది.' ఫోన్ కట్ చేసింది. ఇద్దరం టేబుల్‌కు ఎదురూ బదురూ కూర్చున్నాం. తాంబూలాలులా మొబైల్ ఫోన్లను ఇచ్చిపుచ్చుకున్నాం.

'ఈ సిగ్నల్ కరెక్ట్' అన్నాను.

'ఊ.. మాటలలోనే కథ వండేసారా'

'కథ వినిపించమన్నావు, వినిపించాను.'

'అయితే మొబైల్‌లోనే పెళ్ళయిపోయిందన్నమాట'

'మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్నారు. ఇప్పుడు సాటిలైట్ సిగ్నల్స్ ద్వారా అవుతాయి. దట్సాల్'

'ఇద్దరి మాటల్లో ఇద్దరికీ అంత అనుబంధం ఏర్పడిందా?'

'తెలివిగలవాళ్ళు ఒక మొబైల్ చూసి తెలుసుకోగలరు'

'మాటలలోంచి అంతరంగం తెలుస్తుందా?'

'మాటలద్వారా తెలుస్తుంది'

'నిజమే. ఏవంటారు..'

ఇద్దరూ ఒకేసారి మొబైల్‌లో పలికాం.

'శబ్ధతరంగాలు'

కవిత నవ్వింది.

'ఎందుకు నవ్వొచ్చింది?'

'ఏం లేదు. ఇద్దరం ఒకటే పలికాం. అందుకు'

'మాటలు కలవటం అంటే ఇదేనేమో'

'....'

'హలో'

'మనసులు కూడా కలిసినట్లేనా?'

ఆ ప్రశ్న మందిరంలోకి వెళ్ళిన తీరు ఈ సుగంధం ఏ కుసుమానిదో అని అప్పుడే తయారైన పూల సజ్జ అడిగించిన ప్రశ్నలా ఉంది. నేనూ మెల్లగా అన్నాను.

'మనసులు కలసిన వారికే... మాటలు కూడా కలుస్తాయి'

## తుమ్మెద

**పరిచయం పెరిగిన** తరువాత కవితతో కవితను చదవటం పరిపాటి అయిపోయింది. ఎందుకిలా ఆలోచిస్తోంది?

'డోలాయమానం'

*అనువైన నెలవు వెతుకుతూ నెలకొక్క క్రొంగొత్త ప్రయాణం*

*నిలకడ నిలువుటద్దం పెట్టినా నాస్తి*

*వలస పక్షిని వలవేసి పట్టటం కష్టం కాదేమిటి?*

*ఎప్పటికప్పుడు ఎటువైపు దృష్టి అన్నట్లు....*

*రెక్కలార్చుకుని సిద్ధమే అన్నట్లు*

*అక్కడా... ఇక్కడా అంతా నీదే అన్నట్లు..*

*ప్రియ భాషణం వల్లిస్తుంటే*

*బదులివ్వటం భయమే సుమా!*

*నీ ఊసుల సందిట్లో చేరితే*

*ఎప్పుడు ఒంటితనం ఒడిలో నిస్త్రాణగా వాలిపోవాలో అని!*

అమ్మాయిలకు ఎందుకు ఎక్కువ అనుమానాలు? అని ఒకసారి అడిగాను.

రచయితలెందుకు ఎక్కువగా వైవిధ్యం కోరుకుంటారు? అని బదులు అడిగింది. ఏమో! కవితలు వ్రాసేవారికి వైవిధ్యం అక్కరలేదేమో! అందాన్ని ఎక్కడైనా సరే చూడాలి గదా మరి? అన్నాను. సూర్‌దాస్‌కు కళ్ళులేవు. శ్రీకృష్ణుడిని ఎలా అంత అందంగా వర్ణించాడు? అని త్రిప్పికొట్టింది. నాకు కనిపించకుండానే నా కళ్ళకు ఓ రకమైన కళ్ళజోడు తగిలించి అప్పుడు మాట్లాడదాం అంటున్నట్లుంది.

రచయితలు సామాన్యులు కారు, అనేసింది ఒకసారి.

'మాన్యులు' అన్నాను నేను.

వెంటనే నవ్వి 'అనుమాన్యులు' అంది అంటే? అనుమానించదగ్గవారన్నమాట.

బావుంది. రసం లేకుండా సరసం ఎలా? నాలుగు దినుసులు లేకుండా రసము లేదు, నాలుగు మాటలు లేకుండా సరసమూ లేదు. నలుగురుతోనే నాటకం..

సుబ్బారావుకి ఈ మధ్య కొత్త సమస్య వచ్చింది. పెళ్ళి అయ్యాక మారిపోయాడంటారు కొందరిని. తెలుగు సినిమా చూసిన ప్రతివాడూ, పెళ్ళైయిన ప్రతి మగవాడూ అనవసరంగా నడకలు మార్చి జారిపోతూ ఉంటారు. డైనింగ్ టేబుల్ ముందు కూర్చోవాలంటే భయం వేస్తోంది. కారణం ఆమె వంట బాగా చెయ్యకపోవటం కాదు. బాగా చెయ్యటమే! అన్నీ వడ్డించి ఆ సుందరి (పేరు కూడా అదే) ఓరకంట మరో చూపుని కూడా వడ్డిస్తూ ఉంటుంది.

'వాళ్ళ ఇంట్లో ఇదే చట్నీ రెండుసార్లు అడిగి వేయించుకున్నారు. యస్ ఆర్ నో?'

'యస్'

'తినండి'

'తింటున్నాను'

'కరెక్ట్‌గా తినండి'

'అంటే?'

'బాలేదా?'

'ఓకే. బాగుండకపోతే?'

లేచి నిలబడిపోయింది. ప్లేట్లోవన్నీ తీసేస్తానంటోంది!

'ఉండుండు. కూర్చో కూర్చో, కరెక్ట్‌గా తింటాను'

ఆ మధ్య డిష్ అంటినా వాడికి ఫోన్ చేసింది.

'అసలు మాకు అవసరంలేని ఛానెల్స్ మీ వ్యాపారం కోసంకదా చూపిస్తోంది? యస్ ఆర్ నో?'

'...'

'అమ్మాయి కనిపించని ఛానెల్ ఏదైనా ఉందా?'

'చాలా ఉన్నాయండీ. డిస్కవరీ చానెల్, జాగ్రఫీ.'

'గుడ్ నంబర్? అక్కరలేదు. మెనూలో చూస్తా!'

టకటకా డిస్కవరీ పెట్టింది. సుబ్బారావుని ముద్దుగా చూసింది.

'ఇప్పుడు చూడండి.'

సుబ్బారావు కళ్ళార్పకుండా చూస్తున్నాడు. అనుమానం వచ్చింది. అటూ ఇటూ చూసింది.

'ఏం చూస్తున్నారు? కరెక్ట్‌గా చూడండి'

'కరెక్ట్‌గానే చూస్తున్నాను'

'అంత బాగుందా?'

'అవును! ఆడ సింహం కూడా అందగత్తే మరి!'

టక్కున కట్టేసింది. కోపంగా బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది. సుబ్బారావు టి.వి ఆన్ చేసాడు.

'సుందరీ..'

'ఊ...'

'న్యూస్ చానెల్ ఏదైనా పెట్టుకుంటానే మరి. అందులో అమ్మాయి ఉంటే ఏమీ చెయ్యలేను'

'దూరదర్శన్ పెట్టుకోండి.'

ఒక్కో రోజు బేలగా అడుగుతుంది, 'ఏవండీ, మిమ్మల్ని ఎక్కువగా అనుమానిస్తున్నానా?'

కూరలో ఉప్పు సరిపోయిందా అని అడిగితే చెప్పొచ్చు. ప్రయాణంలో నిద్రపట్టిందా అంటే చెప్పొచ్చు. పై అధికారికి చెప్పేది అర్థమవుతోందా లేదా అనేది చెప్పొచ్చు. ఎక్కువగా అనుమానిస్తున్నానా అంటే?

'లేదు. మరీ ఎక్కువగా ప్రేమిస్తున్నావు'

'ఎవర్నని మీ ఆలోచన? మిమ్మల్నా, ఇంకెవర్నైనా? యస్ ఆర్ నో?'

'ఇంకెవర్ని? నన్నే'

'ఓ. అందుకా అలా ఇబ్బంది పడుతున్నాను?'

'కరెక్ట్.'

'ఏం లేదండీ. మీరు ఎక్కువసేపు అమ్మాయిలని చూస్తుంటే ఇబ్బందిగా ఉంటుంది. మీకు అలా ఉండదా?'

'అంటే?'

'నా వైపు మరో మగాడు అలా చూస్తుంటే మీకేమనిపిస్తుంది?'

బార్ బార్ దేఖో, హజార్ బార్ దేఖో, జో దేఖో, కె దేఖనే కి చీజ్ హై హమారా దిల్‌రుబా!'

పాట పాడేసాడు.

'టూ మచ్'

'అవును సుందరీ! నైబర్స్ ఎన్వీ, ఓనర్స్ ప్రైడ్ తప్పేంటి?'

'తప్పు. మిమ్మల్ని అలా ఇంకొక అమ్మాయి చూస్తే కోపం వస్తుంది నాకు'

'రాకూడదు'

'ఎందుకు? మీరు తెగ చూసేస్తారు కాబట్టి, యస్ ఆర్ నో?'

'నో. నేను కేవలం సౌదర్యారాధన చేస్తాను. మంచి వస్తువు ఎక్కడైనా సరే, స్వీకరించమన్నారు పెద్దలు!'

'స్వీకరిస్తారు, అమ్మాయిలే అక్కరలేదు, ఆంటీలను కూడా వదిలిపెట్టటం లేదు మరి'

'అందరిలో నిన్నే చూస్తున్నాను'

కళ్ళు పెద్దవి చేసింది

'ఛా! ఇదొకటా?'

'అవును. శ్రీకృష్ణుడు చెప్పేసాడు'

'ఓ. మగాళ్ళందరికీ ఆయనే ఆదర్శం. ఏం చెప్పాడు సార్?'

'అందరిలో, అన్ని చోట్లా ఆయననే దర్శించమన్నాడు. అంతేకాదు. ఆలోచనలోనే అందరినీ దర్శించమన్నాడు.

ఆలోచించింది. దగ్గరకొచ్చి చొక్కాకి పెట్టి ఉన్న గుండీ విప్పి మళ్ళీ పెట్టింది.

'మీకో ఛాయిస్ ఇస్తాను'

'ఇచ్చెయ్'

'మీరు ఆ రెండవది చెయ్యండి'

'అంటే?'

'అమ్మాయిలని, ఆంటీలనీ, అందరినీ నాలోనే చూడండి.'

'తప్పకుండా. కానీ అందరూ అంత బాగుండరు, నీలో ఎలా చూసేది?'

దూరంగా వెళ్ళిపోయింది.

'మరి ఎందుకు చూస్తారు వాళ్ళని?'

'బాధతో చూస్తాను'

'ఓ. ఇప్పుడు బాధ కూడానా?'

'అవును నీ అందం వారికి రాలేదే అన్న బాధ'

వెక్కిరించి లోపలికెళ్ళిపోయింది. ఇలాంటి మాటలు ఆడవాళ్ళు వినటానికి ఎంతగానో ఇష్టపడతారు. ఇది నిజం అని ఒప్పుకోటానికి ఎంతగానో కష్టపడతారు కూడా!

బెడ్‌రూమ్ తలుపు చాటు నుండి తొంగి చూసింది.

'వాళ్ళు ఎందుకు చూస్తారు మిమ్మల్ని?'

'నేను తొడుక్కున్న విధంగా షర్ట్ వాళ్ళాయనలు ఎందుకు తొడుక్కోలేకపోతున్నారూ అనే ఆలోచన కలుగుతోంది వారికి.. ఇలా ఎన్నో.'

తలుపు తోసేసింది.

ఫోన్ మ్రోగింది. ఫోన్ చేసేవరకే ఎవరికైనా అధికారం ఉంటుంది. అది తీసుకుని హలో అనాలా లేదా అనేది చాలా విషయాల మీద ఆధారపడి ఉంటుంది. హలో అనకపోవటం నేరం కానేకాదు. కాకపోతే ఆఫీస్‌లో సామాన్యంగా ఆఫీసు విషయాలకు సంబంధించి ఫోన్ వస్తే ఎంత గొప్ప దీక్షాపరుడైనా గబుక్కున ఫోన్ తీయడు. కానీ ఎంతగొప్ప అధికారి అయినప్పటికీ దానిని అమూల్యమైన వస్తువుగా

భావించి చెవి దగ్గరికి చేర్చి కవచకుండలాలుగా భావించి లేని సహజత్వాన్ని తెచ్చి క్షణంలో హజాన్ని మరిచిపోయి 'హలో' అన్నాడంటే ఖచ్చితంగా ఆ ఫోన్ శ్రీమతిదే అయి ఉంటుంది.

'హలో', అన్నాడు సుబ్బారావు.

'ఈ పాట వినండి'

'పాడు'

'నేను పాడను. వినిపిస్తాను'

'....'

తుమ్హే కోయీ అవుర్ దే ఖే తో జల్‌తా హై దిల్
బడీ ముశ్కిలోం సె ఫిర్ సంభాల్‌తా హై దిల్
క్యా క్యా జతన్ కర్‌తే హైం తుమ్హే క్యా పతా
యే దిల్ బేకరార్ కిత్ నా యే హమ్ నహీ  జానెతే..'

కిషోర్ కుమార్ పాట చక్కగా ఉంది.

'పాట బాగుంది'

'బార్ బార్ దేఖోకి ఇది నా సమాధానం.'

ఫోన్ కట్ అయిపోయింది. ఆడవాళ్ళు కాల్‌నే కాదు, కాలాన్నే అరికాలిక్రింద ఉంచగలిగే కాళికలు.

ఇది నాది, దీనిని తాకే ప్రయత్నం ఎవరూ చేయలేరు అనే సంపూర్ణమైన అధికారాన్ని ప్రేమ తత్వంలో నింపగలిగిన వారు ఇద్దరే - వీరిద్దరూ స్త్రీలే. ఒకరు అమ్మ, ఒకరు భార్య.

ఒక కొడుకుగా, ఒక భర్తగా పోజ్ ఇచ్చి ఏదో గొప్ప పాత్ర పోషిస్తున్నాడనుకునే ప్రతి పురుషుడూ ఆ ప్రక్రియలో వారి క్రిందనే ఉంటాడు.

ఇంటికెళ్ళి గూటికి చేరిన పక్షిలా సుందరి కోసం గాలించాడు సుబ్బారావు. తలుపు తెరచే ఉంది. బెడ్‌రూంలోకి వెళ్ళి చూసాడు. అక్కడా లేదు. నిలువుటద్దం ముందు ఎందుకో ఆగాడు. లోపలికి వచ్చింది సుందరి. ప్రక్కన నిలబడింది.

'బలే టైంకి వచ్చారు సార్'

'ఎందుకలాగ?'

'చొక్కా తియ్యండి'

'ఛీ'

'కాదు..' అంటూనే ఒక స్టిక్కర్ అతికించి తీసేసింది.

'ఇదేంటి?'

'అద్దంలో చూడండి'

సరదాగా చేసినా బాగుంది. సుందరి ఫొటోను ముద్ర చేయించి అక్కడ ముద్రించి రోజూ అద్దంలో చూసుకోమంటోంది. ఇద్దరూ తెగ నవ్వుకున్నారు.

'ఆంజనేయస్వామిలా గుండె చీల్చి చూపించలేను కాబట్టి ఈ రూట్‌లోనే వచ్చావా?'

'కరెక్ట్'

'మనిద్దరం అద్దంలోని ఫ్రేమ్‌లో ఎంత బాగున్నామోకదా?'

'ఊ...'

'ఇంటికొస్తే హాయిగా ఉంటుంది'

'ఎందుకో?'

'పిట్టలు ఓ కొమ్మ, ఓ రెమ్మ, ఓ ఆకు తెచ్చి గూడు కట్టుకుంటాయి. ఇవన్నీ ఎక్కడెక్కడి నుంచో వస్తాయి. ఊహలన్నీ ఇలాంటివే. అవన్నీ కలబోసి చిత్రమైన గూడు కట్టుకున్నాక ఆ నెలవులో నిలువెత్తునా నిలవుండేది ఒక్కరే..'

సుందరి సుబ్బారావుని వింతగా చూస్తోంది.

'నాకు ముద్రలు వేయక్కరలేదు,' అన్నాడు సుబ్బారావు. సుందరి చేతులతో తన మొహాన్ని కప్పేసింది.

'నువ్వు నన్నెలా చూస్తున్నావో అద్దం చెబుతోంది..'

చేతులు తీసేసింది.

'నేనెలా చూస్తున్నానో కూడా చూపిస్తోంది'

'నాలోంచి నీ తత్వం, నీలోంచి నా తత్వం.. ఈ యోగానికి ఎందుకో ఈ అద్దం అద్దం కాదు, హారతి పడుతోంది.'

సుబ్బారావు గుండెమీదనున్న తన బొమ్మ మీదనే వాలిపోయింది సుందరి.

నల్లని ఆమె కురులు ఎర్రని గులాబీమీద వాలిన తుమ్మెదలా అనిపించి అద్దం వలన పాత్రలు తారుమారయ్యాయే అనుకుంటూ మరోసారి కొంటెగా చూసాడు సుబ్బారావు.

## ఈ వీణపైన

**కావలసిన వాళ్లు** కావాల్సి మాట్లాడుతూ ఉంటే బాగుంటుంది. కావాలి అనుకున్న వాళ్లు మాట్లాడకుండా ఉంటే అదోలా ఉంటుంది. కవిత నన్ను కవ్వించి ఎందుకో చాలా రోజులయింది.

ఫోన్ చేసాను. కాలర్ ట్యూన్ మారింది. (ఇటీవల కథల ప్రభావమేమో!). చక్కని పాట వినిపిస్తోంది - 'కన్నులు నీవే కావాలి, కలనై నేనే రావాలి, కవితై నీవే ఉరకాలి, కావ్యం నేనై పుట్టాలి...'

'హలో'

'ఏమైంది?'

'ఏమైంది?'

'అంటే?'

'చాలా కాలంగా ఫోన్ రాలేదు!'

'మీరంతా ఏకపక్షం. ప్రజాస్వామ్యానికి పనికిరారు.'

'అవునా?'

'మరి? నేను ఫోన్ చెయ్యటమే కానీ మీరు చెయ్యరు.'

'చేసాగా?'

'ఓ మౌనం మ్రోగింది

*అర్థంకాని ప్రశ్నలకు జవాబుగా*

*మౌనం మ్రోగింది*

*మాటలు కూర్చిన అగాధాలపై*

*వారధి నిర్మించాలనే ప్రయత్నం కాబోలు*

*భాషకతీతమైన మౌనం*

*మన మధ్యకు చొచ్చుకు వచ్చి*

*సాన్నిహిత్యానికి సున్నితమైన భాష్యం చెప్పింది*

*మనమిప్పుడు దూరంగా లేముగా!*

*ఒకరికోసం ఒకరుగా వుండాలనే యత్నం మానలేదుగా!*

*అందుకే మౌనం మ్రోగాలి - తీయగా, శృతి బద్ధంగా, లయననుసరిస్తూనే!*'

'బాగుంది. రెండు క్షణాలలోనే మూడు గంటలు మ్రోగినట్లుంది. తాకకుండానే ఓ వీణ కదిలినట్లుంది'

'ఓహో! మీకూ కవితల పిచ్చిపట్టినట్లుంది'

'కవిత పిచ్చి'

'...'

'ఓ మాటనుకుందాం'

'చెప్పండి'

'కవిత చెప్పేవారే గొప్పవారు'

'ఎందుకు?'

'కథలు చెప్పేవారు కథలు చెబుతూ ఉంటారు'

'అంటే?'

'నిజాన్ని దూరంగా తీసుకుని వెళ్లి ఎక్కడినుండో చూపించి అదుగో నిజం అలా ఉంటుంది అంటారు'

'మరి కవిత వ్రాసే వారు?'

'నిజంతోనే, నిజంలోనే అల్లుకుపోతారు'

'ఇది ఆలోచించాలి.'

మానసిక వేదనతో బాధ పడుతున్న వారెందరినో పరిశీలిస్తూ వస్తున్నాను. మనోవిజ్ఞానం అంతరిక్షాన్ని పరిశోధిస్తున్న ఓ చిన్న స్పేస్‌క్రాఫ్ట్ వంటిది. ఒక చిన్న జీవితకాలంలోని స్థితిగతులనుండి తప్పించుకుని ఒకరి మనస్సులోకి ఎన్నిసార్లు తొంగి చూసినా చిత్రంగానే ఉంటుంది.

'మీతో పోట్లాడాలనుంది', అన్నాడు ఎదురుగుండా కూర్చున్న సుందరం. అతని భార్య అతని ప్రక్కనే చిరునవ్వు నవ్వుతూ కూర్చునుంది.

'ఊ', అన్నాను.

'మీతో...పోట్లాడాలనుంది'

'పోట్లాటెందుకు? మాట్లాడితేచాలు'

'అంటే? నా మాటే పోట్లాడుతున్నట్లుందా?'

'అని నేను అనలేదుకదా?'

'అక్కర్లేదండి. నేనందరికీ లోకువైపోయాను. ఇదిగో, మా ఆవిడ అసలు ఏమీ మాట్లాడదు, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది, ఇదేదో మానసికపరమైన జబ్బు అని మీ వద్దకు వస్తే.. ఇదిగో, నన్నే ఆక్షేపిస్తారు. దేశమంతా ఇలాగే ఉంది.'

నిజమే. నోట్ల కట్టలో ఒక నోటు చెల్లకపోతే సమస్య మనదే అన్నీ చెల్లకపోతే జాతీయ సమస్యే.

'ఏమీ ఆలోచిస్తూ ఉంటుంది ఆవిడ?'

'నాకేం తెలుసు? అడిగితే ఏమీ లేదంటుంది'

'ఆలోచిస్తోందని ఎందుకనుకుంటున్నారు?'

'అలా కనిపిస్తుంది'

ఆమె వైపు చూసాను.

'నాకలా అనిపించటంలేదు', అన్నాను. ఆమె తల వంచుకుంది. సుందరం కుర్చీలో వెనక్కి వాలిపోయి తలపట్టుకున్నాడు.

మిత్రులను మనిషి మనసుద్వారా ఎంచుకుంటాడు. మాట శత్రువులను ఏర్పాటు చేస్తుంది. ఈ ఆట అర్థమయ్యేలోపు జీవితకాలం అయిపోతుంది.

'నీ బాధేంటి?' అడిగాను.

వాళ్లావిడని ఓ చూపు చూసి నన్ను చూసాడు.

'కళామందిర్‌లో కళకళలాడి పోతూ ఉండే అద్దం వెనుక బొమ్మలా ఉంటాననంటుందేంటి? ఓ మాట, ఓ ఆట...'

ఆట... అన్నప్పుడు ఆమె తలవంచుకుంది.

'ఏమీ సంచలనాలు లేవంటావు?'

'సంచలనాలెందుకు నా బ్రతుక్కి? చలనం లేకపోతే ఎలాగ?'

ఆలోచించాను.

'ఏమ్మా?'

ఆమె 'చెప్పండి' అన్నట్లు చూసింది.

'ఈయన ఏదైనా తీవ్రంగా గాయపడేటట్లు చేసి అసలు జీవితం మీద విరక్తి పుట్టేటట్లు చేసాడా?'

తల అడ్డంగా ఊపింది.

'మీ తల్లిదండ్రులను అవమానించాడా?'

మరల అడ్డంగా ఊపింది.

'ఇదేమైనా వ్రతమా? అలా అయితే ఆయనకు చెప్పవచ్చుగా?' మరల కాదన్నట్లు తల ఊపింది. కాకపోతే చిన్న మార్పు ఓ చిన్న చిరునవ్వులో కనిపించింది.

'అసలు మాట్లాడకపోతే ఎలాగమ్మా?'

సుందరానికి ఆ ఒక్క ప్రశ్న జీవితానికి చాలనిపించింది. కళ్లు మూసుకుని బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నాడు.

శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్లుంది.

ఆడవాళ్లు ఎందుకు మాట్లాడరు? దీనిమీద చాలామంది మగవాళ్లు మాట్లాడుతూ ఉంటారు. ఏదైనా సరైన మాట సరైన సమయానికి చెప్పాలనుకున్నప్పుడు ఆడవాళ్లు మాట్లాడరు అని ఒకాయన ఒకప్పుడు చెప్పాడు. అదే నిజమైతే ఈమె ఏం చెప్పాలనుకుంటోంది? నా దగ్గిరకి రావటం ఇష్టంలేకపోతే ససేమిరారాదు కదా? నూటికి తొంభై మంది అసలు డాక్టరు వద్దకు రారు..

రెండవసారి వచ్చినప్పుడు కూడా ఇద్దరు ఏదో సినిమా చూడటానికి వచ్చినట్లు వచ్చారు. ఆమె నమస్కారం పెడుతుంటే ఆమెను నన్ను సుందరం పరీక్షగా చూసాడు. ఇద్దరూ చేతులు కట్టుకుని కూర్చున్నారు.

నా పరిస్థితి మీద నాకే కొద్దిగా జాలేసింది.

'ఎలా?' అడిగాడు సుందరం.

'అంటే?'

'మాటలేదు, స్పందనలేదు.'

'సుందరం అసలెవరైనా ఎందుకు మాట్లాడాలి? గాంధీగారు చాలా రోజులు మాట్లాడనే లేదుట...'

'మనం మనుషులం సార్. సాహిత్య సంగీత కళావిహీన...' చెయ్యి అడ్డం పెట్టాను.

'అదంతా ప్రక్కన పెట్టు. అసలు కనీసం కాఫీ త్రాగుతారా? భోజనం వడ్డించాలా అనేవి కూడా మాట్లాడకపోతే ఎలా అమ్మా?'

తల వంచుకుంది. సుందరం కుర్చీలో వెనక్కి వాలాడు.

'నేను ఇంటికి వచ్చి మొహం కడుక్కుంటుంటే చిక్కని కాఫీ సువాసన వచ్చేస్తుంది. అలా హాల్లోకి రాగానే అలా టీ పాయ్ మీద గ్లాసు కనిపిస్తుంది. కొత్తల్లో ఒహో కాఫీ పెట్టావా అని అడిగేవాడ్ని, మెల్లగా అదీ మానేసాను. అలా టీ.వీ ముందు కూర్చుని తాగేసి ప్రక్కన పెడుతున్నాను. ఆ గ్లాసు అలా తీసుకుని వెళ్లిపోతుంది.'

'ఊ.. ఏమ్మా! నాతో కూడా మాట్లాడవా?'

ఆమె తలవంచుకుని చిరునవ్వు నవ్వింది. అంతకంటే ఇంకేమీ లేదు.

'ఇలా ఎంతకాలంగా ఉంది?'

ఇద్దరూ ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నారు.

'రెండునెలలు' చెప్పాడు సుందరం. నాకు కొద్దిగా నవ్వొచ్చింది. ఏదో కడుపు నొప్పో పంటి నొప్పో అనుకుంటే ఎప్పటినుండీ అన్నమాట మీద చర్చ జరిపించవచ్చు. చిత్రం ఏమిటంటే ఈ మూగనోము పట్టినావిడ ఆ ప్రశ్నకు సమాధానం కోసం భర్త వైపు చూసి వెతుకుతోంది. అలా ఎందుకు చేసిందీ అని ఆలోచించాను. నాకు ఒకటే అర్థమయింది. ఈయన ఏమి చెబుతాడో అనే ఒక ఆసక్తి అందులో వివరంగా కనిపించింది. దీనిని బట్టి న్యాయాన్యాయాలను కొద్దిగా తూకం వేసి చూస్తే ఏదో ఘటన ఓ రెండు నెలల క్రితం సంభవించి ఉంటుందనే నిర్ధారణకు వచ్చి పాతబస్తీలో తెలియని ఇల్లు ఒకటి వెతికి పట్టుకున్న సంతోషం కలిగి మానసిక శాస్త్రం గురించి

నాకూ తెలుసుకోగలిగే మనసు ఒకటి ఉందని ప్రక్కనే ఉన్న డైరీలో మరచిపోతానేమోనని అనుకుని గట్టిగా వ్రాసేసాను. రెండు నెలల గురించి వ్రాసానని సుందరం అనుకుంటాడు.

'అమ్మా, కొద్దిగా వరండాలో కూర్చుంటే మీ ఆయనతో మాట్లాడతాను', అన్నాను.

ఆమె లేచి, మరోసారి మా ఇద్దరి మీదా ఓ చిరునవ్వు పారేసి వెళ్లిపోయింది.

'సుందరా, మీ ఆవిడని ఏదో విషయంలో చాలా ఇబ్బంది పెట్టావు. అవునా?'

'నీ మొహం మండ!'

చెయ్యి అడ్డం పెట్టాను. 'ఇదిగో ఇలాగే వాగి ఉంటావు. ఇష్టం లేనిది ఆడవాళ్లకి జీవితాంతం ఇష్టం ఉండదు. ఇష్టంలేక పోయినా అదిరింది అని చెప్పేవాళ్లు మాయగాళ్లైన మగాళ్లే'

'ఛా'

'అవును. ఇరవై ఏండ్లుగా న్యాయం పట్టి పిండితే నా చేతిలోకి వచ్చి రాలిన జీవిత సత్యం అది. చెప్పు. ఏం చేసావు?'

'స్వామీ. ఏమీ లేదంటే నమ్ము. భోజనం వడ్డించి ఓ మూల సంఘం చెక్కిన శిల్పంలా నిలబడుతుంది. ఏదో ఆలోచిస్తూ ఇక్కడెవరో ఉన్నారని తలచి ఉలిక్కిపడి అటు చూస్తాను. ఫరవాలేదు గుర్తుపట్టానే అన్నట్లు కళ్లు పెద్దవి చేసి పెదాలు విరుస్తుంది. నేనేమైనా అనేలోపో లేక అనుకునేలోపో మరేదో వడ్డించబోతుంది. చెయ్యి అడ్డం పెట్టగానే ప్రక్కన పెట్టి ప్లేటు తీసుకుని లోపలికి వెళ్లిపోతుంది'

ఆ దృశ్యాన్ని ఊహించుకుంటూ అలవోకగా అన్నాను,

'మంచావిడ'

సుందరం టేబులు మీదకి వాలి 'వాట్?' అన్నాడు.

'...'

'అంతేరా! మాట్లాడని వారందరూ మంచివాళ్లే, నాలాగా నిజం చెప్పేటోళ్లందరూ వెర్రిబాగులు! అంతే!'

'అలాక్కాదు. ఇంకొక స్త్రీ అయితే ప్లేటు నీ తలమీద పగలగొట్టేదేమోనని తలచి అలా అనేసాను. సీరియస్ అవకు'

సుందరం లేచాడు.

'రేయ్, నా గోల నీకు నవ్వులాటలా ఉంటుంది. అన్నీ ఉన్నాయి నాకు ఏం లాభం? పైవాడు కొందరి జాతకాలు నూనెలో అరగంట సేపు నాన్చి వెలిక్కి తీసి అప్పుడు వ్రాస్తాడు. మా వాళ్లు నాలుగాకులు ఎక్కువ చదివారు. నా పెళ్లి శుభలేఖ ఏకంగా మూడుగంటలు నానేసి వ్రాయించి ఉంటారు.'

వాడి భుజం తట్టాను.

'మరేం ఫరవాలేదు. అయామ్ హియర్! నేనిక్కడున్నాను'

'కరెక్ట్.. అందుకే జిడ్డు వదలటంలేదు మన మధ్య'

జాతకాలు, దేవుళ్లు, దయ్యాలు అన్నీ ఒకరి అనుభూతికి చెందినవి అని ఎక్కడో చదివాను. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ప్రక్కన కూర్చుని నా భుజం మీద తల వాల్చేసి ఒకడు పడుకుంటాడు.

అతను నిద్రలేచాక భుజం మీద తడుముకుని తడి ఏమీ అంటలేదని నిర్ధారించుకుని దేవుడంటాడు ఎక్కడో అక్కడ అని నాలో నేను గట్టిగా అనుకున్న సందర్భాలున్నాయి. ఆధునిక యుగంలో మొబైల్స్ పట్టుకుని మరుభూమిలోని మరమనిషిలా పారిపోతున్న జనం

మధ్యలో ఒంటరిగా కూర్చుని గాలికి అలికిడి అయి తలుపు తెరచుకుంటే కనీసం ఓ దయ్యమైనా వచ్చి కాసేపు మాట్లాడితే బాగుండు అనుకున్న రోజులున్నాయి. ఇలా ఆకాశం నిర్మలంగా ఉన్నా నేను బైక్ తీసి కొంతదూరం వెళ్లగానే ఎక్కడి నుండో ఓ మబ్బు సబ్బు రుద్దుకుని మరీ నా మీద వాన కురిపించినప్పుడు నిస్సందేహంగా ఏది ఎలా ఉన్నా నా జాతకం మటుకు అన్ని స్థానాలలో ఒక్క శనిగ్రహంతోనే నిండియున్నట్లు నేను భావిస్తాను.

బండి ఆపి గబగబా ఆ ఇంటి చూర్కుకింద నిలబడ్డాను. లోపలినుండి చక్కని వీణ వినిపిస్తోంది. ఓ ఇంటి వరండా అది. వీణ వాయిస్తున్నది ఎవరో కాదు - సుందరం భార్య. నన్ను చూసి ఆపేసింది. లేచి గబగబా తలుపు తీసింది.

'నన్నెలా గమనించావమ్మా?' అడిగాను.

'గ్రిల్‌లోంచి చూసాను. రండి, ఇది మా అక్కా వాళ్ల ఇల్లు.'

లోపలికి వెళ్లి కూర్చున్నాను. ఓ తువ్వాలుతో ప్రత్యక్షమైంది. చేతికిచ్చి సుందరం వర్ణించినట్లుగానే గుమ్మానికి ఆనుకుని చేతులు కట్టుకుంది... అవునూ, ఈమె మాట్లాడిందే? ఆశ్చర్యంగా చూసాను. తలదించుకుని చిరునవ్వు నవ్వింది.

'సుందరంతో ఎందుకు మాట్లాడటంలేదు?'

'చెప్పమంటారా?'

'అయ్యో... ప్లీజ్.'

'పలికించే రాగాన్నే పలకాలంటే నేను ఆ వీణలాంటిదాన్ని, కానీ ఎందుకో మనిషిలా జన్మించాను'

'....'

'మా వారు ఒక గ్రేట్ ఇంటలెక్చువల్. నడకలో వో థియరీ, పడకలో ఓ సిద్ధాంతం. కూర్చుంటే బ్రెయిన్ స్టార్మింగ్, నిలబడితే రాద్ధాంతం. వాన కురిస్తే ఓ విశేషం, కురవకపోతే ఓ విశ్లేషణ! గ్లాసు ఒకలా పట్టుకుంటే ఒక అనుమానం, క్రిందపడేస్తే అవమానం.'

'అర్థమైంది'

'ఎదురింటాయన, లేదా ఆంటీ తలుపు గట్టిగా మూస్తే ఒక గంట నాకు క్లాసు. పనమ్మాయి ఆయనను దాటుకుని వెళ్లిపోతే ఎదురింటి కిరాణా షాపు వాడికి రెండు గంటల క్లాసు. ఆయన చూస్తున్న చానెల్ నేను మార్చేస్తే..'

'టి.వి కట్టేసి అతని చానెల్ ప్రారంభోత్సవం'

నవ్వింది.

'కాదు. తన గదిలోకి వెళ్లి విలువలు - అనే అంశం మీద వ్యాసం వ్రాసుకొచ్చి...'

'హాల్లో గట్టిగా చదువుతాడు'

'లేదు'

'చదివిస్తాడు'

'అయ్యో కాదు. అర్ధరాత్రి నిద్రలేపి సన్నని మాడ్యులేషన్‌తో చెవిలో జోలపాటలా వినిపిస్తారు. అది ఎంచక్కా కంఠస్థం అయిపోయిందని గర్వంగా చెబుతారు. అప్పుడప్పుడు జాలి వేస్తుంది.'

నిజమే. దేశాన్ని ఉద్ధరిణపు నీటితో ఉద్ధరించాలనుకునే వాళ్లుంటారు. ఒక అర్థవంతమైన జీవితాన్ని ఇలా కూడా వ్యర్థం చేసుకుంటారు.

'ఈయనతో మాట్లాడటం అనవసరమని ఇలా..'

'కాదు. రెండు నెలల్రితం ఆలోచించాను. చిన్న గీతలూ, పెద్దగీతలూ అన్నారు. ఇలా మాట్లాడటం మానేసాక ఏదో సిద్ధాంతం చెప్పబోయి మెల్లమెల్లగా ఆగిపోతూ నన్నూ, నా బాధనీ కొద్దిగా గమనిస్తున్నారు. కాకపోతే నన్ను మీ దగ్గరికి తీసుకుని వచ్చి మరో సిద్ధాంతాన్ని వెతుకుతున్నారు.'

ఇద్దరం చాలాసేపు నవ్వుకున్నాం, వాన వెలసినట్లయి లేచాను. వెనక్కి తిరిగి అడిగాను, 'ఇంకా ఎన్ని నెలలు?'

'ఏమో! ఇంకొక్క నెలేమో!'

కావచ్చన్నట్లు తల ఊపి బండి స్టార్ట్ చేసాను.

మనోవిజ్ఞానంలోని మరో విజ్ఞానాన్ని మౌనంగా తెలుసుకున్నాను.

## *నెలవు*

**కవిత కనిపించి** దాదాపు నెలరోజులయింది. ఎవరిదో పెళ్లికి తనే అన్నీ చూసుకోవాలని రాజమండ్రి వెళ్లి ఈ మధ్యనే వచ్చింది. ఎదురుగా వచ్చి కూర్చుంది.

'నెలవు', అన్నాను. అటూ ఇటూ చూసింది.

'ఎవరికీ సంబోధన?'

'నీకే'

'అర్థంకాలేదా '

'నీవు కనిపించని నెలరోజులూ నీ ధ్యాసే, అంచాత నిన్ను నెలవు అన్నాను'

'ఓ. పెళ్లిళ్లు చూస్తుంటే రకరకాల ఆలోచనలొస్తున్నాయి'

'ఓహో'

'ప్రేమా తేలికే, పెళ్లీ తేలికే. రెండిటినీ కలిపి ఓ నెలవును నిర్మించుకోవటమే కష్టమేమో!'

'గోడలు, అడ్డుగోడలూ కట్టుకున్న ఇళ్లల్లో నెలవును నిర్మించుకోవటం కష్టమే'

ఆలోచిస్తోంది కవిత...

'ఊ...నెలవు...', అంది.

'నెలవు'

*ఎక్కడో దాగివుందనుకుని*

*కనిపించని సౌఖ్యాన్ని వెతుకుతూ*

*నత్త నలభైసార్లు తన నెలవును కాదనుకుని*

*బయటకు వచ్చి*

*అటూ ఇటూ పరికించి*

*ఇంపైన తన స్థావరమే*

*తనకు రక్షణ అనుకుని 'యథాస్థానం ప్రవేశయామి' అనుకుంటూ గుట్టుగా గృహప్రవేశం చేసింది'*

'బాగుంది. నత్త ఓ స్త్రీలాగా ఎంతో మెత్తదైనది. కానీ ఇంటిని వెంటపెట్టుకుని మోసేస్తుంది! ఆలోచనలు గీతల్లాంటివి. మెట్టినిల్లు గీసుకున్న గీతల బట్టి ఉంటుంది.'

'నా కవితలు మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయా?'

'అలా ఎందుకు అనిపించింది?'

'ఏదో సమస్యాపూరణంలాగా నేనేదో చెబుతాను.

అది పట్టుకుని కథ వ్రాయాలంటే మరల సమయం వెచ్చించాలి కదా?'

'ఆలోచనల ఆశీర్వాదం ఉన్నవారికి సమస్యలతో సదస్యం జరిగినా ఆనందంగానే ఉంటుంది'

## గీత

బస్‌స్టాప్‌ల పేర్లు చిత్రంగా ఉంటాయి. కండక్టర్ తన గొంతు సద్దుకుని చక్కని శృతిలో 'కల్లు కాంపౌండ్' అని ప్రకటించాడు. గీత తన సీటులోంచి లేచి కనీసం ఓ పురుషపుంగవుడు ఇక్కడ దిగుతాడేమోనని చూసింది. అలా జరగలేదు. దిగబోతుండగా కండక్టర్ తన బాధని గమనించినట్లుంది. 'కల్లు కాంపౌండ్ స్టాప్ అండీ, దిగాలి' అని ఆర్.టి.సీ సేవలని కొద్దిగా సంస్కరించాడు. నవ్వుకుని దిగిపోయింది గీత. బస్సు ముందరకి వెళ్లిపోయింది. బస్‌స్టాప్‌లో నిలబడి కొద్దిసేపు వానవెలిస్తే బాగుండని చూసింది. రోడ్డు అవతల కల్లుకాంపౌండ్ అది చూసినప్పుడల్లా నవ్వొస్తుంది. మొన్ననే పెళ్లయింది. పెళ్లిచూపులకి అబ్బాయిని తీసుకుని రావాలని వెళ్లిన వాళ్ల నాన్న ఎక్కడెక్కడో తిరిగి ఇంటికి చేరుకునేసరికి పెళ్లిచూపులు అయిపోయాయి. ఆనంద్ వచ్చి తనని చూడటం కూడా అయిపోయింది. ఏం పెళ్లిచూపులో... కూర్చున్నంత సేపూ ఫోన్ మ్రోగుతూనే ఉంది.

'సార్, ఏంలేదు. కల్లు కాంపౌండ్ నుంచి మొదటి లెఫ్ట్. వెంటనే సందు యూ టర్న్.. తిరిగారా? వెరీగుడ్ పోచమ్మ గుడి ఉందా? లేదా? కొద్దిగా ముందరకి వచ్చి ఫోన్ చెయ్యండి'

చేగోడీలూ, బాదామ్ హల్వా ప్లేటు అతనికి ఎదురుగా పెట్టి కూర్చుంది గీత. మంచి నీళ్ల గ్లాసుతో అమ్మ వచ్చింది.

'ఆయన్ని వచ్చేయమనండి. మీరు ఎలాగో వచ్చేసారుగా?', అంది. అతను చేగోడీని కాయిన్ టాస్ చేసినట్లు నోట్లోకి రజనీలాగా ఎగరేసాడు.

'సార్‌కి నాలాగే పట్టుదల ఎక్కువ. అపార్ట్‌మెంట్ చూసి వచ్చేస్తానంటున్నారు'

ఫోన్ మ్రోగింది. 'సార్'

'...'

'పోచమ్మ గుడిలేదా? కొద్దిగా ముందరకి రండి. కల్లు కాంపౌండ్. రెండుండవండీ.. ఒకటే.'

మొబైల్ ప్రక్కన పెట్టి తనని చూసాడు ఫైనల్‌గా!

'ఆనంద్..', అన్నాడు, '...నందూ అంటారు'

'గీత'

'కరెక్ట్'

'అంటే?'

'అ...నో....కరెక్ట్. మీ నాన్నగారు చెప్పారు. పేరు తప్పు ఎందుకు చెబుతారు?'

ఎందుకో టక్కున లేచాడు. తలుపులోంచి బైటకు చూస్తూ దేనినో వెతుకుతున్నట్లున్నాడు. ఇక్కడెక్కడా కల్లు కాంపౌడ్ ఎందుకు లేదోనని ప్రకృతిని చిన్నగా ప్రశ్నిస్తున్నట్లున్నాడు.

'అదుగో', అన్నాడు. గీత లేచి నిలబడింది. అటు చూసింది.

'అది నా కారు. సెకండ్ హాండ్‌లో కొన్నాను. బాగుంది. ఎలా ఉంది?'

'కారులో కూర్చుంటే కానీ తెలియదు'

'హ' అని తల గాలికి పైకి లేపి అలానే వదిలేసాడు.

'...'

'గీతగారూ... మీరు నాకు కరెక్ట్‌గా సరిపోతారు' బాటాషోరూంలో చెప్పులోకి కాలు దోపి చెప్పినట్లు చెప్పాడు. ఫోన్ మ్రోగింది.

'సార్..'

'కల్లు కాంపౌండ్.' నాన్న గొంతు వినిపిస్తోంది.

'కరెక్ట్. చాలా ఫేమస్ సార్. ఎవర్నడిగినా చెబుతారు. మీరక్కడే ఉండండి. మీ అమ్మాయిని చూసాను. గీత చాలా సాఫ్ట్. నేను సాఫ్ట్‌వెయిర్. మధ్యలో హార్డ్ వెయర్స్ ఎందుకు?'

బాయ్ చెప్పి బయటకు వెళ్లిపోయాడు.

చీకటి పడి చాలాసేపయింది. వాన ఆగటంలేదు. ఎదురుగా ఉన్న ప్రదేశం జనంతో ముసురుకుంటోంది. కొద్దిగా చిరాకుగానే ఉంది. స్కూటరు వెనుక సీట్లో గొడుగు పట్టుకుని కూర్చున్న పెద్దాయన కూడా బస్‌స్టాప్‌లో ఒంటరిగా నిలుచున్న స్త్రీని చూడకుండా ఉండలేడు.

రెండు ఇడ్లీలు వడ్డించి సమయంకోసం నిరీక్షించింది ఓ ఉదయం.

'ఇల్లు మారితే ఎలా ఉంటుంది?'

'ఎందుకు?'

'ఈ కల్లు కాంపౌండు, ఈ వాతావరణం'

'మరో రెండు వడ్డించు, చాలు' చక్కగా టిఫిన్ చేసి లేచాడు ఆనంద్. బాగ్ తీసుకుని షూ తొడుక్కున్నాడు.

'నాకారు సెకండ్ హాండ్ ఇల్లుకూడా రీసేల్‌ది. ఇది మన సొంతం. భగవంతుడిచ్చిన శరీరం ఎంత సొంతమో ఇల్లు కూడా అంతే. దీన్ని అభిమానించాలి, ప్రేమించాలి. ఒ.కే?

సందేశం ఇచ్చి టకటకా దిగిపోయాడు. కారుదాకా తనూ నడిచింది.

'చూసారా?'

'ఎవర్ని?

'ఆ అంకుల్‌ని?'

'చూసాను. గొప్పగా ఒప్పో ఫోన్ వాడతాడు'

'అదికాదు. నేను దిగినపుడే రోజూ తనూ దిగి నేను ఇస్త్రీ బట్టలు తీసుకుని వెళ్లేవరకూ ఏదో మాట్లాడుతున్నట్లు నటించి నాతోపాటే పైకి ఎక్కుతాడు. ఇది బాగుందా?'

ఆనంద్ చిరునవ్వు నవ్వాడు.

'జటాయువులాంటి వాడు. నేను లేనప్పుడు ఓ కంట కనిపెడుతున్నాడు...', అంటూ కారు స్టార్ట్ చేసాడు.

జటాయువు ఫోన్‌లో మాట్లాడుతూ నవ్వుతున్నాడు కూడా. కారు కిటికీ తలుపు కొట్టింది. కొద్దిగా దించాడు.

'యస్?'

'ఈ వనవాసం కష్టంగా ఉంది'

'మన అపార్ట్‌మెంట్స్ పేరేంటి?'

'చిత్రకూట్ అపార్ట్‌మెంట్స్'

'గుడ్' అంటూ వెళ్లిపోయాడు..

వాన కురుస్తూనే ఉంది. ఆనంద్‌కి అన్నీ లైటే. ఆలోచనలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అప్పసంగా వచ్చినవి కొన్ని. అప్పుడాల్లా కాలిపోయేవి కొన్ని. వాన చినుకుల్లా జారిపోవు. ఇదే బాధ!

అనవసరంగా స్నేహితురాలింటికని వెళ్లింది. పెద్ద దూరం కాదని బస్సు ఎక్కేసింది. ఎదురుగా ఉన్న కల్లు కాంపౌండ్ దగ్గర సందడి పెరుగుతోంది. జనం బెంచీల మీద గుమిగూడుతున్నారు. ఎవరో చూసిన మొహం గొడుగు పట్టుకుని అందులోంచి ఇవతలకి వస్తోంది. రోడ్డు దాటి ఇటే వచ్చాడు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాకూడదు. పోనీ తడుసుకుంటూ వెళ్లిపోతే? దగ్గుతూ దర్శనం ఇస్తే ఆనంద్ అదోలా చూస్తాడు.

'ఎందుకీ వరుస వరుస స్నానాలు?', అంటాడు.

'అది కాదండీ..' అంటుంటే చెయ్యి అడ్డుపెడతాడు.

'ఏదైనా నువ్వు పవిత్రంగా మారాలనుకున్నప్పుడు నన్ను తలుచుకోవాలు,' అంటూ ఓ వెర్రినవ్వు నవ్వుతాడు.

ఈ వానతో ఇన్ని సమస్యలున్నాయి. కల్లు కాంపౌండ్‌లోంచి ఎవరో గొడుగు వేసుకుని రోడ్డుదాటి బస్‌స్టాప్ వైపే వస్తున్నాడు. కల్లు కాంపౌండ్ కోసం బస్‌స్టాప్ కట్టినప్పుడు పని పెట్టుకుని బస్సులో వచ్చి ఇక్కడ దిగి పని చూసుకుని మరలా బస్సెక్కటంలో తప్పేం లేదు. కానీ ఇదేదో తెలిసిన మొహంలాగుంది. అవును. చిత్రకూట్ అపార్ట్‌మెంట్స్‌లోని వాచ్‌మన్ సైదులు. అతను లోపలికి వచ్చి కొద్దిసేపు ఎగాదిగా చూసి గొడుగు మూసేసాడు. వయసులో బాగా పెద్దవాడు సైదులు.

'తగ్గే వాన కాదమ్మా', చెప్పేసాడు.

'ఏం చేస్తాం?'

'నే తీసుకువెళతాను రండి, గొడుగుంది మనకి. అలా అన్నమాట' 'వద్దులే'

'అదేవన్నమాటండి? మన అపార్ట్‌మెంట్లేకదా?'

'ఆగనీ'

'ఆ కాంపౌండ్లోంచి నేను తాగి రాలేదండీ. ఒకప్పుడు నేను గీత కార్మికుడినండీ!'

'అసలు నాకీ జాగానే నచ్చలేదు సైదులూ.'

'అదేంటండీ? గీతలోనూ పనేకదా సెయ్యమన్నారు? ఆల్లంతా కష్టపడతారు కొద్దిసేపు తాగేత్తారు. అంతకుమించి ఏటీ ఉండదండీ. అలా అన్నమాటండీ.'

'చాల్లే. మా మంచోళ్లే అందరూ. ఇస్త్రీ చేస్తుంది కదా? మీ ఆవిడనడుగు'

'ఏటడగాలండీ?'

'మా ఎదురింటాయన. నా వెనకాలే దిగిపోయి ఆ ఫోన్ పట్టుకుని డ్రామా ఆడుతూ ఉంటాడు'

'ఓ ఆయినా? మంచోరే. ఆయన బాస్ ఢిల్లీలో ఉంటాడు. కరెక్ట్‌గా అప్పుడే కాల్ చేసి ఏదో చెబుతాడు. సిగ్నల్స్ దొరక్క అలా కిందకొస్తాడన్నమాటండీ.'

ఇంతలో ఇంకొకరెవరో ఇవతలికొస్తున్నారు. అతను సూటిగా వచ్చి సైదులుని చూసాడు.

'గొడుగు సేతిలో అట్టుకుని ఈడెందుకున్నావురా? ఎల్లిపోక?' అడిగాడు.

గీత దూరంగా జరిగింది. అతను ఆమెను అదోలా చూసాడు.

'నన్ను గుర్తుపట్టలేదా తల్లీ?' అడిగాడు.

ఇదెక్కడిగోల? వీళ్లందరినీ గుర్తుపట్టి ఎవరెవరు కాంపౌండ్లోంచి వస్తారో అలా అందరినీ పలకరించేందుకు ఇక్కడ ఉన్నదా తను!?

'అదేమిటమ్మా! సిత్రకూట్‌లో ఏ రిపెయిరొచ్చినా నేనే! సారే డూటీ ఎక్కించారు నన్ను'

'ఓ!'

'ఇగో సైదులూ, ఆ గొడుగు జాగ్రత్తగా పట్టుకుని అమ్మగారిని ఇంటికి తీసికెళ్లు. ఏమ్మా? ఇంటికేనా?'

'అవును. వద్దులే. తగ్గిపోతుంది'

సైదులు గొడుగు విప్పి దగ్గరగా వచ్చాడు.

'రండి ఇలాగ. ఎల్లిపోదాం. నా కూతురు లాంటోరు. పదండి' ఆలోచిస్తూనే అతనితో ఇవతలకి వచ్చింది.

'రేయ్, మెల్లగా.. పైకి పట్టుకో గొడుగు', వెనుకనుండి వినిపిస్తోంది.

'అమ్మా, జాగ్రత్త..', చెబుతున్నాడు సైదులు, '...మనమంతా ఓ కుటుంబం. అపార్ట్‌మెంట్స్ మనవి. మా అమ్మాయీ వస్తుంది పండక్కి. వచ్చినప్పుడల్లా ఈ కాంపౌండ్లో ఏవేవో వంటకాలు పంచిపెడుతుంది.'

'ఎక్కడుంటుంది?'

'చందానగర్. అల్లుడు సదువుకున్నోడు. ఆల్లిలాగా, ఈల్లిలాగా అని సెబుతా ఉంటుంది. నేను నవ్వుతా ఉంటాను. పడ్డసోట ఎతుక్కోవాల?'

'ఏది వెతుక్కోవాలి?'

'నేనేటి సెప్పేది? గీత కార్మికుడిని. ఏదో తెలిసిన సామెత సెప్పాను'

'ఇక్కడికి రోజూ వస్తావా?'

'లేదు తల్లీ. డబ్బుల ఖాతాలుంటాయి మాకు. అదీ పనే. ఆళ్లు ఎవరి జోలికీ ఎల్లరండీ. ఆళ్ల ప్రపంచం ఆళ్లది. హాయిగా కొద్దిసేపు కూర్చుంటారు, మాట్లాడుకుంటారు, ఎల్లిపోతారు'

గేటు ముందరకి తోసాడు. లోపలికి వచ్చాక గొడుగు ప్రక్కన పెట్టాడు. లిఫ్ట్ బటన్నొక్కాడు.

'థాంక్యూ సైదులూ!'

'అయ్యో'

లిఫ్ట్ తలుపు తెరుచుకుంది.

'ఉంటానమ్మా. మా అయ్య సెప్పేటోడు. లోపాలే సూత్తే దేని లోపలికీ ఎల్లలేమురా అనేటోడు. ఎల్లండమ్మా'

తలుపు మూసుకుంది.

గీతకి ఏదో ఉపదేశం వినిపించినట్లుంది.

అపార్ట్‌మెంట్ తలుపు తెరచింది. ఎందుకో ఇల్లు కొద్దిగా కొత్తగా ఉంది.

## *ఇది కథ కాదు*

**కవిత ఏదో** కలవరంలో ఉన్నట్లుంది.

'రకరకాల ఆలోచనలొస్తున్నాయి' చెప్పింది.

'ఎందుకలాగ?'

'మనం కేవలం కాగితం పడవల్లాగా కలుసుకున్నామా? లేక నిజమైన అంతరంగం ఉన్నదా?'

'అంతరంగం అంటే?'

సూర్యాస్తమయం అవుతున్నప్పుడు కనిపించే కాంతి కొద్దిగా ఆమెను నుదుటి మీద మెరుస్తోంది. దానిని వద్దంటూనో లేక కొద్దిగా కురులను సద్దుకుంటోందో తెలియదు. ఈ సాయంత్రం కొద్దిగా ఎక్కువగా అందంగా ఉంది! నేనడిగిన ప్రశ్నకి కొద్దిసేపు ఆలోచించింది. ఈ మధ్య ఆడవాళ్ళు నాకు రెండు సందర్భాలలో పూర్తిగా అందంగా కనిపించటం జరుగుతోంది. ఒకటి ఏదైనా ఆలోచిస్తున్నప్పుడు, రెండు ఏదీ ఆలోచించే అవసరంలేనప్పుడు.

'వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తులకా లేక రెండు కుటుంబాలు కలిసినప్పుడా? ఈ ప్రశ్న బాగా ఆకట్టుకుంటోంది'

'కవిత కథతో కలసినా, కథ కవితతో కలసినా అనాదిగా ఉన్న ఆలోచనలతో, అక్షరాలతో, భావజాలంతో, ఒక కాగితాన్ని ఆధారం చేసుకుని ఓ సరికొత్త కలయికను ఏర్పరచి మనుగడ సాగించాలి. అవునా?'

'అవును. దారాలు తెంపేసుకున్న గాలిపటాలు ఆకాశంలో ఎగురుతూ ఎంతగా కలసిపోయినా ఎటుపోతాయో చెప్పటం కష్టం అనిపిస్తోంది.

'ఈ కాలంలో కొందరు పెద్దలు అనుభవిస్తున్నది నిన్ను కలత పెట్టినట్లుంది'

అలా నాలుగడుగులు ముందుకు వేసాం.

'ఏది పాత? ఏది క్రొత్త?...' చెప్పింది.

'ఏది పాత? ఏది క్రొత్త?

*తెగిన గాలిపటాల సంగమం*

*మనమెరుగని శూన్యంలో*

*నిలకడగల ఉనికి వాటికెక్కడ?*

*వేళ్ళూనిన వృక్షం చిగురుల వ్యాప్తి*

*హర్షదాయకం కదూ?*

*శూన్యం నుంచి రాలే వర్షబిందువు*

*ప్రవాహంలో కలసి*

*సింధువుగా మారిపోదూ!*

*కొన్ని కోట్ల జీవరాశులకి ఆధారంకాదూ!*

*ఎందరో నడచిన మార్గం అనర్గళంగా సాగలేదా?*

*కాలానుగుణంగా ఒకింత ఒరవడిని దిద్దుకుంటే సరిపోదా?*

*సృష్టికే గల కేంద్రబిందువులు సింధువులుగా మారవా?'*

ఎందుకో అలా నిలబడిపోయాను. ఆమె నన్ను చూసి నవ్వింది.

ఓ గువ్వల జంట దూరంగా ఎగురుతూ గూటికి చేరుకుంటోంది.

*ఇది కథ కాదు*

అదృష్టం బాగుండి ఓ లోవర్ బెర్త్ దొరికినప్పుడల్లా పై బెర్త్ దొరికిన ఓ గర్భవతి, వెంట ఓ ముదుసలి, ప్రక్కనే ఓ పర్వతవర్ధని సిద్ధంగా ఉంటారు నాకు. కొద్దిగా పైకి వెళతారా? అని అడుగుతారు. ఇది నాకు కొత్తకాదు. నేను ఎక్కడికెళ్లినా వందకోట్ల జనాభా నాకంటే ముందరే ఎందుకో నాకోసమే ఎదురు చూస్తున్నట్లుండి ఆ ప్రక్కన నిలబడమంటుంది. కానీ ఈసారి అలా జరగలేదు. కావటానికి ఎదురుగా ముసలి భార్యాభర్తలు కూర్చున్నప్పటికీ నన్ను ఆ మాట అడగలేదు. పాపం మొహమాటమేమోనని నేనే అన్నాను...

'మీకు పై బెర్త్ ఇచ్చారా అండీ?'

'అవునండీ' అన్నదామె.

'నేను తీసుకుంటాను. మీ వారిని ఇక్కడ పడుకోమనండి'

'వద్దండీ...' ఆవిడ చెప్పింది '...ఆయన పైన పడుకుంటారు' ఆశ్చర్యం వేసింది. చూస్తే ఎలా కుదురుతుందా అనుకున్నాను. అతనేమీ మాట్లాడటంలేదు. ఆ మొబైల్‌లో ఏ నంబరో విపరీతంగా కనెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నాడు.

'ఫోన్ ఎత్తటంలేదే' అన్నాడు.

నేను చేయగలిగిందేమీ లేదన్నట్లు ఆవిడ చేతులు కట్టుకుంది. ఆ మధ్య మా బాస్ ఒకాయన్ని కోపంగా అడిగాడు, 'ఏవయ్యా, నా కాల్ ఎందుకు ఆన్సర్ చెయ్యటంలేదు?'

'అది మీ కాల్ అని కాదు సార్, ఇది నా ఫోన్ అయినందుకు' అన్నాడు.

రైలు ముందుకు పోతోంది.

'ఏ ఊరు వెళ్లాలండీ?'

'వైజాగేనండీ', చెప్పింది ఆవిడ.

'విజయవాడలో ఒకళ్లని కలవాలండీ...' ఆయన అన్నాడు,

'...స్టేషన్‌కి వస్తానన్నారు'

'ఓ. అంత రాత్రిపూట? ముఖ్యమైన విషయం అయి ఉంటుంది మళ్లీ ఫోన్ తీసాడు. చెవి దగ్గర పెట్టుకున్నాడు.

'హలో.. ఆ..' మళ్లీ దిగాలుగా మొహం పెట్టాడు.

'సార్, కదులుతున్న రైల్లో కష్టమే...! ' చెప్పాను. 'ఏదైనా స్టేషన్‌లో చూడండి.'

'అదే చెయ్యాలి' అన్నాడు.

'అయినా అంత అర్ధరాత్రివేళ వచ్చి కలవాలంటే ఏదో వస్తువు ఇచ్చేయాలండీ?'

'ఆ... అలాగే అనుకోండి. ఇచ్చేయాలి గదండీ మరి?' ఇంతలోనే లేచి వాష్‌వైపు నడిచాడు.

'చూడండీ..' అన్నాను '...ఆయనకి నడవటానికే అంత ఇబ్బందిగా ఉంది. పైకి ఎక్కి పడుకోలేరండీ.. ఇబ్బంది పడతారు.'

ఆవిడ చిన్నగా నవ్వింది.

'మీరు మరోలా అనుకోకండి..' చెప్పింది, ...క్రింద బెర్త్ ఖాళీగా ఉన్నా అది తప్పదు'

నేనూ, నా ప్రక్కనున్న ఓ అమ్మాయీ ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నాం.

'వయసుమీద పడ్డా ఆయనకేదైనా పట్టుదల అనుకుంటాను' అన్నాను.

'పట్టుదలా? ఇంకే వన్నానా? నో! ఆయనది చాలా సున్నితమైన మనస్తత్వం.'

'ఛా'

'అవును'

'చిన్నప్పుడు రోడ్డు దాటాలన్నా చాలా భయం. స్కూలుకు వెళ్లనని మారాం చేస్తే వాళ్లమ్మ రోడ్డు దాటించి వెంటనే పరుగున ఇటు వచ్చేసేది. మళ్లీ రోడ్డు దాటలేక అటు స్కూలుకు వెళ్లేవారట. ఆయన భయాలే ఆయన విజయాలంటారు ఈ రోజుకీ'

ప్రక్కనున్న అమ్మాయి నవ్వటం మొదలు పెట్టింది.

'అయ్యో ఆంటీ! అంటే క్రింద పడిపోగలరనే భయాన్ని తోలేందుకు కావాలని పైకి ఎక్కుతారా?'

ఆవిడ పెద్దగా ప్రతిక్రియ చూపించలేదు. చిన్నగా నవ్వి అమ్మాయిని అదే పనిగా చూసింది.

'ఏమ్మా? నువ్వూ వైజాగేనా?'

'అవునాంటీ'

'ఏం చేస్తున్నావు?'

'ఇక్కడ జాబ్ చేస్తున్నాను'

'శలవలకి వెళుతున్నావా?'

'అవునాంటీ'

'అమ్మా నాన్నా అక్కడుంటారా?'

'నాకెవరూ లేరు.'

'సారీ'

'ఫరవాలేదు. నన్ను స్పాన్సర్ చేసిన వారింటికి వెళుతున్నాను.'

'స్పాన్సర్స్ అంటే?' ఈసారి నేనడిగాను.

'నా చదువుకయ్యే ఖర్చంతా వాళ్లు పెట్టుకున్నారు.'

ఇంతలో పెద్దాయనొచ్చాడు. మొబైల్ జాగ్రత్తగా సీటు మీద పెట్టాడు.

'డోర్ దగ్గరకూడా సిగ్నల్స్ లేవు. హలో అంటారు, కట్ అయిపోతుంది' కొద్దిసేపట్లో వరంగల్ రానే వచ్చింది. అమ్మాయి లేచింది.

'అంకుల్, నాతో రండి. ప్లాట్‌ఫార్మ్ మీద నిలబడి మాట్లాడుదాం. నేనూ మాట్లాడాలి.'

ఇద్దరూ జాగ్రత్తగా క్రిందకి దిగారు. మేమిద్దరం కిటికీలోంచి చూస్తున్నాం. ఎ.సి కోచ్‌లోని గ్లాసువల్ల ఏమీ వినపడకపోయినా ఇద్దరూ అవతలి ప్రక్కవాళ్లతో బాగానే కనెక్ట్ అయినట్లున్నారు. అటూ ఇటూ చూసి లోపలికొచ్చి కూర్చున్నారు.

'మనింటికి ఖచ్చితంగా వచ్చి అమ్మాయిని చూస్తానన్నారే! మన ఫామిలీ అంటే బాగా నచ్చేసిందిట వాళ్లకి!' అని ఎంతో గబగబా చెబుతూ కూర్చున్నాడాయన.

'అవునా?'

'మరి? విజయవాడ స్టేషన్‌లో లేటయినా ఫరవాలేదు, వచ్చి కలుస్తానన్నారు'

'చిత్రంగా ఉందే!' అంది అమ్మాయి.

'ఏంటమ్మా చిత్రం?'

'ఏం లేదంకుల్. నేనూ పెళ్లి చూపుల గురించే మాట్లాడాను'

'ఛా' ఇది నేనన్నాను.

'అవును. నాకు తెలిసిన అబ్బాయి వాళ్లు నేను వెళుతున్న ఇంటికే వచ్చి చూస్తామన్నారు'

'ఎవరిని?', పెద్దాయన అడిగాడు. ఆవిడ గిల్లింది.

'ఇంకెవరిని?'

'ఓ' అని నవ్వాడు పెద్దాయన.

అలజడయి లేచాను. అమ్మాయి పైకి ఎక్కి పడుకున్నట్లుంది. పెద్దావిడ కిటికిలోంచి చూస్తోంది. విజయవాడ స్టేషన్ అది. పెద్దాయన మొబైల్ పట్టుకుని వాళ్లకోసం చూస్తున్నట్లున్నాడు. కానీ ఎవరూ రానట్టుంది. ఇంక లాభం లేదనుకుని రైల్లోకి వచ్చేసాడు. బండి కదిలింది.

'రాలేకపోయినట్లున్నారు' అన్నాడు.

'ఫరవాలేదు ఇంక పడుకోండి. కావలిస్తే తిరిగొచ్చేటప్పుడు కలుసుకోవచ్చు' అన్నదావిడ.

'కరెక్ట్. మళ్లీ ఇలాగే వెళ్లాలిగా?'

మెల్లగా పైకి ఎక్కాడు పెద్దాయన. ఇద్దరం సాయం పట్టాం.

ఆవిడ జాగ్రత్తగా దుప్పటీ కప్పి ప్రక్కనే మంచినీళ్ల బాటిల్ పెట్టి కూర్చుంది.

'మీరూ పడుకోండి' అన్నాను.

'అంతేకదా!' అంది. ఆయన కొద్దిసేపట్లోనే గురకపెట్టేసాడు.

'నిద్రపట్టింది' అన్నాను.

'ఏవిటో ఆయన ముచ్చట...' చెప్పింది, '....సంబంధం లేదూ, పాడూ లేదు. అన్నీ చక్కగా సినిమాల్లో చూపించేటట్లు చేద్దామనుకున్నాం పాపం. మా అమ్మాయి ఒక్కటీ పడనీయలేదు. కోరుకున్న వాడిని చేసుకుని అమెరికాలో స్థిరపడిపోయింది...'

'మరి ఈ ఫోన్లూ అన్నీ'

'ఏం లేవండీ. ఆ షాక్ నుండి తేరుకోలేదంతే!'

ఒక్కసారి పైకి చూసాను. పెరిగిన గెడ్డం మధ్యలోంచి చిగురుటాశలా చిన్నగా తెరచిన నోరు ఎందుకో చిన్నగా నవ్వుతున్నట్లుంది. ఉన్నదానితోకాకుండా అనుకున్న దానితో అతుక్కోమంటోంది బ్రతుకు.

ఈవిడ బెడ్ సద్దుకుంది. చిన్న లైట్ కూడా తీసేసింది.

'మీరనుకున్నారు కదా! పెద్దాయన పైకెక్కటం ఎందుకని? '

'ఏం లేదండీ. నేను పడుకున్నప్పుడు ఎక్కడికైనా లేచి వెళ్లకుండా నేను చేసిన ఏర్పాటు. మెలుకువ వచ్చినా అలా ఎట్టి పరిస్థితిలో క్రిందకి దిగరు. ఆయనకి చాలా భయం. పడుకోండి, గుడ్నైట్'

'గుడ్నైట్' అన్నాను కానీ నిద్రపడుతుందనే ఆశలేదు. బయటకి చూస్తూ కూర్చున్నాను. అంతా చీకటే

ఎందుకో ఇంత చిమ్మ చీకటిలో కూడా అందరినీ రమ్మంటూ ఓ లైట్ వేసుకుని అలా సాగిపోతోందీ బండి.

## ప్రవాహం

**ఇద్దరం** ఒక సెల్ఫీ దిగాం. ఫొటోలో కవిత నాకంటే ఎక్కువ సంతోషంగా కనిపించింది.

'ఎందుకు నవ్వటం లేదు?' అడిగింది.

'ఫొటో సరిగ్గా రావలని ఓ లోచన వలన అలా బిగుసుకుని ఉంటాను.'

'ఇద్దరం పెళ్లయినవాళ్లల్లా ఉన్నామా? లేక అలా ఉండాలని అనుకుంటున్నవాళ్లలా ఉన్నామా?'

ఓ నవ్వు నవ్వి అక్కడున్న ఓ బెంచీమీద కూర్చున్నాను.

'విశ్లేషణలన్నింటినీ పేస్తేగానీ ఓ చక్కని వివాహం జరగదు'

'ఛా' అంది కవిత

'ఇదేంటి నాలాగా మాట్లాడుతున్నావు?'

'రంగులు మారతాయి కదా?'

ఇద్దరం నవ్వుకున్నాం. ప్రక్కన కూర్చుని మరోసారి సెల్ఫీ చూసింది.

'ఆడవాళ్లకి మంగళసూత్రం పెళ్లి అయినట్లు చెబుతుంది. మగవాళ్లకి ఏంటి?'

'ఇంకా సూత్రధారణ అవలేదుకదా?ఊహిస్తున్నావా?'

'ఊ.. ఇంతకీ పెళ్లయిన మగవాళ్లకి ఓ డ్రెస్ కోడ్ ఏంటి?'

'చొక్కాకి ఓ గుండీ ఊడిపోయి ఉంటుంది'

విరగబడి నవ్వింది.

'రెండు బొత్తాలు ఊడితే?'

'పిల్లాడో పిల్లో పుట్టినట్లు అర్థం' ఇద్దరం నవ్వుకున్నాం.

'ఒక చక్కని బంధానికి పెళ్లి అవసరమా?' అడిగాను. సీరియస్ అయి తల వంచుకుంది.

ఎందరో అమ్మాయిలూ, అబ్బాయిలూ ఈ రోజు తల్లిదండ్రులను అడుగుతున్న వింతప్రశ్న అది. నేను కవితను కావాలని అడిగాను.

తలపైకెత్తి చిరునవ్వు నవ్వింది.

*'చినుకులు వచ్చీ వచ్చి శరన్మేఘాలలో తేలిపోయాయి*
*కాలచక్రం తన పంధాలో పరుగులు తీస్తూనే వుంది.*
*దేనినీ కాదనలేము*
*తనలో సంగమించమన్న సాగర హ్వానాన్ని*
*నది ఎన్నడూ తిరస్కరించలేదు*
*ప్రకృతి నిర్దేశించిన గతిలోనే సృష్టి సాధ్యం*
*గూడు నిక్షిప్తంగా వుంది ప్రతివారికి*
*వెతుక్కుంటూ వెళ్లటమే జీవనం*
*అనంత సాగరం కూడా భూమినే గూడు చేసుకుంది*
*అనంతమైన లోచనలకు గూడు మన మనస్సుకాదా?*
*అందుకే*
*గూటిలోనే నిగూఢమైనది ఏదైన సాధ్యం.*
*కోట్లతో కోటలెందుకు*
*ఒక్క తాళితో ఒక్క గూడుకట్టు.'*

'కవిత బాగుంది. ఏంటి ఇప్పుడు కథ వ్రాయాలా?'

'మరి? ఏదో ఇల్లు కట్టమన్నట్లు భయపడితే ఎలా మాష్టారూ?'

## నది

**ఈ గెస్ట్ హౌస్** ఎవరు కట్టించారో కానీ ఎంతో కళాత్మకంగా కట్టారు. ఉదయమే బ్రేక్‌ఫాస్ట్ చెయ్యటానికి అలా లాబీలోకి వెళ్ళగానే బాల్కనీ రెయిలింగ్ మీదినుంచి దూరంగా అందమైన జలపాతం కనిపిస్తూ ఉంటుంది. రోజూ అలా దానినే చూస్తూ కాఫీ తాగేవాడిని. కరెక్ట్‌గా అదే టైంకి ఓ పెద్దాయన ఒక యుక్తవయసున్న అమ్మాయితో యన కూతురు కావచ్చు, అక్కడికి వచ్చి కూర్చుంటాడు.

'నాకు నిజం చెప్పు డాడీ..'

యన అటూ ఇటూ చూసాడు.

'నీతో అబద్ధం ఎందుకు చెబుతాను హారికా?'

'నో. అంతా అబద్ధమే. అసలు పెళ్లి అనేదే ఒక అర్ధంలేని వ్యవస్థ.'

'ఇది.. నో హారికా, లోచించు. సమాజాన్ని ముందుకు తీసుకుని వెళ్లే ఒక చక్కని ప్రక్రియ. నేనెక్కడి నుంచి వచ్చాను, నువ్వెక్కడినుండి వచ్చావు? ఒక్కసారి లోచించు.'

అమ్మాయి చెయ్యి అడ్డం పెట్టింది.

'చూడూ, అందరం ఎక్కడో ఓ చోటునుండి రావలసిందే అదెందుకు? దాని గురించి చర్చ ఎందుకు?'

'హారికా, నన్ను విసిగిస్తున్నావు. చిన్నప్పటినుండీ అన్నిటినీ నువ్వు ప్రశ్నిస్తూ వస్తుంటే నేనే నిన్ను ముందుకు తోసాను. అప్పుడు అది ముచ్చటగా అనిపించేది.'

'ఇప్పుడేమైంది?'

యన నాకు దగ్గరగా వచ్చి కాఫీ కప్పు నింపుకుని ఓ చిరునవ్వు నవ్వాడు. నేను రెయిలింగ్‌కు నుకుని కాఫీ తాగుతున్నాను. యన మరల అమ్మాయి వైపు వెళ్లాడు. ఈసారి ఓ కుర్చీ లాక్కున్నాడు.

'అబ్బాయి మంచివాడు హారికా. మంచి ఫామిలీ'

అమ్మాయి అటూ ఇటూ చూసింది.  చివార్న ఓ పెద్దాయన ఓ కెమెరాతో ఎప్పటినుంచో వీడియో తీస్తున్నాడు.

'అదుగో.. యనా చాలా మంచివాడు. కాదని చెప్పమను. అసలు మంచీ చెడూ ఏముంది? అంతా అవసరాన్ని బట్టే.  రోజుల్లో పెళ్లి అనేది ఓ మంచి అవసరం. దట్సాల్'

'ఇంతకీ ఏం చేస్తానంటావు?'

అమ్మాయి చేతులు కట్టుకుంది.

'ఏం చెయ్యాలి నేను?'

యనెందుకో నన్ను చూసాడు. ఇబ్బంది పడుతున్నాడేమో అనుకుని కొద్దిగా దూరంగా జరిగాను.

'అయ్యో, నో ప్రాబ్లమ్. మీరెందుకు జరుగుతారు? లోపల మాట్లాడుకుందాం అంటే వద్దు, పచ్చిగాలి పీలుస్తూ పిచ్చిపిచ్చిగా మాట్లాడుకుందాం అంటుంది... ఓపెన్ హార్ట్!'

అమ్మాయి చక్కగా నవ్వుతోంది.

'చెప్పు డాడీ, ఏం చెయ్యమంటావు నన్ను? చదువుకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను, రెండుసార్లు అమెరికా వెళ్లొచ్చాను, ఒక ఫ్లాట్ ఉంది, రెండు సైట్స్ ఉన్నాయి, ఒక అనాధాశ్రమానికి డొనేషన్ ఉంది, మీకేం కావాలన్నా నేనున్నాను. కాకపోతే మీరు చిన్నప్పుడు నేను జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ తెచ్చుకోవాలనుకుంటే సారీ.. ఇప్పుడు నా వల్లకాదు..'

కెమెరా మనిషి ఈసారి దగ్గరగా వచ్చి చక్కగా మరోకోణంలో చిత్రీకరిస్తున్నాడు.

పెద్దాయన గెడ్డం గోక్కున్నాడు.

'తల్లీ.. జిమ్నాస్టిక్స్ ఎందుకు? మనం పెళ్లి గురించి మాట్లాడుకుంటున్నాం'

అమ్మాయి ఎందుకో చిన్నగా తనలో తాను చప్పట్లు కొట్టుకుంది.

'రెండూ ఒకటే'

'ఇది టూ మచ్'

'మరి? చక్కగా, స్వతంత్రంగా, హాయిగా బ్రతుకుతున్న వాళ్లు మరొకరి స్వాతంత్ర్యంలోకి దూసుకుపోయి కిందామీదా పడి, లాక్కుని, పీక్కుని, శరీరంతో, మనసుతో ఇబ్బందులు పడుతూ చేసే జిమ్నాస్టిక్స్.. పెళ్లికాదా?'

'స్వాతంత్ర్యం అంటే ఏంటి?'

అమ్మాయి అటూ ఇటూ చూసింది. నన్ను కొద్దిసేపు చూసింది.

'అదుగో  అంకుల్‌ని చూడు.  కాఫీ కప్పును స్టైల్‌గా పట్టుకుని రెయిలింగ్ మీద కూర్చున్నారు. ఇక్కడ ంటీ ఉంటే వెంటనే అయ్యో దిగిపోండి. అలా ఎందుకు? ఇలా కూర్చోండి అంటూ కుర్చీ చూపిస్తుంది. అవునా?'

వెంటనే దిగిపోయాను. అందరం నవ్వుకున్నాం. లాభం లేదనుకుని యన ప్రక్కన కూర్చున్నాను.

'ఏమీ అనుకోకండి..' అన్నాడాయన '... ఈ అమ్మాయి బాగుపడదు'

'బాగా చెడిపోయింది' అమ్మాయి చక్కగా చెప్పింది. రెండు చేతులూ అమెరికన్ పద్ధతిలో చేతిలో చాట పట్టుకున్నట్లు ముందుకు పెట్టింది.

'సో?', అడిగింది.

'నువ్వో కప్పూ, నాకో కప్పూ తెచ్చి ఇక్కడ కూర్చో', అన్నాడు పెద్దాయన.

ఇంతలోనే మరో సౌందర్యారాధకుడు ఓ గుడ్డ సంచీతో మాసిన గెడ్డాన్ని గోక్కుంటూ గది తలుపు మూసేసి ఇటే వచ్చాట. నా ప్రక్కనే కూర్చున్నాడు.

సంచీలోంచి ఓ డైరీ రాసాడు.

'చెప్పాలనుంది' అన్నాడు.

'ఏంటండీ?' బేలగా అడిగాను. నువ్వు బాగుపడవు అన్నట్లు నన్ను చూస్తూ తల డించాడు.

'అది నా కవితపేరు'

'ఛా'

'అవును. చెప్పాలనుంది... కానీ చెప్పలేను' అన్నాడు.

'వద్దు' అన్నాడు ఈ అమ్మాయి తండ్రి. ముక్కుమీద వేలు పెట్టాడు.

'నో. చెప్పలేను అన్నవాడిని వద్దు అనకూడదు, చెప్పమనాలి'

'కరెక్ట్. చెప్పండి' అన్నాను.

'అమ్మ కాఫీ వేరు, మా విడ కాఫీ వేరు. రెండూ కమ్మనైనవే. చెప్పలేను'

'ఓ'

'అమ్మగురించి లోచన చెయ్యను. మా విడ లోచించనీయదా. ఎందుకో చెప్పలేను'

'శభాష్'

ఇంతలో అమ్మాయి రెండు కప్పులు కాఫీ తెచ్చింది. కవి ఓ చిన్న గ్రీటింగ్ కార్డు ఇవతలకి తీసాడు.

'ఎలా ఉంది?' అడిగాడు.

'పెయింటింగ్ బాగుంది' అమ్మాయి చెప్పింది.

చిత్రం చివర ఉన్న నీలం రంగు బార్డర్‌ను నిమిరాడు. 'ఇదిలేకపోతే ఎలా ఉంటుంది?'

'అసలు ఏమీ బాగుండదు. అర్ధమేకాదు' చెప్పింది.

'ఎందుకో చెప్పలేను. నేను గీసిన ప్రతిబొమ్మకీ విడ బార్డర్ ఎందుకు గీసేదో'

'...'

'అంత అందం గీతలో ఎలా దాచేదో, చెప్పలేను'

అమ్మాయి తండ్రి కాఫీ సేవిస్తూ లోచించాడు.

'ఒక బార్డర్ లోపల బొమ్మ గీయటం గొప్పా లేక బొమ్మకు బార్డర్ ఇవ్వటం గొప్పా?'

‘చెప్పలేను. అదే చెబుతున్నా. గొంతు బాగున్నప్పుడు అందరికీ పాడి వినిపిస్తాం. క్షీణించినప్పుడు లోలోపల పాడుకుంటాం. అదీ త్మానందమే! బొమ్మ గీతలోపలికి వెళ్లిపోయింది కదా?‘

అప్పటివరకూ కెమెరా పట్టుకుని ప్రకృతి సౌందర్యాన్ని చిత్రీకరిస్తున్న వ్యక్తి దగ్గిరగా వచ్చాడు. కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. గబగబా కెమెరాని అటూ ఇటూ కెలికాడు. ఒక వీడియో క్లిప్పింగ్ ప్లే చేసాడు. అమ్మాయితో సహా అందరం దాని వైపు దృష్టి మళ్లించాం. జలపాతాల హోరు ముందర ఈ సంచీతో ఉన్న వ్యక్తి మాటలన్నీ ఏదో ప్రబోధంలా వినిపిస్తున్నాయి.

కెమెరా ప్రక్కన పెట్టాడు. ఓ సిగరెట్ తీసి ముట్టించాడు.

‘ఎలా ఉంది?‘

‘అదిరింది‘ అందరం అన్నాం.

‘అలా మీ ముందర పారుతున్న జలపాతం బాగుందా? ఈ బార్డర్‌లో బాగుందా?‘

ఎందుకో తెలియదు, ఇద్దరూ ముగ్గురు చప్పట్లు కొట్టారు.

‘ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఎక్కడ లోతుంటే అక్కడికి జారిపోతూ వెళ్లిపోయిన నదిలా ఉండేవాడిని. ఇద్దరం ఇక్కడే కలుసుకున్నాం. కాలం జాలువారుతున్న జలపాతంలా తోచింది. విచ్చలవిడిగా బ్రతుకుతున్న నాకు ఓ బార్డర్ దొరికింది. నా క్రియాశీలత యావత్తు ఒక చోట కేంద్రీకృతమైంది. ఈ వయసులో మరొక్కసారి ఈ జలపాతం ఇక్కడికి వచ్చాను. అటు చూడండి. పైన రెండు నదులు కలసి ఇలా ఒక్కసారిగా ఇక్కడ జలపాతంలా జారుతాయి... నిత్యోత్సవం, నిత్య యౌవనం‘

‘మీ భార్య మీతో రాలేదా?‘ అడిగాను.

‘లేదు‘

‘చూసారా...‘ వెంటనే అమ్మాయి లేచి నిలబడింది,

‘మగవాళ్లందరూ ఇంతే.‘

‘కాదు...‘ చెప్పాడతను, ‘...మెయే నన్ను ఇక్కడికి పంపింది.‘

‘ఎందుకు?‘ ముక్త కంఠంతో అందరం అడిగాం.

‘ఏంలేదు..! కొద్దిగా గంభీరంగా చెప్పాడు. ‘...మె ఇప్పుడు బెడ్‌లో ఉంది. నేను ఒంటరినైనప్పుడు తిండికి బాధపడకూడదని నేనెలాంటివి తింటానో అలాంటివి ఎలా వండాలో నేర్పింది. మెకోసం ఈ మధ్యనే వీణ నేర్చుకుని మంచం దగ్గిర కూర్చుని వినిపించటం అలవాటైంది. తనే వాయిస్తున్నట్లు నందించేది.‘

‘ఇక్కడేదైనా మందుకోసం వచ్చారా?‘ అడిగాను.

‘లేదండీ..‘ అంటూ కెమెరా న్ చేసాడు,

‘...ఈ జలపాతం ఇప్పుడెలా ఉందో చూడాలని అతి కష్టం మీద సైగలు చేసి చెప్పింది.‘

అందరం కుర్చీల్లో వెనక్కి వాలిపోయాం. జలపాతం శబ్దం అలా ఏదో తెలియని భాషలో బాగా తెలిసిన వాళ్లతో మాట్లాడుతున్నట్లు తోచింది.

యన లేచాడు. సంచీతో ఉన్నాయన. చేతులు కలిపాడు.

‘సార్, మీకు తెలియకుండా మిమ్మల్ని జలపాతం ముందు నిలబెట్టి మీ మాటలు వీడియో తీసాను. సారీ. నా భార్యకు నచ్చుతుందనుకున్నాను‘

'భలేవారే! నో ప్రాబ్లమ్' - అన్నాడాయన.

యన శలవు తీసుకుని వెళ్లిపోయాడు.

'చెప్పలేను..', ఈయన మెల్లగా అన్నాడు. '...అస్సలు చెప్పలేను. ఒక గూడు కట్టుకోవటంలో ఎంత గూఢమున్నదో ఎందుకో చెప్పలేను' ఓ కొమ్మమీది నుండి రెండు పిట్టలు కలసి ఇటే చూస్తున్నట్లున్నాయి.

*నిలువుటద్దం*

**కవిత వాళ్ల ఇంటికి** పెళ్లి చూపులకని వెళ్లాల్సివస్తుందని ఎన్నడూ అనుకోలేదు. రోజూ కలుసుకునే అమ్మాయిని ఇలా ఒక సందర్భం అనే అంచుతో రెండు కుటుంబాలు కలవాలనే అల్లికతో ఓ ప్రత్యేకమైన చీరె సింగారించుకుని వచ్చినప్పుడు ఎలా చూడాలో అర్థం కాలేదు.

కవిత ఇప్పుడు ఓ కథగా మారిపోయిందనీ, కథ కవిత్వాన్ని తప్ప దేనినీ కోరుకోవటం లేదనీ మా ఇంట్లోనూ తెలియదు, వాళ్ల ఇంట్లోనూ తెలియదు.

'ఇలా ఇటునుండీ రావచ్చు, అలా అటునుండీ రావచ్చు మా ఇంటికి హ హ' అన్నాడు కవిత తండ్రి. కాకపోతే బూజు దులిపే కర్ర అలా హాల్లోనే ఎందుకుంచారో నాకు బోధపడలేదు. బహుశః బూజు దులిపిన తరువాత అక్కడే మరచిపోయినట్లున్నారు.

'అది వాస్తుకోసం అలా ఉంచేసిన ప్రత్యేకమైన కర్ర హ హ' అన్నాడు.

'ఇల్లు బాగుంది', మా వాళ్లు జనగణమన ముక్తకంఠంతో పాడినట్లు చక్కగా చెప్పారు.

'హ హ'

కవిత లోపలినుంచి వచ్చింది. ఆమె తల్లి ప్రక్కగా నిలబడి నిన్ను చూడకూడదన్నట్లు అందరినీ చూసేసి చిన్నగా తలవంచుకుంది. ఎక్కడో పన్నీరు చల్లితే ఓ రెండు చుక్కలు ఇటు గాలికి పయనించి మీద వాలాయా అనిపించింది.

'మా అమ్మాయి కవిత హ హ. రామ్మా, కూర్చో'

'వీడు మా వాడు. పిచ్చి వ్రాతలు వ్రాస్తూ ఉంటాడు' నాన్న పలికారు.

'హ హ'

'ఏమ్మా? మీ నాన్నగారు నువ్వు కవితలు వ్రాస్తావని చెప్పారు. ఏదీ ఓ చక్కని కవిత చెబితే వినాలనుంది'

ఎక్కడినుండో కవిత చెల్లెలు ప్రత్యక్షమైంది. ఈమె మెరుపయితే ఆమె ఉరుములా ఉంది. కవిత కూర్చున్న సోఫా వెనకే వచ్చి చేతులు కట్టుకుంది.

'మా అక్కయ్య కవిత చెబితే మరి సార్ కవితకి తగ్గ కథ చెప్పగలరా?'

'ఇవి పెళ్లిచూపులు' అన్నాను.

'హ హ'

'కథలు చెబితే బాగుండదు.'

'కవితలు చెప్పవచ్చా?'

'హ హ'

'రియాలిటీ షో కదా ఇది?'

'అదంతా కుదరదు. చెప్పు అక్కా!'

రెండు కుటుంబాల మధ్యా ఈ మధ్యనే ఓ మధ్యవర్తి తయారయ్యాడు.

'కవితను చూడటానికి కాదు, వినటానికి వచ్చినట్లుంది' అన్నాడు.

'హ హ'

'కవిత వినకపోతే ఏదీ చూసినట్లుండదు' అన్నాను.

మొదటిసారి కవిత నన్ను ఓ చూపు చూసింది.

'కవితకీ, కథకీ పెళ్లిచూపులెలాగో నాకు తెలియటంలేదు హ హ' అన్నాడాయన.

'అమ్మాయి పాట పాడితే బాగుంటుంది' అన్నాడు మధ్యవర్తి.

'అబ్బాయి కవితే కోరాడు' పట్టు పట్టారు ఇక్కడి వాళ్లు.

'కానీ చివరకు కథ చెప్పాలి' కవిత చెల్లెలు చెప్పింది.

ఈ మరదలు పిల్ల బలే ముద్దుగా ఉంది. దగ్గరకి పిలిచి తల నిమిరాను. 'నీ అక్కయ్య కవిత చెప్పగానే నీ చెలిలో కథ చెబుతాను' అన్నాను.

'కుదరదు. అందరూ వినాలి'

'అలాగే. ముందు కవిత ఏదీ?'

కవిత గొంతు సవరించింది. అందరం అటు చూసాం.

'ఇది సమాగమం..'

'కవిత టైటిల్ అనుకోమా హ హ' అడిగాడు వాళ్ల నాన్న.

'అవునా
  సమాగమం
    నీ దర్శనం'

'వావా'

'శభాష్'

'చాలా బాగుంది'

'***నీ దర్శనం***
***ఎప్పుడూ హర్షాతిరేకమే***
***నా ముందర నేనే నిలుచున్నట్లు***
***కుడి ఎడమైతేనేం***
***చెదరని చిరునవ్వు నీదైనది ఆహ్వానిస్తుంది***

*గడచిన ఏండ్లలో మనం చాలా దగ్గరైపోయినట్లు*
*దూరం కొలవటానికి మాత్రమే వున్నట్లు*
*కలల్లో సంగమాలు, సమావేశాలు నిజాలైనట్లు*
*ఇలా ఎన్నో..*
*'ఇలా ఎన్నో...?*
*'ఇలా ఎన్నో..*
*నీ చిరునవ్వుకి ప్రతిచర్యలు నాలో*
*మొత్తం మీద*
*నీ ముందు నిలబడితే*
*నిలువుటద్దం ముందు నిలబడినట్లే అనిపిస్తుంది!'*

అందరూ చిన్నగా చప్పట్లు కొట్టి నావైపు చూసారు.

అనుభూతి చిత్రంగా ఉంది. పెళ్లిచూపుల తంతేనా ఇది? కాలప్రవాహాన్ని అరచెంబులో అరనిముషంలా మార్చి అహర్నిశలు ఊహలోనే పట్టువదలని ఆలోచనతో ప్రాణవాయువును పీలుస్తున్న చిరు రసహృదయాన్ని సరి చేసుకుని ఒక్కసారి కిటికీ అవతలకి చూసాను.

'బాలు మీ కోర్టులో ఉంది. హ హ'

ఈయన హడావుడి చూస్తుంటే నా తలమీద తలంబ్రాలు ఈయనే పోసేటట్లున్నాడు. రెండు స్వరాలు పలికి బాలమురళీగారు మృదంగ విద్వాన్‌ను చూసి ఓ నవ్వు నవ్వినట్లు మధ్యవర్తిని చూసి ఎందుకో నవ్వాను. అయిన ఏ భావమూ వ్యక్తపరచలేదు. ఏ మధ్యవర్తికైనా సహజంగా ఉండవలసిన ధర్మం అది.

'ఈ రోజు అసలు ఉదయం నుంచీ ఏమిటో అస్సలు బాలేదు' అన్నాను చిన్నపిల్ల ఊరుకోలేదు.

'అదేం కుదరదు. చెప్పకపోతే ఓడిపోయినట్లే' చెయ్యి అడ్డుపెట్టాను.

'నేను కథ చెప్పటం మొదలు పెట్టేసాను. అది కథలో భాగమే!'

'ఓహో...చెప్పండి!'

'అనగా అనగా అనగా..'

'నాకు పిచ్చిపిచ్చిగా ఉంటోంది డాక్టర్'

'ఎందుకలాగ?'

'నేను అడక్కుండా ప్రతిరాత్రి ఇన్ని కలలు ఎందుకొస్తాయో తెలియటంలేదు'

'అంటే చక్కగా నిద్రపోతున్నారన్నమాట. ఇంకేంటి సమస్య?'

'అయ్యా, ఇది నిద్రలాగానే లేదు. దైనందిన జీవితంలో ఎంతమందితో మాట్లాడుతున్నానో, అందరూ తిరిగి నిద్రలో కలల్లోకి వచ్చి మరల మాట్లాడుతున్నారు. ఇది నిద్ర ఎందుకవుతుంది?'

వారి గురించి ఆలోచిస్తే వాళ్లు అలాగే కలల్లోకి వచ్చేస్తారు. ఆలోచించండి'

ఒక్కోసారి డాక్టర్లు లాయర్లలాగా మాట్లాడుతూ ఉంటారు.

'సార్, నేను ఎవరిగురించీ ఆలోచించను.'

'ఆఫీసులో బాగా శ్రమకు, ఒత్తిడికీ గురవుతున్నట్లున్నారు'

'ఆఫీసులో చాలా హాయిగా ఉంటుంది'

'ఇంట్లో సమస్యలున్నాయా?'

'ఒంటరివాడికి సమస్య ఏముంటుంది?'

డాక్టర్ గట్టిగా గాలి పీల్చి కళ్లు మూసుకున్నాడు. ఈ కలలు అతనికి ఎందుకు రావని ఆలోచిస్తున్నట్లున్నాడు. యోగిలా కళ్లు తెరిచాడు.

'అదే సమస్య..' పరమ గురువులా సెలవిచ్చాడు '...అదీ సంగతి. ఒంటరితనం బాధిస్తోంది. పెళ్లి చేసేసుకోండి'

లేచి నిలబడ్డాను.

'సార్. మరో రోజు దర్శనం చేసుకుంటాను. ఇలా ఇస్త్రీ చేసేవాడు, కూరగాయలు అమ్మేవాడు, మంచం మీద కూర్చునే భోజనం చేసే పక్కింటాయన, ఇలా వీళ్లందరూ కలలో కొచ్చే బదులు, ఓ చక్కని ఆడపిల్ల రావచ్చుకదా?'

'మీరు రోజూ చూసే వారు కలల్లోకి వస్తున్నారు. చక్కని అమ్మాయిని చూడండి. వస్తుందేమో కలలోకి!'

ఆఫీసులో ఆఫీసరు గదిలోకి వెళ్లాను. ఆయన్ని చూడగానే విచిత్రమైన కల గుర్తుకొచ్చింది. ఫైలు ముందుకు తోసి నవ్వాను. ఆయన చిరాకుగా మొహం పెట్టాడు.

'చెప్పూ, నిన్న రాత్రి ఎలా కనిపించాను కలలో?'

'వద్దండి. నేను కావాలని అలా కలలు కనటం లేదు'

'అని నేనూ అనను. ఎందుకో వినాలనుంది. చెప్పు'

'ఏమీ అనుకోకండి సార్'

'ఏం లేదు సార్. మీరు కట్ బనియన్‌లో ఈ టేబుల్ మీద నిలబడి వ్యాయామం చేస్తున్నట్లు కనిపించారు'

ఆయన ఫైల్ మూసేసాడు.

'నిజమే చెబుతున్నావా? అనవసరమైన కల్పనలు చేస్తున్నావా?' నేను లేచాను.

'గంట.. కరెక్ట్‌గా గంట తరువాత పిలుస్తాను'

ఇవతలకి వచ్చి నా టేబుల్ దగ్గిర కూర్చున్నాను. ఆయన గదిలోకి వెళ్లి ఏదో మాట్లాడి ఇవతలకి వచ్చిన మేడమ్ నన్ను అదోలా చూసుకుంటూ వెళ్లింది. ఎందుకో ఆగి నా దగ్గరకొచ్చింది.

'నేనూ వచ్చానా?' అడిగింది.

'ఎక్కడికి?'

'ఎక్కడికేంటి? నీ కలలోకి'

'అందరూ వస్తారు'

'చెప్పు. నేనెలా కనిపించాను?'

'క్రికెట్ బాల్ పట్టుకుని బౌలింగ్ చేయబోయి అంపైర్ కాలు తగిలి క్రింద పడిపోయారు మేడమ్!'

టీ తెచ్చిపెడుతున్న వాడు విరగబడి నవ్వాడు. ఆవిడ మూతి విరిచి వెళ్లిపోయింది.

మిత్రుడు సుందరం టీ తీసుకుని వచ్చి దగ్గరగా కూర్చున్నాడు.

'రోజు రోజుకీ నీ సమస్య పెద్దదవుతోంది...' చెప్పాడు '...ఏదైనా పరిష్కారం ఆలోచించావా?'

'ఏమో అర్థం కావటంలేదు. నేను పెద్ద పుస్తకాల పురుగునూ కాను. ఇలా అందరూ పాత్రలై కూర్చుంటున్నారెందుకు?'

సుందరం టీ కప్పు టేబుల్ మీద పెట్టాడు.

'ఇది ఆసక్తికరంగా ఉంది. పాత్రలైపోయారు అన్నమాట మీద ఆలోచించాలి. కలలో పాత్రగా మారిన ప్రతి వ్యక్తిని ఎంచుకుని ఏదైనా మంచి ఆలోచనతో కథ వ్రాస్తూ పోతే? ఆలోచించు...'

ఇక్కడో మర్మం తోచింది. కేవలం కలలలో జీవించేవారిని పిచ్చివారంటారు. కలలలోని కలకలానికి కలంలోకి చేర్చి కలంకారీ చేసేవాడిని కళాకారుడనేస్తారు... నిజానికి అందరూ వెర్రివాళ్లే!

ఈ మధ్యనే కొంటెగా మాట్లాడే ఓ అమ్మాయి ఆఫీసులో చేరింది. ఇది విని కంప్యూటర్‌ను వదిలి ఇటు తిరిగింది.

'సుందరం..' మెల్లగా చెప్పింది '....ఈయన ఇప్పుడు కథలు చెప్పటం లేదంటావా? కలలమీదికి తోసేస్తున్నాడు, నా కలలో మొన్న ఎలా కనిపించాడో చెప్పమంటావా?'

కాలం కలలా కదిలిపోయింది. ఈ కలల గురించి చెప్పటం మానేసాను. నన్ను అందరూ పిచ్చివాడిని చూసినట్లు చూస్తున్నారు. అందరూ ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. ఆలోచనలు ఫైళ్లల్లో దాక్కున్నట్లు పుస్తకాలలోకీ, డైరీలలోకీ వెళ్లిపోయి దాక్కుని కదిలావంటే చంపేస్తామన్నట్లు భటులలా నిలబడి ఉన్నాయి.

ఓ అమ్మాయి తలుపు సందులోని సూర్యరశ్మితోపాటు లోపలికి వచ్చింది. ఎవరో అర్థం కావటంలేదు. చేతిలో మైకు ఉంది.

'ఇంత గొప్ప రచయిత అయి ఉండి మీరు నలుగురిలోకీ ఎందుకురారు?'

'నేను రచయితను కాను. కానీ గొప్పవాడిని! ఎన్నో కలలను కన్న కన్నతండ్రిని. ఆ కలల తాలూకు నిజాలని వాటి ప్రక్కన పెట్టి కాగితాలు నింపాను. అవన్నీ కలలో, నిజాలో, కథలో మీరు నిర్ణయించుకోవాలి'

'మీకెవరూలేరా?'

'ఉన్నారు. స్వప్నాలలా కరిగిపోయరు'

'మీరు మీ జీవితంతో సంతుష్టులా?'

'అన్ని జీవితాలకీ ఓ మూల్యం ఉంటుంది. అన్ని కోణాలనూ చూడగలిగిన వాడు చివరకు మూలాధారంలా ఓ మూలకి వెళ్లి మూలుగుతూ ఉంటాడు. నేనూ అదే చేస్తున్నాను. ఇదే ఎంతో తృప్తిగా ఉంది!'

'ఏ విధంగా సార్?'

'నా కలలనన్నింటినీ కాగితాలలో బంధించేసాను. నాకు నేను వైద్యం చేసుకున్నాను.'

'ఓ. ఇలా చేయాలని మీకు ఎందుకనిపించింది?'

ఆమెకు చుట్టూతా చూపించాను.

'ఈ గదిలో ముందర ఏమీలేవు అన్నీ అద్దాలే, అబద్ధాలే. నిజాలని చూపించి నిలదీసే ప్రతిబింబాలే. అన్నిటిలో నేనే..'

విరగబడి నవ్వాను. స్టేజ్ క్రింద హాల్లో అందరూ చప్పట్లు కొడుతున్నారు. ఆ శబ్దంలోంచి నిద్రలేచి నిజాయితీగా కళ్లు తెరచి చుట్టూతా చూసాను..

ఈ ఇంట్లోకి అర్ధమాత్రంగా ఉన్న కథలా ప్రవేశించి నిలువుటద్దాన్ని కవితలా పొంది నన్ను నేను పూర్తిచేసుకున్నాను.

ఓ కథ వ్రాసాను.

కవిత అందరినీ చూసి చిన్నగా చప్పట్లు కొట్టటంతో అందరూ చప్పట్లు కొట్టారు.

'నాకో కల రావచ్చు..' కవిత చెల్లెలు చెప్పింది '...ఇప్పుడు రాబోయే కలల గురించి చెప్పవచ్చన్నమాట'

'చెప్పుతల్లీ'

'ఎవరూ ఏమీ అనుకోకూడదు'

'నో ప్రాబ్లమ్'

'మరీ.. పెళ్లికొడుకు గంపలో కూర్చుని వస్తున్నట్లు కలగంటానేమో!'

## *సుందరి, సుబ్బారావు*

**పనిలో** పడి కొద్దిరోజులు గడచిపోయాయి. సైలెంట్‌లో పెట్టిన మొబైల్ మాట్లాడలేని మనసులా అలా టేబుల్ మీద కొట్టుకుంటోంది. ఏదో గుర్తుకొచ్చి ఫోన్ తీసాను.

'ఏంటి?చాలా కాలంగా మాటాలేదూ, కబురూ లేదు?' - కవిత అడుగుతోంది.

'నిజమే. పనులలో బిజీ అయ్యాను. చెప్పు'

'అమ్మాయిని చూసి వెళ్లారు. నచ్చిందీ, నచ్చలేదు, ఇలాంటివి మాకు తెలియజేయాలి కదా?'

'అవునూ, ఆ రోజే అన్నీ అయిపోయాయి కదా? కవిత నచ్చకపోతే కథ పుట్టుకురాదు. ఇంకేం కావాలి?'

'ఇంట్లో జాతకాల గురించి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు' ఇదో బాధ - ఇదో పరిపాటి అయిపోయింది. పని యావత్తూ పూర్తి అయిన తరువాత ఓ పెద్దాయన వచ్చి చూసి రిపోర్ట్ ఇస్తే ఇంకెవడో దాన్ని చదివి ఇదలా ఉంది, అదలా ఉంది అని ఏదోలా మొహం పెట్టి సంతకం పెట్టాలా వద్దా అన్నట్లు చూస్తాడు.

'హలో?'

'ఆ హలో?'

'ఏంటీ ఏమీ చెప్పరు? ఇప్పటికి ఇద్దరు సిద్ధాంతులయ్యారు'

'వాళ్లిద్దరికీ ఎలాగో పడదు. వాళ్లిద్దరినీ కొట్టుకోమని చెప్పి మనిద్దరం అలా సరదాగా పెళ్లి చేసేసుకుంటే సరిపోతుంది'

'చాలా లైట్‌గా తీసుకుంటున్నారు'

'జాతకాలు కలవకుండా మనసులు కలుస్తాయా? అని ఒక సిద్ధాంతిని అడగండి. జాతకాలు కలసినందుకు బలవంతంగా మనసులను కలుపుతారా? అని మరో సిద్ధాంతిని అడగండి. ఇద్దరికీ కలిపి మూడో సిద్ధాంతి దగ్గర టి.విలో చర్చ జరపండి'

'మీకు అన్నీ నవ్వులాటే! ఇంతకీ నన్ను ఏం చెయ్యమంటారు?'

'నక్షత్రాలు, గ్రహాలు, మనిద్దరినీ చూసి ఏమనుకుంటున్నాయో కొద్దిగా ఊహించి వాటికి మన సందేశంగా ఓ కవిత పంపించు. అవి ఏ కథ చెబుతాయో చూద్దాం!'

'ఓ ఇంట్లో ఏమనుకున్నారు?'

'ఏమీ అనుకోవటంలేదు కవితా! మా ఇంట్లో అందరూ నవగ్రహాలే! అంటే ప్రతిరోజూ కొత్త గ్రహాలలా కనిపిస్తారు.'

'ఓ!'

'అదీ సంగతి. శాస్త్రాలన్నీ ప్రక్రియల ప్రతిబింబాలే, జీవన విధానాలన్నీ గొప్ప ప్రక్రియలే. గుండె చప్పుళ్లు చూసుకుని ముందడుగులు వేయరు.'

'బాగుంది. ముందైతే కవితతో చప్పుడు చేస్తాను'

'బై'

అయిదు నిముషాలలో వాట్సాప్ సందేశం అందింది.

***ప్రేమలేఖ***

***జిలుగు చుక్కలు తివాచీ పరచి***

***గ్రహాల వీక్షణం కోసం ఎదురుచూస్తుంటే***

***శుకుడు గురునితో 'ప్రేమలేఖ చివరన వెన్నెల సంతకమే' అంటూ మురిసిపోయాడు.***

***మీనమేషాలు ఇక్కడ మనకు తావులేదని తొలిగిపోయాయి***

***'గ్రీష్మం మాట హేమంతలో ఎందుకు?***

***మధ్యన వసంతం వుండగా' - అంటూ గ్రహాధిపుడు హెచ్చరించాడు***

***'సమాగమం తరువాత సంగమం అనివార్యం' అంటూ వెన్నెల రాజు వేగిరపెట్టాడు.***

***ఇక నేను మాత్రమే సంసిద్ధం కావాలేమోననిపించి ప్రేమలేఖ లేకుండానే శుభలేఖ ఎందుకులెమ్మని మీకై ఈ అక్షర కుసుమం అందిస్తున్నా!***

*సుందరి - సుబ్బారావు*

సుబ్బారావు టి.వి ముందు కాళ్లు చాపుకుని కూర్చున్నాడు. మిత్రుడు శ్రీనివాసరావు, అతని శ్రీమతి వచ్చి కొద్దిసేపు కబుర్లు చెప్పి వెళ్లిపోయారు. సుందరి గదిలోకి వెళ్లి ఇంకా ఇవతలికి రాలేదు..

సినిమా హాల్లో లైట్లు తీసేసి ఇంకా తెరమీద ఏమీ కనిపించనపుడు ఎలా ఉంటుందో ఈ కొద్ది సేపూ అలా ఉంటుంది. గదిలోంచి నేపథ్య సంగీతం ఏమీ వినిపించటంలేదు. దర్శకుడు నిశ్శబ్దాన్ని వాడుకుంటున్నట్లున్నాడు. సినిమా మటుకు గారంటీ అని తేలిపోయింది.

ఇన్ని చానెల్స్ ఉన్నా అన్నింటిలోనూ ఒకటే వార్తలా ఎన్ని రోజులు గడచినా అన్ని మాటలకు ఒకే ఆలోచన సుందరికి - తనంటే చులకన!

'రసం ఇడ్లీ ఎప్పుడూ చెయ్యలేదా? నాకు చేతకాదా? ఆమెతో అంతసేపు చర్చ ఎందుకు?' ఇవి లోపలినుండి వినిపిస్తున్న మాటలు. ఆమె పాపం చెప్పిన మాట ఒకటే మామూలుగా వంటలో పెట్టుకునే చారుకీ, ప్రత్యేకంగా ఇడ్లీకోసం చేసే చారుకి తేడా ఉంది అని చెప్పింది. సుబ్బారావు జిజ్ఞాస చూపించాడు. అంతే!

సుందరి హాల్లోకి వచ్చి సుబ్బారావుని చూడను కూడా చూడలేదు. మగవాడి గురించి ఏదైనా చెప్పాలంటే ఆడవాళ్లకి వాళ్లని చూడవలసిన అవసరం ఉండదు. అక్కడున్న కుర్చీ ఏంగిల్ మార్చి స్పీడుగా కూర్చుని సుబ్బారావులా కాలు టి.వి వైపు జాపి రిమోట్ తీసుకుని కట్టేసింది.

'తల నొప్పిగా వుంది. నేను వంట చెయ్యను'

సుబ్బారావు తనదైన దిక్కుమాలిన నవ్వు నవ్వాడు.

'నవ్వు ఎందుకు వస్తోంది?'

'వస్తోందని నువ్వే అన్నావు'

'వస్తుంది. ఎందుకురాదు? రసం ఇడ్లీట రసం ఇడ్లీట. మొహం చూడు!'

'అయితే వంట చెయ్యవన్నమాట'

'ఎందుకు చెయ్యాలి? ఆమెకు చెప్పండి'

'చెయ్యదు'

'ఊ. ఎందుకు చేస్తుంది? ఓ పని చెయ్యండి, ఎలా చెయ్యాలో కనుక్కోండి ఫోన్ చేసి'

'శభాష్. ఏది మనోడి నెంబరేది..'

సుందరి చెయ్యి చూపించింది. 'ఇదిగో కనుక్కోమన్నది నేను ఎలా చేయాలో అనికాదు. మీరు ఎలా చెయ్యాలోనని'

'అయినా మావాడు ఒప్పుకోడు'

'పోన్లేండి ఇప్పటికైనా అర్థమైంది మొగుళ్లంటే ఎలా ఉంటారో..'

'పెద్ద మాటలు మాట్లాడేస్తున్నావు..'

టక్కున లేచి లోపలికెళ్లిపోయింది.

మహాత్మాగాంధీగారు సత్యాగ్రహం అనేది కస్తూరిబాగాంధీ వద్ద నేర్చుకున్నట్లు వ్రాసియున్నారు. స్వాతంత్ర్యంతో పని లేదు కాబట్టి సుబ్బారావు ఆ పంథాలో ఆలోచించలేదు. అనవసరమైన స్వాతంత్ర్యాన్ని అరికట్టేందుకు ఎటువంటి సత్యాగ్రహం చేయాలో అర్థం కావటం లేదు ఎవరికీ. బెడ్‌రూంలో లైట్ వేసాడు.

'లైట్' అరిచింది సుందరి. తీసేసాడు. ఓ స్టూలు దగ్గరగా లాగి దానిమీద దానిమ్మ గింజల ప్లేటు పెట్టాడు.

'వద్దు'

'తినేసేయ్. ఓ పని అయిపోతుంది'

'పారెయ్యండి. రెండు దారులుంటాయి.'

పురుషుడికి భావోద్వేగం కలిగితే కవిత్వం వాగులా జాలువారుతుంది. స్త్రీకి అలకలో ఎత్తిపొడుపులు ఎత్తిపోతల జలపాతంలా ప్రవహిస్తాయి. సుబ్బారావు నవ్వాడు. సుందరి అటు తిరిగి పడుకునే ఉంది.

'నవ్వు వొద్దు', తీవ్రంగా చెప్పింది. సుబ్బారావు ఆలోచించాడు. ఇతనికి స్ట్రెచింగ్ వ్యాయామం లేకపోయినా విషయాన్ని సాగదీసే అలవాటుంది.

'ఆమె చెప్పినా రసం ఇడ్లీ నేనలా చెయ్యలేనే! నువ్వే చెయ్యాలేమో!' ప్రతిక్రియ లేదు. భార్య అలిగినప్పుడు రెండు ఆప్షన్స్ ఉంటాయి. తన తలమీద చెయ్యి పెట్టుకుని కొద్దిసేపు ఆవేశాన్ని ఆపుకోవటం మొదటిది. ఆవిడ తలమీద ధైర్యంగా చెయ్యి ఉంచి కొద్దిసేపు చూడాలి. ఇంకెక్కడైనా తాకితే ఏదైనా జరగవచ్చు. మెల్లగా తలమీద చెయ్యి ఉంచాడు. అటువైపు కూడా రెండు దారాలుంటాయి. విసిరి కొట్టటం మొదటిది. ఏ ప్రతిక్రియా చూపకపోవటం రెండవది. సుందరి రెండవదారి ఎంచుకుంది.

నిద్రపోయిందా? లేదు. పదిమంది అలక చూపిన ఆడువారిలో ఒక్కరు మాత్రమే నిద్రపోతారని సర్వేలలో తేలింది. నిద్రపోతే అది అలక కానట్టేనని ఓ పెద్దాయన నిర్ధారించడం జరిగింది. సుందరి మూడో పద్ధతి ఎంచుకుంది. టక్కున జరిగి చేతిని క్రింద ఉంచి దానిమీదనే పడుకుంది. నలిగినంత పనయింది.

'విరిగిందా వేలు?' అడిగింది. చెయ్యి విదిల్చుకున్నాడు.

'విరుగుతానంటోంది'

'బాగయింది. వెల్లుల్లి బాగా నలగాలి అందికదా? ఇలాగే నలగాలి!'

'వెల్లుల్లి?'

'రసమిడ్లీట రసమిడ్లీ..'

ప్రక్కనే పడుకున్నాడు సుబ్బారావు. పట్టు వదులుతున్నప్పుడు అక్కడినుండి వదలి వెళ్లకూడదన్నది అలక శాస్త్రం. వెళ్లిపోతే అదుగో బాగానే ఉన్నదనుకుని పారిపోయాడంటారు.

'రసంలేదూ, ఇడ్లీలేదు సుందూ.. ఏదో ఆమెతో అలా మాట్లాడాను. అంతే'

'లేదండీ. మన జాతకాలు అసలు కలవలేదు'

'ఛా'

'టి.వీలో ఇద్దరు చెప్పారు. పైగా మంగళవారాలు ఎప్పుడూ కొట్టుకుంటాం అన్నారు.'

'ఇలా ప్రతి మంగళవారం కొట్టుకుంటూ జాతకాలలో నిజాన్ని చాటాలంటే మనం మిగతా ఆరు రోజులూ కలిసుండాలి కదా?'

'కాదు. మీది మిథున లగ్నం. నాది వృశ్చికం. ఉత్తర దక్షిణ ధృవాలన్నారు'

'ప్రక్కప్రక్కనే ఉంటే ప్రక్క ఇంటివాళ్లతో సంబంధాలైపోతాయి'

'అన్నీ వేళాకోళమే!'

'కాదు. మనిద్దరి స్వభావాలు ఒకటైతే సహజీవనంలో గొప్పేముంది?'

'కాదండీ భయం వేస్తోంది. మీది ఆకుపచ్చరంగు, నాది ఎరుపు రంగు. అస్సలు కుదరువుట'

'ఆకుపచ్చ పట్టుచీరెకి ఎరుపు రంగు బార్డరు సూపర్ కదా సుందూ?'

'మరి పోట్లాటలు తప్పటంలేదు. ఇలా ఎన్నాళ్లు?'

'నీకు అలవాటు లేనిది నాలో చూసి ఉద్వేగానికి గురవుతావు. నాకు సరైనది కాదు అనిపించేది నీలో చూసి చిరాకు పడతాను. ఇలా కూడా ఉంటుంది అనేది మనిద్దరం కలవకపోతే తెలుసుకొలేం కదా? అదే జాతకాలు చెబుతున్నాయి అనుకో! పెళ్లిళ్లు చేసుకోవటం తేలిక. సంసారం చెయ్యటమే నిజమైన సామర్థ్యాన్ని చెబుతుంది.'

'స్వభావాలు మారవు కదా?'

'ఎందుకు మారాలి?'

'అదేంటి?'

'రెండు పట్టాల మీద జీవనయానం సాగిపోతుంది కానీ రెండింటినీ కలిపేస్తే కాలచక్రం ఎలా తిరగాలి? దేనిమీద నడవాలి?'

మర్నాడు సుబ్బారావు కొద్దిగా ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. సుందరి చక్కగా ముస్తాబయి సోఫాలో చేతులు కట్టుకుని కూర్చునుంది. సుబ్బారావు ఇల్లంతా కలయజూసాడు. కొత్తవాళ్లెవరూ లేరు. సుందరి బొమ్మలా ఉంది. చలనం లేదు. ఎందుకైనా మంచిదని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఆడవాళ్ల తీరును బట్టి ఏమీ అర్థం కావటంలేదనుకున్నప్పుడు నేరుగా సావిత్రి ప్రక్కకు ఎ.ఎన్.ఆర్ వెళ్లినట్లు వెళ్లికూర్చోకూడదు. ఎదురుగా కూర్చోవటం కరెక్ట్. సినిమా ప్రోగ్రామ్ అయితే పెట్టుకోలేదు. సుందరి ఇప్పుడు కొత్తగా ఏదీ చెప్పలేదు. కాకపోతే ఏదో ఆలోచిస్తున్నట్లుంది.

'సర్దేశాను', అంది.

'ఏంటి?'

'అన్నీ. నావన్నీ, పెట్టెకూడా'

'ఎందుకు?'

'చెప్పేసాడు'

'ఎవరు? ఏమిటి?'

'టి.విలో'

అందంగా కనిపిస్తున్న టి.విని ఎంతో బాధగా చూసాడు సుబ్బారావు. ఈ దిక్కుమాలిన బుల్లితెరను చూడవలసిన కళ్లజోడులోంచి అందరూ చూడలేరు కదా?

'మనకి షష్టాష్టకాలున్నాయట '

'ఎక్కడ?'

'ఎక్కడోకాదు. జాతకాలలో. ఆరు, ఎనిమిది ముడిపడి చిక్కుకున్నాయట'

'అవునా? అంటే నువ్వూ నాకు చిక్కావు, నేను నీకు చిక్కాను. ఈ చిక్కుముడినే పెద్దలు పెళ్లి అన్నారు. దీని బట్టి ఏమి అర్థమైంది?'

సుందరి అనుమానంగా చూసింది.

'నీ వెనకాల షోకేసు చూడు'

అటు చూసింది సుందరి.

'ఏమయింది? బొమ్మలున్నాయి'

'కదా? రకరకాల బొమ్మల కొలువు. అన్నింటినీ ఒక్కచోట పెట్టి హారతి ఇవ్వటంలేదా?'

'అయితే?'

'అన్నీ ఒక రకమే ఉండవు కదా?' సుందరి ఆలోచించింది. దగ్గరగా వచ్చి కూర్చున్నాడు సుబ్బారావు. 'ధర్మమే గొప్పది. అదే కాకపోతే సావిత్రికి సత్యవంతుడు దొరికేవాడా?'

'మనం మాములు మనుషులం'

'మాములుగా జీవిద్దాం. మన సిద్ధాంతం మనకుండాలి. ఇంకొకరి సిద్ధాంతం ఎందుకు?'

సుందరి లేచి లోపలికెళ్ళి సూట్‌కేసు లోపల పెట్టింది. ఏమనుకుందో ఏమో కాఫీ పట్టుకొచ్చింది.

'మనకేం కాదు కదా?'

కప్పు తీసుకున్నాడు సుబ్బారావు.

'ప్రతిరోజూ అందరికీ ఏదో ఒకటి అవుతూనే ఉంటుంది. వాళ్ళు చెప్పినా అవుతుంది, చెప్పకపోయినా అవుతుంది.'

'మరి ఇవన్నీ నిజాలు కావా?'

'నమ్మకాలన్నీ కమ్మనైన నిజాలే!'

'మరి దేనిని బట్టినడుచుకోవాలి!'

'మనకి గొడవలున్నాయని గ్రహాలు చెబితే మనం గొడవపడిపోయే మూర్ఖులం కదా?'

సుందరి నవ్వింది.

'గొడవలొస్తే?'

'గ్రహాల ప్రభావాన్ని నిరూపించిన మొనగాళ్లం, మొనగత్తెలం. అసలు మన వ్యక్తిత్వాలేవి?'

తల అడ్డంగా ఊపింది సుందరి.

'ఇంతమంది చెబుతున్నది అబద్ధమా?'

'గ్రహాలు చెబుతున్నాయి కాబట్టి జాగ్రత్త పడదాం. సరేనా?' కాఫీ కప్పు తీసుకుంది సుందరి.

'నాకు ఆశ్చర్యం కలుగుతుంది....', చెప్పింది, '....నేను ప్రతిరోజూ ఇలా ఏదో చెబుతున్నా ఆ టి.వీ మానెయ్యమని చెప్పరు ఎందుకలా?'

సుబ్బారావు నవ్వాడు కానీ ఏమీ మాట్లాడలేదు. దగ్గరకొచ్చి గిల్లింది. 'నవ్వకండి. చెప్పండి'

'చెప్పనా?'

'ఊ.. ఉండండి. వద్దని మీరు చెప్పినా నేను వినను అని నమ్మకం. అంతేనా?'

'కాదు. ఆలోచనలలో అమృతం ఉంటుంది, ఆలోచనలోనే విషయం ఉంటుంది. తొందరపాటు ఆలోచనలో విషం వచ్చి కూర్చుంటుంది. జాతకాల ఆలోచనలో తప్పులేదు. పెట్టి సద్దే తొందరలో విషం వస్తుంది. చాయిస్ మనది!'

'కానీ షష్టాష్టకాలు..'

చెయ్యి అడ్డుపెట్టాడు సుబ్బారావు.

'అందరం ఋణానుబంధాల వలన దగ్గరవుతాం, దూరమవుతాం. గ్రహాలు కేవలం లక్షణాలను సూచిస్తాయి'

'మీకెవరు చెప్పారు?'

'నాకు కాదు. పార్వతికి పరమేశ్వరుడు చెప్పాడు మహాభారతంలో.' నడుము మీద చెయ్యి పెట్టుకుంది సుందరి.

'ఆ సిద్ధాంతికి ఫోన్ చేసి చెబుతాను', గట్టిగా చెప్పింది.

'నో సుందరీ! ఎవరి ప్రపంచం వారిది. వదిలెయ్'

ఆఫీసులో పని చేసుకుంటుండగా మొబైల్ మ్రోగింది. సుందరి ఫోన్ అది.

'హలో'

'హలో నేను'

'అవును నువ్వు.'

'ఊ...కాదూ, మా పెదనాన్నగారొచ్చారు'

'వెరీగుడ్'

'జాతకాలు చెబుతారు'

'వెరీగుడ్'

'అదేంటి? విసుక్కుంటారనుకున్నాను'

'ఎందుకు? జాతకాలు చెప్పలేకపోతే ఈ రోజుల్లో పదవతరగతి కూడా చదవనట్లే'

'....'

'హలో!'

'ఆ హలో. ఆయన ఏమంటున్నారో తెలుసా?'

'తెలుసు'

'ఎలా?'

'అన్ని సమస్యలకీ నా దగ్గర సమాధానం ఉంటుందన్నారు అవునా?'

'అరె? ఎలా చెప్పారు?

'నా మాటలన్నీ వినిపించుంటావు'

'ఊ.. మీ మనస్తత్వాన్ని తెలుసుకుని నన్ను మసలుకోమంటున్నారు.'

'నువ్వు అలా చెయ్యట్లేదని ఎవరన్నారు?'

'అలాకాదు, అలా ఉండాలి అన్నారు.'

'గుడ్ టి.వి చూడవద్దని నేను ఎందుకు అనలేదో తెలిసిందా?'

'లేదు'

'నీ తత్వం అది. తెలుసుకుని నేను నడుస్తున్నాను'

'ఓహో!'

'ఇంకా ఏం చెప్పారాయన?'

'చాలా చెప్పారు. మీకు ధైర్యం ఎక్కువట. వితండవాదన కూడా ఎక్కువట!'

'బాగుంది సామాన్యుడు కాడని చెప్పలేదా?'

'లేదు'

'ఇంకొక్కసారి చూపించు. ఏదో గడిలో చిన్నగానైనా ఆ పెద్ద విషయం వారికి కనిపించకపోదు'

'వేళాకోళమా?'

'ఈ వేళ ఫోన్ చేస్తే అలాగే ఉంటుంది'

'ఓ. బిజీనా? మళ్లీ చేస్తాను'

సుబ్బారావు ఆఫీసులో ఒకరు చేతులూ కాళ్లూ చూసేవారున్నారు. ఊరికే అతని దగ్గరకు వెళ్లాడు సుబ్బారావు. హస్తసాముద్రికం తెలిసిన వారందరిలాగానే చెయ్యిపట్టుకుని చేతిని చూడకుండా మొహాన్ని జాగ్రత్తగా చసాడు.

'పదకొండో ఏట ఎక్కడ పడ్డారు?' అడిగాడు.

'మెట్లమీదినుండి'

ఇది పెద్ద వింతకాదన్నట్లు చిరునవ్వు నవ్వి గీతల్లోకి వెళ్లాడు.

'చాలా పైకి రావలసినవారు. అవునా?'

క్రిందపడ్డానుకదా?'

'అలాక్కాదు. ఎన్నో అవకాశాలుపోగొట్టుకున్నారు'

'కావచ్చు'

'ఇష్టా అయిష్టాలు చాలా గట్టిగా ఉన్నాయి'

'ఉంటాయి'

దీర్ఘ శ్వాస విడిచాడు.

'ఆరోగ్యం ఎలా ఉంటోంది?'

'బాగానే ఉంటోంది'

'వచ్చే ఏడాది కొద్దిగా కడుపునొప్పి విషయంలో జాగ్రత్త పడాలి'

'ఒకే. ఈ ఏడాదే కొద్దిగా మొదలైంది లెండి'

'ఊ. పెద్ద విషయం కాదులెండి. కాకపోతే కొద్దిగా జాగ్రత్తపడాలి'

'మా ఆవిడ సంగతి గీతల్లో ఉంటుందా?'

కుడి చెయ్యి వదిలేసి ఎడమ చెయ్యి తీసుకున్నాడు.

'తొందరపాటు ఎక్కువ. ఏదీ దాచుకోదు'

'కరెక్ట్‌గా చెప్పారు.'

'కనపడతాయి సార్. బాగుంది. మంచి దాంపత్యం. ఈ రెండు వ్రేళ్ల మధ్య గీత ఉంది చూసారా? ఇది గొప్పది. ఈ మధ్యనే వచ్చి ఉంటుంది.'

'కావచ్చు. దీని బట్టి ఏంటి?'

'మీ మేధా సంపత్తి గొప్పదిసార్. దానిని వాడుకుని చాలా అభివృద్ధిలోకి వస్తారు!'

ఇంతలో అటుగా ఎవరో వెళ్లటంతో ఆ సన్నివేశం ముగించుకుని తన సీటుకి వెళ్లిపోయాడు సుబ్బారావు. ఓ గంట తరువాత ఈ సాముద్రికుడు చేతులు తుడుచుకుంటూ సుబ్బారావు సీటు ప్రక్కగా వెళ్లుతూ ఆగాడు.

'సార్, ఓ రహస్యం చెప్పాలి'

'చెప్పండి'

'నూటికి తొంభై మందికి ఏ గీతా చూడకుండా ఇవన్నీ చెప్పవచ్చు. నేనూ అదే చేసాను'

'నేనూ అదే చూసాను.'

సుబ్బారావు బండి ఆపి తలుపులోంచి తొంగి చూసి ఇంట్లోకి వెళ్లాడు. సుందరి ఎక్కడా కనిపించలేదు. పెరట్లోకి వెళ్లి వెతికాడు. అక్కడ తులసి కోట దగ్గర దీపం పెట్టుకుని ఏదో స్తోత్రం చేసుకుంటోంది. ఆగమని సైగ చేసి ఓ పది నిమిషాల తరువాత లోపలికొచ్చి కాఫీ పట్టుకొచ్చింది.

'భయంగా ఉంది'

'ఎందుకు?'

'ఈ వరుసలో మూడో ఇంట్లో వాళ్లకి పెళ్లయి ఆరు నెలలు అయిందట'

'వెరీగుడ్'

'వెరీ గుడ్‌కాదు. విడాకులకి అర్జీ పెట్టుకున్నారట.'

'ఛా'

'అవును. జాతకాలలో కుజదోషం చూస్కోలేదుట. ఎవరో మహానుభావుడు ఇంటికొచ్చి ఉన్నదున్నట్లు తేటతెల్లంగా చెప్పి వెళ్లిపోయాడుట. అమ్మాయి తండ్రికి కుడికాలికి ఆరువేళ్లున్నాయా అని అడిగాడుట. ఆయనకి అలాగే ఉంటాయట!'

'నేను దీంట్లో చెయ్యగలిగిందేమీలేదు సుందరీ!'

'మీరు ఏం చేస్తారు మాస్టారూ! మన సంగతేమిటి?'

'ఇలా అన్నిటికీ భయపడుతూ కూర్చుంటే ఎలా సుందరీ?'

'ఆయన్ని అడుగుదాం'

'ఎవర్ని?'

'శర్మగారుట! అద్దంలో చూసినట్లు చెబుతారుట!' సుబ్బారావు లేచి బెడ్‌రూంలోకి వెళ్లి అరిచాడు.

'సుందరీ!'

ఒక్క పరుగున వెళ్లింది.

'ఏమైందండీ?'

'అద్దంలో నేను పూర్తిగా నాలాగే కనిపిస్తున్నాను'

'ఎవరిలా కనిపిస్తారు? మొన్ననే పూర్తిగా తుడిచాను. మీరు మరీనూ. నా గుండె ఆగిపోయింది సుమా!'

'నువ్వు కూడా అంతా నీలాగే కనిపిస్తున్నావు'

'అంటే? మీ బాధేంటి?'

'మంచి ఉపాసనా, సాధన మార్గంలో ఉన్నవారికి దర్పణంలో చూసినట్లు చాలా విషయాలు దర్శనం ఇస్తాయి. ఏదో చీరె సద్దుకునేందుకో లేక చొక్కా గుండీలు పెట్టుకునేందుకో లేదా బండి వెనకాల ఎవరొస్తున్నారో చూడటానికి దర్పణాన్ని కొద్దిసేపు అవసరానికి వాడతాంకానీ ఇరవై నాలుగు గంటలూ అద్దం ముందు నిలబడి కాలం గడుపుతామా సుందరి?'

ఇద్దరూ హాల్లోకి వచ్చారు.

'దోషం ఉంటే భార్యాభర్తలలో ఎవరో ఒకరు..'

చేయి అడ్డుపెట్టాడు సుబ్బారావు.

'ఒకరు పుట్టాలంటే ఒకరికి సంతానయోగం, ఒకరికి పౌత్ర యోగం, ఒకరికి తమ్ముడుండే యోగం, ఇలా ఎందరి జాతకాలలో యోగం చూడాలో మరి? అలాగే ఒకరు లోకం దాటిపోవాలంటే ఎందరి బంధుత్వాన్ని జాతకాల ద్వారా చూడాలి? అంతా ఋణానుబంధం అనుకుని ఈశ్వరుడిని ధ్యానించటం ఉత్తమం!

చేతిలో ఉన్నది చేసుకుంటూ పోవటమే ధర్మం కానీ ఇలా కాలం, ఆలోచనలు కలిపేసి వృధా చేసుకుంటామా?'

సుబ్బారావు అనుకోని రీతిలో సుందరి విరగబడి నవ్వింది.

'ఇంత గూఢమైన విషయం చెబుతుంటే నవ్వుతావేంటి?'

'అవును. పెదనాన్నగారు చెప్పారు'

'ఏంటి? ఇదేమాటా?'

'కాదు. మీరు జాతకాలను పెద్దగా పట్టించుకోరని మీ జాతకంలో ఉందిట.'

ఎండాకాలం అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. డాబా మీద పడుకున్నారు సుందరీ, సుబ్బారావు. ఇద్దరూ నక్షత్రాలను చూస్తున్నారు.

'ఇవి చాలా దూరం కదండీ?'

'అవును'

'గ్రహాలు కొద్దిగా దగ్గర కదండీ?'

'అవును'

'అవి కనపడవేం?'

'ఏమో!'

'మనమూ గ్రహం మీదనే ఉన్నాం కదూ'

'ఉన్నాం'

'మన గ్రహము ఇంకో గ్రహం మీద ఉన్నవాళ్ల జాతకంలో కనిపిస్తుందా?'

'ఫోన్ నెంబరు దొరికితే ఫోన్ చేసి కనుక్కుంటున్నాను' 'వేళాకోళం'

'ఈశ్వరుడికీ అంతా అంతే!'

'అంటే?'

'ఇదో పెద్ద సందడి కుటుంబం. దాని గమనాన్ని అర్థం చేసుకుని పురుషార్థాన్ని సాధించుకోవాలి. చాలా సింపుల్!'

'అర్థంకానివన్నీ మీకు సింపుల్'

'అర్థం అయిన వాటి గురించి ఆలోచించక్కరలేదు కదా!'

'..'

'ఆలోచించు'

'ఏంటి?'

'మనం వాటిని చూస్తున్నట్లు అవి మనలని చూడటం లేదంటావా?'

'చూస్తే?'

'మనలని దీవించమని చెబుదాం సుందరీ?' సుందరి లేచి కూర్చుంది.

'పడుకో. ఇప్పుడు స్తోత్రం చెయ్యకు మరీనూ!'

## ఈ క్షణం ఇద్దరిదీ

**మా టేబిల్ మీద** రెండు కాఫీ కప్పులు పెట్టి బేరర్ అలానే నిలబడి ఉన్నాడు. అతను ఏదో అడగాలనుకుంటున్నట్లు అర్థమయి అతన్ని జాగ్రత్తగా చూసాను. నేనూ కవిత కలుసుకున్నప్పటినుంచీ ఈ హోటలే, ఈ టేబిలే, ఈ బేరరే!

అతను గొంతు సద్దుకున్నాడు.

'సార్, కంగ్రాచులేషన్స్' అన్నాడు. ఇద్దరం ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నాం.

'దేనికి?' అడిగాను.

'చాలా రోజులుగా మీ ఇద్దరినీ చూస్తున్నాం. కొత్తల్లో ఒకలాగ ఉండేవారు, ఇప్పుడు పెళ్లి అయిపోయిన వారిలా ఉన్నారు...' నేను ఏదైనా మాట్లాడే ముందరే చెయ్యి అడ్డుపెట్టాడు.

'సార్, దయచేసి ఏమీ అనుకోకుండి. నేను మీ మాటలేమీ వినలేదు. నేను వయసులో పెద్దవాడిని. ఎందుకో మిమ్మల్ని అభినందించాలి అనిపించింది'

'తప్పేం లేదు. థాంక్యూ'

'మా హోటల్లో కలుసుకుంటూ అనుబంధం ఏర్పరచుకుంటే మాకు అంతకంటే ఏం కావాలి?'

'ఓ. బావుంది'

'సార్, ఏమీ అనుకోకపోతే ఒకమాట'

'ఇన్ని అనుకున్నాక ఇంకా అదెందుకు? చెప్పు'

'మీ ఇద్దరికీ ఈసారి ఓ గిఫ్ట్ ఇస్తాను'

ఎందుకు?'

'మీరు టిప్పులుగా ఇచ్చిన డబ్బు ఇలా మారుస్తాను.. ఓ మూడొందలుంటుంది'

‘ఓ. మా కెందుకయ్యా. ఇంట్లోకి ఏదైనా మా వైపునుండి కొను. బాగుంటుంది‘

‘నాకు ఆ అదృష్టం లేదు సార్. కాలం కలసి రాలేదు. నాకసలు పెళ్లి కాలేదు. ఎవరూ లేరు. ఇల్లంటే ఏంటో నాకు తెలియదు‘ కప్పు అలానే పట్టుకున్నాను. అతను వెళ్లిపోయాడు.

‘కాలం కలసి రాలేదు‘ కవిత చెప్పింది.

‘కలసిరావటం అంటే?‘

‘కాఫీలో చక్కెరలా అన్నమాట!‘

‘కాలంలోకి మనం వచ్చాం‘

‘ఎలా?‘

‘దాని దారిన అది పోతోంది. మనం వచ్చి కలుసుకున్నాం.‘

‘అవును‘

‘ఒక స్టేజ్ మీద నృత్యం జరుగుతోందనుకో! ఓ జంట స్టేజ్ మీదకి వచ్చి వాళ్ల లయలో కలసి తాళానికి అనుబంధంగా నృత్యం చేస్తారా? చెయ్యరా?‘

‘నిజమే‘

‘ఆ లయను అర్థం చేసుకుని మన లయను అవగాహన చేసుకుని కలసి సాగేందుకు నిర్ణయించుకున్న కాలాన్ని ముహూర్తం అంటారు. ఆ క్షణం అటువంటిది. ‘

‘అందరూ అలా చూసుకోరు కదా?‘

‘చూసుకోకపోయినా వారి లయ కలసిపోయి ఉండవచ్చు.‘

‘కలవకపోతే?‘

‘చూసేవారికి, చేసేవారికి ఎక్కడో ఆట సాగటం లేదన్నది తెలిసిపోతుంది. కలసి రావాలంటే అర్థమవుతోందా?‘

‘ఇంత క్లాస్ తీసుకున్నాక కాకుండా ఉంటుందా?‘ కవిత ఏదో ఆలోచిస్తోంది.. మెల్లగా అణువుగా పలికింది..

ఈ క్షణం ఇద్దరిదీ

‘ఈ రంగస్థలం ఇకపై నీది‘ అంటూ

భువిని పగలు, రేయికి అందించింది

‘అయితే ఈ సంధ్య ఇద్దరిదీ‘ అంటూ వెన్నెలరాజు

నవ్వులు రువ్వేసాడు

‘నా నాట్యాన్ని మించిన గానం ఇకపై అందించు‘ అంటూ నెమలి కోయిలమ్మని హెచ్చరించి తప్పుకుంది.

***కాలం ఒడిలో అలుపు లేకుండా ఎవరి ఆట ఎంతసేపో!***

***నీకూ నాకూ తెలుసా?***

***అందించినవి అందుకుని అందంగా ముందుకు అడుగెయ్యటం తప్ప శోధిస్తూ సాధించేదేముంది?***

***గమనం ఆగితే గమ్యమెక్కడో తెలిసేదెలా?***

***అందుకే***

*అడుగు ముందుకు వేద్దాం, రేపు ఎవరిదో తెలియకుండానే*

*అందుకే*

*ఈ ఝరిని అనుసరిస్తూ నేను*

*నాతోబాటు లయబద్ధంగా నీవూనూ!*

*కాలం కథకళి అయితే*

*జీవితం ఓ కథాకేళిలా...*

*సాగనీ!*

*శుభముహూర్తం*

చివరి లోకల్ ట్రైన్ అలా ప్లాట్‌ఫార్మ్ దాటిపోయింది. ఆ టీ స్టాల్ వాడు ప్లాట్‌ఫార్మ్ యావత్తూ కలయజూసాడు. కొద్దిగా చలిగా ఉంది. సామాన్యంగా ఒకరిద్దరు రైలు దిగి ఇంకా ఎంతో దూరం వెళ్లవలసిన వారుంటారు. ఈ రాత్రి ఎందుకో అలాంటివారు కూడా ఎవరూ లేరు. రోజూ ఆ ట్రెయిన్ వెళ్లేవరకూ అక్కడే ఆగి ఆ చిత్రమైన కోటును సద్దుకుని ఆ రోజుతో పని అయిపోయినట్లు మాసిపోయిన గెడ్డం గోక్కుంటూ ఓ పెద్దాయన మెట్లు దిగి వెళ్లిపోతూ ఉంటాడు. ఈ టీ స్టాల్ వైపు చూడను కూడా చూడడు. ఆ ఫ్లాస్క్‌లో సరిగ్గా మూడు కప్పులు వస్తాయేమో!

'సార్ టీ', అన్నాడు ఎందుకో.

ఆయన ఆగాడు. తల అడ్డంగా ఊపాడు. ఇతను రెండు కప్పులు నింపాడు.

'నేనిస్తున్నాను సార్, రండి. నేనూ పోవాలిక!'

ఆయన మెల్లగా అటువైపు నడిచాడు. చెక్కబల్లమీద కూర్చుని నిట్టూర్చాడు. వొణుకుతున్న చేతుల్లోకి కప్పు తీసుకున్నాడు.

'టీ బాగుంది' అన్నాడు.

'చలీ బాగుంది'

'అవును'

'అవును సార్, మిమ్మల్ని రోజూ చూస్తాను. ఏ బండీ ఎక్కరు, ఏ బండీ దిగరు. ఈ బండి వెళ్లిపోయాక మీరూ వెళ్లిపోతారు. ఎందుకలాగ?'

ఆయన రైలు పట్టాలవైపు చూసాడు.

'నా రైలు మిస్ అయిపోయాను నాయినా.'

'ఇంకో రైలు ఎక్కొచ్చుగా!'

'రైళ్లకి టైం ఉంటుంది. ఆ టైం రైలు వెళ్లిపోయాక అన్నీ వెళ్లిపోయినట్లే. టైం అది!'

'ఏమయిందేంటి?'

టీ రెండు గుటకలు మింగాడు పెద్దాయన.

ఓ రాత్రి రైలు ప్రయాణం నా డైరీలో జైలు వ్రాత అయి కూర్చుంది. పై బెర్త్‌మీద పడుకున్నానన్న పేరే కానీ నిద్రపట్టటం లేదు. పడుతోందీ అనుకునే సమయానికి బండి ఎక్కడో ఆగిపోయేది. నాకు పట్టిన నిద్రబండి దిగిపోయేది! మరల అటూ యిటూ

సద్దుకుంటూ కాలం గడుపుతున్నాను. ఏ అర్ధరాత్రో నన్ను ఎవరో లేపుతున్నట్లనిపించింది. లేచి చూసాను. క్రింది బెర్త్ మీద పడుకున్న ఓ అమ్మాయి.. అసలు ఇలాంటి అమ్మాయిని చూసినందుకు కాబోలు నిద్రపట్టటం లేదేమోననే ఆలోచన కూడా కలిగింది. గుడిలోకి వెళ్లినప్పుడు మూడు ప్రదక్షిణలు చేసి కొద్దిసేపు కూర్చోమంటారా. అక్కడ యంత్రం, దైవం యొక్క స్పందనలు మనలోకి ప్రవేశించి మన శరీరంలోని చక్రాలను ప్రతిస్పందింపచేస్తాయి కాబట్టి నేలమీద కూర్చుని స్పందనలను భూమిలోకి పంపాల్సిన ప్రక్రియ అదని ఓ పెద్దాయన చెప్పాడు. అలాగే రైల్లోకి వచ్చి మన సీటు వద్ద ఎక్కడా దొరకని సౌందర్యరాశి ఎదురుగా ప్రత్యక్షమైనప్పుడు శరీరం, మనస్సూ రెండూ చెరో కిటికీలోంచి అవతలకి వెళ్లిపోతాయేమో! అంచేత నిద్రపట్టడం మానేసి ఉండవచ్చు. కాకపోతే ఈమె నన్ను ఇంత రాత్రి ఇలా ఎందుకు నిద్రలేపుతోందో తెలియలేదు. మధ్యలో పడుకున్న కుర్రాడు అప్పుడే బోర్లపడ్డ పసివాడిలా తోచాడు. అతని క్రింద ఓ పెద్దాయన రెండు చేతులూ ఎటో పోనిచ్చి లోకంతో పనిపెట్టుకోవద్దు అని చెబుతున్నట్లుంది. నాకు ఎదురుగా పై బెర్త్‌మీద పడుకున్న వ్యక్తి నాకు సగం చోటు చాలన్నట్లు అటు పూర్తిగా ఒరిగిపోయి ఉన్నాడు. ఆయన క్రింద పడుకున్న వ్యక్తి ఇటు పూర్తిగా జారి మరొక్క కుదుపుకి క్రింద పడిపోయేటట్లు ఉన్నాడు.

ఈ అమ్మాయి ఓ దుప్పటి నాకు అందిస్తోంది. ఆలోచించాను. అందరూ లేచి ఉండగా నాతో మాట్లాడటం సిగ్గనిపించి ఇలా నిద్రకోసం కష్టపడుతున్నానని తెలుసుకుని ఎంతో ఆప్యాయతతో నాకు ఒక దుప్పటి అందిస్తోందన్నమాట.

'వద్దండీ.. నా దగ్గిరుంది' అన్నాను.

'ఇది మీ దుప్పటేనండీ. మూడోసారి క్రిందపడింది' వెంటనే అందుకున్నాను. థాంక్స్ చెప్పేముందే తన బెర్త్ మీదకి వెళ్లిపడుకుంది.

నీక్కూడా ఓ ప్రేమ వ్యవహారమా? అన్నట్లు రైలు కొద్దిగా మూలిగింది...

★★★★★

ఉదయం ఇద్దరూ దిగిపోయారు. కిటికీ దాకా జరిగాను. 'ఏం చేస్తుంటారు?', అడిగాను.

'రిసెర్చ్'

'ఓ. ఎందులో?'

'మానవ సంబంధాలు, మనుగడలు'

'ఆసక్తికరంగా ఉంది'

'అందుకే పరిశోధన చేస్తున్నాను. మీరు?'

'నేనూ బోర్డు మీద పాకుతాను!'

నవ్వింది.

'ఎందుకు? అంటే ఏ విషయంలో?'

'స్ట్రాటిజిక్ మేనేజ్‌మెంట్‌లో లెక్చరర్‌ని!'

'ఓ. దుప్పట్లు క్రిందకి తోసెయ్యటంలో ఏంటి స్ట్రాటజీ?'

' చంపేశారు... కావాలని అలా చెయ్యలేదు కదా?'

'ఏమో! నేను తీస్తానా లేదా అని ఆలోచించారని ఎందుకు అనుకోకూడదు?'

'అలా అయితే ఇటు ప్రక్క వ్యక్తి కూడా తీసి ఇవ్వవచ్చు కదా?'

'ఊ... మీకు పెళ్లికాలేదని అర్థమైంది' చెప్పేసింది.

'ఎలా చెప్పారు?'

'పెళ్లైన వారు ఎంతలేదైనా కొంత కుదురుగా ఉంటారు'

'కరెక్ట్'

ఓ కాఫీ కాన్ పట్టుకుని ఓ చిన్నకుర్రాడు కప్పులు అందిస్తున్నాడు. కొద్దిగా పొడి నింపి మరో కప్పు తీసుకుని ఆ కాఫీ కలిపే విన్యాసాన్ని అందరూ చూస్తున్నారు. కొద్దిగా కూడా చిందకుండా అర్థచంద్రాకారంగా కాఫీని అటూ ఇటూ కలుపుతున్నాడు. ఎడమచేతిని వయ్యారంగా ఊపినప్పుడు ఓ పాట కూడా పాడుతున్నాడు....

'నిజంగా.. నేనేనా... ఇలా నీ జతలో ఉన్నా'

అందరూ కాఫీ తాగుతున్నారు. అటు సైడ్ బెర్త్ మీద కూర్చున్న వ్యక్తి కూడా అడిగాడు. కప్పులో పొడివేసి టాప్ తిప్పాడు. అందరూ చూస్తున్నారనే ఉత్సాహం పెరిగింది. మరల ఒకసారి విన్యాసం చేసాడు. ఓ చిన్నపిల్ల అడిగింది' ఇంకోసారి చెయ్యవా?'

ఈసారి ఎడమ చేతితో స్టైమని ఊపాడు. బండి కదిలి కుదుపు ఇచ్చింది. ఆ కప్పు చేతిలోంచి జారి ఆ సైడ్ బెర్త్ వ్యక్తి మీద పడిపోయింది. గోలగోల చేసాడు అతను. కుర్రాడు కాన్ తీసుకుని పారిపోయాడు.

'ఎందుకు ఆ విన్యాసాలు?' నేనన్నాను.

'మానవ సహజం...' ఈమె చెప్పింది '... మామూలు మనిషిని కనీసం మామూలుగానైనా గుర్తించని సమాజం మనది' ఆలోచించాను. మాటలో దమ్ముంది.

రైలు ప్లాట్‌ఫార్మ్ దాటుతోంది. జనం చేతులూపుతున్నారు.

'మామూలు మనిషి అంటే?'

'ముళ్లలోనూ, మామూళ్లలోనూ ఇరుక్కుంటూ నిరంతరం మూలగా ఉండిపోయి మూలుగుతున్నవాడు' అందరూ ఇటు చూస్తున్నారని మా ఇద్దరికీ తెలుసు.

'అందుకు ఇలాంటి విన్యాసాలు తప్పవా?'

'అలా కాదు. గుర్తింపు... అది కోరుకోవటం తప్పు. దానిని వెతుక్కుంటూ ఉంటే విన్యాసం. ఇచ్చేది కానీ అడుక్కునేది కాదు. సమాజం సహజంగా ఇవ్వదు కాబట్టి ఎంతోమంది ఎన్నో చెత్త పనులు చేస్తూ ఉంటారు.'

'నాకు భయం వేస్తోంది'

నవ్వింది. 'ఎందుకు?'

'చంద్రుడు నేలమీద కొస్తే రాజకీయాలతో ముక్కలైపోతాడు. మిమ్మల్ని పెళ్లి చేసుకున్నవాడు మీ ఆలోచనలకి ముక్కామల వెళ్లి మొక్కలు నాటుకుంటాడు!'

ఈసారి నవ్వుకుంది.

'అంత భయం అక్కరలేదు. ప్రతి మగవాడికీ ఓ స్ట్రాటజీ ఉంటుంది...'

ఏదో అనబోయి నోరు తెరచి అలాగే ఆగిపోయాను. ఒక్క అరనవ్వు నవ్వి పూర్తిగా కిటికీ వైపుకు తిరిగిపోయింది.

ఓ సాయంత్రం లోకల్ దిగి ఫోన్ వచ్చినందుకు అక్కడే నిలబడి మాట్లాడుతున్నాను. రైలు కదలి వెళ్లిపోయింది. అటు ప్లాట్‌ఫార్మ్ మీద ఈ అమ్మాయి కూడా మొబైల్‌లో మాట్లాడుతూ నిలబడి ఉంది.

ఇద్దరం ఒకేసారి ఫోన్ బంద్ చేసి ఒకళ్లనొకళ్లు చూసుకున్నాం..

'హలో'

'హలో'

'మిమ్మల్ని ఎలా పిలవాలి?' అడిగింది.

'అనుబంధిని'

'ఛీ. అదేం పేరు?'

'మీ సబ్జక్ట్ కదా?'

'మిమ్మల్ని ఎలా పిలవాలి?'

'ఆలోచించండి'

'వ్యూహారావు'

'బాగుంది. స్ట్రాటజీ'

'మెట్లు అటున్నాయి'

'అయితే?'

కొద్దిగా ముందుకు వంగింది.

'మెట్లు అటున్నాయీ...'

'కాదూ... ఆ బ్రిడ్జ్ మీద కలుద్దాం. ఇలా మాట్లాడలేం!'

ఒకళ్లనొకళ్లు వేటాడుకుంటున్నట్లు దొంగ చూపులు చూసుకుంటూ బ్రిడ్జ్ మీదకి ఎక్కాం. పట్టాల చివార్న సూర్యుడు అప్పటివరకూ దారి చూపించి ఇక నా వల్లకాదు లైట్లు వేసుకోండని చెప్పినట్లు క్రిందకి దిగిపోతున్నాడు.

'మా వాళ్లు సంబంధాలు చూస్తున్నారు'

'మీకే?'

'ఏం? చూడకూడదా?'

'సంబంధాలను ఉతికి ఆరేసిన వాళ్లకి వాళ్లు సంబంధాలు చూడటం దేనికి?'

'తప్పదు. వాళ్లు మేం కథ ప్రారంభించాం అని చెప్పటానికి అలా చేస్తారు. కథ ముందరే ప్రారంభమైందని తెలుసుకోవాలన్నా తప్పదు.'

'కరెక్ట్. రోజులలా ఉన్నాయి. మరి ప్రారంభం చెయ్యండి'

'ఏంటి?'

'ఏదో కథ అన్నారు కదా?'

'ప్రారంభం అయింది.'

'గుడ్'

'ఆరోజు రైల్లో'

'ఓ...'

'మీతోనే!'

ఈ లోకంలోకి వచ్చాను. నా ఎడమప్రక్క ముట్టుకోకండి, షాక్ కొడుతుంది, డైరెక్ట్ కరెంట్ అనే బోర్డు కనిపిస్తోంది. ఆమె నవ్వింది.

'షాక్ అవకండి. ఆ బోర్డులు మామూలే. మనిద్దరం బోర్డుమీద పాకే వాళ్లమే. ఆలోచించండి. బలవంతం ఏం లేదు' దూరంగా పాయింట్ సిగ్నల్ దగ్గర పట్టాలు మారి మరో పట్టా మీదుగా ఓ రైలు ఇప్పుడే స్టేషన్ చేరుకుంటోంది!

అన్నీ సద్దుకుని ఉదయమే గబగబా యూనివర్సిటీకి వెళ్లిపోతోంది. తలుపు దగ్గర అడ్డంగా నిలబడ్డాను. ఏం చేయాలనుకుంటోంది? పెళ్లయి ఆరునెలలు గడిచాయి. దగ్గరకి రానీయదు. ఏవో సిద్ధాంతాలు చెబుతుంది.

'క్లాసుంది' అంది.

'మనకి పెళ్లి అయినట్లా? కానట్లా?'

గబగబా బాగ్‌లోంచి మొబైల్ తీసి ఫోటో చూపించింది. అర చిరునవ్వు మరల అరిసె వేసినంత తీయగా చూపించింది. లోపల పెట్టింది. నేను కదలలేదు.

'ప్లీస్...'

'ఏంటి సంగతి? ఎలా కనపడుతున్నాను?'

తప్పుకోమని చెయ్యి ఊపింది. మరో రోజు చూద్దామనుకుని తప్పుకుని దారిచ్చాను. తలుపు తెరుచుకుని వాకిట్లోకి వెళ్లింది. ఎందుకో ఓ క్షణం ఆగి ఇటు తిరిగింది.

'పెళ్లితోనే అనుబంధం ఏర్పడుతుందా లేదా కామంతోనే దగ్గరవుతారా?... అ...' చెయ్యి అడ్డుపెట్టింది '...ఇది నేను అడుగుతున్నది కాదు ....ఈ రోజు నే తీసుకుంటున్న క్లాసు'

నవ్వి అటు తిరిగింది. చెయ్యి పట్టుకుని లోపలికి లాగాను.

'నాకూ సాయంత్రం క్లాసుంది'

'చెప్పండి'

'సమాజంలో, సంఘంలో ఉంటూనే సమాజాన్ని చదువుతూ ఏదో సాధించేసాం అనుకునే కాలం విలువ తెలియని మూర్ఖులను సరిచేయటానికి స్ట్రాటజీ ఏమిటా? అని'

జాగ్రత్తగా నా చెయ్యి తన చెయ్యి మీద నుంచి తీసేసింది.

'క్లాస్ తీసుకోండి. మంచి క్లాస్. ఎవరైనా సందేహాలు అడిగితే తీర్చండి. సబ్జక్ట్ బాగుంది. బై!'

వెళ్లిపోయింది.

కాలం కరిగిపోయింది. ఎందరినో కనుక్కున్నాం. బంధం ఏర్పడటానికి కావలసిన దినుసులు వివాహం జరిగిన ముహూర్తంలో లేవన్నారు. ఇన్ని బంధనాలతో ఒక బంధాన్ని ఎలా సాధిస్తారు అన్నారు. కాలంలోని ఆ క్షణంలో ఏ అలజడీ లేకుండా కలసినప్పుడు మనస్సులోని జఢత్వాలు వివాహబంధానికి అడ్డురావన్నారు కొందరు.

మనోవైజ్ఞానికులు మరేవో చెప్పారు. బంధువులు చెరో తిట్టూ బిస్కట్లు పంచుకున్నట్లు పంచుకుని తిట్టారు. నాకు వచ్చింది ఏమీలేదా, పోయిందీ ఏమీ లేదనుకున్నాను.

అమ్మాయిలలో అందం కనిపించటం మానేసింది. నా జీవితం వృధాకాలేదు. ఓ ఏడాది తరువాత ఇదే రైలు బ్రిడ్జిమీద చిన్నపిల్లను ఎత్తుకుని నిలబడ్డాను. లోకల్ దిగి బ్రిడ్జ్ ఎక్కి ఇటే వచ్చింది. ఏది ఎలా ఉన్నా చక్కని వ్యవహారాలుంటాయి ఈమెకు. నాలుగడుగులు ముందుకు వేసి ఆగింది.

'హాయ్'

'హలో'

'హలో...', అంటూ పాపను పలుకరించింది. కొద్దిసేపు అలాగే ప్రక్కన నిలబడింది.

'ఎవరీపాప?' అడిగింది.

'మా అమ్మాయే!'

'ఓ. నా రిసెర్చ్ మోసపోదు'

'నీ రిసెర్చ్ కరెక్ట్. మన పెళ్లి సమయానికి ఇది చంటిపిల్ల' మా ఇద్దరినీ జాగ్రత్తగా చూసింది.

'ఓ.'

'పెళ్లి అనే తంతుతో అనుబంధానికి సంబంధం ఎందుకు?' ఆలోచించింది. 'బై' అని చెప్పి కొంతదూరం వెళ్లి మరల వెనక్కి వచ్చింది. బాగ్‌లోంచి ఓ చిన్న చాక్‌లెట్ తీసి పాపకిచ్చింది. ముక్కుగిల్లి వెళ్లిపోయింది.

ఏంటో ఈమె గోల. ఏం కావాలో తెలియదు. ఏం చేస్తోందో తెలియదు. ఎవరు కావాలో తెలియదు. అందరి దగ్గరా కావలసినంత సమాచారం ఉంది ఈ రోజుల్లో. ఆ సమాచారాన్ని ఏం చేయాలో తెలియదు. బ్రతకటానికి కావలసినవన్నీ సమకూర్చుకుంటారు. బ్రతుకంటే ఏంటో తెలియదు...

కొద్దిరోజుల తరువాత అపార్ట్‌మెంట్స్ లిఫ్ట్ ఎక్కబోతుంటే వాచ్‌మన్ వచ్చాడు.

'సార్, అమ్మగారు వచ్చారని తాళాలిచ్చాను' అన్నాడు. ఏమీ మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్లాను. బెడ్‌రూంలోని కంప్యూటర్‌లో ఏదో పనిచేస్తూ కనిపించింది.

'రండి' అంది.

నా బాగ్ ప్రక్కన పెట్టి షూ విప్పాను.

'నా మెటీరియల్ కొంత ఇందులో ఉండిపోయింది...' చెప్పింది,

'...పాప ఏదీ?'

'వాళ్ల అమ్మ దగ్గిరుంది'

'ఓ'

మంచినీళ్లు త్రాగి కంప్యూటర్‌లోకి చూసాను.

‘రిసెర్చ్ ఎలా ఉంది?‘ అడిగాను.

అందులోంచి లాగ్ అవుట్ అయి హాల్లోకి వచ్చి సోఫాలో కూలబడింది.

‘ఏం చేస్తాం? రిసెర్చ్‌లో వదిలించుకోలేనిది చేరిపోయింది... ఈ ఇల్లు, ఈ గోల...‘

‘హు...దీనితో ఏం పనిలేదు‘

‘ఉంది సార్. మానవ సంబంధాలు - ఎన్ని ఇళ్లుంటే ఎలా ఉంటుందో చూడాలనుంది. డేటా ఎంత ఎక్కువుంటే అంత మంచిది. ఆవిడనీ ఇక్కడే ఉండమనండి! ఆట బాగుంటుంది‘

‘నీకేం కావాలి?‘

‘ఆవిడని చూడాలి, మాట్లాడాలి‘

‘ఆమె చేసే రిసెర్చ్‌కి నీతో పనిలేదు. అందరూ రిసెర్చ్ టూల్స్ అనుకోకు, షాక్ తింటావు‘

‘ఏం రిసెర్చ్ చేస్తోందేమిటి? పిల్లల్ని కని పెళ్లిళ్లు ఎలా చేయించాలనా?‘

‘నో. పెళ్లి చేసుకుని ఎలా? చేసుకోకుండా ఎలా మరొకరిని బాధ ఎలా పెట్టాలి అని‘

‘నాకు ఆమెతో ఒక ఇంటర్వ్యూ కావాలి‘

‘నో. కుదరదు‘

‘కావాలీ..‘ గట్టిగా అరచింది.

‘నీకు ఆ అధికారం లేదు‘

‘ఎందుకు? మా అమ్మ నాన్నల్ని, నన్ను మోసం చేసే అధికారం మీకెవరిచ్చారు?‘

‘నీ తల్లిదండ్రులమాట వినని దానివి, వాళ్లగోల నీకెందుకు?‘

‘నిన్ను బజారుకీడుస్తాను‘

‘బజారులో ఉన్న నీ సమాజం... ఇంకెక్కడికి ఈడుస్తుంది నన్ను?‘ మంచి నీళ్ల బాటిల్ ఖాళీ చేసింది.

‘ఒకే! ఒకే ఒక ఫేవర్‘

‘చెప్పు‘

‘నీ బ్రతుకు నీది. ఈ సంగతి ఎవరికీ చెప్పకు. నేను మోసపోయినదానిగా నన్ను ఎవరూ చూడకూడదు‘

ఆశ్చర్యం వేసింది. ఏముంది ఈ చదువులలో? నాలుగు అమెరికా మెరికలు, ప్రపంచాన్ని ఏలేసిన ఎత్తుగడలు, వేళాపాళాలేని వెర్రితలలు...గుర్తింపు దెబ్బ తింటే బ్రతకలేరు, తనే చెప్పింది!

‘ఆల్‌రైట్. మానవ సంబంధాల సబ్జక్ట్ నుంచి నా సబ్జక్ట్‌కి వచ్చినట్లున్నావు. మార్పు బాగుంది. ‘

‘కొంత అబ్బింది!‘

దగ్గరకి లాక్కున్నాను.

‘నో‘ అంది

‘మరింత అబ్బుతుంది‘

‘నాకు ఇంత చాలు‘

'ఆ పాప నా పాప కాదు. అలాంటి ఆవిడ ఎవరూ లేరు' వదిలించుకుని కళ్లల్లోకి చూసింది. సోఫాలో కూలబడి మొహం చేతుల్లో దాచుకుంది. మరల దగ్గిరకి వచ్చి గట్టిగా పట్టుకుంది.

'నీ మనసు ఖాళీ చేసుకో. నాది ఖాళీగానే ఉంది. అది నిజమైన ముహూర్తం. అప్పుడే ఆ క్షణం ఇద్దరిదీ. లేకపోతే ఎవరి పట్టావారిది, ఎవరి డిగ్రీ వారిది'

చాయ్ పూర్తి అయింది. టీ స్టాల్ వాడు గ్లాసులు తీసుకుని లోపల పెట్టేసాడు.

'మరి రోజూ ఇలా రైలు వెళ్లేవరకూ నిలబడి అటువైపు ఎవరికోసం చూస్తారు?'

'నోనో...చాలామంది జంటలను చూస్తూ ఉంటాను. ఆ బ్రిడ్జ్ మీదకి వెళ్లి కొద్దిసేపు మాట్లాడుకుని బై చెప్పుకుని వెళ్లిపోతూ ఉంటారు. ఊరికే ఇదో సరదా అయిపోయింది'

ఇద్దరూ ఎక్జిట్ గేట్ వరకూ వచ్చారు.

'ఇప్పుడు ఒంటరిగా ఉన్నారా?'

'లేదు. అనవసరమైన ఆలోచనలతో విడాకుల దాకా వెళ్లిపోయే వాళ్లకి ఏవో కబుర్లు చెబుతూ ఉంటాను. ఇక్కడ కూర్చోపెట్టి నా కథ చెబుతూ ఉంటాను'

'అవునా?'

'అవును. ప్రేక్షకులలో కూడా పర్‌ఫార్మర్స్ ఉంటారు. ఒక బృందగానంలోకి అనుకోకుండా వచ్చేసాక గొంతు కలిపిపాడాలి, లయబద్ధంగా ఆడాలి. ఆ ప్రదర్శన ఇవ్వాలంటే బుర్రలో వెర్రి ఆలోచనలు పనికిరావు. ఇది జీవితంలోని స్ట్రాటజీ'

ప్లాట్‌ఫారమ్ మీదుగా ఏదో రైలు ఆగకుండా వేగంగా వెళ్లిపోయి దూరంగా ఓ కూత కూసింది.

## కుటుంబం

**కవితలు, కథలు** అన్నింటినీ బంగారు దుకాణంలో ఏదో చంద్రహారాన్ని అద్దం ముందర అమర్చి చూసుకుంటున్నట్లు చూసుకుంటున్నాను.

'ఏదో వెతుక్కుంటున్నట్లున్నారు?' వినపడింది.

వెనక్కి తిరిగాను. ఏ మాత్రం శబ్దం చేయకుండా ఎప్పుడో వచ్చేసి వెనుకే నిలబడి ఉంది కవిత.

'నువ్వొచ్చాక ఇంక దేనిని వెతకాలి?'

చేతి బాగ్ అలా టేబిల్ మీద పెట్టి అలా కూర్చుంది.

'అంటే? నన్ను వెతకమనా?'

'కాదు. ఈ కాగితాలలో కవితను ఇక వెతకనక్కరలేదు కదా!'

'ఓ.'

'ఒక ఆలోచన వస్తోంది.'

'ఏంటి?'

'ఈ తెల్లకాగితాలమీద కనిపిస్తున్న ఈ అక్షరాలన్నీ మన పరివారమే కదా!'

'నిజమే. ఒక్కో శీర్షిక క్రింద కట్టుకున్న ఒక్కోగూడు. అన్నిటికీ రెక్కలు వచ్చేసినట్లున్నాయి'

'కవితలోని పదాలు, పదజాలాలు, భావాలు...నీవైపు బంధువులు, కథలోని సంఘటనలు, వాక్యాలు, నావైపు బంధువులు.'

'బావుంది'

'రెండు కుటుంబాలూ ఎంతగా కలిసిపోయాయో చూడు!'

'నిజమే

'ఇంక పెళ్లి ఎందుకసలు?'

తన మోచేతిని టేబిల్‌మీద పెట్టి పిడికిలితో బుగ్గను నొక్కుతూ నన్ను అదోలా చూసింది. ఇప్పుడే ముదిరిందా ఈ రోగం లేక బాగా ముదరటం వలన ఇప్పుడు బయట పడుతోందా అని సూటిగా అడగటం సమంజసం కాదేమో అనుకున్నప్పుడు ఆడవాళ్లు సామాన్యంగా అలా చూస్తారని ఒకళ్లిద్దరు ముగ్గురికి చెబుతుండగా నాలుగో మనిషిగా నేను వినటం జరిగింది.

'మరి ఏం చేద్దాం?' అడిగింది.

'ముహూర్తం నిర్ణయించి తాంబూలాలు పుచ్చుకున్నారు కదా?'

'అవును. అయితే పెళ్లయిపోయినట్లేనా?'

'నో నో. ఆ ముహూర్తం రోజున స్టేజ్ మీద అందరం నిలబడి మేం కలసిపోయాం. ఈ ముహూర్తానికి ఆ ప్రకటన చేస్తున్నాం అని చెప్పి వెళ్లిపోదాం. ఈ ఖర్చు ఎందుకు?'

'ఊ... బాగుంది. బట్టల షాప్ వాళ్లని, జువెలరీ వాళ్లనీ అందరినీ బాగు చేసేసాం కదా! ఇంకెందుకు?'

'లేదు కవితా! అక్షరాలా కలసిన ఆలోచనలు బంధువులలా సాక్షాత్కరిస్తే ఎలా ఉంటుందో చూడాలి కదా? అందుకైనా పెళ్లి అనే విధానం జరుపుకోవాలి'

'లక్షల మాట ఇది'

'శభాష్. అయితే అక్షమాలలా ఓ కవిత చెప్పు'

ఓసారి కాగితాలన్నీ ప్రేమగా చూసింది కవిత.

'వసంతుడు ఎదురు వెళ్లి మల్లె తీగని మురిపించాడు...' కవిత కవిత వినిపించింది...

***'వసంతుడు ఎదురు వెళ్లి మల్లె తీగెని మురిపించాడు***
***అది నాకూ సమ్మతమేనంటూ***
***మావిరెప్ప తల ఊపింది***
***కోకిలమ్మ చివుళ్లు వేగిరంగా కొమ్మ కొమ్మని చుట్టుకున్నాయి.***
***అలుపులేని కాలచక్రం ఉత్సాహంగా రెమ్మరెమ్మని పూయించింది.***
***ఈ ఎదురు కొలువుకి ఎంతమంది పెద్దలో... అందరి మోమున చిరునవ్వులే!***
***అందరి చేయూత అందంతో అమరింది.***
***ఇదంతా దేనికోసం?***
***కవ్వింత కంటికింపుగా వుండేటందుకే మరి!***

*మరో కుటుంబం ముచ్చటగా కొలువుతీరేందుకేనా?*

## *ఎదురు కొలువు*

సుకుమారికి ఏ రోజైనా ముందర ఆగ్రహం, తరువాత గ్రహాలమీద చర్చ, ఆ చివర పూర్తి నిశ్శబ్దం అలవాటై కూర్చున్నాయి. పురుషోత్తమరావు పేరుకు తగ్గ ఉత్తముడూ కాడు, అన్నింటినీ సమర్ధించుకోగల పురుషుడూ కాడు. పెళ్లయిపోయి నూట ఎనభై రోజులు దాటి ఒక పూట పూర్తయింది. అంత నిక్కచ్చిగా లెక్క వెయ్యటం మటుకు ఈ భార్యాభర్తలు పెళ్లయినప్పటినుండే చక్కగా చేసుకుంటున్న పని! చాకలి పద్దుకూడా బహుశః అంత కరెక్ట్‌గా వేసి ఉండరు అలా అని ఇద్దరూ అసలు పరస్పరం మాట్లాడుకోరా అనుకోవటం పొరపాటు. ఒక్కోసారి అర్ధరాత్రి దాటిపోయి కూడా ఇక పాలవాడు వచ్చేస్తాడు అనే టైంకి కూడా చర్చించుకున్న రోజులున్నాయి. అయితే భార్యాభర్తలు చర్చించుకోకూడని విషయం అది... అదేమిటంటే మనం ఇలా పోట్లాడుకుంటూ ఎన్నిరోజులు కరెక్ట్‌గా కలసి ఉండగలము అనే అంశం మీద సమాలోచన ప్రారంభం అయి, మరో ఆలోచనగా మారి, నీ లెక్క తప్పంటే నీ లెక్క తప్పు అని అనుకుని, ఎన్ని లెక్కలు తప్పు అయినప్పటికీ ఇలా కనీసం ఈ విషయంలోనైనా ఒక మాట మీదకి మనం రాలేకపోయాం కాబట్టి అన్ని లెక్కలూ తప్పే అనుకుని ఈ రాత్రితో ఈ వైవాహిక జీవితానికి దీర్ఘవిరామం - ఫుల్‌స్టాప్ పెడదామని నిర్ణయించుకుంటూ ఉంటారు.

ఉదయమే ఆ పని చేసే అమ్మాయి వచ్చి బెల్ నొక్కి ఎవరూ తలుపు తెరవపోయేసరికి 'ఊ.. మళ్లీ మొదలు' అనుకుని ఏదో చేతనైన పని చేసేసి వెళ్లిపోతుంది.

ఉత్తముడు లేచి అటూ ఇటూ తిరిగాడు అలాంటి ఉదయాన్నే ఈ రోజు.

తమ్ముడు వెల్లూరులో చదువుతానన్నాడు. హైదరాబాదులో కూడా సీటు వచ్చింది. ఇక్కడే చదవమంటుంది సుకుమారి. పైగా మన ఇంట్లోనే ఉంటూ చదవమంటుంది. కుర్రాళ్లు హాస్టల్‌లో ఉంటే తనకి భయం. డబ్బు ఖర్చు అన్న మాటమీద కాదు అని వాదిస్తుంది.

టి.వీ పెట్టి మ్యూట్ చేసాడు. కుమారి పడుకుంటే మనసు కుదుటపడుతుందని ఉత్తముడు ఎక్కువగా ఉత్తమంగా ఆలోచిస్తూ ఉంటాడు. బెడ్‌రూం తలుపు వైపు చూస్తూ అలా టి.వీలో వార్తలు గమనిస్తున్నాడు. ఏదైనా మాట కాదంటే చాలు చాలా దూరం ప్రయాణం కట్టేస్తుంది ఈ అమ్మాయి. తలుపు చిన్నగా తెరుచుకుని టక్కున మూసుకుంది. టి.వీలో వార్తలు కూడా మూసుకున్నాయి. ఒక బిస్కెట్ కలర్ సూట్‌కేస్ ముందు ఇవతలకి వచ్చింది. తరువాత చక్కగా ముస్తాబయిన కుమారి వచ్చి పెట్టె అలా పెట్టింది.

'నావల్ల కాదు', చిన్నగా చెప్పింది.

'ఏమైపోయిందని?' మెల్లగానే అడిగాడు.

'నా మాటకు విలువలేని చోట నేనెందుకు?'

'లోక్‌సభ స్పీకర్ మాటకే విలువలేదు. అలా చూడు'

'ఇదే నాకు నచ్చనిది. అన్నీ నవ్వులాటలాగా ఉంటాయి. నేనూ ఓ మనిషిని. అయినా నేను వాదించను.'

'ఏం చేస్తావు?'

'వెళ్లిపోతాను.మీరు'

'ఎక్కడికి?'

'తెలియదు. ఎందుకు చెప్పాలి?'

'చెప్పాలేమో ఆలోచించు'

'నో. నేను ఆలోచించను'

'కాఫీ సంగతేమిటి?'

'వంటిల్లుంది, పొడుంది, పంచదారుంది.'

'నువ్వు తాగవా?'

'మీకనవసరం'

కాలింగ్ బెల్ మ్రోగింది. ఉత్తమ్ లేచి తలుపు తీసాడు. లుంగీ, షర్ట్, ఓ టవల్‌తో ఓ పెద్దాయన నిలబడున్నాడు. చిన్నసైజు ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ సైజు విభూతి నుదుటి మీద మెరుస్తోంది.

**'నారా...యా...అన్.....కరక్....చిక్'** అని చేతులు కలిపాడు. డాక్టర్లు వాడే బాగ్ ఒకటి కనిపిస్తోంది. మనిషి ఎవరో అర్థంకాలేదు. భాష తమాషాగా ఉంది. ఇలాంటి అర్థంకాని వ్యవహారం ఎక్కువగా ఈ కుమారి తాలూకా వారిదై ఉంటుందని అటు చూసాడు. అక్కడ మరో పెట్టె ప్రక్కన నా సంగతేమిటి అన్నట్లు ఆమె నిలబడుంది. ఆలోచించే లోపల లోపలికి వచ్చి ఫాన్ కూడా ఆన్ చేసి సోఫాలో కూర్చున్నాడు. ఉత్తమ్‌కి ఇప్పటికీ ఫాన్ స్విచ్ బదులు లైట్ స్విచ్ వేసే అలవాటుంది.

'మీరా...'

**'నారా...యా...చిక్ చిక్.... మారిపో...త?ఎ...** '

'నా పేరు ఉత్తమ్. మీరు...'

చప్పట్లు కొట్టాడు. 'కలకలపోయి.. ఇట్టా.. ఎట్టా?'

అన్నాడు. కుమారి తన గదిలోకి పారిపోయింది. ఇతను చూస్తే వింతగా మాట్లాడుతూ చూసావా ఎంత గొప్ప విషయం చెప్పానో అన్నట్లు ఓ నవ్వు కూడా నవ్వుతున్నాడు. ఏమీ చెయ్యలేక గదిలోకి వెళ్లాడు.

'ఇదిగో, నీ మావయ్యో, పెదనాన్నో అనుకుంటా, ఊరినుంచి వచ్చినట్లున్నాడు', అన్నాడు. కుమారి అప్పటివరకూ తనలో తాను నవ్వుకుంటూ ఉంది. వెంటనే సీరియస్ అయింది. చెయ్యి చూపించింది. 'ఇదిగో, నాకు ఇలాంటి వాళ్లెవరూ బంధువులు లేరు. మీ వైపు చుట్టమే ఎవరో..'

'నాకు ఈయనెవరో తెలియదు'

'కూర్చో పెట్టారుగా! ఏం కావాలో చేసి పెట్టండి.'

మరల హాల్లోకి వచ్చాడు. ఆయన చెయ్యి ఉపదేశం చేస్తున్నట్లు పెట్టాడు.

**'కావలి...కొక్కా... కరిషాక్ చిక్. అల్లా' అన్నాడు.**

'ఎక్కడినుండి వచ్చారు సారే!'

ఎందుకో టైలర్‌లా కాలు ఆడించటం మొదలెట్టాడు.

**'రాన్...కారంకోవ...కల్లారి చిక్'** అన్నాడు. ఉత్తమ్ నమస్కారం పెట్టాడు.

'కరెక్ట్‌గా చెప్పండి సార్. నాకేమీ అర్థం కావటంలేదు' అతను ఎందుకో ఈ మాత్రం తెలియదా అన్నట్లు తల బాదుకున్నాడు.

**'కిల్ జిడ్స్ కార్.. అల్లా'**

కుమారి నవ్వు ఆపుకుంటూనే వంటింట్లోకి వెళ్లింది. ఆయన లేచి టి.వి రిమోట్ తీసుకుని టకటకా చానెల్స్ అన్నీ మార్చేసి ఒక చానెల్ దగ్గిర ఆగాడు. వెనక్కి తిరిగాడు. టి.వి అస్సలు బాగాలేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

**'సరై.. కావ...చాన్ చిక్...నో'** అన్నాడు.

వచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఉత్తమ్ గదిలోకి వెళ్లి కంప్యూటర్‌లో ఉన్న పెళ్లి తాలూకు ఫోటోలన్నీ టకటకా చూసాడు. ఎక్కడా ఇలాంటి శాల్తీ కనిపించనేలేదు. ఇదేదో రాంగ్ నంబర్. రాంగ్ అడ్రస్‌కి వచ్చినట్లుంది.

మరల హాల్లోకి వచ్చాడు. కుమారి ఏమనుకుందో ఏమో, కాఫీ తీసుకుని వచ్చి అలా టీపాయ్ మీద పెట్టింది. అది తీసుకుని ఆమెను ఓ చూపు చూసాడు. ఎందుకో టపటపా కన్నీళ్లు కార్చేసాడు. కుమారి జుట్టు నిమిరాడు.

**'కాలం..కావలిన...కార్ సిక్...తే!'** అంటూ తనలో తాను ఎందుకో బాధపడిపోయాడు!

సంచీలోంచి ఏవో గాజులు తీసి ఇచ్చాడు.

'నేను మిమ్మల్ని గుర్తుపట్టలేదు' చెప్పింది కుమారి.

**'చిక్కరీస్ చికోరి చిక్..అయ్యో'** అన్నాడు.

ఆ చివరి మాట ఒక్కటీ అర్థమైంది. కాకపోతే ఇద్దరికీ అంతా పూర్తిగా అర్థమైనట్లు ఆయన ఎంతో గర్వపడుతున్నట్లు కనిపిస్తోంది. కుమారి లోపలికి వెళ్లిపోయింది. కూర్చోమని ఉత్తమ్‌కి మర్యాద చేసేసాడు అతిథి.

'ఆఫీస్‌కి వెళ్లాలి...మీరు...'

'ఆఫీ...పో...కావాలికచ్చా, కరెక్ట్ చిక్,' అంటూ వాచ్ చూస్కున్నాడు. అటూ ఇటూ చూసి సోఫాలోని దిండు సర్దుకుని కాళ్లు జాపేసి చక్కగా నిద్రపోయాడు.

'ఆఫీసుకు వెళ్లటానికి వీల్లేదు..', కుమారి శాసించింది.

'ఆయనెవరో నాకు తెలియదు!'

అదీ నిజమే. ఈ చిక్ చిక్‌ని ఏం చేయాలో తెలియటం లేదు...

'కాఫీ పెట్టినందుకు థాంక్స్', లోపలికెళ్లి మెల్లగా అన్నాడు.

'మీకు ఇవ్వలేదుగా?'

'అంటే?'

'వచ్చినవారికి మర్యాద. దట్సాల్'

'ఆయనెవరో తెలియటంలేదు.'

'నాకెందుకు?'

'ఇంతకీ ఆ పెట్టె లోపల పెట్టి వంట చేసెయ్. ఓ పని అయిపోతుంది'

'నో.'

'ఆ పెద్దాయన కోసం చెయ్యవా?'

'ఆయనెవరో కనుక్కుని నాకు వివరం చెప్పి ఆఫీసుకు వెళ్లిపోండి. ఆయనకి కావలసినవన్నీ చేసి పెడతాను.'

'అది నావల్ల కావటంలేదు సుక్కూ.'

'చిన్నపని కావటంలేదు. నేనంటే విలువలేదు. అసలు ఏమనుకుంటున్నారు?'

'ఇంట్లో కూరలున్నాయా?'

'ఏవో ఉన్నాయి. ఈయన ఏం తింటారో ఏమో?'

'అడిగితే చైనీస్‌లో మాట్లాడుతున్నాడు. చిక్ చిక్ అంటాడు. చిక్కీలు రైటేమో!'

'ఖచ్చితంగా మీ చుట్టమే. సరైన భాష కూడాలేదు. అర్థం లేకుండా మాట్లాడడం'

'కాదు. నీ వైపే. అర్థంకాకుండా మాట్లాడటం!'

'సరే. ఇప్పుడు ఈ గోలెందుకు? ఆ టమాటలు తీసుకుని చట్నీ చెయ్యి. ఓ పనైపోతుంది!'

'మీకు కావలసినది ఆయన మీద ఎందుకు రుద్దటం? తప్పకుండా చేస్తాను. కానీ మీరు ఈ రోజు కాంటీన్‌లో తింటే ఎందుకో తెలియదు కానీ సంతోషంగా ఉంటుంది!'

ఉత్తమ్ హాల్లోకి వచ్చాడు. ఆడవాళ్లు నీరసంతో నిరసన ప్రదర్శిస్తారని విన్నాడు. ఇలా నీరసం తెప్పిస్తారని అనుకోలేదు. చిక్ చిక్ నడుము వాల్చటం ఏంటి, నాలుగో గేరు టచ్ చేసేసాడు. ఎవరై ఉంటారా ఈ కారెక్టర్? ఆ బాగ్ తెరచి సామానంతా చూస్తే తెలిసిపోతుందేమో! బాగుండదనుకున్నాడు. మొబైల్ తీసి ఫోటో తీసి తన మేనమామకి పంపాడు. ఆ మెసేజ్ క్రింద ఏదో అడగబోయే ముందరే ఓ మెసేజ్ వచ్చింది.

'ఆఫీసునుండి తప్పిపోయాడా?' అని.

ఉత్తమ్ జవాబుగా వ్రాసాడు. 'ఈయనెవరైనా మన బంధువా?' కొద్దిసేపటికి కాల్ వచ్చింది.

'హలో'

'ఒరేయ్, బంధువో కాదో అలా ఉంచు. ఇప్పుడెందుకు అడుగుతున్నావు?'

'ఇంటికి వచ్చి పడుకున్నాడు

'వార్ని. నీకు చెప్పలేదా? సరిగ్గా అడుగు. ఎవరిల్లో మరి!' 'నేను సరిగ్గానే అడిగాను. ఆయనా చెప్పాడు. ఆ భాష మటుకు అర్థంకావటంలేదు.'

'మతి స్థిమితం పోయినవాడేమో చూడు'

'చక్కగా చిక్కని కాఫీ త్రాగాడు'

'బావుంది నీ గోల. కాఫీ త్రాగేవాళ్లందరూ మతిస్థిమితం ఉన్నవాళ్లని అర్థమా? మీ అత్తయ్య ఆరుసార్లు త్రాగుతుంది'

'నాకలా కనిపించటంలేదు. ఈవిడకి గాజులు కూడా ఇచ్చాడు'

'ఛా. అమ్మాయివైపు చుట్టంలేరా. మెల్లగా కనుక్కో, దూరపు చుట్టాలైనా ఈ మధ్య ఓ పూట తలదాచుకోవటం కోసం అలా వస్తూ ఉంటారు. కొద్దిగా ఆ టి.వీ ఛానెల్ వాడిలాగా ఇంటర్వ్యూ చేసి నిజంలాగు.'

'అలా జరగటం కష్టంగా ఉంది. మాట్లాడే ముందర సౌండ్ చేస్తారు చూడూ, ఆ శబ్దాన్ని భాషగా వాడుకుంటున్నాడు'

'ఎవరో మొనగాడురా.'

'అమ్మాయేమో ఆయనొక్కరికే వంట చేస్తానంటోంది'

'ఇప్పుడు పాయింట్‌కి వచ్చావు. నీకు తెలియకుండా పిలిపించింది ఆలోచించు'

'ఇది నిజంగానే ఆలోచించాలి. నువ్వు జీనియస్‌వి. మళ్లీ ఫోన్ చేస్తాను.'

పెట్టేసాడు.

అటువైపు కూడా ఆ ఫోటో ఎవరికో వెళ్లింది.

'ఇలాంటివి షేర్ చెయ్యకు' అని మెసేజ్ వచ్చింది.

'ఈయనెవరో తెలుసా?' అని ఈమె అడిగింది.

ఇద్దరూ సమాధానం ఇచ్చారు.

'ఆ మధ్య నీళ్లతో పెట్రోల్ చేసినాయన' అని ఒకటి,

'ఈ మధ్య జైలుకెళ్లి ఇవతలకి వచ్చిన ఓ నిత్యానంద బాబా' అని రెండవది.

'మనకు సంబంధీకులా?', అని అడిగింది.

'ససేమిరా! మీ ఆయనకు చెప్పి పంపించేయ్.. ఆయన వైపు వాళ్లయితే నీ ఇష్టం!'

ఉత్తమ్ అటూ ఇటూ పచార్లు కొట్టాడు. కుమారి వంటింట్లోకి వెళ్లింది. ఏవో సద్దుకుని స్నానానికి వెళ్లిపోయింది. పడుకునున్న చిక్‌చిక్‌కి మనసులోనే సెల్యూట్ కొట్టాడు ఉత్తమ్.

మరో పెట్టె ప్రహసనం ఇప్పటికి ఆగింది అనుకున్నాడు.

ఇంతలోనే అతిథి లేచాడు. బాగా అలవాటున్న ఇంటిని చూసినట్లు చుట్టూతా చూసి ఇలాంటి ఇళ్లు కరెక్ట్ కావన్నట్లు ఎందుకో తల అటూ ఇటూ ఊపాడు. ఉత్తమ్‌ని జాగ్రత్తగా చూసాడు.

'ఆఫీ...క్కరలే..తక్?' అడిగాడు.

చిక్ చిక్ నుండి ఒక్క నిద్రలో కథక్ కి వచ్చాడెందుకో బోధపడలేదు.

'ఇవాళ ఆఫీసుకు వెళ్లటంలేదండీ', అన్నాడు.

ఓహో అన్నట్లు చేతులు కట్టుకున్నాడు. అరె, ఈయన మాట అర్థమైపోయిందే అనుకుని ఎక్కడలేని ఉత్సాహం తెచ్చుకున్నాడు.

'సార్, మీరు ఎక్కడనుండి వచ్చారు? మనం ఒకరినొకరు ఏమవుతాం?', అడిగాడు.

ఆయన నిలబడ్డాడు. లుంగీ సరిజేసుకున్నాడు. వాళ్ల ఊరు వాకిట్లోనే ఉన్నట్లు అటు చూపించాడు.

'కావ క్ర కర్ కర్ కా?ఆ...భిరావ్ కచ్చికల్‌కి చిక్!' అనేసాడు ఒక్క ఊపిరిలో. మరల చెక్ పెట్టినట్లుంది ఉత్తమ్‌కి!

'మీరు నాకు ఏమవుతారండీ ఇంతకీ?'

నోరు తెరచి అవమానం జరిగినట్లు కొద్దిగా ఆగి బాధ చూపించాడు.

'పా...పాలకా... కర్ కట్'

మైకు టెస్ట్ చేస్తూ ఆంప్లిఫెయర్‌ను సద్దినప్పుడు ఓ చిత్రమైన శబ్దం వస్తుంది. అది ఈయనకు సహజంగా వస్తుందని గ్రహించాడు. మర్యాదగా తల ఊపాడు. ఆయన సంతోషంగా గుండెమీద చెయ్యిపెట్టాడు. చుట్టరికం అర్థమైనందుకో లేక ఆయన భాష ఈ భూమి మీద ఒక్కరికైనా పూర్తిగా అర్థమైనందుకో తెలియలేదు. చిన్నప్పటినుండీ అన్నట్లు చెయ్యి నేలమీదకి మూడడుగుల దూరంలో పెట్టాడు.

ఉత్తమ్ వంటింట్లోకి వెళ్లాడు. ఏదో లోపల పాడుకుంటోంది. ఆలోచించాడు. మావయ్య చెప్పింది కరెక్ట్. ప్లాన్ ప్రకారం నడుస్తోంది కథ అనుకున్నాడు. కాకపోతే ఉదయం త్వరగానే స్నానం చేసేస్తే ఆడవాళ్లకి అలక ఎక్కువసేపు ఉండదేమోనని అనుకున్నాడు. అలా అనుకున్నట్లుగానే 'ఏమి తేలింది?' అడిగింది.

'కొద్దిగా అర్థమవుతోంది' అన్నాడు.

'ఏమర్థమవుతోంది?' అటు తిరిగి కూర తరుగుతూనే అడిగింది.

‘చిన్నప్పుడు ఒక్కసారి ఎందుకో ఎత్తుకున్నాడుట‘

కుమారి నవ్వింది.

‘ఏమైంది?‘

‘అది కాదు నేనడిగింది. నేను పెళ్లిపోతున్నానని చెప్పాను కదా? ఆ సంగతి ఏమి తేలింది అని అడుగుతున్నాను. కాదు. నిలదీస్తున్నాను‘

‘నిలబడే ఉన్నానుగానీ, అంత పెద్దవి కావు, కొద్దిగా చిన్నవిగా తరుగు‘

‘మీకెందుకు?‘

‘అదేంటి?‘

‘ఇదంతా ఆయనగారికి‘

‘సరె. వడ్డించుకో నే వెళతాను.‘

‘గుడ్‘

ఈసారి కుమారి హాల్లోకి వచ్చింది.

‘మరో కప్పు కాఫీ తీసుకుంటారా?‘ అడిగింది ఉత్తమ్‌ని ఏడిపించటానికి. అలాగే అన్నట్లు తల ఆడించాడు. వంటింట్లోకి వెళుతుంటే వెనుకనుండి వినిపించింది...

‘పంచదార కొద్దిగా తగ్గించమ్మా‘

‘అలాగే‘ అంటూ ఏదో గుర్తుకొచ్చి వెనక్కి తిరిగింది. మాటలు రావనుకున్న పిల్లవాడికి అమాంతం మాటలు వచ్చినప్పుడు చిందులు వేసిన తల్లిదండ్రులలాగా ఇద్దరూ ఆయన ఎదురుగా కూర్చున్నారు.

‘ఇందాకటినుంచీ ఇలా ఎందుకు మాట్లాడలేదండీ?‘

‘తమాషాగా‘

‘చంపేసారు.‘

‘ఇంతకీ అలా ఎందుకు చేసారండీ?‘, ఉత్తమ్ అడిగాడు.

‘రాత్రి మీ నంబరుకు కాల్ చేసాను. హలో అని వినిపించింది గానీ ఆ తర్వాత మీ ఇద్దరూ ఊరికే వాదించుకోవటం అంతా విన్నాను‘

‘ఓ. ఆ కాల్ మీదా? గొడవలో పడి మరచి పోయాను‘

‘ఊ. నాకు మీ గోల అర్థమైంది. ఇద్దరికీ చెబుతున్నాను వినండి‘

ఇద్దరూ ఒకళ్ల నొకళ్లు చూసుకుని ఆయన వైపు తిరిగారు.

‘భార్యాభర్తల మధ్య గొడవలు ఎలాంటివో తెలుసా? అర్థంపర్థంలేనివి. నేను ఇందాకటినుండీ మాట్లాడుతున్నాను చూడండీ, అలాంటివి.‘

ఆ హాల్లో నిశ్శబ్దం ఆవరించింది.

‘ఏం లేదండీ...‘, ఉత్తమ్ చెప్పాడు. ‘..... నా తమ్ముడు...‘ ఆయన చెయ్యి అడ్డం పెట్టాడు.

'చూడండీ. నాకు తెలుసు. మీ ఆవిడ చిన్నప్పుడు మా బంధువుల్లోనే ఓ అబ్బాయి హాస్టల్‌లో ఉంటూ ఉరేసుకున్నాడు. ఆమెకు అదీ భయం. ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా అలా భయపడిపోయి వద్దు, వద్దు అంటుంది'

కుమారి తల దించుకుంది.

'అందరికీ అలా ఎందుకవుతుందండీ?' ఉత్తమ్ అడిగాడు.

'అసలు సమస్యే లేదు...', ఆయన చెప్పాడు '.....నేనుండేది వెల్లూరులోనే, మా ఇంట్లో ఉండి చదువుకుంటాడు. చాలా?'

'ఏంటి? మీరు వెల్లూరు నుండి వచ్చారా?'

'అవునూ. నా పేరు నారాయణ. కాకపోతే ప్రాంతీయంగా నారాయణన్ అంటారు. మీ ఇద్దరికీ నేను బంధువునే. అంచాత ఎదురుకోలు కార్యక్రమంలో కొద్దిసేపు అటూ కొద్దిసేపు ఇటూ కూర్చున్నాము. ఏ ఫోటోలోనూ పడలేదు. గుర్తుకొస్తున్నానా?'

'గుర్తుకొస్తోంది సార్..', ఉత్తమ్ చెప్పాడు, '..కాకపోతే ఇలా లుంగీలో లేరనుకుంటాను'

'నిజమే. పాంట్ షర్ట్‌లో ఉన్నాను. చాలా కాలం క్రితం తమిళనాడులో స్థిరపడ్డాను. నా భాషకూడా కొద్దిగా భిన్నంగా ఉంటుంది!'

'కొద్దిగానా?'

ఆ మాటకు ముగ్గురూ పిచ్చిపిచ్చిగా నవ్వుకున్నారు. కాలెండర్‌లో ఏప్రిల్ ఒకటవ తేదీ మరో కథ చెబుతోంది...

నాలుగు రోజులు తరువాత నారాయణన్ గారు వెల్లూరు బయలుదేరారు. ఆటోలో సామాను పెట్టి ఆశీర్వదించారు.

'చూడమ్మా...' చెప్పారు '...ఎదురుకోలు అంటే ఏదో జీబ్రా క్రాసింగ్ మీద అటు నలుగురూ ఇటు నలుగురూ అటూ ఇటూ జరిగిపోవటంకాదు. రెండు కుటుంబాలు, వారి కుటుంబాలు.. ఇలా ఒక పరివారం పూర్తిగా కలసిపోయి బంధుత్వాలను గట్టిపరచుకోవటం అని అర్థం. నీ మరిది పట్ల నీ బాధ చెబుతుంది నిజమైన బంధుత్వం గురించి. నువ్వు నాకు నచ్చావు! వస్తాను ఉత్తమ్....ఫోన్లు చేస్తూ ఉండండి. నీ వాళ్లూ, నా వాళ్లూ అనే ఆనవాళ్లు లేనిది నిజమైన బంధుత్వం!' ఆటో డ్రైవర్ కూడా ఎందుకో తల ఊపి స్టార్ట్ చేసాడు. వీధి చివరిదాకా వెళ్లేవరకూ ఆయనను చూస్తూ నిలబడ్డారు. మెల్లగా ఇంట్లోకి వెళ్లి కూర్చున్నారు.

'కా...కా..కాఫీ చిక్స్', అన్నాడు ఉత్తమ్!

## పూజ

**'దేవుళ్ళందరూ** నేలమీద కాకుండా ఎత్తైన గుట్టలమీద ఎందుకుంటారు?' గుడి మెట్లు ఎక్కుతూ అడిగింది కవిత.

'పైకి ఎక్కి క్రిందకి చూస్తే సంకుచితమైన ఆలోచనలు ఆవిరైపోతాయని కాబోలు' అన్నాను.

'ఓహో. దేవుళ్లున్నది మనకోసమా? వాళ్ల కోసమా?'

'మనం వెళ్లకపోతే వాళ్లకేమీ తేడా పడదు'

'నిజమే!'

అయాసం తీర్చుకునేందుకు కొద్దిసేపు కూర్చుండిపోయింది.

'మగవాళ్లు స్వార్థపరులు' చెప్పింది.

'అవునా?'

'అవును. పెళ్లికాకుండానే పెళ్లిలో ఓ పూజ చేయిస్తారు. వరపూజ అంటారు, గౌరీ పూజ అంటారు.. ఒకటికాదు'

'పెళ్లి కాకుండా మగవాడు కూడా చాలా చేస్తాడు. ఆ హోమం అంటారు, ఈ హోమం అంటారు'

నన్నూ కూర్చోమని సైగ చేసింది. తప్పదనుకుని కూర్చున్నాను.

'ఊ... అసలు పూజ అంటే?' అడిగింది.

'పార్వతీదేవి పర్వతరాజ పుత్రిక'

'అవును'

'శివుడు స్థాణువు'

'అవును'

'అపర్ణగా తపస్సు ఆచరించిన తరువాత వారికి వివాహం జరిగింది.'

'ప్రకృతి పురుషునితో కలిసే ముందు తనలోని స్పందనను ఒక స్థాయికి తీసుకుని వెళుతుంది. సముద్రంలో కలిసే నది అక్కడికి చేరుకునే సమయానికి పరవళ్లు తొక్కి పైకి పొంగుతుంది. అటువంటి వివాహం వలన, ఆ శక్తి వలన పురుషుడు అమృతమూర్తి అవుతాడు! కాలకూటగరళమైనా అతన్ని బాధించదు!'

'ఓహో. జీవితంలో గరళం మింగే సన్నివేశాలుంటే?'

'తప్పకుండా ఉంటాయి'

ఇద్దరం లేచాం. కొన్ని మెట్లు ఎక్కిన తరువాత వెనక్కి చూసాను. రెండు మెట్ల క్రింద నిలబడిపోయింది కవిత.

'పరిణతి...' అంటూ పలికింది.

'ఎలాగ?'

***'నేనో శిలను '***

'ఓ'

***'దాగి వున్న ఈ శిల్ప సౌందర్యం ఎక్కడిది?'***

ఓ మెట్టు ఎక్కింది.

'నేనో ఆలోచనను

కదలని కలాన్ని'

'శభాష్'

'ఉలకని పలకని ఈ కావ్య కన్యక ఎలాటిది?'

మరో మెట్టు ఎక్కింది. సాయం సంధ్య కాంతులు వింతగా గంతులేస్తున్నాయి.

***'నేనో నిశ్శబ్దఝరిని***

***శృతి చేసిన వీణను***

***అన్నిటికీ సిద్ధమైన ఈ మౌనరాగం ఎక్కడిది?'***

ప్రక్కకు వచ్చి నిలబడింది.

***'నేనో పుష్పాన్ని.. '***, మెల్లగా అంది.

*సహజ సౌరభమే నా రససిద్ధి!*
*వికసించటమే ఒక పూజ!*'

## ఓ కామేశ్వరావు కథ

'ఈ మెట్ల మీదే ఓ కథ చెబుతాను' చెప్పాను. కవిత వింటూనే మెట్లెక్కుతోంది.

'కామేశ్వరరావు తన జీవితంలో మొదటిసారి పూర్తిగా ఒంటరివాడైనాడు. ఏ రోజైనా ఇద్దరు ముగ్గురు తన టేబిల్ దగ్గర కూర్చోకుండా ఏ రోజూ ఆఫీసు పని చేసుకునేవాడు కాడు. ఎందుకో ఎవరూ లోపలికి రావటంలేదు. ఏదైనా ఫైలు పట్టుకొచ్చినా అలా జాగ్రత్తగా టేబిల్ మీద పెట్టి జారుకుంటున్నారు. అయినా కూడా లౌకికం తెలియని వాడు కాడు. రెండు రోజుల క్రితం కూడా ఇలా లేదు. ఒక్క పూటలో ఆఫీసంతా మారిపోయింది.'

'ఏమైంది?' కవిత అడిగింది.

'కాంతమ్మగారు మరో ఆఫీసునుండి ట్రాన్సఫర్ అయి ఇక్కడికి వచ్చారు. భర్త ఎక్కడో దూరంగా ఉంటాడు. ఏవో సమస్యలున్న మనిషిగా ఉండేది. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటలకు ఆయన గదిలోకి వెళ్లి ఓ గంటసేపు కాలక్షేపం చేసేది...

ఆవిడ అలా ఆ గదిలోకి వెళ్లే సమయానికి శేషన్‌గారు తన బాగ్ సద్దుకునేవాడు. 'ఆఫీస్ అయిపోయినట్లే... ఇంటికి పోవాల. నేరం నాలుగు మణి'

'అదేంటిసార్, ఇంకా ఎక్కడయింది?' ప్రక్కన కూర్చునే అమ్మాయి అడిగింది.

'అయిపోయింది. సారువాండు మరల పిలువడు తాన. అర్థమయిందా? సేవ స్టార్టయింది. చూచినావా?'

'సార్, మీరు నేరం అన్నారు. అలా అనెయ్యటం ఎంత నేరం సార్?'

'నేరం అంటే టైం తల్లీ, వస్తానూ..!' అంటూ బాగ్ సద్దుకుని జారుకున్నాడు.

మరో ఆఫీసు నుండి పనికోసం వచ్చినవాడు కూడా కొద్దిసేపు కూర్చుండిపోయి 'ఇది అన్యాయం' అన్నాడు.

'ఏంటి?' అమ్మాయి అడిగింది.

'మీరేదో అంటున్నారు కదా?'

'ఏమన్నాం?'

'అదే ఇలా ప్రతిరోజూ లోపలికెళ్లి...'

అమ్మాయి నోరు మీద వేలు పెట్టుకుంది.

'తప్పుసార్. వారి మధ్య ఏమీలేదు. ఏదో మాటలు కలిసాయి అంతే.'

'అలాక్కాదు. నేనూ విన్నాను.'

'ఏం విన్నారు?'

'కామేశ్వరావుగారి భార్య ఆయనతో ఉండదు కదా?'

'మీకెవరు చెప్పారు?'

'ఒకరా? ఇంకో ఇద్దరు చెబితే సెంచరీ అయిపోతుంది'

'ఓ. ఇద్దరి కోసం ఆగటం ఎందుకు? ఓ రెండు పేర్లు మీరే చెబితే అయిపోదా?'

అతను ఫైలు తీసుకుని లేచాడు.

'చూడమ్మా! నన్ను ఏదో పోరంబోకు అనుకోకు. ఆలోచించిగానీ మాట్లాడను.'

అమ్మాయి నవ్వి ఊరుకుంది. అతను వెళ్లిపోయాడు.

కవిత రెండు మెట్ల వెనుక ఉంది. అలా నిలబడి ఆ చెట్లలో ఆడుకుంటున్న కోతులను చూస్తోంది. కొద్దిసేపు నేనూ ఆగిపోయాను. గాలి చల్లగా ఉంది.

ఆఫీసులో చిత్రమైన వాతావరణం ఏర్పడింది. కాంతమ్మగారు ఓ మూల కూర్చుని ఏవో పుస్తకాలు చదువుకుంటూ ఉండేవారు. కరెక్టుగా సాయంత్రం నాలుగవుతుండగా చేతిలో ఉన్న పనంతా చక్కబెట్టుకుని కాగితాలన్నీ సర్దేసి బాగ్ కూడా తీసుకుని కామేశ్వరరావు గదిలోకి వెళ్లిపోయింది. శేషన్ దీర్ఘంగా ఆవులించాడు.

'తమ్మీ...' అని అటెండెంట్‌ను పిలిచాడు. అతను దగ్గిరకి వెళ్లాడు.

'సార్'

'ఆ గోడ గడియారం చూస్తివా?'

'చూసాను సార్'

'నేరం ఎవుళ?'

'నాల్గు సార్'

'కాదు. కాంతమ్మ మేడమ్ లోనకు పోయింది దానే? '

'సార్'

'అప్పుడు టైం నాలుగు. ఏమి?'

'కరెక్ట్ సార్'

'ఈ ఫైల్ ఉదయమే పూర్తి చేసినా తమ్మీ'

'సార్'

'ఏమి? నీ కోసం పెట్టనా!'

'నా కోసం ఏమి సార్?'

'హ హ! సార్ టేబిల్ మీద ఇప్పుడు పెట్టిరా ఏమి?'

'అర్థమైంది సార్. ఇలా ఇవ్వండి'

అతను క్రాఫ్ సద్దుకుంటూ ఆ రూమ్ వైపు బయలుదేరాడు. శేషన్ కాలు మీద కాలు వేసాడు అటు ప్రక్కనున్న అమ్మాయి వైపు చూసాడు.

'ముప్పది సంవత్సరాలు దానా... ఇగో పాపా, ఏమి? ముప్పది సంవత్సరాల అనుభవం దానా.'

అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. కంప్యూటర్‌లో ఏదో కొట్టుకుంటూనే ఉంది. ఆయన ఇటు తిరిగాడు. ఇక్కడ కూర్చున్న వ్యక్తి అలా ఉండడు. ఎప్పుడు ఎవరు ఏది చెబుతారా అన్నట్లు ఆకలిగా చూస్తూ ఉంటాడు.

'ఈ నామం ఉంది చూస్తివా?' శేషన్ అడిగాడు. అతను ఏమీ మాట్లాడలేదు. నోరొక్కటీ చిన్నగా తెరిచాడు.

'ఈ నామము.. ఏరోజూ అద్దం చూసి పెట్టడు ఈ శేషన్'

‘ఛా‘

‘ఆమా! మరి ఏమి?‘

‘ఎట్లా పెట్టుకుంటారు సార్? నామం? అర్ధరాత్రి గడియారం ముల్లులా అలా.. షార్ప్‌గా ఉంటుంది సార్!‘

‘చూస్తివా? ప్రక్క ఇంటి అమ్మాయిని చూస్తూ నువ్వు కాలిలో సెరుప్పు ఎప్పిడి తొడుక్కుంటావు మాదిరి... సింపుల్. అనుభవం పా!‘

‘వండర్‌ఫుల్ సార్. మీది మాములుగానే మంచి స్కిల్. అద్దం చూడకుండా అంత చక్కగా పెట్టుకోవటం సామాన్యమైన విషయం కాదు‘

‘అర్జునుని మాదిరి పా. క్రింద దాన చూసి పైన బాణం ఆడిచ్చా... అప్పిడి.‘

ఇంతలో అటెండెంట్ వచ్చాడు.

‘తమ్మీ, ఏమి జరుగుతా ఉన్నది లోపల?‘

‘సార్, ఏదో మాట్లాడుకుంటున్నారు. మీ ఫైల్ టేబిల్ మీద...‘

‘ఏమి? మీదినుండి తోసేసినాడా! అవున్లే. డిస్టెర్బెన్స్ కదా?‘

‘లేదు సార్. ఓ పక్కగా జరిపారు. నన్ను వాళ్లిద్దరికీ టీ తెమ్మని చెప్పారు. అందుకే పోతున్నా కాంటీన్‌కు‘

శేషన్ అటు తిరిగాడు.

‘చూస్తివా? ఇప్పుడు చెప్పు‘

ఆ అమ్మాయి నవ్వింది.

‘ఏంటి సార్, మీరు మరీనూ. సార్ ఒక్కోసారి నాక్కూడా టీ తెప్పిస్తారు పాపం!.‘

‘ఆ....పాపం! ఇలాక్కూడానా... ఆండవనే! రొంబ అన్యాయం పా!‘

ఆయన బాగ్ తీసుకున్నాడు.

‘అయిపోయింది. ఇంక మేమెందుకిక్కడ? పోయి వస్తా తమ్మీ!‘

కొంత దూరం నడుచుకుంటూ వెళ్లి అటెండెంట్ భుజం మీద చెయ్యి పెట్టాడు.

‘తమ్మీ! సుల్తాన్ బజార్‌లో రెడీమేడ్ దొరుకుతాయి కదా!‘

‘ఏంటి సార్! కుర్తా పైజమాలా?‘

‘నో నో.. ఆడువాండ్ల బురకాలు! అవి వేసుకుని కూర్చుంటాను పా అప్పుడె ఓ ఫైల్ పట్టుకుని పోతే నాకు కూడా టీ సాపాటిక్కు కుదురుతుంది. చూస్తివా? ఈ చేతి మీద నిలబెట్టిన ఆఫీసుదానా! ఎట్లయిపోయింది ఈ ఆఫీసు.. తమ్మీ..‘

‘బాధపడకండి సార్!‘

బాగ్ ఒక భుజం మీదనుండి మరో భుజం మీదికి సద్దాడు శేషన్.

అటెండెంట్ భుజం తట్టాడు.

‘తమ్మీ, ఈ ఆఫీస్ ఇక నీది దానా.. జాగ్రత్త! పోయి వస్తా తమ్మీ. జాగ్రత్త!‘

అటెండెంట్ కూడా ఆయన భుజం తట్టాడు.

‘నేనున్నాను సార్. వెళ్లిరండి. నేనున్నాను. అయామ్ హియర్!‘

'కరెక్ట్'

శేషన్ భారీ అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

రెండు మెట్లు భారీగా ఎక్కి కవిత ఆగిపోయింది.

'ప్రతి ఆఫీసులో ఓ కామేశ్వరావు, ఓ కాంతమ్మ, ఓ శేషన్ ఉండితీరుతారు. ఇందులో పెద్ద గొప్ప విషయం ఏముంది?'

'ఆలోచిస్తే అన్నీ గొప్ప విషయాలే. అసలు ఆలోచన అనేదే చిత్రమైనది. ఆలోచనలో అమృతం ఉండవచ్చు ఆలోచనలో విషం ఉండవచ్చు. ఏ అంతర్మథనంలోంచైనా ముందర వచ్చేది విషమే.'

'ఇంతకీ విషయం ఏంటి?'

'విశదంగా చెబుతాను. నేను చెబుతుంటే ఆయాసం తగ్గుతుంది'

'కాదు. వింటుంటే ఆశ పెరుగుతోంది'

'వెరీగుడ్ ఆఫీసులో కొద్దిరోజుల తర్వాత కాంతమ్మగారు కనిపించకుండా పోయారు. ఇంటికి నోటీసులు పంపారు. శలవు మంజూరు కాలేదన్నారు. ఆవిడ తాలూకు బంధువులు ఆఫీసుకు వచ్చి సమాచారాలు సేకరించారు. శేషన్ వాళ్లని కాంటీన్‌కి తీసుకుని వెళ్లి స్పెషల్ టీలు ఆర్డర్ చేసాడు. దాదాపు రెండు నెలలు గడచిపోయాయి. రక్షణ శాఖ వారు కామేశ్వరావును కొన్ని ప్రశ్నలు అడిగి వెళ్లిపోయారు. పై అధికారులు కామేశ్వరావును మరో చోటుకి బదిలీ చేస్తున్నారని వార్తలు వచ్చాయి.

గడియారం నాలుగు కొడుతూనే ఉంది. కామేశ్వరావు ఏ మాత్రం తొణకలేదు. కాకపోతే ఆయన గతంలో ప్రవర్తించిన తీరు మారిపోయింది. కాలానుగుణంగా దేనినో ఆసరాగా తీసుకుని అల్లుకుపోయే ప్రతి జీవిత లతకీ ఎక్కడో కొలత తప్పుతుంది. ఓ కలత మిగులుతుంది. చిరుగాలికే పంచిన చక్కని సువాసనలు, చిరునవ్వులు, అక్కడక్కడ ఎండిన ఆకుల మాటున ఏవో అర్థంకాని చిరాకుల్లా మారుతాయి.

ఒక రోజు బక్కగా ఉన్న ఓ కుర్రాడు ఆఫీసులోకి వచ్చాడు. శేషన్ దగ్గిరకి వచ్చి నిలబడ్డాడు. శేషన్ తన ముక్కుమీదినుండి జారిపోతున్న కళ్లజోడును పైకి తోసాడు. బాగున్నానా అన్నట్లు తల ఊపాడు.

'నా పేరు సతీశ్' అన్నాడు కుర్రాడు.

నాకేమీ అభ్యంతరం లేదన్నట్లు మరోసారి తల ఊపాడు శేషన్.

'కాంతమ్మగారు....'

'ఆమె ఆఫీసుకు రావటం లేదు పా. నోటీస్ పంపినాము'

'నేను కాంతమ్మగారి అబ్బాయిని'

అందరూ చేస్తున్న పని ఆపేసి అటు చూసారు. శేషన్ లాభం లేదనుకున్నట్లు కళ్లజోడు తీసేసాడు.

'కూర్చో పా. ఎప్పిడి?'

అతను కూర్చున్నాడు.

'ఎక్కడున్నారు ఆమె?'

'తెలియదు సార్. ఇన్ని నెలలు గడచిపోయినా ఏమీ ఆచూకీ తెలియటం లేదు.'

'ఊ.. ఏం చేస్తుంటావు?'

'డిగ్రీ అయ్యాను సార్.'

'జాబ్..'

'జాబ్‌లేదు సార్. దాని గురించే వచ్చాను.'

శేషన్ అమ్మాయి వైపు తిరిగాడు.

'ఏమ్మా, జాబ్‌గానీ ఏదైనా ఇప్పిస్తామా మనం?' అమ్మాయి నవ్వేసింది ఊరుకుంది.

'చూడు తమ్మీ. తప్పు చోటుకి వచ్చావు'

'సార్, మా అమ్మ జీతం కూడా ఇప్పుడు మాకు రావటంలేదు. తిండికి కష్టం అవుతోంది'

'కష్టమే..తమ్మీ..' అంటూ అటెండెంట్‌ను పిలిచాడు. అతను దగ్గరకి వచ్చి ఇద్దరినీ ఓ చూపు చూసాడు.

'కొద్దిగా నల్ల టీ పెట్టుపా' అన్నాడు శేషన్. అతను వెళ్లిపోయాడు.

'సార్'

'చెప్పు కన్నా'

'మా అమ్మ ఉద్యోగం నాకు ఇప్పిస్తారా? ఏవో రూల్స్ ఉంటాయి కదా?'

'నో నో. చూడు కన్నా, ఎవరైనా తప్పిపోయి ఏడు సంవత్సరాలుకూడా దొరక్కపోతే. మరోలా అనుకోవద్దు, వారు చనిపోయినట్లు లెక్క. అప్పటిదాకా ఎవరు ఏమీ చెయ్యలేరు. పోనీ ఏడు సంవత్సరాలు ఆగినా అప్పటికి నీ వయసు ఏమగును? అదీ ప్రాబ్లమే. టీ సాపట్లా...'

హై కోర్టు డివిజన్ బెంచ్ మీద కూర్చున్న న్యాయమూర్తిలా ఓ చిరునవ్వు నవ్వి మరల అమ్మాయివైపు చూసాడు.

'ఏమ్మా?' అన్నాడు. అమ్మాయి అబ్బాయి వైపు చూసింది. ఏమీ మాట్లాడకుండా తన పనిలోకి మరల తల దూర్చేసింది.

'ఇక్కడ కామేశ్వరరావుగారు ఎవరు?' అతను అడిగాడు. రిటైర్‌మెంట్ వయసు మరో నాలుగేండ్లు పొడిగించినందుకు కలిగే ఆనందం కలిగింది శేషన్‌కి. చేతిలోని కలంతో అటువైపు సైగ చేసాడు. కవిత ఓ మెట్టు మీద కూర్చుండిపోయింది విశ్రాంతి కోసం నేనూ కూర్చున్నాను.

'ఇలా ఆఫీసుల్లో ఇళ్ల విషయాలన్నీ కూడా మాట్లాడుకుంటారా?' అడిగింది.

'నేను కథ చెబుతున్నాను కవితా!'

'ఓహో. ఇది నిజం కాదన్నమాట'

'జరిగిన కథ.'

'ఇదొకటి మళ్లీ. కథను నలుగురూ మెచ్చుకోవాలంటే ఇది జరిగిన కథ అని చెప్పేయటం రచయితల దురలవాటు.'

'ఇది మామూలుగా అన్నమాట కాదు. రచయితల తరఫున ఈ మెట్టుమీద నిరసన ప్రదర్శిస్తున్నాను'

'ఈ నిరసనను సరసంగా స్వీకరిస్తున్నాను. ఇంతకీ కామేశ్వరావు ఏం చేసాడు?'

'కామేశ్వరావు ఏమీ చెయ్యలేదు. మిగతా వాళ్లు చాలా చేసారు.'

'ఓహో. ఏం చేసారు మాష్టారూ?'

'చూసావా? నీకూ ఏదో తెలుసుకోవాలనుంది. సృష్టిలోని కీలకం ఇది.'

'ఇదేంటి? కథ చెబుతుంటే తరువాత ఏమయింది అనటంలో కూడా సృష్టిలోని కీలకమా? ఇలా అయితే బండీ నడిచినట్లే.'

'అలాక్కాదు. కాంతమ్మగారికీ, కామేశ్వరావుకీ మధ్య ఏమిటి అన్నది మనం ఇంకా తేల్చుకోలేదు.'

'మనం అంటే?'

'అ...అదీ.. జనరల్‌గా అన్నమాట. అదీ కథ.'

'ఓ మాటనుకుందాం'

'ఓ!'

'అంటే?'

'నా మాటలు నీకొచ్చేస్తున్నాయి'

'అయితే?'

'మనకు పెళ్లయిపోయినట్లే!'

'ఇప్పుడర్థమయింది'

'ఏంటి?'

'కాశీయాత్ర ఎందుకు పెడతారో'

'ఎందుకు?'

'పెళ్లి ముందర ప్రతి మగవాడికీ కొంత పిచ్చి పుడుతుందని విన్నాను. అంచాత అటు బయలుదేరుతాడు.'

'వెనక్కి తెచ్చి పిచ్చికుదురుస్తారు.'

'సరే చెప్పండి. ఇంతకీ కామేశ్వరావు కథ ఏమయింది?'

శేషన్ ఒక రోజు ఉదయమే కామేశ్వరావు గదిలోకి పరుగుతీసాడు.

'సార్, రిసల్ట్స్ వచ్చినాయి సార్. ఈ లిస్ట్‌లో కాంతమ్మగారి పేరు కూడా వున్నాది సార్'

ఆయన లిస్ట్ చూసి చదివాడు.

'శేషన్..'

'సార్'

'వాళ్ల ఇంటికి ఈ లిస్ట్ కాపీ పెట్టి మరో నోటీస్ పంపండి'

'ఆమా సార్'

'మరోసారి ఆఫీస్ తరఫున మరో పేపరు ప్రకటన ఇవ్వండి'

'సరి'

'ఆవిడ నుండి ఏ సమాచారము రాకపోతే అది రికార్డ్ చేసి తరువాత వారికి అవకాశం ఇవ్వండి.'

'సార్.. ఆవిడ ఎక్కడికి వెళ్లి ఉంటుంది సార్?'

కామేశ్వరావు కళ్లు మూసుకున్నాడు.

'శేషన్, పారేసుకున్న పెన్సిల్ ముక్కే సరిగ్గా వెతుక్కోలేను. కాంతమ్మగారి గురించి ఏం చెబుతాను?'

'అది కాదు సార్. మీతో రోజూ..'

కామేశ్వరరావు చెయ్యి అడ్డు పెట్టాడు.

'మీరూ రోజూ కలుస్తారు. కొత్తల్లో అయితే గంటలు గంటలు కూర్చునేవారు'

'కరెక్ట్ సార్'

'అలా అని మీరు ఈ రోజు వరకూ ఒక్కసారైనా కనిపించకుండా ఎందుకు వెళ్లిపోలేదో ఎలా చెప్పగలను?'

'చాలా బాగా చెప్పినారు సార్. వస్తాను..'

శేషన్ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

'మతిపోయింద్ పా.. పైన వున్న ఫాన్ నెత్తిమీద పడినదా అంద మాదిరి ఉన్నాదిరా తమ్మీ.'

మంచినీళ్ల బాటిల్ ఖాళీ చేసాడు. బాటిల్ మూత పెడుతూనే కరెంట్ షాక్ తగిలిన వాడిలా లేచి నిలబడ్డాడు. ఎదురుకుండా కాంతమ్మగారు నిలబడి ఉన్నారు...

కవిత మెట్లెక్కడం ఆపేసి నన్ను వింతగా చూసింది.

'ఇది అన్యాయం' అంది

'ఏది అన్యాయం?'

'ఎక్కడి నుండో అలా ఎలా ఊడిపడుతుంది? టూ మచ్'

'ఇది కథ'

'ఓ. జరిగిన కథ కదూ, పైగా? ఇదొకటి? సర్లెండి. పూజ అన్నారూ, దేవుడన్నారు, తపస్సన్నారు... ఏంటో, అసలు నా కవితలోని భావాన్ని ప్రక్కన పెట్టి ఇష్టమొచ్చిన కథలు వ్రాస్తున్నారు, కాదు చెప్పేస్తున్నారు'

'కవిత పెసరట్టులాంటిది..' చెప్పాను, '....అల్లం, పచ్చిమిర్చీ, ఉల్లిపొరలు, జీలకర్ర వగైరా చల్లి ప్లేటులో చక్కగా సద్ది పెట్టింది కథ అవుతుంది'

'పోనీ మరో మాట అనుకుందాం'

'యస్?'

'నేను ప్లేన్ దోసా ఆర్డర్ ఇస్తే పెసరట్టు ఎవరు తెమ్మన్నారు? ఆర్డర్ కాన్సిల్.'

ఇద్దరం నవ్వుకున్నాం.

ఆఫీసు హాల్లో ఓ రోజు ఓ చిన్న కార్యక్రమం పెట్టారు. కామేశ్వరరావు ప్రామోషన్ మీద మరో ఆఫీసుకు బదిలీ అయ్యాడు. కాంతమ్మగారికి అక్కడే ఓ చిన్న ప్రామోషన్ వచ్చింది. అందరూ స్వీట్లు పంచుకున్నారు. శేషన్ ఓ ఫేర్‌వెల్ ప్రోగ్రామ్ పెట్టాడు. తాను మాట్లాడలేడని కామేశ్వరరావు తప్పుకున్నాడు. కాంతమ్మగారు మాట్లాడాల్సిందేనని అందరూ పట్టు పట్టారు. ఆవిడ అందరికీ నమస్కారం చేసుకుంది.

'నేనూ ఆ టెస్ట్‌లో పాస్ అవటానికి కారణం కామేశ్వరరావు సార్ అని అందరికీ మనవి చేసుకుంటున్నాను. భర్త ఉండి కూడా ఎన్నో చిత్రహింసలకు గురయి భర్తకు దూరంగా పిల్లలతో వేగలేక ఉన్న నేను ఈ ఉద్యోగంలో చేరాను. చేరినప్పటినుండీ ఇంట్లో ఎదిగొచ్చిన కుర్రాళ్ల బాధలు ఎక్కువయ్యాయి. వాళ్ల కాళ్లమీద నిలబడటం దూరం పెట్టి నా జీతంతో దుబారా చేసి ఇంటి ముందర అప్పుల వాళ్లను నిలబెట్టారు నా సుపుత్రులు. ఎప్పుడైనా కోప్పడితే - అర్థమైంది, నాన్న నిన్ను ఇందుకే వదిలిపెట్టాడు అని వాళ్లు

చెప్పినప్పుడు ఎందుకు బ్రతికున్నాను, ఎవరికోసం ఇంకా బ్రతుకుతున్నాను అని మూగబోయిన నా మనస్సును ప్రశ్నించుకుని మూగుతున్న ఆలోచనలకు, మూలుగుతున్న కాలానికీ మధ్య తూగలేని నన్ను కొద్దిగా ఆగమని చెప్పి అదుగో ఆ కిటికీ అవతల పైన ఇంకా కొద్దిగా ఆకాశం వున్నది అని చెబుతూ వచ్చారు కామేశ్వరావుగారు. ఆయన దగ్గరే రోజూ ఖాళీ సమయంలో ఈ పరీక్షకు కావలసినవన్నీ చదువుకున్నాను.

సార్ ఒంటరిగా ఉన్నారన్న సంగతి మనకందరికీ తెలిసిందే వారి శ్రీమతిగారు తగువు పెట్టుకుని మరో ఊళ్లో ఉద్యోగం చేయటం నాకు తెలిసిన విషయం. నా బాధలు చెప్పుకుంటున్నప్పుడు ఆయన ఒకరోజు నవ్వుతూ 'ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోతే ఎలా ఉంటుందో' అన్నారు. తెగించి అదే పని చేసాను. తప్పో ఒప్పో నాకు తెలియదు కానీ ఇన్ని రోజులూ వారి శ్రీమతిగారింట్లో ఉన్నాను..'

అందరూ కుర్చీలలో వెనక్కి వాలారు.

'ఒక సమస్యలో ఉంటూ మరో సమస్యను సమాధానం వైపు తీసుకుని వెళ్లే కామేశ్వరావుగారు వారి శ్రీమతికి ఎన్నడూ దూరం కాలేదు. ఆవిడ కూడా నాతో కొంత ఆకాశాన్ని పంచుకున్నారు. రెండు నెలల తరువాత ఇక్కడికి రాబోతున్నారని మీకు ఎలా చెప్పాలో నాకు అర్థం కావటం లేదు..'

ఆ చిన్న హాలు నిశ్శబ్దంతో నిండింది. ఎక్కడో ఫైళ్ల చాటున ఏవో ఫోన్లు మ్రోగుతున్నాయి. ఎవరూ పట్టించుకోవటం లేదు. కాంతమ్మగారు కొద్దిగా జీర గొంతులో చెప్పారు, '....పిల్లలు ఉద్యోగాల కోసం కనీసం ప్రయత్నించటం ప్రారంభించారంటే ఎక్కడో కొండలు కరుగుతున్నాయని అర్థం. తోటలో మొక్కలెన్నో కలసి ఉంటాయి. పూలన్నీ ఎవరి సజ్జలోనికో చేరిపోతాయి. ఎవరి పూజనుండో జాలువారి ఎవరి సన్నిధికో చేరుతాయి. ఏ పూజవలన, ఎవరి పూజవలన ఎవరు ఎవరిని కలుస్తారో ఎవరికి తెలుసు?'

★★★★★★

మెట్లు పూర్తయ్యాయి. కొద్ది దూరంలో ధ్వజస్తంభం కనిపిస్తోంది. ఆ పైన ఆకాశం. గాలికి చిరుగంటలు కొట్టుకుంటున్నాయి. లోపల పెద్ద గంటలు మ్రోగుతున్నాయి. జంట స్వరాలతో రాగం పైకి ఎగసినట్లు ఇద్దరం గుడివైపుకు వెళ్లిపోయాం.

## పెండ్లి

**'ముహూర్తం దగ్గరవుతున్నది'** కవిత చెప్పింది.

'చాలా ఆదుర్దాగా ఉంది'

'ఎందుకు?'

'నీ తలమీద చేయి పెట్టగలిగే అవకాశం కదా?'

'పాత జోకు'

'విషయం కొత్తదే'

'నేనూ ఆలోచిస్తున్నాను'

'ఏంటి?'

'నా తలమీద చెయ్యిపెట్టినప్పుడు కొత్త ఆలోచనలు వస్తాయా లేక ఉన్న ఆలోచనలు ఆగిపోతాయా అని'

'పోనీ ఒకసారి చెయ్యి తలమీద పెట్టి చూడనా? ప్రాక్టీస్?' కవిత చిత్రంగా నవ్వింది.

'ఓ పని చెయ్యండి.'

'చెప్పు. తల కొద్దిగా నొప్పిగా ఉంది'

'అయితే?'

'తల మీద గట్టిగా అదిమి పట్టి ఒత్తండి. తగ్గిపోవచ్చు'

'అంటే మసాజ్ చెయ్యాలా?'

'కాదు. ఒకరికొకరు...'

'ఓహో...'

'ఆలోచన వస్తోంది'

'రానీ. చెయ్యి పెట్టకుండానే వస్తోంది. గుడ్'

'ఊ. ఉండండి. వధూవరులు ఇరువురూ ఒకరి తలమీద ఒకరు చేతులు పెట్టి సిగ్గుతో తలవంచుకుంటే అసలు ఆ దృశ్యం ఎలా ఉంటుంది?'

'ఆలోచించాలి. నీకేదో బొమ్మ కనిపిస్తున్నట్లుంది'

'అవును. ఇద్దరూ కలసి ఆలోచనల పల్లకీ కట్టుకుని అనుకోని భావనలకు పరుగులు తీస్తున్నట్లుండదూ?'

'.....'

'ఈసారి ఎందుకో బొమ్మలు కనిపిస్తున్నాయి' కవిత చెప్పింది.

'ఏ కళారూపమైనా తొలుత మనసులో చూపించేది చిత్రమే!'

'దృశ్యంలోంచి అదృశ్యం - చెబుతాను'

'వెరీ గుడ్'

ఇంద్రధనసు

***ఏడడుగులు ఏర్పరచిన దారివెంట ఏడు వర్ణాలు***
***కదిలిస్తే అంతా శ్వేత వర్ణమే!***
***చిత్రంగా - కలలన్నిటికీ కాంతే ముగింపు!***
***యుగళ గీతంతో సాగే జీవితం...***
***మరో యోగ సాధనే మరి.***
***చరిత్రలో మరో రమ్యమైన సంపుటి***
***ఒద్దికగా చేసుకునే ఒప్పుకోలు ఓ మధురమైన తంతు.***
***మంగళవాయిద్యాలు, మర్యాదలు, మన్నింపుల మధ్య మనదైన ఈ పయనం ఏ అలౌకిక తీరంవైపో!'***

***పెండ్లి***

'ఈ సాయంత్రం నిన్ను ఒకరింటికి తీసుకుని వెళతాను' అన్నాను.

'ఎవరాయన? నెత్తిన చేతులు పెట్టే స్వామీజీయా?'

'నోనో. చాలా గొప్పవాడు. అంటే కళాకారుడు.'

'ఇప్పుడాయన ఎందుకు మనకి?'

'పెళ్లి గురించి చెబుతాడు'

కవిత బండి దిగిపోయింది. రెండు చేతులూ నెత్తిన పెట్టుకుంది. అటుపోతున్న ఆటో అతను ఆగాడు.

'మేడమ్?'

అక్కరలేదన్నట్లు చెయ్యి ఊపింది కవిత.

'నేనుండగా నిన్ను ఎలా ఆటో కావాలా అని అంటాడు?' అడిగాను.

'నన్ను ఆటో కోసం దింపినట్లు అతను అనుకున్నాడు'

'కరెక్ట్. అంటే లిఫ్ట్ ఇచ్చేవాడిలా ఉన్నానన్నమాట!' చెయ్యి అడ్డు పెట్టింది.

'సారే! అతను వెళ్లిపోయాడు. పోనీ పట్టుకుని అడుగుదామా?'

'బండెక్కు. సుందరంగారి వద్దకు తీసుకుని వెళతాను' బండి ఎక్కింది.

'మనం పెళ్లి చేసుకుందాం' చెప్పింది.

'వెరీ గుడ్'

'పెళ్లి గురించి అదే అర్థమవుతుంది'

'కరెక్ట్'

'ఈ స్వామీజీ ఇంటికి ఎందుకు?'

'పెళ్లి గురించి అదే అర్థమవుతుందన్నావు'

'కరెక్ట్'

'కానీ ఇలా అర్థమయ్యే అవకాశం మరల రాదు'

'ఆయన ఏంటి? ప్రవచనం చేస్తాడా?'

'లేదు. అసలు మాట్లాడగలడో లేడో చూడాలి'

'ఓ. పెద్దవారా?'

'అవును'

సుందరంగారింట్లో వరండాలోని ఓ బల్ల ఉయ్యాల గాలికి అటూ ఇటూ కదులుతోంది. ఈ వయోవృద్ధుడు అసలు ఎవరినీ గుర్తుపట్టడం కూడా లేదు. కానీ అందరూ తెలిసినట్లే, జనజీవన స్రవంతిలో ఉన్నట్లే అన్ని మాటలు మాట్లాడుకున్నాడని తెలిసింది. గేటు తీసి లోనకి నడిచాం. మమ్మల్ని చూసాడో లేదో కూడా తెలియదు. చేతి కర్రతో ఉయ్యాలను ఓ తోపు తోసాడు.

'నన్నెవరూ ఈ ఉయ్యాల ఎక్కనీయరు' చెప్పాడు.

'ఎందుకని?' అడిగాను.

'నా ఎముకలు లోపల విరిగిపోయి ఉన్నాయని చెబుతున్నారు.' ఇంతలో వాళ్ల అబ్బాయి వచ్చాడు. మమ్మల్ని పలుకరించి లోపలికి తీసుకు వెళ్ళాడు.

'కూర్చోండి సార్. ఆయన ఈ మధ్య ఈ లోకంలో ఉండటం లేదు. ఏదో ధోరణి మాటలు మాట్లాడేస్తూ అలా కాలం వెళ్లదీస్తున్నారు.'

సుందరంగారికి దాదాపు తొంభై నాలుగు సంవత్సరాల వయసుంటుంది. కాకపోతే మంచి హుషారుగానే కనిపించారు. గబగబా లోపలికొచ్చి మా ఇద్దర్నీ చూసారు.

'అవతల ప్రక్కన రోడ్డులోంచి అలా వెళ్లి తిరుగుతాడు వాడు', అన్నారు. ఎవరు అని అడగబోయి వాళ్ల అబ్బాయిని చూసి ఆగిపోయాను. ఆయన అప్పటికప్పుడు ఏదో ఉపనిషత్ వాక్యం చెప్పినట్టు చిరునవ్వు నవ్వి మళ్లీ వరండాలోకి వెళ్లిపోయారు.

'నా కాబోయే సతీమణి..కవిత' అన్నాను.

'ఈయన విజయ్. సుందరంగారి కుమారులు.'

కవిత నమస్కారం చేసుకుని అటూ ఇటూ చూస్తోంది. ఈ వింత వాతావరణం అర్థంకావటంలేదు.

'సుందరంగారు గొప్ప కళాకారులు...' చెప్పాను '...వారి చిత్రాలకు నేను చాలాసార్లు వ్యాఖ్యానాలు చేసి యున్నాను'

ఇంతలో ఆయన మరల లోపలికి వచ్చారు.

'పిల్లలు గాలి పటాలు ఎగరేస్తూ ఉంటారు...', అన్నారు చేతులు పైకిపెట్టి,'... అవి డాబామీద అలా వచ్చి పడుతూ ఉంటాయి. పరుగులు పెడుతూ ఉంటారు. పడిపోతూ ఉంటారు. ఎలా?'

అలా చూస్తూ కూర్చున్నాం.

ఆయన టి.వి వైపు తిరిగారు. అందులో క్రికెట్ మాచ్ వస్తోంది.

'నన్ను గుర్తుపట్టలేదు' చెప్పాను.

'చెప్పానుగా...' విజయ్ చెప్పాడు, '....ఆ స్థితి దాటి పోయింది. ఎంతో ప్రయత్నం చేసి చూసినా గుర్తొచ్చినట్లు తల ఊపి పేరు కూడా రెండు సార్లు పలికి మరేదో అర్థం కానిదంతా మనకు చెప్పి అలా ఎటో వెళ్లిపోతారు.'

ఇద్దరం ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నాం. కవిత ఎంతో బలవంతంగా నవ్వు ఆపుకుంటోందని అర్థమవుతోంది.

'రండి' అన్నాడు విజయ్.

ఇద్దరం లేచి లోపల సుందరంగారి చిత్రాలను చక్కగా అమర్చిన ఓ పెద్ద హాల్లోకి తీసుకుని వెళ్లాడు.. ఎందుకో ఓ చిత్రమైన ఆలోచన వచ్చింది.

ప్రతి వ్యక్తి ఓ మహా మ్యూజియమ్..., అనుకున్నాను, లోపల కదిలే ఆలోచనలు అద్భుతాలు. వ్యక్తిత్వమనేది చివరికి మిగిలిపోయే ఓ సంగ్రహాలయం

వయసుకు ఓ క్యూర్, మనసులాంటి మ్యూజియమ్‌కు ఓ క్యూరేటర్... రెండు కష్టమే.

తలుపు తెరిచారు. కొన్ని వందల చిత్రాలు ఎంతో శ్రమపడి చక్కగా దుమ్ము లేకుండా, పట్టకుండా నలుగురూ చూసే విధంగా ఉన్నాయి. నా వ్యాఖ్యానాలను చక్కగా వ్రాయించి ఆయా చిత్రాల క్రింద నా పేరుతో సహా కార్డ్ బోర్డుల మీద అతికించారు. హాల్లో ఓ మూల ఓ చిన్న పార్టిషన్ ఉంది. ప్లైవుడ్‌తో ఉన్న పార్టిషన్ ఓ చిన్న కళ్యాణమంటపంలా ఏర్పాటు చేసారు. దానిమీద 'పెండ్లి' అనే మాట సూర్యబింబం మీద ఉదయ రవిచంద్రికరాగంలా మెరుస్తోంది...

'ఇదేంటి?' అడిగాను.

'ఆయన ఆరోగ్యం బావున్నప్పుడు ఎందుకో కొన్ని ప్రత్యేకమైన చిత్రాలను ఎంచుకుని ఇందులో ఏర్పాటు చేయించారు. రండి' అంటూ లోపలికి తీసుకుని వెళ్లాడు.

సుందరంగారు ఆ హాల్లోకి వచ్చి ఎవరితోనో చెబుతున్నట్లు చెబుతున్నారు, 'రెండురోజులు ముగ్గు బాగా వేస్తుంది ఈ పనమ్మాయి. మూడోరోజు దానిష్టం! అన్నీ మూడ్ బట్టే. లోకమంతా నాలాగా తయారయితే నన్నెవరు బాగు చెయ్యాలి?'

ఎడమ ప్రక్క మొదటి చిత్రంలో ఒక జీబ్రా క్రాసింగ్ కనిపిస్తోంది. దానిమీద ఒక జంట చేతులు పట్టుకుని రోడ్డు దాటుతున్నారు. జంటలోని ఆడపిల్ల ఒక అమ్మాయికి ఫోటో తీసినట్లుంది. మగవాడు పెయింటింగ్ వేసినట్లుంది. అమ్మాయి భయపడుతున్నట్లుంది. క్రింద ఏం వ్రాసుందోనని చూసాను.

'ఏడడుగుల సంబంధం అంటే ఏమో, అనుకున్నాను. ఇలా ఓ రోజు బెదురుతూ రోడ్డు దాటే ప్రయత్నం చేస్తున్న ఈ అమ్మాయి చెయ్యి ఎందుకు పట్టుకున్నానో పట్టుకుని రోడ్డు దాటించాను. అలా ఏడు రోజులు రోడ్డు దాటించినందుకు ఓ సోమవారం రోజున అలా నిలబడి ఆలోచిస్తోంది ఆ అమ్మాయి. తల వంచుకుని కేవలం కళ్లు పైకి 'విప్పార్చి' కలసి దాటుదామా?' అని అడిగింది.

'ఏంటి?'

'ఏదైనా'!

కవిత చిరునవ్వు నవ్వింది. 'అందుకా మీరు..'

'అందుకు నేను?'

'అలా రోడ్డు క్రాస్ చేసే చోట అలా నిలబడుతూ ఉండేవారా?'

'ఎవరు చెప్పారు?'

'మరో చిత్రం చూద్దాం'

ఈ బొమ్మ కొద్దిగా అర్థం కాకుండా ఉంది. సుందరం వినాయకుడిలా కూర్చున్నాడు. అటూ ఇటూ సిద్ధి, బుద్ధి ఉండవలసిన చోట ఆయన భార్య ఉంది.

దానిక్రింద ఓ వ్యాఖ్య - గుర్తుందా నీరజా? వినాయక చవితి రోజున వీధి చివర పెట్టిన వినాయకుని పందిరి వద్దకు వెళ్లి మైకు శబ్దం తగ్గించమని నాకోసం గొడవ పెట్టుకున్నావు! వాళ్లు ఇంటికి వచ్చి గొడవ చేసినా నన్ను వెనక్కి తోసి నా ముందర నిలబడ్డావు. చివరి రోజు వాళ్లే వచ్చి మంచి చేసుకుని మరల నాలుగు మంచి మాటలు చెప్పమంటే నన్ను నువ్వే మైకు ముందుకు సాగనంపావు! భర్తకు భార్యయే సిద్ధి, భార్యయే బుద్ధి!

తరువాత ఉన్న పెయింటింగ్ - గౌరీదేవి ఒడిలో శయినించిన శివుడు... ఆయన శిరస్సును చేతితో మెత్తగా తాకుతూ నిద్ర పుచ్చుతోందా అన్నట్లుంది. క్రింద వ్యాఖ్య - ఈ గంగ గోల నీకెందుకు? కొద్దిసేపు నవ్వుకున్నాం.

మరో పెయింటింగ్ ముందు నిలబడి విజయ్ చెప్పాడు. 'సార్, ఇది నేను తీసిన ఫోటో, దీనినే పెయింటింగ్‌గా మార్చారు ఆయన'

నీరజగారు కుర్చీలో ఉన్నారు. వెనుక సుందరం గారున్నారు. ఆమె తలను రెండు చేతులతో ఎందుకో పట్టుకున్నారు.

'మా అమ్మ ఎప్పుడూ ఆయన చేతిని తీసుకుని ఎందుకో ఆవిడ తలమీద పెట్టుకునేది. ఎందుకో హాయిగా ఉంటుందనేది!'

ఇద్దరం చాలాసేపు ఆ చిత్రాన్ని చూసాం.

'కళ్ల డాక్టర్ రమ్మంటున్నాడు' వెనుక నుండి వినిపించింది. సుందరంగారున్నారక్కడ - ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

'అతనికి చెప్పు, ఇప్పుడు రాలేనని.'

'అలాగే'

ఆయన వెళ్లిపోయాడు. ఆయన గీసిన బొమ్మల మధ్య మమ్మల్ని చూసి కూడా ఈ లోకంలోకి ఆయన రాకపోవటం ఆశ్చర్యం అనిపించింది.

మరో పెయింటింగ్ కొద్దిగా కిటికీకి దగ్గరగా ఉంది. ఆస్పత్రి వార్డులో ఓ బెంచీ మీద ఒంటరిగా ఓ ఫ్లాస్క్ పట్టుకుని కూర్చున్నారు సుందరంగారు.

'నా చెయ్యి తలమీద గట్టిగా పెట్టుకుని నన్ను చూసి లోపలికి వెళ్లావు కానీ నన్ను ఆ బాదం కాయ కళ్లతో చూసి గుర్తుపట్టేలా ఇవతలకి రాలేదు.'

'సార్...', విజయ్ చెప్పాడు, '....అది బాగా ఆరోగ్యం క్షీణించిన సమయం. ఆ రోజు నుంచీ స్పృహలోనే ఉంటుంది కానీ ఆవిడ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది. ఎప్పుడో నవ్వుతుంది, గట్టిగా శ్వాస పీల్చి నిద్రపోతుంది.'

ఇటు తిరిగి మరి కొన్ని చిత్రాలు చూసి ఓ చిత్రం దగ్గిర ఆగిపోయాం. ఆ పెయింటింగ్ మీద ఓ చిన్న తెర ఉంది.

'నీ జీవితం, నా జీవితం ఇలా ముడిబడతాయనుకోలేదు' అని వ్రాసి ఉంది. తెరపైకి తీసాం.

రెండు పిచ్చుకలు బ్రహ్మముడిలా తోకలు ముడివేసుకుని ఉన్నాయి. ఓ చిన్ని గూడులోంచి అటూ ఇటూ తొంగిచూస్తున్నాయి.

చెట్టుకొమ్మల నిండా ఎర్రని పూలు మంత్రాలు చదువుతున్నట్లున్నాయి. కొన్ని అక్షతలలా క్రిదకి రాలుతున్నాయి.

'జాగ్రత్తగా చూడండి...' అన్నాడు విజయ్. '... ఈ చిత్రం ముందర ఎందరెందరో నిలబడ్డారు. లక్షల్లో మాట్లాడారు. మేం అమ్మలేదు.'

'వద్దు. ఇది సామాన్యంగా లేదు'

'పూర్తిగా చూసారా?'

అర్థం కాలేదు. జాగ్రత్తగా చూస్తే తెలిసింది. ఆ చెట్టు ఆకుల మాటున ఉన్న ఆకాశపు రంధ్రాలలో ఇద్దరి బొమ్మలూ తొంగి చూస్తున్నట్లున్నాయి.

'అయ్యబాబోయ్' అంది కవిత.

'ఇది ఆయన గీసిన చివరి చిత్రం', విజయ్ చెప్పాడు. కాకపోతే ఆ కాన్వాస్ అక్కడున్న చివరి కాన్వాస్ కాదు. దాని ప్రక్కన మరో రెండున్నాయి.

నదిలోకి ఓ గట్టు సగం దూరం వరకు కనిపిస్తోంది. అటు సూర్యుడు అస్తమిస్తున్నాడు. గట్టు చివర ఓ జంట చేతులు పట్టుకుని అటు తిరిగి నిలబడి ఉన్నారు. సప్తవర్ణాల ఇంద్రధనువు ఆ గట్టు చివరినుండి అవతలకి వారధి కట్టినట్లుంది.. ఈ పెయింటింగ్ గుర్తుకొచ్చింది. కొన్ని సంవత్సరాల క్రితం దీనికి నన్ను వ్యాఖ్య అడిగారు సుందరంగారు. దాని క్రింద నా మాటలు చూసి విచిత్రమైన అనుభూతికి లోనయ్యాను.

'కలయికకు ఓ తంతు, కలలకు ఓ అంతు మరి ఎక్కడివో

ఏడడుగుల వారధితో ఏడేడు భువనాలను ఎన్నేండ్లలో తాకాలనో

కాలం పన్నిన వలలోని వలయాన్ని సరిజోడుతో జలక్రీడగా మార్చాలనో

గోడల మీద బొమ్మలవి కావు, గాలికూగే పటాలు కావు, గాలి పటాలు కావు,

కలసి సాగే జీవితాలు చిత్రాలు, విచిత్రాలు, చరిత్రకు వదిలిన సంపుటాలు'

దీని క్రింద సుందరంగారి దస్తూరిలో ఏదో వ్రాసి ఉంది. జాగ్రత్తగా చదివాను.

అర్థంకాని దానికి బార్డర్ గీయి - అందమైపోతుంది, ఆనందం మిగులుతుంది అని చెప్పిన సోదరుడు (అక్కడ నా పేరుంది)కి ఈ చిత్రం అంకితం!'

ఇద్దరం ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నాం.

'ఆకాశం ఇవాళ నిర్మలంగా ఉంది..', వెనుక నుండి వినిపించింది. సుందరంగారు మరోసారి లోపలికి వచ్చినట్లున్నారు, '....గాలిలో తేమ 42 శాతం, సముద్రంలోకి వెళ్లేవారికి సూచనలేమీ లేవు. రేపు ఆకాశవాణిలో పెద్దగా కార్యక్రమాలేవీ లేవు. పడుకోండి', అని చెప్పి వెళ్లిపోయారు.

ముగ్గురం నవ్వుకున్నాం. ప్లై వుడ్‌తో చేసిన ఆ అంతర్భాగం చివరికి వచ్చాం. తలుపు దగ్గర ఓ చిన్ని చిత్రం ఉంది. వరుసగా పైకి తీసుకుని వెళ్లేమెట్లున్నాయి. అలసిపోయిన ఓ జంట మధ్యలోని మెట్టుమీద అటు తిరిగి కూర్చునున్నారు. మెట్ల పైన ఏదీ లేదు..

'ఏదో గుడి వుందట!' క్రింద వ్రాసి ఉంది.

ముగ్గురం డ్రాయింగ్ రూంలోకి వచ్చాం. బరువుగా కూర్చుని ఆలోచిస్తున్నాం. విజయ్ కాఫీ తీసుకుని వచ్చాడు. అతనూ కూర్చున్నాడు.

'ఆ పిచ్చుకల బొమ్మ గీసిన తరువాత ఎందుకో పెద్దగా మాట్లాడటం మానేసారు. రోజూ అమ్మను మాట్లాడించే ప్రయత్నం చేసేవారు. ఆవిడ చిన్నపిల్లలా నవ్వేది. దగ్గరకి పిలిచి ఆయన చేయి తలమీద పెట్టుకునేది. ఆ రోజుల్లో ఒకసారి అడిగాను - నాన్నా, ఈ బొమ్మలో ఆ రంధ్రాల ద్వారా ఎందుకు చిత్రీకరించావు? అని! చాలా గట్టిగా నవ్వారు. 'మనకు అన్నీ ఉన్నాయి. పైవాడు ఏదీ తక్కువ చెయ్యలేదు. జాగ్రత్తగా ఆలోచిస్తే మేమిద్దరం ఈ బ్రహ్మరంధ్రాలను దాటేసాం. మా అస్తిత్వాలు అలౌకికాలు!', అన్నారు.

ఆ తరువాత ఆయన క్రమంగా ఆ మాత్రం మాట కూడా తగ్గిపోయింది. బాగా గుర్తు. ఎందుకో ఓ రోజు అమ్మ గదిలోకి వెళ్లి ఆవిడ తలమీద చెయ్యి పెట్టి ఆవిడ చెయ్యి ఆయన తలమీద పెట్టుకున్నారు. ఎందుకో ఇద్దరూ ఎందుకు నవ్వారో, ఎవరి కోసం నవ్వారో తెలియదు..'

ఇద్దరం నీరజగారి గదివైపు వెళ్లాం. ఇల్లంతా కలయ తిరుగుతూ సుందరంగారు అక్కడికొచ్చారు.

'చిన్న కుందేలుండేది ఒకప్పుడు..', చెప్పారు, '...ఇల్లంతా గంతులేస్తూ తిరిగేది. చక్కగా ఆడుకునేది. అలవాటుగా ఈ గదిలో దాక్కునేది!'

నీరజగారు వీల్ చెయిర్‌లో కూర్చునున్నారు. ఆవిడలో ఎటువంటి ప్రతిక్రియా లేదు. ఏదో విని ఏదో అర్థమైనట్లు తల ఊపుతున్నారు.

నమస్కారం చేసుకుని ఇవతలకి వచ్చాం. సుందరంగారికీ నమస్కారం చేసాం. ఆయన చెయ్యి చూపించి ఓ కళాకారుడి అలవాటుగా వేలు కొరుక్కున్నాడు. ఇంటి సింహద్వారం ప్రక్కగా ఓ కిటికీ మీద పాత ఫోటో ఉంది. బ్లాక్ అండ్ వైట్‌లో చాలా మసకగా ఉంది. బక్క చిక్కిన సుందరం చక్కని చుక్కలాంటి నీరజ ఒకళ్ల తలమీద ఒకళ్లు చేతులుంచి మావైపు చూస్తున్నారు.

గేటు దాకా వచ్చాం.

'డాక్టర్లు ఏమంటున్నారు?' అడిగాను.

'రెండు రోడ్లు దాటి కుడి ప్రక్కకు వెళితే అక్కడ వాడు నిలబడి ఉంటాడు', వెనుక నుండి వినిపించింది. నవ్వులేని కవ్వింతగా తోచింది.

'అన్నీ బాగానే ఉన్నాయంటాడు డాక్టర్. ఏం చేస్తాం? వయసు కదా' అని వెళ్లిపోతాడు. సుందరంగారు రెండు చేతులూ వెనుక పెట్టుకుని జాగ్రత్తగా ఇంట్లోకి వెళ్లిపోయారు.

'ఒక్క విషయం అర్థంకాదు..' అన్నాడు విజయ్.

'ఏంటది?'

'ఏం లేదండీ. ఇలా తన ధోరణిలోనే ఉండిపోయే ఈయన ఒక్కోసారి మాములు మనిషిలాగా ఓ రాత్రిపూట వెళ్లి నిదురిస్తున్న ఆవిడ తలను నిమిరి నిశ్శబ్దంగా వెళ్లిపోతారు. ఇదేంటి?'

ఆలోచించాను.

'పెండ్లి అనే విభాగంలోని చిత్రాలు చూసాం కదా? అక్కడే ఉంది సమాధానం. మొదటి చిత్రంలో చివర ఏం వ్రాసుంది? కలసి దాటుదామా? అనే విన్నపం. అవునా? అంతే!'

కవిత ఏమీ మాట్లాడటంలేదు. బైక్ అలా సాగిపోతోంది.

'దమ్ము కొట్టుకుంటూ బుద్ధుడి విగ్రహాన్ని చూసే ఈ కుర్రాళ్లనడుగు' అన్నాను.

'ఏంటి?'

'అటువంటి దమ్మున్న పెళ్లి చేసుకునే దమ్ముందా?'

'నిజమే. శృతిలేని వాయిద్యాలని వాయిస్తూ, అడుగడుగునా వాదిస్తూ లాజిక్కుల్లో మాజిక్కులు వెతుకుతూ జీవితంలోని మ్యూజిక్‌ను పోగొట్టుకుంటూ బైక్ చక్రంలోకి జారి చిరిగిపోతున్న దుపట్టాలను వెలిక్కి తీసుకునే ఆరాటంలో కూడా పోరాటాన్ని మరవని అమ్మాయిలను మీరూ అడగండి'

'ఏమని?'

'పెండ్లి అంటే ఏమిటి? అని!'

*సంగమం*

'**ఈ రాత్రి కవిత లేదూ,** కథ లేదూ' చిన్నగా చెప్పింది కవిత.

'ఎందుకు?'

'ఇలా రెండు కలసిపోయిన వేళ ఏమీ మిగలవు కదా?'

'పోనీ ఓ కవ్వింత ఉందా?'

ఓర చూపు చూసి నవ్వింది కవిత. వందమీటర్ల పరుగు పందెం అవలీలగా గెలుచుకునే యువతి కూడా ఈ 'తిరుభువనం' పట్టు చీరె కట్టుకుని త్రిభువనాలను ఆకర్షించేటట్లు అలా కుదురుగా, వయ్యారంగా, ఇప్పుడెలా. నన్ను చూసి ఏమనుకుంటాడో, ఏపాటి ఆలోచనకు ఈ పాటి తలాడిస్తాడో, చూడకూడదో, అసలు ఎలా చూడాలో అనుకునే చూడామణిలా తళుక్కుమంటూ మెరిసే కళ్లతో ఎలా ప్రత్యక్షమవుతుందో అర్థంకాదు!

'అలా అరచూపుతో చూడటం సరికాదు' అన్నాను.

'ఎందుకని?'

'మిగిలిన అరచూపు మరొకరికి అవకాశం ఇచ్చినట్లుకదా?'

'....'

'కవితకు సిగ్గెందుకు?'

'సిగ్గు కవితకు కాకపోతే? కథకెందుకు?'

'కథను చేరదా?'

'కవిత భావాన్ని దాచేసుకుంటుంది'

దగ్గిరగా వెళ్లాను. 'ఓ.... అందుకా సిగ్గులా కనిపిస్తుంది?' దగ్గరకి తీసుకున్నాను.

'మీ గుండె చప్పుడు..'

'ఊ.. నా గుండె చప్పుడు?'

'స్త్రీ మనోభావాలకు ఓ తాళమా?'

'కాకపోవచ్చు'

'మరి?'

'నాంది పలుకుతున్న సరికొత్త రాగానికి రూపకం కావచ్చును కదా?'

రాతిబండల మీదినుండి జాలువారిన నది జలపాతంలా జారి ఏదో గోల చేసి అలా చివరకు ప్రశాంతంగా ఓ చోట చక్కగా ప్రవహిస్తూ కాలం ఎందుకో ఓ మూల నిలబడి అలా అంతా వింతగా గమనిస్తున్నట్లుంది. కిటికీలోంచి కొద్దిపాటి ఆకాశం కనిపిస్తోంది. అక్కడెక్కడో ఎందుకో ఆగి ఉన్న చందమామ కోసం ఓ మబ్బు ఓ రథంలా మారి మలయమారుతాన్ని తన లయగా మార్చుకుని మందగమనంతో ఎప్పటికైనా నిన్నే చేరాలి, నువ్వు మనోరథంగా మారినా మరో పథం వెదకినా మన మధ్య అనుబంధమే మనకు సారథి అని చెబుతున్నట్లు అలా సాగిపోతోంది...

'ఏంటి ఆలోచిస్తున్నావు?', అడిగాను.

'మనం చిత్రకారుడు గీసిన బొమ్మలమైతే ఎంత బాగుండేది?'

'ఎందుకు?'

'కౌగిలిలోంచి బయట పడే అవసరం, అవకాశం రెండూ జీవితంలో రావు'

'...'

'ఏవంటారు?'

'ద్వారం తెరచుకున్నాక లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. ఇది మరో ప్రపంచంలోకి వెళ్లేందుకు సింహద్వారం మాత్రమే! దీనిమీద అడ్డంగా నిలబడితే ఎలాగా?'

కళ్లు విప్పార్చి పైకి చూసింది.

'ఈ ఊయలలోంచి దిగాలని లేదు'

'ఎందుకు?'

'శ్వాస నిశ్వాసలు బరువుగా సాగుతుంటే ఎవరో తంబురా శృతి చేస్తున్నట్లుంది. తెలియకుండానే జుగల్ బందీ ప్రారంభమైనట్లుంది.'

'హిందోళ రాగమా?'

'హిందోళంతో మాల్‌కౌన్స్ సమావేశం అవుతోంది!'

'నాకు సంగీతం అంతగా తెలియదు. రాయిలాంటి వాడను'

'అందుకే చెబుతున్నా.. హిందోళంలో రిషభం లేదు. అక్కడ తాకకూడదు!'

'నియమాలు ఎక్కువపెట్టి కళను దెబ్బ తీస్తున్నారు అందరూ' శబ్దం లేకుండా నవ్వుతోందని నాకు తెలుసు.

'శిలలోని చప్పుడు కూడా తాళం వేస్తోంది. శిల్పి తన ఉలితో చేసే చప్పుడు కూడా లయబద్ధమే కదా?'

'నేను శిలను, శిల్పిని కూడానూ'

'కవ్వించమన్నారు కదా?'

'కరెక్ట్'

'నాకు తెలిసిన ఓ ప్రాకృతం చెబుతాను. విప్పుతారా?'

నేను విప్పితే నువ్వూ విప్పాలి... అదే, మరో సమస్య...'

'నో. ఈ డబల్ మీనింగ్ వద్దు. ఇదిగో ప్రాకృతం ఇస్తాను'

'చెప్పూ'

'ఏత్తి అణ పత్తి అన్తీ జ ఇ ం ణ భిజ్జన్తా'

'మేలుకునే ఉన్నావా? లేక నిద్రలో కలవరిస్తున్నావా?'

'ఏం? మీ కథలా ఉందా? బాగుంది కదా?'

'అందుకే ఇన్ని ఆభరణాలు వద్దన్నాను.'

'ఇదేంటి? అవేం చేసాయి?

'సంస్కృతానికి పరికిణీ వోణీ కడితే చక్కని తెలుగు ఆడపడుచులా ఉంటుంది.. ఈ సంగమం ఎలా ఉంది?'

'ఇంతకీ చిక్కు విప్పలేదు.'

'అర్థ కాకుండా అలా వదిలేస్తే బాగుంటుందేమో?'

'కుదరదు. తప్పించుకునే పద్ధతులివన్నీ'

'కవితా! మనం చేస్తున్నదంతా కూడా అర్థం కానిదేకదా?'

'నేను అడిగిందాంట్లో అర్థం ఉంది'

'సరే! చూద్దాం. కిటికీని తాకుతూ సాగుతున్న ఆ మల్లెతీగెలాగా.. ఈ కవితలాగా కథలోకి సాగుతూ పోతే నా కథంతా కవిత్వమే నిండిపోదా ఓ కవితాళికా!'

'ఇదేంటి? కొత్త పేరా?'

'కావచ్చు. జుగల్ బందీ రాగాలలోంచి ఏవేవో కొత్త కొత్తవి వికసిస్తున్నాయి. ఈ ఆలాపనలోంచి వచ్చే అల్లరి పాట మన్మధుని అల్లరిపెడుతున్నాయి'

'ఇవన్నీ ఆపి విషయంలోకి రండి. సమస్య తీర్చండి'

'అలాగే. ఒక రాగంలోనే జుగల్ బంది చేద్దాం.'

'అదెలా?'

'యమన్ కళ్యాణ్... శుద్ధ మధ్యమం పలకటంలో తేడా. అంతే.'

'ఇదెవరు చెప్పారు?'

'ఈ రాత్రి ఎవరూ ఏమీ చెప్పక్కర్లేదు. అన్నీ అవే వచ్చేస్తాయి. కమాన్!'

'ఏంటి కమాన్?'

'శుద్ధమధ్యమాన్ని శోధిద్దాం'

'నా ప్రహేళికను విప్పవోయి మానవా!'

'ఏదీ, మరొక్కమారు పలుకుము దేవి!'

'పత్తి అణ వత్తి అన్తీ జ ఇ తుజ్ఝ ఇ మే ణ మ జ్జ రు అ ఈ ! పుట్టీ అ బాహ బిన్దూ పుల ఉబ్బే ఏణ భిజ్జన్తా"'

ఆలోచించాను. మాది సామాన్యమైన వివాహం కాదు. పిచ్చికీ వెర్రికీ జరిగిన అనుసంధానం లాంటిది. తొలి రాత్రి ఇదెక్కడి చోద్యం? ఈ భూమి మీదకి రాలిన ఏ మగాడికీ ఇలాంటి పరిస్థితి రాకూడదు.

'ప్రతిహిన ప్రతీయన్తీ యది తవేమేన మమ రోదన శీలాయాః
పుష్ఠస్య బాష్ప చిన్దవః పూలకోద్భేదేన చిద్యమానాః

తల పైకెత్తి కళ్లు విప్పార్చి చూసింది.

'విశ్వసింపవే నన్ను...', చెప్పింది, '...విశ్వసింపవేనన్ను - నా వెన్నుమీద, నీదు భాష్ప కణమ్ములు నిలిచినపుడు, అటు మొలచిన పులకలతో నవ్వి పగలకున్న నన్ను నమ్మవలదు కోమలాంగీ!'

'బాగుంది. నీ ముందర ఓ నిలువుటద్దం, నా ముందర మరో నిలువుటద్దం - ఇలా రెండింటిలో మనం కనిపిస్తున్నప్పుడెలా ఉందో తెలుసా?'

'చెప్పండి'

'నా చిక్కుముడి ఇప్పుడు చెబుతాను. శిల, శిల్పం, శిల్పి ముగ్గురూ కలిసిపోతే ఎలా ఉంటుంది?'

'చెప్పలేను'

'శిలలోంచి ఓ సౌందర్యరాశిని చెక్కుతూ ఆమె నడుము క్రింద తనని తాను ఊహించుకుంటూ గట్టిగా పట్టుకుని పైకి చూస్తుంటే ఆ అందాల రాశి అతని శ్రమకి జాలిగా క్రిందకి చూస్తుంటే ఆ శిలలో ఏమి పలుకుతోంది? అందమా? ఆలోచనా? కథా? కవితా? కల్పనా?'

మరల పైకి చూసింది. నల్లని జుట్టులోంచి మెరుస్తున్న చామంతుల ఆభరణాలు ఒక్కసారి పైకి లేచిన ముఖం ముందు ఏపాటి అనిపించాయి. కాకపోతే నల్లత్రాచు పడగ చిన్నబోయి నాగమణి తనను తాను ఎలుగెత్తి అద్దంలో చాటుతున్నట్లుంది.

"శిలలు కూడా కథలు చెబుతాయి"

'కరెక్ట్.'

'నేను మాట్లాడను. ఈ రాత్రి నన్ను శిల అనుకుని చెక్కండి - ఎక్కడో ఓ శిల్పం దొరక్కపోదు!'

కిటికీలోంచి ఆ మబ్బు ఇంకా అలానే కదులుతోంది. వెనుక కొన్ని నక్షత్రాలు మెరిసే సమయం అంటూ తెగ మెరిసిపోతున్నాయి. లోలోన ఆలోచనలెందుకో ఒక్కసారిగా తెగ మురిసిపోతున్నాయి.

'అంతరిక్షంలోని పెను చీకటి వీనుల విందుగా శిరోజాలుగా మారి జ్యోతి స్వరూపులందరూ సూర్యచంద్రాభరణాలుగా, నక్షత్రాలుగా కాలసర్పాన్ని అలంకరించిన వైనంలో...'

'అవునూ.. మీ చేతులెందుకు కదులుతున్నాయి? శిల్పం చెక్కటమంటే ఇదేనా?'

'మాట్లాడను అన్నావు. చిక్కిన చక్కని దానిని చెక్కకుండ యేల?'

'మధ్యలో ఆపారు'

'శుద్ధ మధ్యమంలో'

'....'

'... ఒక సౌరమండలాన్ని గుర్తించి పరి పరి సాగే పరంపరకు సూర్యబింబం వంటి బొట్టుతో ఈ రేయికి కాంతి ఇంతే చాలనిపించే ఇంతి చంద్రబింబం వంటి ముఖంతో..'

'అంతుందా?'

'అంతులేదు!'

'ఓ'

'తరతరాల తరంగిణులతో వయ్యారాలొలకబోసుకుంటూ సాగిపోయే నదీ జలపాతాల వలయములన్నీ వలలలా వలితములుగా మారిన వలువలు మధురకేళికి తెరతీసే నెలవులై నిలువగా... ఈ జీవాధారములు మాలో మునుపు దాగియున్న వనరులే అని చాటుగా చాటుతున్న సమున్నత శిఖరములు మంగళ కలశములుగా మారి కూడా చేతకాని ఈ శిలపట్ల ఆ వక్షస్థలమునకు ఇంత వివక్ష ఏలనో!'

కవిత కళ్లల్లోకి చూసింది. ఏమీ మాట్లాడలేదు. ఏదో నది ఎంతో ఆతృతతో వేగంగా సాగరం వైపుకు సాగి ఎందుకో ఓ క్షణం ఆగినట్లనిపించింది. ఆకాశంలో మనోరథం మబ్బులా, మత్తుగా సాగుతోంది.

మానస ప్లవంగమునకు విప్లవముగా తగిలే ముక్కెర వంటి నడుమును రెండు చేతులతో నిలుపుకున్న అశ్వముల వంటి జఘనములకు పార్శ్వమున అప్పుడే చివురించిన ఓ అశ్వత్థపత్రమేమో!'

కవిత రెండు చేతులతో ముఖం కప్పుకుంది.

'చెక్కమని చెక్కిలి దాస్తే ఎలా?'

ఒక చెయ్యి తీసేసి కొంటెగా చూసింది.

'ఈ శిల్పం వేళ్లు పట్టుకుంటే చాలు, చిత్రకారుడికి కుంచెలతో పనుండదు - అని చెప్పేందుకా ఈ భంగిమ?' రెండో చేయి తీసేసింది. ముఖం ఎర్రగా ఉంది.

'కవితా! ఊహలతో గీసుకున్న చిత్రాలన్నిటినీ పైవాడు చిన్నపిల్లవాడిలా ఎందుకు చెరిపేస్తాడో తెలుసా?'

'తెలియదు'

'సందర్భానికి తగినట్లు మనకు చిత్రం గీసుకోవటం చేతవ్వటానికి'

'మల్లె తీగె ఎంతో బేల అని ఊరకే అనుకున్నాను. ఇలా పాకితే ఎంత ప్రమాదమో దానికి తెలియదు!'

'తెలియకుండా జరిగేవి ప్రమాదాలు. తెలిసి చేసుకునే ప్రమాదాలు సంసారాలు..'

జలపాతంలోంచి ఓ ధార సముద్రం వైపు సాగింది. కొండ చరియలలోంచి కొంత దిగువ భాగాన ప్రవహించి గబుక్కున చాలా క్రిందకి దూకింది. రథం మబ్బు చంద్రుని చేరింది. ఈ రథమంతా నాదే అన్నట్లు చంద్రుడు అధిరోహించాడు. ఎవరు కదులుతున్నారో తెలియకుండానే ఏదో కదిలిపోతోందని తెలుస్తోంది... చైతన్యం శిలగా మారుతోంది. ప్రతి అణువూ స్పందనలో స్థిరమవుతోంది. సర్వం సమూలంగా మైమరచిన చోట తెలియలేని విశ్వరచన నిజమైన ఆనందం నృత్యంలా కదులుతోంది..'

మారని మరో లోకంలో కవిత లేదు, కథలేదు, శిక్షలేదు, జైలు లేదు, అక్షరం లేదు, శబ్దంలేదు, వాక్యం లేదు, కావ్యం లేదు.. ఛందస్సు లేదు, శిల్పం లేదు, ఆకారం లేదు, అలంకారం లేదు, పదంలేదు, పదార్థం లేదు.. రసానందమే పరమార్థం.

తాపాగ్నితో శబ్దం బుక్కుగా మారి అగ్నిలోకి ఆహుతిలా జారుతోంది. మరో సృష్టి ఎక్కడో జరిగిపోతోంది... మబ్బు ఎటో మాయమవుతోంది. చంద్రుడు ఓ అంతస్తు దాటి, అంతఃస్థితులను వదిలి పరిపరి పరిస్థితులను మార్చేసి మరో తిథివైపు సాగిపోతోంది ఈ రాత్రి!'

'ఇంతకీ మీ సవాలు ఏంటి?' రహస్యంగా అడిగింది కవిత.

శిల, శిల్పి, శిల్పం - మూడూ కలసి వున్న ఆ సౌందర్య సృష్టికి అడుగున ఉలితో లయబద్ధంగా అడగవలసిన ప్రశ్న అది'

'అడగండి'

'భార్యాభర్తలు ఎవరు?'

ఇరువురి శ్వాసనిశ్వాసలు అలజడులు లేపి ఎక్కడెక్కడో సంచరించిన తుఫానులా తీరాన్ని దాటుతున్నాయి.

'ఒకరి మానాన్ని ఒకరు కప్పేసుకుకుని కాపాడుకునే అభిమానవంతులు'

(ప్రాకృతానికి తెలుగు పద్యం సౌజన్యం: హాలుని గాథా చతుశ్శతి కి డా. కోడూరు ప్రభాకర రెడ్డి గారి విశేష వ్యాఖ్యలతో గల ఆంధ్రానువాదం)